www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

కాంగ్రెస్‌లోకి జీహెచ్‌ఎంసీ మేయర్‌!

గద్వాల్‌ విజయలక్ష్మి, కేకేతో దీపాదాస్‌ మున్షీ భేటీ.. పార్టీలోకి రావాలని ఆహ్వానం

2 రోజుల్లో వారిద్దరూ హస్తం గూటికి.. కాంగ్రెస్‌లోకి పలువురు బీఆర్‌ఎస్‌ కార్పొరేటర్లు

పార్టీ మారినా మేయర్‌గా విజయలక్ష్మే.. కౌన్సిల్‌లో పెరుగుతున్న కాంగ్రెస్‌ బలం 13

బీఆర్‌ఎస్‌ను వీడి వెళ్లేవారిని ప్రజలే చెప్పులతో కొడతారు

మా పాలనలో వేసవిలోనూ సాగునీరిచ్చాం: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌ రెడ్డి 12

శనివారం | 23-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 355 | శ్రీ శోభకృత్‌ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి ఉ. 7.19 తదుపరి చతుర్దశి; నక్షత్రం: పుబ్బ పూర్తి; వర్జ్యం: మ.1.31-3.19, దుర్ముహూర్తం: ఉ.6.21-7.57; అమృతఘడియలు: రా.12.21-2.09, రాహుకాలం: ఉ.9.00-10.30, సూర్యోదయం: 6.21; సూర్యాస్తమయం: 6.24 | వరంగల్‌

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ముడుపులు డిమాండ్‌ చేసింది..

కేజ్రీవాలే


కేజ్రీవాల్‌ను కోర్టుకు తరలిస్తున్న ఈడీ అధికారులు

మద్యం స్కాంలో ఆయనే ప్రధాన సూత్రధారి

రూ.45 కోట్లు గోవా ఎన్నికల్లో వాడినట్లు ఆధారాలున్నాయ్‌

కేజ్రీ తరఫున విజయ్‌ నాయర్‌ రూ.100 కోట్లు తీసుకున్నారు

క్యాబినెట్‌ ఆమోదించకముందే కవిత ఆడిటర్‌ బుచ్చిబాబు మొబైల్‌ ఫోన్‌లో మద్యం విధానం డాక్యుమెంట్‌ దొరికింది

కవితతో బేరం కుదిరిందని కేజ్రీవాల్‌ తనకు చెప్పినట్లు మద్యం వ్యాపారి మాగుంట శ్రీనివాసులు రెడ్డి వెల్లడించారు

చెన్నైలో ఎక్కడ, ఎలా ముట్టచెప్పారో రాఘవ తెలిపారు

నాయర్‌తో కలిసి పని చేయాలని కేజ్రీ చెప్పినట్లు శరత్‌రెడ్డి కూడా వాంగ్మూలం ఇచ్చారు.. కస్టడీ రిపోర్టులో ఈడీ

న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): 'ఢిల్లీ మద్యం విధానం రూపకల్పనలో సీఎం అరవింద్‌ కేజ్రీవాల్‌ ప్రత్యక్ష పాత్ర పోషించారు. మద్యం విధానంతో లబ్ధి పొందిన వారి నుంచి నేరుగా ఆయనే ముడుపులు డిమాండ్‌ చేశారు. లిక్కర్‌ వ్యాపారులు, వ్యక్తుల నుంచి ముడుపులు వసూలు చేశారు. సీఎం హోదాలో మద్యం కుంభకోణానికి ఆయనే ప్రధాన సూత్రధారి' అని ఎన్‌ఫోర్స్‌మెంట్‌ డైరెక్టరేట్‌ (ఈడీ) స్పష్టం చేసింది. సౌత్‌ లాబీకి నాయకత్వం వహించిన కవిత తదితరులకు అక్రమంగా లాభాలు ఆర్జించిపెట్టేందుకు వీలుగా కేజ్రీ ఈ విధానాన్ని రూపొందించారని వివరించింది. ఢిల్లీ మద్యం స్కాంలో అరెస్టు చేసిన కేజ్రీవాల్‌ను ఈడీ శుక్రవారం ఢిల్లీలోని రౌజ్‌ ఎవెన్యూలో మనీలాండరింగ్‌ నిరోధక చట్టానికి సంబంధించిన ప్రత్యేక కోర్టులో ప్రవేశపెట్టింది. ఆయనను పది రోజులపాటు

మిగతా 2వ పేజీలో...

కేజ్రీవాల్‌కు 6 రోజుల కస్టడీ

28 వరకూ విచారణకు అనుమతి

బలవంతంగా అప్రూవర్లుగా మార్చి ప్రకటనలు ఇప్పించారు

ఎన్నికలకు ముందే ఫలితాలను సాధించాలనుకుంటున్నారు

కేజ్రీవాల్‌ తరఫున బలంగా వాదించిన న్యాయవాది సింఘ్వి

జైలు నుంచే సర్కారును నడుపుతా!

స్పష్టం చేసిన కేజ్రీవాల్‌

సీఎంగా ఆయనే: ఆప్‌ 2

కవితకు సుప్రీంలో చుక్కెదురు

ఢిల్లీ మద్యం కేసులో బెయిల్‌ ఇవ్వలేమన్న న్యాయస్థానం

ట్రయల్‌ కోర్టుకు వెళ్లాలని సూచన

కేజ్రీ అరెస్ట్‌ ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు

విపక్షాల్లేకుండా చేయాలని బీజేపీ కుట్ర 12

హేమంత్‌, కవిత అరెస్ట్‌ ఘటనలే రుజువు: కేసీఆర్‌

కేజ్రీవాల్‌కు ఎంత చెప్పినా వినలేదు

మద్యం జోలికి వెళ్లొద్దంటే.. ప్రత్యేక విధానమే తెచ్చారు 2

ఫలితం అనుభవిస్తున్నారు: అన్నా హజారే

ప్రతిపక్షాలపై దాడులు ఆపమని ఆదేశించండి

ఆర్టికల్‌ 324 కింద జోక్యం చేసుకోండి

విపక్షాల గొంతు నొక్కేందుకు బీజేపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది

2 రాష్ట్రాల సీఎంలను ఈడీ అరెస్టు చేసింది

కాంగ్రెస్‌ను అడ్డుకునేందుకే ఖాతాల ఫ్రీజ్‌

ఈసీకి విపక్ష నేతల వినతిపత్రం 2

కేజ్రీ సతీమణికి రాహుల్‌, మమత పరామర్శ



అలా లీజుకు ఔటర్‌



ఇలా 25 కోట్లు కారులోకి

బీఆర్‌ఎస్‌కు సొమ్ములు ఇచ్చిన ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా

గత ఏడాది ఏప్రిల్‌ చివర్లో ఆ సంస్థకు ఎల్‌వోఏ అందజేత

జూలై 4న బాండ్లు కొన్న ఐఆర్‌బీ.. 13న ఎన్‌క్యాష్‌మెంట్‌

కారు పార్టీకి కేరళ సంస్థ కైటెక్స్‌ సమర్పణ రూ.25 కోట్లు

వరంగల్‌లో ఫ్యాక్టరీ నిర్మాణం ముగిసేదశలో 15 కోట్లు

'రంగారెడ్డి'లో ఫ్యాక్టరీ శంకుస్థాపనకు ముందు 10 కోట్లు

హైదరాబాద్‌, మార్చి 22: ఔటర్‌ రింగ్‌ రోడ్డును 30 ఏళ్లపాటుకు లీజుకు తీసుకున్న ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థ.. అప్పట్లో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌ పార్టీకి ఎన్నికల బాండ్ల రూపంలో ఇచ్చిన విరాళం.. రూ.25 కోట్లు! తమ సొంత రాష్ట్రంలో అవినీతిని భరించలేక రూ.3500 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నట్టు గతంలో ప్రకటించి.. ఆ తర్వాత తెలంగాణకు వచ్చిన దుస్తుల తయారీ సంస్థ కైటెక్స్‌ గుర్తుందా? ఆ సంస్థ కూడా నాటి అధికార బీఆర్‌ఎస్‌కు సమర్పించుకున్న విరాళాల విలువ రూ.25 కోట్లు!! ఎన్నికల బాండ్ల రూపంలో దక్షిణాదిన అత్యధికంగా విరాళాలు అందుకున్న పార్టీగా ఖ్యాతి దక్కించుకున్న బీఆర్‌ఎస్‌కు మేఘా ఇంజనీరింగ్‌ సంస్థ నుంచి అత్యధికంగా రూ.195 కోట్లు విరాళంగా వచ్చిన సంగతి తెలిసిందే. అలాగే.. మరికొన్ని కంపెనీల నుంచి కూడా ఆ పార్టీకి విరాళాలు అందినా.. ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా, కైటెక్స్‌ నుంచి అందిన బాండ్ల కథ.. వాటి టైమ్‌లైన్‌ కారణంగా కొంచెం ప్రత్యేకం. వీటిలో తొలుత ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా విషయానికి వస్తే.. ఓఆర్‌ఆర్‌ నిర్వహణను 30 ఏళ్లపాటు టోల్‌ ఆపరేట్‌ ట్రాన్స్‌ఫర్‌ (టీవోటీ) పద్ధతిలో ప్రైవేటు కంపెనీలకు అప్పగించేందుకు 2022 నవంబరులో

మిగతా 13వ పేజీలో...

బీజేపీకి 466 కోట్లు..

ఎవరిచ్చారో తెలీదు! 2

ఎస్‌బీఐ ఈసీకి ఇచ్చిన రెండు జాబితాల్లో తేడాలు

కొనుగోలుదారుల జాబితాలో 18871 ఎంట్రీలు

పార్టీల జాబితాలో 20,421

2 జాబితాల్లోనూ సరిపోలిన బాండ్లు 18,741

జారీచేసిన మొత్తం బాండ్లలో తేడా రూ.623 కోట్లు

వాటిలో అత్యధికం బీజేపీకే


కేసీఆర్‌ ఫామ్‌హౌస్‌లో నిర్మించిన సమావేశ మందిరం

మెదక్‌ నుంచి వెంకట్రామిరెడ్డి

బీఆర్‌ఎస్‌ తరఫున బరిలో మాజీ ఐఏఎస్‌, ఎమ్మెల్సీ

నాగర్‌కర్నూల్‌ నుంచి ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌ కుమార్‌

13 స్థానాలకు అభ్యర్థుల ఖరారు.. పెండింగ్‌లో 4

లోక్‌సభ ఎన్నికలపై ఎర్రవల్లి నుంచే కేసీఆర్‌ సమీక్ష

ఫాంహౌస్‌లో హాల్‌.. 300 మందికి ఏర్పాట్లు

హైదరాబాద్‌, జగదేవ్‌పూర్‌, సిద్దిపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మెదక్‌ లోక్‌సభ స్థానానికి మాజీ ఐఏఎస్‌ అధికారి, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి పేరును బీఆర్‌ఎస్‌ ఖరారు చేసింది. మెదక్‌తో పాటు నాగర్‌కర్నూల్‌ స్థానానికీ అభ్యర్థిని ప్రకటించింది. ఇక్కడి నుంచి మాజీ ఐపీఎస్‌ అధికారి ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌ కుమార్‌ను పేరును ఖరారు చేసింది. ఈ మేరకు శుక్రవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌ నియోజకవర్గంలోని ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో సమీక్ష అనంతరం కేసీఆర్‌ మెదక్‌, నాగర్‌కర్నూల్‌ స్థానాలకు అభ్యర్థుల పేర్లను ఖరారు చేశారు. ఫలితంగా ఇప్పటివరకు 13 స్థానాలకు

మిగతా 12వ పేజీలో...

తాకట్టు వెనుక కనికట్టు ఏమిటి?

- వరంగల్‌ జైలు స్థలం మార్టిగేజ్‌పై విజిలెన్స్‌ విచారణ
- సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం 56 ఎకరాలు తనఖా
- బ్యాంక్‌ ఆఫ్‌ మహారాష్ట్ర నుంచి రూ.1,173 కోట్ల రుణం
- బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో టీఎస్‌ఎస్‌హెచ్‌సీఎల్‌ ఏర్పాటు
- దీనిపై ఫిర్యాదులు రావడంతో రంగంలోకి విజిలెన్స్‌!
- బ్యాంక్‌తో ఒప్పందం వివరాలు ఇవ్వాలని ఆదేశం



హైదరాబాద్‌, మార్చి 22(ఆంధ్రజ్యోతి): భారీగా నిధులు కేటాయిస్తూ గత సర్కారు హయాంలో తలపెట్టిన హనుమకొండ సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం కోసం వరంగల్‌ జైలు స్థలాన్ని తాకట్టు పెట్టిన వైనంపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్‌ అండ్‌ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను రంగంలోకి దించింది. దీంతో పూర్తి వివరాలు తక్షణమే పంపాలని తెలంగాణ సూపర్‌ స్పెషాలిటీ హాస్పిటల్స్‌ కార్పొరేషన్‌ లిమిటెడ్‌ (టీఎస్‌ఎస్‌హెచ్‌సీఎల్‌) ఎండీని విజిలెన్స్‌ కోరింది. తనఖా కింద రుణం మంజూరు

మిగతా 12వ పేజీలో...

90 కిలోల నిషేధిత డ్రగ్‌ పట్టివేత 3

విలువ రూ.8.99 కోట్లు

బొల్లారంలో తయారీ

విదేశాలకు ఎగుమతి



విరుధునగర్‌ బరిలో నటి రాధిక 2

14 మందితో బీజేపీ జాబితా విడుదల

విజయకాంత్‌ కుమారుడిపై పోటీ



ఇస్రో 'పుష్పక్‌' పరీక్ష విజయవంతం 2

సురక్షితంగా దిగిన ఆర్‌ఎల్‌వీ ఎల్‌ఈఎక్స్‌-02

అంతరిక్ష వ్యర్థాల నియంత్రణలో ముందడుగు

మాజీ ఐపీఎస్‌ ప్రభాకర్‌రావు ఇంట్లో తనిఖీలు

ఫోన్‌ ట్యాపింగ్‌ కేసులో సోదాలు

ఆయన యూఎస్‌ వెళ్లినట్లుగా గుర్తింపు

ట్యాపింగ్‌లో ఓ మీడియా యజమాని!

ప్రణీత్‌రావు స్టేట్‌మెంట్‌తో ఆయన ఇంట్లో సోదాలు.. ఆధారాలు లభ్యం

లండన్‌కు పరారైనట్లు గుర్తింపు

మాజీ డీఎస్పీకి ముగియనున్న కస్టడీ

హార్డ్‌ డిస్క్‌లను మూసీలో పడేసినట్లు వెల్లడించిన ప్రణీత్‌రావు 13

బాలికపై అత్యాచార యత్నం

భూపాలపల్లి సైబర్‌ క్రైం సీఐ సంపత్‌ అరెస్టు 3

పోక్సో కేసులో రిమాండ్‌కు

అరెస్టు చేసే ముందు ఈడీ కారణాలు చెప్పాల్సిందే

» సుప్రీంకోర్టు స్పష్టీకరణ.. కేంద్రం రివ్యూ పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, మార్చి 22: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎవరినైనా అరెస్టు చేసే ముందు అందుకుగల కారణాలను స్పష్టంగా పేర్కొనాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు పునరుద్ఘాటించింది. ఈ కారణాలను లిఖితపూర్వకంగా పేర్కొంటూ నిందితునికి ఇవ్వాల్సి ఉంటుందని తెలిపింది. ఇందుకు ఎలాంటి మినహాయింపులు లేవని స్పష్టం చేసింది. ఇవే విషయాలను పేర్కొంటూ గతంలో సరిగ్గానే తీర్పు ఇచ్చామని, అందులో ఎలాంటి తప్పులు లేవని తెలిపింది. గతంలో ఇచ్చిన తీర్పును సమీక్షించాలంటూ కేంద్ర ప్రభుత్వం చేసిన వినతిని తిరస్కరించింది. కేంద్రం దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌పై జస్టిస్ ఎ.ఎస్.బోపన్న, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం తమ ఛాంబర్‌లోనే విచారణ జరిపి ఆర్డర్లు ఇచ్చింది. 'రివ్యూ పిటిషన్‌ను, అందుకు సంబంధించిన పత్రాలను చాలా జాగ్రత్తగా పరిశీలించాం. గతంలో ఇచ్చిన ఉత్తర్వుల్లో చిన్నపాటి తప్పును కూడా గుర్తించలేదు. అందువల్ల ఆ ఉత్తర్వులను పునఃపరిశీలించాల్సిన అవసరం ఏమీ లేదు" అని పేర్కొంది. రివ్యూ పిటిషన్‌పై ఓపెన్ కోర్టులో విచారణ జరపాలన్న కేంద్రం పిటిషన్‌ను కూడా తిరస్కరించింది. గురుగ్రామ్‌కు చెందిన రియల్ ఎస్టేట్ కంపెనీ ఎంళిఎం డైరెక్టర్లు బసంత్ బన్సల్, పంజక్ బన్సల్‌లపై ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేసి అరెస్టు వారెంట్లు జారీ చేసింది. దీనిపై నిందితులు సుప్రీంకోర్టుకు వెళ్లగా ఇదే ధర్మాసనం ఈడీ తీరును తప్పుపట్టింది. అరెస్టు సమయంలో వ్యవహరించాల్సిన తీరుపై ఆ కేంద్ర దర్యాప్తు సంస్థకు పలు సూచనలు చేసింది. "కఠినమైన పీఎల్ఎంఏ చట్టం-2002 ప్రకారం ఈడీకి తీవ్ర పరిణామాలకు దారితీయగల అధికారాలు ఉన్నాయి. వాటిని వేధింపుల కోసం ఉపయోగించకూడదు" అని వ్యాఖ్యానించింది. కేవలం తమ ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేదన్న, సమన్లకు స్పందించలేదన్న కారణాలతో నిందితుల్ని అరెస్టు చేయకూడదని స్పష్టం చేసింది.

కేజ్రీ తప్పు చేశారు..అనుభవిస్తున్నారు: అన్నా హజారే

న్యూఢిల్లీ, మార్చి 22: చేసిన తప్పులకు కేజ్రీవాల్ ఫలితం అనుభవిస్తున్నారని, మద్యం వ్యవహారాలకు దూరంగా ఉండాలంటూ ఆయనను మరీమరీ హెచ్చరించినా పట్టించుకోలేదని ప్రముఖ సామాజిక కార్యకర్త అన్నా హజారే వ్యాఖ్యానించారు. అసలేమీ జరగకుంటే అరెస్టు చేసేంతటి పరిస్థితి వచ్చేది కాదు కదా? అని అన్నారు. మద్యంపై తాము సాగించిన పోరాటాన్ని గుర్తు చేస్తూ, ఎక్సైజ్ పాలసీ విధానాలకు దూరంగా ఉండాలని రెండుసార్లు సూచించానని తెలిపారు. మహారాష్ట్రలోని స్వగ్రామం రాలెగావ్ సిద్ధిలో 86 ఏళ్ల హజారే శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మద్యం జోలికి వెళ్లొద్దంటే.. సంపాదనకు ఆశపడి ఏకంగా ప్రత్యేక విధానమే తెచ్చారని కేజ్రీని విమర్శించారు. 2011 నాటి అవినీతి వ్యతిరేక ఉద్యమంలో హజారే, కేజ్రీవాల్ కలిసి పనిచేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒకనాటి తన సహచరుడు అరెస్టు కావడం పట్ల హజారే విచారం వ్యక్తం చేశారు. కాగా, అధికారంలో ఉంటే దురాశ కమ్మేస్తుందనే సంగతి స్పష్టమైందని, అధికారం అందరినీ అవినీతిపరులను చేస్తుందని సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ సంతోష్ హెగ్డే తెలిపారు. కాగా, కాంగ్రెస్, షీలా దీక్షిత్ నాయకత్వంలోని ఢిల్లీ ప్రభుత్వంపై బాధ్యతారహితంగా, ఆధారాలు లేకుండా లెక్కలేనన్ని ఆరోపణలు చేసిన కేజ్రీవాల్ ఇప్పుడు వాటికి ప్రతిఫలం అనుభవిస్తున్నారని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కుమార్తె శర్మిష్ఠ ట్వీట్ చేశారు.

విరుధునగర్ బరిలో సినీ నటి రాధిక

చెన్నై, మార్చి 22: తమిళనాడు పార్లమెంటు స్థానాలకు సంబంధించి బీజేపీ సెంట్రల్ ఎలక్షన్ కమిటీ శుక్రవారం 14 మందితో కూడిన 4వ జాబితాను విడుదల చేసింది. అదేవిధంగా పుదుచ్చేరిలోని ఒక స్థానానికి కూడా అభ్యర్థిని ప్రకటించింది. వీటిలో ప్రముఖ నటి రాధిక శరత్‌కుమార్‌కు విరుధనగర్ స్థానాన్ని కేటాయించారు. ఈమె దివంగత నటుడు విజయకాంత్ కుమారుడిని ఇదే నియోజకవర్గం నుంచి ఢీ కొననున్నారు. ఇక, తమిళనాడు బీజేపీ శాఖ ఉపాధ్యక్షుడు, సీనియర్ నేత కేపీ రామలింగంకు నమ్మక్కల్ నియోజకవర్గాన్ని కేటాయించారు. ఇతర నేతలు వి.బాలగణపతికి తిరువళ్లూరు(ఎస్సీ), ఆర్‌సీ పాల్ కనగరాజ్‌కు చెన్నై ఉత్తరం, ఎ.అశ్వత్థన్‌కు తిరువణ్ణామలై, ఏపీ మురుగానందంకు తిరుప్పూర్, కె. వసంతరాజన్‌కు పొల్లాచ్చి, వీవీ సెంథిల్‌నాథన్‌కు కరూర్, పి.కార్తియయానికి చిదంబరం(ఎస్సీ), ఎస్‌జీఎం రమేశ్‌కు నాగపట్టణం(ఎస్సీ), ఎం. మురుగానందంకు తంజావూర్, డాక్టర్ దేవనాథన్ యాదవ్‌కు శివగంగ, ప్రొఫెసర్ రామ శ్రీనివాసన్‌కు మదురై, బి. జాన్ పాండియన్‌కు టెంకాశీ(ఎస్సీ) నియోజకవర్గాలను కేటాయించారు. ఇక, పుదుచ్చేరిలోని పార్లమెంటు స్థానానికి ఆ రాష్ట్ర హోం శాఖ మంత్రి ఎ. నమశ్శివాయంను అభ్యర్థిగా ప్రకటించారు. కాగా, విలవన్‌కోడ్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరగనున్న ఉప ఎన్నికకు సంబంధించి బీజేపీ అభ్యర్థిగా వీఎస్ నంతినిని ఆ పార్టీ ప్రకటించింది.

ఒడిశాలో బీజేపీ,బీజేడీ ఒంటరి పోరు..కుదరని పొత్తు

భువనేశ్వర్, మార్చి 22: ఒడిసా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయాలని బీజేపీ నిర్ణయించింది. సీఎం నవీన్ పట్నాయక్ సారథ్యంలోని బీజేడీతో గత మూడు వారాలుగా జరిపిన చర్చలు విఫలమవడంతో ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 21 లోక్‌సభ, 147 శాసనసభ స్థానాల్లో సొంతగా బరిలోకి దిగుతామని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సమాల్ శుక్రవారం 'ఎక్స్'లో వెల్లడించారు. అన్ని ఎంపీ, అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధిస్తామన్న ధీమా వ్యక్తంచేశారు. మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రజలకు చేరడం లేదన్నారు. వాటి ప్రయోజనాలకు వారికి అందడం లేదని చెప్పారు. సమాల్ ప్రకటన దరిమిలా.. అటు బీజేడీ కూడా అన్ని స్థానాల్లో ఒంటరిగానే బరిలోకి దిగనున్నట్లు ప్రకటించింది. ఈ దఫా నాలుగింట మూడో వంతు సీట్లు సాధిస్తామని ఆ పార్టీ సంస్థాగత కార్యదర్శి ప్రణబ్‌ప్రకాశ్ దాస్ 'ఎక్స్'లో తెలిపారు.

యూపీ మదర్సా చట్టం రాజ్యాంగ వ్యతిరేకం

న్యూఢిల్లీ, మార్చి 22: ఉత్తరప్రదేశ్ మదర్సా చట్టం రాజ్యాంగ వ్యతిరేకమని పేర్కొంటూ అలహాబాద్ హైకోర్టు దాన్ని కొట్టివేసింది. అది లౌకికవాద భావనకు విరుద్ధమైనదని తెలిపింది. ఉత్తరప్రదేశ్ బోర్డ్ ఆఫ్ మదర్సా ఎడ్యుకేషన్ యాక్ట్-2004ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఆ హైకోర్టు లఖ్‌నవూ బెంచ్‌కు చెందిన న్యాయమూర్తులు జస్టిస్ వివేక్ చౌదరి, జస్టిస్ సుభాష్ విద్యార్థిలు శుక్రవారం ఈ తీర్పును వెలువరించారు. ఈ తీర్పు ప్రకారం మదర్సా ఎడ్యుకేషన్ బోర్డు పరిధిలో పనిచేస్తున్న మదర్సాలకు ప్రభుత్వ గ్రాంట్లు, ఇతర ఆర్థిక సాయం నిలిచిపోనుంది. చివరకు ఆ ఇస్లామిక్ విద్యాసంస్థలన్నీ మూతపడనున్నాయి. దాంతో ఇక్కడ చదువుతున్న విద్యార్థులను ఇతర పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. మదర్సా ఎడ్యుకేషన్ బోర్డు ఏర్పాటును సవాలు చేస్తూ అన్షుమన్ సింగ్ రాథోడ్ ఈ పిటిషన్ వేశారు.

బ్యాంకు ఖాతాల స్తంభనపై కాంగ్రెస్ పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీకి ఎదురుదెబ్బ తగిలింది. తమ అకౌంట్లను ఐటీ శాఖ ఫ్రీజ్ చేయడాన్ని సవాల్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం ఢిల్లీ హైకోర్టు కొట్టివేసింది. 2014-15, 2015-16, 2016-17 సంవత్సరాలకు సంబంధించి ఐటీ అధికారులు తమపై ప్రారంభించిన టాక్స్ రీఅసెస్మెంట్ ప్రొసీడింగ్స్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. వాదనలు విన్న ధర్మాసనం ఈ నెల 20న తీర్పును రిజర్వు చేసింది. పన్నుల చెల్లింపులో వ్యత్యాసాలు ఎంత వరకు ఉన్నాయని ధర్మాసనం ప్రశ్నించగా, నగదు, వస్తువులు అన్నింటినీ కలిపి రూ.520 కోట్ల వరకు తేడాలు ఉన్నట్టు గుర్తించామని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. దాంతో ఈ కేసులో టాక్స్ అథారిటీ చట్టబద్ధమైన నిబంధనల్ని ఉల్లంఘించలేదని ధర్మాసనం అభిప్రాయపడింది. కాంగ్రెస్ రిట్ పిటిషన్‌ను కొట్టివేసింది.

ముడుపులు డిమాండ్ చేసింది కేజ్రీవాలే



రౌజ్ అవెన్యూ కోర్టులో కేజ్రీవాల్

(మొదటి పేజీ తరువాయి)

కస్టడీలో ఇంటరాగేషన్ చేయడానికి అనుమతించాలని కోరింది. మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 50 కింద ఎన్నిసార్లు సమన్లు పంపినా హాజరు కాకుండా ఆయన తప్పించుకుంటున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. మనీ లాండరింగ్ చట్టంలోని సెక్షన్ 3 కింద ఆయన నేరానికి పాల్పడ్డారని ధ్రువీకరించింది. ఈ మేరకు 32 పేజీల దరఖాస్తు (కస్టడీ రిపోర్ట్)ను సమర్పించింది. "ఆమ్ ఆద్మీ పార్టీకి పూర్తి నాయకుడు కేజ్రీవాల్ మాత్రమే. కీలక నిర్ణయాలన్నీ ఆయనే తీసుకుంటారు. మద్యం విధానంతో ప్రయోజనాలు పొందిన వారి నుంచి ముడుపులు నేరుగా ఆయనే డిమాండ్ చేశారు. తద్వారా వచ్చిన రూ.45 కోట్లను గోవా అసెంబ్లీ ఎన్నికల్లో ఉపయోగించినట్లు ఆధారాలు ఉన్నాయి" అని తెలిపింది. ఈడీ దరఖాస్తులోని మరిన్ని వివరాలు..

సీఎం హోదాలో ఢిల్లీ మద్యం కుంభకోణానికి కేజ్రీవాలే ప్రధాన సూత్రధారి. అప్పటి ఉప ముఖ్యమంత్రి సిసోడియా, ఆప్ నేత విజయ్ నాయర్, ఇతర మంత్రులతో కలిసి ఆయన కుట్ర పన్నారు. కొందరికి అక్రమ ప్రయోజనాలు సమకూర్చేందుకు వీలుగా ఢిల్లీ మద్యం విధానాన్ని రూపొందించారు.

మంత్రివర్గం(జీవోఎం) ఆమోదించాల్సిన మద్యం విధానాన్ని రూపొందించేందుకు అవసరమైన 30 పేజీల డాక్యుమెంట్‌ను కేజ్రీవాల్ నివాసంలో సదరు శాఖ మంత్రి సిసోడియా తనకు ఇచ్చారని సిసోడియా కార్యదర్శి అరవింద్ చెప్పారు. హోల్‌సేల్ వ్యాపారం మార్జిన్‌ను 12% మేరకు నిర్ణయించింది ఇందులోనే. కానీ, ఈ నివేదికపై జీవోఎం సమావేశాల్లో ఎప్పుడూ చర్చించలేదు.

కేజ్రీవాల్, సిసోడియాతో విజయ్ నాయర్ నేరుగా చర్చించేవారు. ఆయన ఆప్ తరఫున దళారీగా వ్యవహరించారు. ఎలాంటి అధికారిక హోదా లేకపోయినా కేజ్రీవాల్ ఇంటి సమీపంలోని ఓ క్యాబినెట్ మంత్రి బంగళాలో నివసించారు.

సౌత్ లాబీ యజమానులైన కవిత, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మాగుంట రాఘవ, శరత్ రెడ్డిల నుంచి రూ.100 కోట్ల ముడుపులను విజయ్ నాయరే స్వీకరించారు. ఈ గ్రూప్‌కు అరుణ్ రామచంద్ర పిళ్లై, అభిషేక్ బోయినపల్లి, బుచ్చిబాబు ప్రాతినిధ్యం వహించారు. మద్యం విధానం రూపకల్పనపై విజయ్ నాయర్‌తో తెలంగాణకు చెందిన మద్యం వ్యాపారి అరుణ్ రామచంద్ర పిళ్లై చర్చించారు. కవితకు ప్రయోజనాలు కట్టబెట్టాలని నాయర్ అనుకున్నారని కవిత ఆడిటర్ బుచ్చిబాబు చెప్పారు.

మంత్రి మండలి ఆమోదించక ముందే బుచ్చిబాబు మొబైల్ ఫోన్‌లో మద్యం విధానం కాపీ దొరికింది. అందుకు సంబంధించి విజయ్ నాయర్‌తో జరిపిన సంభాషణలు కూడా లభ్యమయ్యాయి.

అభిషేక్ బోయినపల్లి రూ.100 కోట్లను విజయ్ నాయర్‌కు, ఆయన సహచరులకు రకరకాల పద్ధతుల్లో బదిలీ చేశారు. ఇందుకు బదులుగా సౌత్ లాబీకి ఇండో స్పిరిట్ హోల్‌సేల్ వ్యాపారం, కొన్ని రిటైల్ షాపులు, పెర్నార్డ్ వ్యాపారం, ఎల్ వన్ లైసెన్స్ లభించాయి.

సౌత్ లాబీ నుంచి అరవింద్ కేజ్రీవాల్ ముడుపులు డిమాండ్ చేసినట్లు పలు ఆధారాలు లభించాయి. ప్రముఖ మద్యం వ్యాపారి మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఇచ్చిన ప్రకటన ఇందుకు సాక్ష్యం. సీఎం కార్యాలయంలో ఆయన కేజ్రీవాల్‌తో సమావేశమయ్యారు. కవితతో రూ.100 కోట్ల మేరకు ముడుపులకు బేరం కుదిరినట్లు కేజ్రీవాల్ తనకు చెప్పారని మాగుంట తెలిపారు. ఆయన సలహా మేరకు తాను కవితను కలిశానని చెప్పారు. అప్పుడే ఆమె రూ.50 కోట్లు చెల్లించాలని తనను కోరారని, తన కుమారుడు రాఘవ కవిత మనుషులు అభిషేక్ బోయినపల్లి, బుచ్చిబాబులకు రూ.25 కోట్లు ముట్టచెప్పారని శ్రీనివాసులు రెడ్డి చెప్పారని వివరించింది. రాఘవ మాగుంట కూడా ఈ విషయాలను ధ్రువీకరించారు. ఇక అరబిందో సంస్థ యజమాని శరత్ రెడ్డి కూడా తాను అరుణ్ పిళ్లై, విజయ్ నాయర్ ద్వారా కేజ్రీవాల్‌ను కలిసిన తీరును వివరించారు. నాయర్‌తో కలిసి పని చేయాలని కేజ్రీవాల్ తనకు చెప్పారని ఈడీకి వివరించారు.


నా జీవితం దేశానికే అంకితం

తన జీవితం దేశానికే అంకితమని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టైన శుక్రవారం ఈడీ కార్యాలయం వద్ద తనకు ఎదురైన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. తాను జైలులో ఉన్నా, వెలుపల ఉన్నా తన జీవితం దేశానికే అంకితమని వ్యాఖ్యానించారు.

ఆరు రోజుల కస్టడీకి కేజ్రీవాల్

న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్‌ను ఆరు రోజుల ఈడీ కస్టడీకి అప్పగిస్తూ మనీ లాండరింగ్ నిరోధక చట్టం ప్రత్యేక కోర్టు జడ్జి కావేరి బవేజా శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. మనీ లాండరింగ్ చట్టం కింద కేజ్రీవాల్‌ను గురువారం రాత్రి అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఆయనను కస్టడీకి ఇవ్వాలని కోరుతూ శుక్రవారం రౌజ్ ఎవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఢిల్లీ ఎక్సైజ్ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి కేజ్రీవాలేనని, రూ.100 కోట్ల మేర ముడుపులను తీసుకోవడంలో ఆయనే ప్రధాన పాత్ర పోషించారని ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ రాజు వాదించారు. కేజ్రీవాల్ వాస్తవాలు వెల్లడించలేదని, డబ్బు ఎక్కడి నుంచి ఎక్కడకు వెళ్లిందో ఆయన నుంచి రాబట్టాల్సి ఉందని తెలిపారు. దర్యాప్తునకు సీఎం సహకరించలేదని, అందుకే కస్టడీకి కోరాల్సి వచ్చిందని తెలిపారు. కాగా, మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 19 కింద ఒక వ్యక్తిని అరెస్టు చేయాలంటే నేరం చేసినట్లు రుజువు చేయాలని, ఇంతవరకూ ఈడీ ఎలాంటి ప్రత్యక్ష సాక్ష్యం సమర్పించలేదని సీనియర్ న్యాయవాదులు అభిషేక్ సింఘ్వీ, విక్రం చౌదరి, రమేశ్ గుప్తా వాదించారు. కేజ్రీవాల్‌ను నిందితుడిగా విచారిస్తున్నట్లు నిన్నటి వరకూ ఈడీ చెప్పలేదని తప్పుబట్టారు. 'కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా సాక్షులు ముందుగా ఎలాంటి వివరాలు చెప్పలేదు. అరెస్టు చేసి.. బెయిల్ నిరాకరించిన తర్వాతే వారు ప్రకటనలు చేశారు. వారిని బలవంతంగా అప్రూవర్లుగా మార్చారు. దేశ చరిత్రలో ఇలా ఒక సీఎంను అరెస్టు చేయడం ఇదే ప్రథమం. సార్వత్రిక ఎన్నికలను ఈ అరెస్టులు ప్రభావితం చేస్తాయి" అని సింఘ్వీ వాదించారు. కాగా, కేజ్రీవాల్ అరెస్టు నేపథ్యంలో ఆప్ శ్రేణులు ఆందోళన బాట పట్టాయి. డీడీయూ మార్గ్‌లోని బీజేపీ కేంద్ర కార్యాలయం ముందు నిరసన తెలిపాయి. దీంతో డీడీయూ మార్గ్‌లో సెక్షన్ 144ను విధించారు. నిరసన తెలిపిన మంత్రులు సౌరబ్ భరద్వాజ్, ఆతిషిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆప్ నిరసనలతో ఢిల్లీలోని పలు మెట్రోస్టేషన్లను మూసి వేశారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నిజామాబాద్	37.0	23.0
ఆదిలాబాద్	34.3	22.5
రామగుండం	37.0	21.8
ఖమ్మం	37.0	24.0
నల్లగొండ	38.0	23.4

జైలు నుంచే సర్కారును నడుపుతా!

న్యూఢిల్లీ, మార్చి 22: సీఎం పదవికి రాజీనామా చేయబోనని, అవసరమైతే జైలు నుంచే ప్రభుత్వాన్ని నడుపుతానని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో అరెస్టైన కేజ్రీవాల్‌ను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు శుక్రవారం ఈడీ కస్టడీకి అప్పగించింది. ఈ నేపథ్యంలో తమ ప్రతినిధితో కేజ్రీవాల్ మాట్లాడుతూ, 'జైల్లో ఉన్నా, బయట ఉన్నా అక్కడి నుంచే ప్రభుత్వాన్ని నడిపిస్తా' అని చెప్పారని ఇండియాటుడే టీవీ చానల్ వెల్లడించింది. కేజ్రీవాల్ సారథ్యంలోని ఆమ్‌ఆద్మీపార్టీ కూడా.. ఢిల్లీ సీఎంగా ఆయనే కొనసాగుతారని చెబుతోంది. దీనిపై సీనియర్ న్యాయవాది గోపాల్ శంకర నారాయణన్ స్పందిస్తూ.. సీఎంగా ఉన్న వ్యక్తి అరెస్టయితే ఆ పదవి నుంచి దిగిపోవాలని ఏ చట్టంలోనూ లేదని తెలిపారు. రాజ్యాంగ విలువలను దృష్టిలో పెట్టుకొని కేజ్రీవాల్ సీఎం పదవి నుంచి దిగిపోతేనే మంచిదని.. మరో సీనియర్ లాయర్ అర్ణబ్ చౌదరి పేర్కొన్నారు.

ప్రతిపక్షాలపై దాడులు ఆపాలని ఆదేశించండి

» ఎన్నికల కమిషన్‌కు విపక్ష నేతల వినతి

న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు ముందు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ ప్రతిపక్షాలు ఐక్య కార్యాచరణకు సిద్ధమయ్యాయి. ఆర్టికల్ 324 కింద విశేషాధికారాల్ని ఉపయోగించుకుని కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) జోక్యం చేసుకుని ప్రతిపక్షాలపై దాడులను ఆపాలని ఆదేశించాలని కోరాయి. ఈ మేరకు కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్, టీఎంసీ నేత డెరెక్ ఓబ్రెయిన్, సీపీఎం నేత సీతారాం ఏచూరి సహా పలువురు ఇండియా కూటమి నేతలు శుక్రవారం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. "ప్రతిపక్షాలను లక్ష్యంగా చేసుకొని, వాటి గొంతు నొక్కేందుకు కేంద్ర ఏజెన్సీలను బీజేపీ విచ్చలవిడిగా వాడుకుంటూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది. దీంతో దేశంలో స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికలు జరిగేందుకు విఘాతం కలుగుతోంది. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. అంతకుముందు అప్పటి ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేశారు. వారిని అరెస్టు చేయడం వల్ల రెండు రాష్ట్రాల్లో ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతోంది. ప్రధాన ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్ ఖాతాలను స్తంభింపజేశారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు తృణమూల్, ఆర్జేడీ, బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నేతలపై ఈడీ దాడులు చేసి కొందరిని అరెస్టు కూడా చేసింది. గతంలో ఎన్నడూ ప్రతిపక్షాలపై ఇంత దారుణంగా ఏజెన్సీలను దుర్వినియోగపరచడం చూడలేదు" అని వినతిపత్రంలో పేర్కొన్నారు.



సీఈసీ రాజీవ్‌కుమార్‌ను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతున్న 'ఇండియా' నేతలు

కేజ్రీవాల్ సతీమణికి రాహుల్ పరామర్శ

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అరవింద్ కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్‌కు ఫోన్ చేసి పరామర్శించారు. తమ సంఘీభావాన్ని తెలిపారు. ఇండియా కూటమి బలాన్ని చూసి ప్రధాని మోదీ భయపడిపోతున్నారని.. అందుకే కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ పరిణామాలు కూటమిని మరింత బలోపేతం చేస్తాయని పేర్కొంది. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ముఖ్యమంత్రులను కుట్రపూరితంగా అరెస్టు చేస్తున్నారని, బీజేపీతో చేతులు కలిపిన నేతలపై ఉన్న కేసులను మాత్రం ఉపేక్షిస్తున్నారని మమత మండిపడ్డారు. కేజ్రీవాల్ అరెస్టును చట్ట విరుద్ధమైన చర్యగా సీపీఎం, సీపీఐ అభివర్ణించాయి. ఇదిలా ఉండగా, దేశంలోని వివిధ ప్రాంతాల రాజకీయ పార్టీలు, భావజాలాలకు చెందిన ఓబీసీ నేతలు ఓబీసీ ఘట్‌బంధన్ పేరుతో కూటమిగా ఏర్పడి ఇండియా కూటమికి ఈ ఎన్నికల్లో మద్దతునిస్తున్నట్లు ప్రకటించాయి. ఈమేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేతో పాటు రాహుల్‌ను కలిశాయి.

హైతీలో భారతీయుల రక్షణకు ఆపరేషన్ ఇంద్రావతి

న్యూఢిల్లీ, మార్చి 22: కరేబియన్ దీవుల సముదాయంలోని హైతీ దేశంలో సాయుధ గ్యాంగ్‌లు వీధి పోరాటాలకు దిగడంతో అరాచకం రాజ్యమేలుతోంది. ప్రభుత్వం అదృశ్యం కావడంతో అనిశ్చితి నెలకొంది. వాస్తవానికి అక్కడ ప్రభుత్వ యంత్రాంగం అంటూ ఏమీ లేదు. ఈ పరిస్థితుల్లో అక్కడ ఉంటున్న భారతీయులను కాపాడేందుకు 'ఆపరేషన్ ఇంద్రావతి'ని నిర్వహిస్తున్నట్టు భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జయ్‌శంకర్ వెల్లడించారు. గురువారం 12 మందిని సమీపంలోని డొమినిక్ రిపబ్లిక్ దేశానికి సురక్షితంగా తరలించినట్టు తెలిపారు. అమెరికా ప్రభుత్వం కూడా తమ రాయబార కార్యాలయంలోని అంత అత్యవసరమైన పోస్టుల్లో లేని ఉద్యోగులను వాయు మార్గంలో తరలించింది. హైతీలో గ్యాంగ్ వార్‌లు ముదరడంతో ఇప్పటికే ఎమర్జెన్సీని విధించారు. దేశం బయట ప్రధాని ఏరియల్ హెన్రీ చిక్కుకుపోవడంతో ఆయన ఈ నెల 12న రాజీనామా చేశారు. అప్పటి నుంచి దేశం అల్లకల్లోలమయింది. సాయుధ గ్యాంగ్‌లు విమానాశ్రయాలు, పోలీసుస్టేషన్లు, జైళ్లపై దాడులు చేస్తున్నాయి. వేలాది మంది ఖైదీలు జైళ్ల నుంచి తప్పించుకొని పారిపోయారు. హైతీలో అత్యంత కిరాతకమైనదిగా పేరు పొందిన 'జీ9 అండ్ ఫ్యామిలీ' గ్యాంగ్‌కు 47 ఏళ్ల చెరిజియర్ నాయకత్వం వహిస్తున్నారు.

బీజేపీకి 466 కోట్లు..ఎవరిచ్చారో తెలీదు!

ఎస్‌బీఐ ఈసీకి ఇచ్చిన రెండు జాబితాల్లో తేడాలు



న్యూఢిల్లీ, మార్చి 22: బీజేపీకి ఎన్నికల బాండ్ల రూపంలో వచ్చిన విరాళాల్లో.. రూ.466 కోట్లు ఎవరిచ్చారో వివరాల్లేవు! సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు తాజాగా ఈసీకి నంబర్లతో సహా బాండ్ల 'పూర్తి' వివరాలను సమర్పించామని ఎస్‌బీఐ ప్రకటించిందిగానీ.. అందులోనూ కొన్ని లొసుగులున్నాయి. అది నిజంగా 'పూర్తి' సమాచారం కాదు. ఎందుకంటే.. ఎస్‌బీఐ గురువారం ఈసీకి రెండు జాబితాలు సమర్పించింది. అందులో ఒకటి.. కొనుగోలుదారుల జాబితా కాగా, రెండోది వారిచ్చిన బాండ్లను నగదుగా మార్చుకున్న పార్టీల జాబితా. కొనుగోలుదారుల జాబితాలో 18,871 ఎన్నికల బాండ్ల వివరాలున్నాయి. కానీ.. నగదుగా మార్చుకున్న పార్టీల జాబితాలో 20,421 బాండ్ల వివరాలున్నాయి. రెండింటిలోనూ కామన్‌గా ఉన్న యునిక్ నంబర్ ఆధారంగా.. ఏ కంపెనీ/ఏ వ్యక్తి ఏ పార్టీకి ఎంత విలువైన బాండ్లు ఇచ్చిందీ సరిపోల్చే ప్రయత్నం చేయగా.. 18,741 బాండ్ల వివరాలే సరిపోలుతున్నాయి. వాటి విలువ రూ.12,145.88 కోట్లు. కానీ గత ఐదేళ్లలో జారీ అయిన మొత్తం బాండ్ల విలువ రూ.12,769 కోట్లు. ఈ రెండింటి మధ్య తేడా.. రూ.623 కోట్లు. అందులో రూ.466.5 కోట్ల దాకా బీజేపీకి అందగా.. కాంగ్రెస్‌కు ఇలా వచ్చినవి రూ.70 కోట్లు, తృణమూల్ కాంగ్రెస్‌కు వచ్చినవి రూ.17 కోట్లు. ఇలా కొనుగోలుదారు పేరు లేకుండా ఆయా పార్టీలకు అందిన బాండ్లన్నీ 2019 ఏప్రిల్ 12 నుంచి ఏప్రిల్ 25 మధ్య పార్టీలు నగదుగా మార్చుకున్నవే. అంటే.. ఆ బాండ్లన్నీ 2019 ఏప్రిల్ 4 నుంచి ఏప్రిల్ 11 లోపు జారీ అయి ఉంటాయని అంచనా.

బాండ్లు ఇచ్చుకో..

ఐటీ, ఈడీ కేసులు, దాడులను ఎదుర్కొన్న పలు కంపెనీలు రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వడం గమనార్హం. ఉదాహరణకు.. దేశంలోనే అత్యధికంగా రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చిన ఫ్యూచర్ గేమింగ్ కంపెనీపై 2019 జులైలో ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. మేఘా కంపెనీ కూడా ఐటీ, ఈడీ దాడులను ఎదుర్కొంది. 2019 ఫిబ్రవరిలో ఈడీ దాడులను ఎదుర్కొన్న ఎంకే జలన్ గ్రూప్.. రూ.616.9 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేసి పార్టీలకు సమర్పించుకుంది. 2022 మార్చిలో హీరో మోటోకార్ప్‌పై ఐటీ దాడులు జరగ్గా.. ఆ ఏడాది అక్టోబరు 7న ఆ కంపెనీ రూ.20 కోట్ల విలువైన బాండ్లు కొని బీజేపీకి సమర్పించింది. అలాగే.. అరబిందో ఫార్మా ఎండీ పి.శరత్‌చంద్రారెడ్డి ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో 2022 నవంబరు 10న అరెస్ట్ కాగా.. ఆ తర్వాత ఐదురోజులకు అరబిందో ఫార్మా రూ.5 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేసింది. 2023 జనవరి 27న రౌస్ ఎవెన్యూ కోర్టు ఆయనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయగా.. మే 8న ఢిల్లీ హైకోర్టు బెయిల్ ఇచ్చింది. అరబిందో మళ్లీ నవంబరు 8న రూ.25 కోట్ల బాండ్లు కొనుగోలు చేసింది.

బీజేపీకి వచ్చిన విరాళాలు

బాండ్ల రూపంలో భారతీయ జనతాపార్టీకి అత్యధికంగా విరాళాలిచ్చింది మేఘా ఇంజనీరింగ్ (రూ.584 కోట్లు). అలాగే.. క్విక్ సప్లై (రూ.385 కోట్లు), వేదాంత (రూ.230.2 కోట్లు), భారతి ఎయిర్‌టెల్ గ్రూప్ (రూ.247 కోట్లు), మదన్‌లాల్ లిమిటెడ్ (రూ.175.5 కోట్లు), కెవెంటర్ ఫుడ్ పార్క్ (రూ.144.5 కోట్లు), డీఎల్ఎఫ్ కమర్షియల్ (రూ.130 కోట్లు), బిర్లా కార్బన్ (రూ.105 కోట్లు), ఫ్యూచర్ గేమింగ్ (రూ.100 కోట్లు), హల్దియా ఎనర్జీ (రూ.81 కోట్లు), ఇతరులు.. రూ.3,486.1 కోట్లు విరాళంగా ఇచ్చారు.

కాంగ్రెస్‌కు వచ్చిన విరాళాలు

కాంగ్రెస్ పార్టీకి అత్యధికంగా బాండ్ల రూపంలో విరాళాలు ఇచ్చిన కంపెనీ వేదాంత. ఆ కంపెనీ కాంగ్రెస్‌కు రూ.125 కోట్లు సమర్పించింది. వెస్టన్ యూపీ పవర్ ట్రాన్స్‌మిషన్ కంపెనీ (రూ.110 కోట్లు), ఎంకేజే ఎంటర్‌ప్రైజెస్ (రూ.91.6 కోట్లు), యశోద హాస్పిటల్ (రూ.64 కోట్లు), అవీస్ ట్రేడింగ్ అండ్ ఫైనాన్స్ (రూ.53 కోట్లు), ఫ్యూచర్ గేమింగ్ (రూ.50 కోట్లు), సస్మల్ ఇన్‌ఫ్రా (రూ.39 కోట్లు), రిత్విక్ ప్రాజెక్ట్స్ (రూ.30 కోట్లు), ఎస్ఈపీసీ పవర్ (రూ.30 కోట్లు) విరాళాలిచ్చారు.

ఏ పార్టీకి ఎవరెవరి విరాళాలు?

టీఎంసీ తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి అత్యధికంగా ఫ్యూచర్ గేమింగ్ నుంచి రూ.542 కోట్లు అందాయి. మిగతా సంస్థలు.. హల్దియా ఎనర్జీ (రూ.281 కోట్లు), ధరివాల్ ఇన్‌ఫ్రా (రూ.90 కోట్లు), ఎంకేజే ఇన్‌ఫ్రా (రూ.45.9 కోట్లు), అవీస్ ట్రేడింగ్ అండ్ ఫైనాన్స్ (రూ.45.5 కోట్లు), ఐఎఫ్‌బీ ఆగ్రో (రూ.42 కోట్లు), చెన్నై గ్రీన్ వుడ్స్ (రూ.40 కోట్లు), పీసీబీఎల్ (రూ.40 కోట్లు), ప్రారంభ్ సెక్యూరిటీస్ (రూ.38.8 కోట్లు), క్రిసెంట్ పవర్ (రూ.33 కోట్లు), ఇతరులు రూ.394.1 కోట్లు.

బీఆర్ఎస్ దక్షిణాదిన ప్రాంతీయ పార్టీలన్నింటిలోకీ అత్యధిక విరాళాలు అందుకున్న బీఆర్ఎస్‌కు.. అందరికన్నా ఎక్కువగా మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.195 కోట్లు విరాళంగా ఇచ్చింది. అలాగే.. యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (రూ.94 కోట్లు), చెన్నై గ్రీన్‌వుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ (రూ.50 కోట్లు), డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ (రూ.32 కోట్లు), హెటిరో డ్రగ్స్ (రూ.30 కోట్లు), ఔటర్ రింగ్ రోడ్డు 30 ఏళ్ల లీజు కాంట్రాక్టును దక్కించుకున్న ఐఆర్‌బీ ఇన్‌ఫ్రా సంస్థ (రూ.25 కోట్లు), కేరళకు చెందిన కైటెక్స్ కంపెనీ (రూ.25 కోట్లు), హెటిరో ల్యాబ్స్ లిమిటెడ్ (రూ.20 కోట్లు), ఇతర కంపెనీలు రూ.720 కోట్ల మేర బీఆర్ఎస్‌కు బాండ్ల రూపంలో విరాళాలు ఇచ్చాయి.

వైసీపీ ఫ్యూచర్ గేమింగ్ కంపెనీ.. ఏపీలో అధికార పార్టీ అయిన వైసీపీకి రూ.154 కోట్లు విరాళంగా ఇవ్వడం ఆసక్తికరం. వైసీపీకి 100 కోట్లకు పైగా విరాళాలు ఇచ్చిన కంపెనీ అదొక్కటే. దాని తర్వాత మేఘా ఇంజనీరింగ్ (రూ.37 కోట్లు), రామ్‌కో సిమెంట్స్ (రూ.24 కోట్లు) ఓస్ట్రో జైసల్మేర్ (రూ.17 కోట్లు), ఓస్ట్రో మధ్య విండ్ (రూ.17 కోట్లు), స్నేహ కైనెటిక్ పవర్ ప్రాజెక్ట్స్ (రూ.10 కోట్లు) ఇతరులు రూ.69.8 కోట్లు.

టీడీపీ తెలుగుదేశం పార్టీకి అత్యధికంగా విరాళాలు ఇచ్చిన సంస్థ.. షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ (రూ.40 కోట్లు). అలాగే.. మేఘా ఇంజనీరింగ్ (రూ.28 కోట్లు), వెస్ట్రన్ యూపీ పవర్ ట్రాన్స్‌కో (రూ.20 కోట్లు), నాట్కో ఫార్మా (రూ.14 కోట్లు), డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ (రూ.13 కోట్లు), భారత్ బయోటెక్ (రూ.10 కోట్లు), ఇతరులు రూ.86.6 కోట్లు.

ఇస్రో పుష్పక్ పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట, మార్చి 22: అంతరిక్ష వ్యర్థాల నియంత్రణలో భాగంగా ఒకసారి ప్రయోగించిన రాకెట్‌ను తిరిగి భూమి మీదికి తీసుకొచ్చే ప్రక్రియలో ఇస్రో కీలక ముందడుగు వేసింది. దీనికోసం ప్రత్యేకంగా అభివృద్ధి చేసిన రీయూజబుల్ లాంచ్ వెహికిల్ (ఆర్ఎల్‌వీ) ఎల్ఈఎక్స్-02 స్వయంగా ల్యాండయ్యే పరీక్షను విజయవంతంగా నిర్వహించింది. కర్ణాటక చిత్రదుర్గలోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్ నుంచి శుక్రవారం ఉదయం 7.10 గంటలకు ఈ పరీక్ష నిర్వహించినట్టు ఇస్రో ఎక్స్ (ట్విటర్)లో వెల్లడించింది. విమానం రెక్కల తరహాలో రూపొందించిన ఈ పునర్వినియోగ రాకెట్‌కు ఇస్రో 'పుష్పక్' అని పేరు పెట్టింది. ఈ సిరీస్‌లో ఇస్రో నిర్వహించిన రెండో పరీక్ష ఇది. గతేడాది కూడా ఆర్ఎల్‌వీ-ఎల్ఈఎక్స్-01 పేరిట ఇస్రో తొలిసారి పుష్పక్‌ను పరీక్షించింది. తాజాగా స్వతంత్ర్య ల్యాండింగ్‌కు సంబంధించి దాని సామర్థ్యాన్ని ఎల్ఈఎక్స్-02 ద్వారా మరోసారి పరీక్షించింది. దీనికోసం భారత వాయుసేనకు చెందిన చినూక్ హెలికాప్టర్‌లో పుష్పక్‌ను రన్‌వేకు 4 కిలోమీటర్ల దూరంలో 4.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి వదిలిపెట్టారు. ఆరంభంలో కొన్ని ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ అక్కడి నుంచి ప్రయాణిస్తూ రన్‌వే వద్దకు చేరుకున్న పుష్పక్.. సురక్షితంగా ల్యాండ్ అయింది. అత్యంత కచ్చితత్వంతో రన్‌వేపై దిగిన ఈ వాహక నౌక.. పారాచూట్, ల్యాండింగ్ గేర్ బ్రేకులు, నోస్ వీల్ స్టీరింగ్ సిస్టమ్ సాయంతో తనకు తానే ఆగిపోయింది. ఎంతో సంక్లిష్టమైన ఈ పరీక్షను విజయవంతం చేసిన బృందాన్ని ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ అభినందించారు. అంతరిక్షం నుంచి తిరిగొచ్చే సమయంలో ఆర్ఎల్‌వీ విధానం ఎలా ఉంటుంది, హైస్పీడ్ ల్యాండింగ్‌ను అది ఎలా నియంత్రించగలుగుతుంది వంటి పరిస్థితులను ఈ మిషన్ విజయవంతంగా ప్రదర్శించిందని ఇస్రో పేర్కొంది.



మత్తుకు అలవాటు చేసి.. రేవ్ పార్టీలకు!

నిరుపేద విద్యార్థినులే లక్ష్యంగా జగిత్యాలలో దందా.. గంజాయికి బానిసైన ఓ బాలిక వింత ప్రవర్తన

- చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు
- తనలాగే పది మంది బాలికలు మత్తుకు అలవాటు పడ్డారని బాధితురాలి వెల్లడి
- బాలికలంతా పలుమార్లు హైదరాబాద్‌లోని రేవ్ పార్టీలకు
- రంగంలోకి నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో
- విచారణ చేస్తాం: ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్



జగిత్యాల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న నిరుపేద బాలికలను, వసతి గృహాల్లోని విద్యార్థినులకు గంజాయి అలవాటు చేసి, వారిని రేవ్ పార్టీలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న దందా జగిత్యాల జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. జగిత్యాల పట్టణంలో ఓ బాలిక గంజాయి మత్తుకు బానిసై వింతగా ప్రవర్తిస్తుండంతో ముఠా నిర్వాకం బయటపడింది. బాధిత బాలిక తరహాలోనే మరో 10 మంది విద్యార్థినులను ఈ ముఠా మత్తుకు బానిస చేసినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండు సమీపంలో ఉన్న పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని రెండు నెలల క్రితం వింతగా ప్రవర్తిస్తూ అస్వస్థతకు గురైంది. సెల్‌ఫోన్ వినియోగానికి బానిస కావడంతోనే బాలిక అలా ప్రవర్తిస్తుందేమోనని భావించిన తల్లిదండ్రులు ఆమెను ఓ వైద్యుడి వద్దకు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇప్పించారు. బాలిక ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో తమ బాలిక పట్ల జరగరానిదేదో జరిగి ఉంటుందన్న అనుమానంతో ఒక పార్టీ శాఖ జిల్లా అధ్యక్షుడితో కలిసి గత నెల 15న చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఫిర్యాదు చేశారు. అప్పటి జగిత్యాల సీఐ, బాధిత బాలికకు ప్రకృతి ఎన్జీవో ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో రంగంలోకి దిగిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆఫీసర్లు బాధితురాలి నుంచి వివరాలు ఆరా తీశారు. ఆమె వెల్లడించిన సమాచారం ఆధారంగా మరో 10 మంది బాలికలు కూడా గంజాయికి అలవాటు పడినట్లు గుర్తించారు. వీరికి తొలుత గంజాయి, ఆ తర్వాత డ్రగ్స్‌కు అలవాటు చేసినట్లు సమాచారం. మత్తుకు అలవాటు పడిన బాలికలను ఓ ముఠా హైదరాబాద్‌లోని రేవ్ పార్టీలకు తీసుకెళ్లిందని, ఇందుకు ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారని తెలుసుకొని షాక్ అయ్యారు. పాఠశాలలో ప్రత్యేక తరగతులు ఉన్నాయని చెప్పి బాలికలు జగిత్యాల నుంచి హైదరాబాద్‌లోని రేవ్ పార్టీలకు వెళ్లినట్లు గుర్తించారు. బాలికలు ఓ రోజు రాత్రి పూట చెప్పాపెట్టకుండా ఇంట్లోంచి వెళ్లిపోయి రెండ్రోజుల తర్వాత తిరిగిరావడం.. పిల్లల ప్రవర్తనల్లో మార్పు రావడాన్ని తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. తల్లిదండ్రుల్లో కొందరు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా ఈ ఘటనపై నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సైతం లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. బాలికలను మత్తులోకి దించడానికి ఎలాంటి డ్రగ్స్ వినియోగిస్తున్నారు? అవి ఎక్కడి నుంచి సప్లయ్ అవుతున్నాయి? ఇప్పటివరకు ఎంత మంది ఈ ఉచ్చులో చిక్కుకున్నారు? బాలికలను రేవ్ పార్టీలకు తరలిస్తోంది ఎవరు? సదరు పాఠశాల ఉపాధ్యాయులు ఎందుకు గమనించలేదు? గతంలో పోలీస్ స్టేషన్‌లో ఎవరైనా ఫిర్యాదు చేశారా? అయితే ఎంత వరకు విచారణ కొనసాగింది.? శిశు సంరక్షణ అధికారుల విచారణలో తేలిన అంశాలు ఏమిటి? తదితర వివరాలను పోలీసు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై జగిత్యాల జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా ఘటనపై లోతుగా విచారణ చేపడుతున్నామని తెలిపారు. జిల్లా బాలికల సంక్షరణ అధికారి హరీశ్ మాట్లాడుతూ సదరు బాలికకు మానసిక సమస్య ఉందన్న అనుమానంతో స్వధార్ హోమ్‌కు తరలించామని స్పష్టం చేశారు. అక్కడే తల్లిదండ్రుల సమక్షంలో పలు దఫాలుగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కాగా జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఓ గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి ఈ దందా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధికారుల ధనదాహానికి బలి

- భూ రికార్డులో సవరణ కోసం రూ.4.50లక్షల లంచం
- ఏడాది గడిచినా పరిష్కారమవని సమస్య
- మనస్తాపంతో అన్నదాత ఆత్మహత్య



మృతుడు రఘుపతి

బచ్చన్నపేట, మార్చి 22: పొలం తన అధీనంలోనే ఉన్నా రికార్డులో పేరు లేకపోవడంతో ఆ రైతు అధికారుల చుట్టూ తిరిగారు. పేరు చేర్చడానికి అడిగితే లంచం కూడా ఇచ్చాడు. అయితే ఏడాది గడిచినా సమస్య పరిష్కారం కాకపోవడంతో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలో ఈ ఘటన జరిగింది. బాధిత రైతు భార్య పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్మట రఘుపతికి బచ్చన్నపేట మండలం కొన్నె రెవెన్యూ శివారులో ఎకరం 20 గుంటల పొలం ఉంది. రికార్డుల్లో ఆయన పేరు లేకపోవడంతో పలుమార్లు రెవెన్యూ అధికారులను ఆశ్రయించాడు. ఫలితం లేకపోవడంతో రెవెన్యూ కార్యాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న రవీందర్ సహకారంతో నిరుడు ఫిబ్రవరిలో సీనియర్ అసిస్టెంట్ కొలిపాక సుమన్‌కు రూ.4.5లక్షలు లంచం ఇచ్చాడు. అప్పటి నుంచి కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో సుమన్‌ను గట్టిగా నిలదీస్తే రికార్డుల్లో నమోదు చేయడం కుదరడం లేదని బదులిచ్చాడు. తానిచ్చిన డబ్బయినా తిరిగివ్వాలని అడిగితే పట్టించుకోలేదు. దీంతో మనస్తాపం చెందిన రఘుపతి(45) శుక్రవారం పొలంలో చెట్టుకు ఉరేసుకున్నాడు. తన భర్త చావుకు కారణమైన సుమన్, రవీందర్‌పై చర్యలు తీసుకోవాలని శ్యామల డిమాండ్ చేశారు. రఘుపతి కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్థులు, సీపీఎం నాయకులు తహసీల్దార్ కార్యాలయం వద్ద మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేపట్టారు. రఘుపతికి భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు.

పోక్సో కేసులో సీఐ సంపత్ అరెస్టు



బండారు సంపత్

వరంగల్ క్రైం, మార్చి 22 : బాలికపై అత్యాచార యత్నం చేసిన కేసులో భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైం విభాగంలో సీఐగా పనిచేస్తున్న బండారు సంపత్ అరెస్టయ్యారు. ఈయనపై పోక్సో కేసు నమోదు చేసిన కేయూ పోలీసులు.. గురువారం అర్ధరాత్రి అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో కేయూ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా పనిచేసిన సమయంలో సంపత్‌కు ఆ ప్రాంతంలోని ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. సంపత్ పరిచయంతో ఆ మహిళ కాపురంలో వివాదాలు జరిగి భర్తకు దూరమైంది. అనంతరం ఇద్దరు సహజీవనం చేశారు. ఆపై సీఐగా పదోన్నతి పొందిన సంపత్.. ఖమ్మం, అటు నుంచి భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైంకు మారారు. మహిళ వద్దకు వస్తున్న సీఐ సంపత్.. ఆమె కుమార్తె(మైనర్)పై కన్నేసి ఇటీవల అత్యాచార యత్నం చేశాడు. గమనించిన సదరు మహిళ.. సీఐ సంపత్‌పై కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో ఆయన్ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన విషయాన్ని కేయూ సీఐ సంజీవ్ ధ్రువీకరించారు. సంపత్‌పై సస్పెన్షన్ వేటు పడనుంది.

విద్యార్థినులపై ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు

- షీ టీమ్ అవగాహన సదస్సుతో వెలుగు చూసిన ఘటన

నాగిరెడ్డిపేట, మార్చి 22: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినులను లైంగికంగా వేధించాడు. ఆ పాఠశాలలో షీ టీమ్ సభ్యులు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు కారణంగా అతడి వ్యవహారం బయటపడింది. ఈ ఘటన కామారెడ్డి జిల్లాలో నాగిరెడ్డిపేట మండల పరిధిలోని ఓ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగింది. నిజామాబాద్ జిల్లా బోధన్ మండలం పెంటాకలాన్ గ్రామానికి చెందిన గుండారం ప్రవీణ్ సదరు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం జిల్లా షీ టీమ్ సభ్యులు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై ఆ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. దాంతో ప్రవీణ్ లైంగిక వేధింపుల గురించి విద్యార్థినులు షీ టీమ్ దృష్టికి తీసుకొచ్చారు. షీ టీమ్ సభ్యులు విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు ఆ పాఠశాలలో విచారణ జరిపి, సదరు ఉపాధ్యాయుడు ఇద్దరు విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తేల్చారు. బాధిత విద్యార్థినుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ప్రవీణ్‌పై పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు.



బట్టలు విప్పించి.. లోదుస్తులు లాగి..

- ట్రాక్టర్ డ్రైవర్‌పై దౌర్జన్యం.. ఇద్దరు కానిస్టేబుళ్లపై వేటు

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), మార్చి 22: బట్టలు విప్పించి.. లోదుస్తులు లాగేసి.. ఓ ట్రాక్టర్ డ్రైవర్ పట్ల దౌర్జన్యం చేసిన ఇద్దరు కానిస్టేబుళ్లను మహబూబాబాద్ ఎస్పీ సస్పెండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు వీరన్న, సాంబయ్య ఇటీవల ఓ రోజు రాత్రి పెట్రోలింగ్ విధుల్లో ఓ ఇసుక ట్రాక్టర్ డ్రైవర్‌పై దౌర్జన్యం చేసి.. బట్టలు విప్పించి.. డ్రాయర్ పట్టుకుని లాగారు. ఆ వీడియో గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. విచారణ జరిపిన మహబూబాబాద్ ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్.. కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

'ఇందుగుల'వాసులకు మెరుగైన వైద్యం అందిస్తాం

- రాష్ట్ర వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ శివబాలాజీ రెడ్డి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మాడ్గులపల్లి, మార్చి 22: అంతుచిక్కని వ్యాధితో రెండు నెలలుగా ఇబ్బంది పడుతున్న నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం ఇందుగుల గ్రామస్థులకు మెరుగైన వైద్యం అందిస్తామని రాష్ట్ర వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ శివబాలాజీ రెడ్డి తెలిపారు. '2 నెలలుగా పల్లెకు సుస్తీ' శీర్షికతో శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించారు. వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్‌తో మాట్లాడి వెంటనే సీనియర్ వైద్య బృందాన్ని ఇందుగులతో పాటు మండలంలోని అన్ని గ్రామాలకు పంపాలని ఆదేశించారు. మంత్రి వెంకటరెడ్డి ఆదేశాల మేరకు వైద్య బృందం.. ఇందుగుల గ్రామంలో జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్న బాధితుల ఇళ్లకు వెళ్లి వివరాలను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ శివబాలాజీ రెడ్డి మాట్లాడుతూ... వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు మెరుగైన వైద్యం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. గ్రామంలో తాగునీటి నమూనాలు సేకరించి పరీక్ష కోసం ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట రాష్ట్ర ఎపిడెమాలజిస్ట్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన మానుకోట సబ్ రిజిస్ట్రార్

- రూ.19 వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత



మహబూబాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వ లెక్కల ప్రకారం చదరపు గజానికి రూ.100 చొప్పున ఫీజు చెల్లించాలి. కానీ, ఆమె అదనంగా గజానికి రూ.200 లంచం డిమాండ్ చేశారు. చివరకు రూ.150 చొప్పున లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కు పట్టుబడ్డారు. మహబూబాబాద్ జిల్లా సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ శుక్రవారం భూమి రిజిస్ట్రేషన్‌కు డబ్బు తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాలోని దాట్ల గ్రామానికి చెందిన రైతు గుండగాని హరీశ్ దంతాలపల్లిలో 128 గజాల స్థలం కొన్నాడు. రిజిస్ట్రేషన్ కోసం ఈ నెల మొదటి వారంలో సబ్ రిజిస్ట్రార్ తస్లీమాను సంప్రదించారు. చదరపు గజానికి రూ.200 అదనంగా ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. రూ.150 అదనంగా ఇస్తానని హరీశ్ బతిమాలాడు. తర్వాత ఏసీబీని ఆశ్రయించాడు. మరోవైపు రిజిస్ట్రేషన్ కోసం వస్తానని, రూ.19,200 ఇస్తానని సబ్ రిజిస్ట్రార్‌కు సమాచారం ఇచ్చాడు. నగదుతో కార్యాలయానికి వెళ్లగా డేటా ఎంట్రీ ఆపరేటర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి వెంకట్ అలియాస్ ఆలేటి వెంకటేశ్వర్లుకు అందించాలని సబ్ రిజిస్ట్రార్ సూచించారు. అప్పటికే నిఘా పెట్టి ఉన్న ఏసీబీ అధికారులు వెంకటేష్ డబ్బు తీసుకుంటుండగా పట్టుకున్నారు. శుక్రవారం పలువురి నుంచి లంచంగా వసూలు చేసిన రూ.1.72 లక్షలు కూడా వెంకట్ వద్ద లభించాయి. సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్‌తో పాటు సహకరించిన వెంకట్‌ను అరెస్టు చేశారు. వీరిని శనివారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. తస్లీమా ములుగు జిల్లా సబ్‌రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో గిరిజనులకు సాయంతో పేరు తెచ్చుకున్నారు. కొవిడ్ సమయంలో ములుగు ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి సీతక్కతో కలిసి కొండలు, గుట్టలు దాటి గిరిజన గూడేల్లోకి వెళ్లి నిత్యావసరాలు అందజేశారు. ఇదంతా సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి వెళ్లడంతో తస్లీమా ప్రశంసలు అందుకున్నారు. కానీ, ఆమె లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశమైంది.

లెక్చరర్లు మందలించారని విద్యార్థిని ఆత్మహత్య?

- బెల్లంపల్లి పాలిటెక్నిక్ కాలేజీ ఎదుట విద్యార్థుల ఆందోళన



వైష్ణవి(ఫైల్)

బెల్లంపల్లి/చిట్యాల, మార్చి 22: లెక్చరర్లు మందలించారన్న మనస్తాపంతో బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీకి చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకొంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం కాల్వపల్లికి చెందిన నర్సింహులు-కోమల దంపతుల కుమార్తె వైష్ణవి (19) బెల్లంపల్లి పాలిటెక్నిక్ కాలేజీలో ఎలక్ట్రికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్(ఈఐ) ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమెనే క్లాస్ లీడర్(సీఆర్). ఈ నెల 14న తన స్నేహితుడి పుట్టినరోజు సందర్భంగా క్లాస్ రూంలోనే స్నేహితుల సమక్షంలో వైష్ణవి అతడితో కేక్ కట్ చేయించింది. ఇది తెలిసిన ఈఐ విభాగం హెచ్‌వోడీ సాంబయ్య, లెక్చరర్లు మరుసటి రోజు వైష్ణవిని మందలించారు. ఈ నెల 17న వైష్ణవి తండ్రికి ఫోన్ చేసి కూతురిని ఇంటికి తీసుకెళ్లాలని చెప్పారు. ఆయన హనుమకొండలో ఉంటున్న తన మరో కుమార్తె కీర్తనకు చెప్పడంతో.. ఆమె కాలేజీకి వెళ్లి వైష్ణవిని తీసుకొని బయల్దేరింది. అప్పటికే కొంత అనారోగ్యంతో బాధపడుతున్న వైష్ణవిని కీర్తన ఓ ఆస్పత్రిలో చూపించింది. తర్వాత కీర్తన హన్మకొండలోనే ఉండిపోయింది. వైష్ణవి బస్సులో ఇంటికి బయల్దేరింది. మార్గమధ్యలో టేకుమట్ల మండల కేంద్రంలో పురుగుల మందు కొనుగోలు చేసి ఇంటికి తీసుకువెళ్లింది. 17న సాయంత్రం వైష్ణవి ఇంట్లోనే పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వైష్ణవి ఈనెల 21న సాయంత్రం మృతి చెందింది. హెచ్‌వోడీ, లెక్చరర్ల వేధింపులతోనే తను కూతురు ఆత్మహత్య చేసుకొందని వైష్ణవి తండ్రి నర్సింహులు చేర్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, వైష్ణవి ఆత్మహత్య విషయం పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులకు తెలియడంతో శుక్రవారం విద్యార్థులు తరగతులు బహిష్కరించి కాలేజీ ఎదుట ఆందోళన చేపట్టారు. సంబంధిత లెక్చరర్లను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

రూ.8.99 కోట్ల విలువైన.. 90 కిలోల నిషేధిత డ్రగ్ పట్టివేత

- బొల్లారంలో తయారీ.. విదేశాలకు విక్రయం

హైదరాబాద్ సిటీ/జిన్నారం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మానవ మెదడు, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే నిషేధిత మత్తు మందును తయారు చేసి.. విదేశాలకు ఎగుమతి చేస్తున్న ఫార్మా కంపెనీపై ఔషధ నియంత్రణ సంస్థ, ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఆ కంపెనీ నుంచి రూ.8.99 కోట్ల విలువైన 90.40 కిలోల డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇంటర్‌పోల్ సమాచారంతో గురు, శుక్రవారాల్లో ఈ సోదాలు జరిగాయి. ఔషధ నియంత్రణ సంస్థ డైరెక్టర్ జనరల్ కమలాసన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం ఐడీఏ బొల్లారంలోని పీఎస్ఎన్ మెడికేర్ కంపెనీలో నిషేధిత 3-మిథైల్‌మెత్కాథినోన్(3-ఎంఎంసీ)/మెటాఫెడ్రోన్‌ను తయారు చేస్తున్నారు. దీనిని సిగరెట్ ప్యాకెట్లలో పెట్టి ఐరోపా వంటి దేశాలకు భారీ మొత్తంలో ఎగుమతి చేస్తున్నారు. పదేళ్లుగా ఈ దందా నడుస్తోందని అధికారులు గుర్తించారు. డ్రగ్‌ను తయారు చేస్తున్న పీఎస్ఎన్ మెడికేర్ డైరెక్టర్ కస్తూరిరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

ఆహార కల్తీపై ఫిర్యాదు మరింత సులభం

- గ్రేటర్ పరిధిలో 040-21111111, రాష్ట్ర స్థాయిలో 9100105795 అందుబాటులోకి

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆహార కల్తీని నియంత్రించేందుకు సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీలపై కూడా ఫిర్యాదులు చేసేందుకు వీలుగా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టనుంది. ఈమేరకు వినియోగదారునికి ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ చేసిన తర్వాత రేటింగ్ ఇచ్చే ఆప్షన్ పక్కనే ఫిర్యాదు నంబరుతోపాటు ఫీడ్ బ్యాక్ బాక్స్ ఉండేలా కొత్త వ్యవస్థను తీసుకువస్తోంది. అన్ని సంస్థల్లోనూ కచ్చితంగా ఈ విధానాన్ని అమలు చేయాలనే నిబంధన తీసుకురానున్నారు. ఈ మేరకు స్విగ్గీ, జొమాటో తదితర ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలతోపాటు జెప్టోలాంటి వాటితో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తాజాగా సమావేశమయ్యారు. ఈ నేపథ్యంలో హోటళ్లు, ఇతర ఆహార కంపెనీలు, దుకాణాలు, బేకరీలు, ఆహార ఉత్పత్తి కేంద్రాల్లో కల్తీపై ఫిర్యాదు చేసేందుకు రెండునంబర్లను అందుబాటులోకి తెచ్చారు. గ్రేటర్ పరిధిలో 040-21111111, రాష్ట్రస్థాయిలో 9100105795 టోల్‌ఫ్రీ నంబర్లను అందుబాటులోకి వచ్చాయి.



ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కస్టడీలో కేజ్రీవాల్

ఢిల్లీ మద్యం విధానం కేసులో గురువారం రాత్రి అరెస్టయిన ఆమ్ ఆద్మీపార్టీ అధినేత, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ ఆరురోజులపాటు తన కస్టడీలో ఉంచుకొని విచారించబోతోంది. ఈ కేసులో ఆయనే అసలు కుట్రదారుడనీ, ఎకె[illegible] పాలసీ రూపకల్పన, అమలుకు ముడుపులు అందుకున్నాడనీ, నాలుగు హవాలా మార్గాలనుంచి వచ్చిన సొమ్మును పంజాబ్, గోవా ఎన్నికల్లో ఉపయోగించాడనీ, రాబట్టవలసిన సమాచారం ఇంకా ఉన్నది కనుక ఓ పదిరోజులు తమకు అప్పగించాలని ఈడీ రెండున్నరగంటలపాటు కోర్టులో వాదించింది. ఈ ఆరురోజుల విచారణలో సదరు సంస్థ మరెన్ని కొత్త విషయాలు తెలుసుకుంటుందో, ఇప్పటికే తన వద్ద ఉన్న సమాచారానికి కొత్తగా ఎన్ని అతుకులు వేయగలుతుందో తెలియదు కానీ, కేజ్రీవాల్ అరెస్టు అనూహ్యమైనదేతే కాదు. స్వయంగా ఆయనే ఎంతోకాలంగా తన అరెస్టు ఖాయమని చెబుతున్నారు. తొమ్మిదిసార్లు ఈడీ పిలిచినా వెళ్ళలేదన్నమాట నిజమే కానీ, ఎప్పుడు వెళ్ళినా అరెస్టవుతానని ఆయన నమ్మకం. కానీ, ఎన్నికల బాండ్లద్వారా ఏ పార్టీకి ఎవరు ఎన్ని వందలకోట్లు ధారపోశారో తెలియచెబుతూ ఎన్నికల సంఘం గుప్తనిధుల గుట్టువిప్పిన రోజునే కేజ్రీవాల్ అరెస్టవుతారని, ఆ కారణంగా మీడియా దృష్టి యావత్తూ అటుగా మళ్ళిపోతుందని ఎవరూ ఊహించలేదు.

ఇప్పుడు ఉనికిలో లేని మూడేళ్ళనాటి సదరు మద్యం విధానం అక్రమమా, సక్రమమా, ఈ కేసులో మంచిచెడ్డలేమిటన్నది న్యాయస్థానాలు నిర్ణయిస్తాయి. కానీ, సార్వత్రిక ఎన్నికలు అతిసమీపంలోకి వచ్చేసి, ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడిన ఐదురోజుల్లో ఒక ముఖ్యమంత్రి అరెస్టు కావడమన్నది రాజకీయంగా విశేషమైన పరిణామం. రెండునెలల కాలంలో అరెస్టయిన రెండోముఖ్యమంత్రి ఈయన. కాకపోతే, జార్ఖండ్ ముఖ్యమంత్రి శిబూసోరేన్ ఈడీ అరెస్టు చేయడానికి కాస్తంత ముందు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారంతే. కేజ్రీవాల్ మాత్రం తాను జైల్లోనుంచే ఢిల్లీని ఏలతానని అంటున్నారు. ఈ ఇద్దరూ కూడా రక్షణకోసం న్యాయస్థానాలను ఆశ్రయించారు కానీ ఫలితం లేకపోయింది. కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీచేయడంలోనూ, అరెస్టుచేయడంలోనూ ఒక లెక్క ఉన్నదని కొందరివాదన. గత నాలుగునెలల్లో ఆయనకు నాలుగు సమన్లు అందితే, ఫిబ్రవరిలో ఎడాపెడా నాలుగు జారీచేశారు. మార్చి21న సమన్లతో పాటు అరెస్టు కూడా జరిగిపోయింది. ఇన్నినెలలుగా అన్ని తాఖీదులు ఉల్లంఘించినప్పుడు ఇప్పటివరకూ ఎందుకు ఊరుకున్నారో తెలియదు. ఢిల్లీ, పంజాబ్, హర్యానా, గోవా, చండీగఢ్, గుజరాత్ రాష్ట్రాలు ఆమ్ ఆద్మీకి కీలకమైనవి కనుక ఈ ఎన్నికల వేళ కేజ్రీవాల్ అందుబాటులో లేకపోవడం ఆ పార్టీకి పెద్ద సమస్య. ఆయన అరెస్టు అనేక ఎంపీ సీట్లలో ఆ పార్టీ విజయావకాశాలను ప్రభావితం చేయవచ్చు. అలాగే, ఇండియా కూటమి ముఖ్యనాయకుడుగా, కొన్ని రాష్ట్రాల్లో నేరుగా పొత్తులు కూడా ఉన్న నేపథ్యంలో, ఒక ప్రజాకర్షణగల నాయకుడిని విపక్షాలు ప్రచార సమయంలో కోల్పోబోతున్నాయి. విపక్షపాలిత రాష్ట్రాల్లోని నాయకుల వెంట ఈడీ, సీబీఐలు పడటం, జైల్లోకి తోయడం గతంలోనూ ఉన్నదే. కానీ, ప్రజాకర్షణ ఉన్న కేజ్రీవాల్ తమతో లేకపోవడం ఇండియా కూటమికి పెద్దలోటు.

మనీష్ సిసోడియా ఇదే కేసులో జైలుకుపోయిన ఏడాది తరువాత కేజ్రీవాల్ అరెస్టయ్యారు. గత రెండేళ్ళుగా ఈ కేసు నడుస్తోంది. ఈడీ, సీబీఐలు వందలసార్లు దాడులు చేశాయి. కుట్రలూ, లెక్కలూ, ఆరోపణలూ కాగితాలమీదే తప్ప క్షేత్రస్థాయిలో ఒక్కరూపాయి కూడా దొరికింది లేదు. ఇప్పుడు ముఖ్యమంత్రినుంచి కొత్తగా ఏమి రాబడతారో తెలియదు కానీ, కేంద్రంలోని అధికారపక్షానికి ఎన్నికలబాండ్ల ద్వారా ఎవరు ఎందుకు లబ్ధిచేకూర్చారో ప్రజలకు అర్థమవుతున్న సమయంలోనే కేజ్రీవాల్ అరెస్టు జరిగింది. బీజేపీకి ఎన్నివేల కోట్ల రూపాయలు విరాళాలుగా వచ్చాయన్నది అటుంచితే, ఓ ఐదువందల కోట్లు ఎవరిచ్చారో కూడా తెలియదట. ఇక, వందకోట్ల ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎవరినుంచి కేజ్రీవాల్ ముడుపులు అందుకున్నారని ఈడీ ఆరోపిస్తున్నదో, వారే ఎన్నికలబాండ్ల ద్వారా బీజేపీకి భారీగా గుప్తదానాలు చేయడం మరో విచిత్రం. ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను కత్తిరించడం, లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా నిత్యం వేధించడం, ఘర్షణపడటం ద్వారా కేజ్రీవాల్ పార్టీ విస్తరణను నిరోధించే ప్రయత్నం బీజేపీ ఎంతోకాలంగా చేస్తున్నది. మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఆయన రోజూ తన రాజకీయ మనుగడకోసం పోరాడుతూనే ఉన్నారు కనుక, ఈ అరెస్టు కూడా మద్యం పాలసీతో ముడిపడింది కాదని చాలామందికి అనిపిస్తోంది.

ఆద్యంతాలు, మధ్య మోదీ

సీబీఐ, ఈడీ, ఎసఎఫఐఓ, ఎన్‌సీబీ, ఎనఐఏ, ఐటీ... చట్టబద్ధంగానా లేక చట్ట విరుద్ధంగానా అనే విషయాన్ని అటుంచితే అవన్నీ ఇప్పుడు దేశ పౌరుల జీవితాలలోకి దూకుడుగా ప్రవేశిస్తున్నాయన్నది ఎవరూ కొట్టివేయలేని వాస్తవం. అటువంటివే మరికొన్ని కూడా మనకు చేరువలోకాకపోయినా దిగంతంలో ఉన్నాయి. వీటిని ఆదేశిస్తున్న పెద్దన్న ఎవరు? నడమంత్రపు సిరి మూటగట్టుకున్నది ఎవరు? స్వలాభం కోసం అవసరం లేని చోట జోక్యం చేసుకుంటున్నది ఎవరు? ఎవరు అత్యంత శక్తిమంతుడు? పాలకులకు ఇష్టుడైన వ్యక్తి ఎవరు? తేనీరు లేదా కాఫీ సేవనానికో, పిచ్చాపాటీకో ఇద్దరు వ్యక్తులు కలుసుకున్నప్పుడు ఇవే వారు తర్కిస్తున్న ప్రశ్నలు. ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది ఉన్నప్పుడు ప్రతి ఒక్కరూ మౌనంలోకి జారిపోతున్నారు. సమష్టిగా మౌన కుట్రలో పాల్గొంటున్నారేమోనని అనిపిస్తుంది.



▪ పి. చిదంబరం

'పళని' పలుకు

ఈ ప్రశ్నలకు ముగింపు పలికేందుకు ప్రతి పోలింగ్ కేంద్రంలోను ఒక ఈవీఎమ్ (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్)ను పెట్టి, అభ్యర్థుల జాబితాను సమకూర్చి, తాము ఎక్కువగా ఇష్టపడే అభ్యర్థికి ఓటు వేయమని ప్రజలను అడగాలి. 85 ఏళ్ల పైబడిన వయసు ఉన్నవారు ఇంటి నుంచే ఓటు వేసేందుకు అనుమతించాలి. నోటాను ఎంచుకొనే వీలు ఉండదు. ఈ సాంబారు సమరాలలో కొత్త దినుసు సీఏఏ– ఎనఆర్‌సీ (ఎనఆర్‌సీ – నేషనల్ రిజిష్టర్ ఆఫ్ సిటిజెన్స్ –జాతీయ పౌర పట్టిక) దేశ పౌరులు అందరినీ నమోదు చేయడానికి దీన్ని ఉద్దేశించారు. ఇందుకు ఒక క్రూర పద్ధతిని అనుసరించారు. లక్షలాది హిందువులు ఈ నమోదు ప్రక్రియలోకి రావడం లేదని తెలుసుకున్న దేశభక్తి ప్రపూరిత అధికారుల సీఏఏ (పౌరసత్వ సవరణ చట్టం)ను ప్రతిపాదించారు. అయితే ముస్లింలు మినహా అఫ్ఘాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్ నుంచి వచ్చిన హిందువులు అందరికీ పౌరసత్వం కల్పించేందుకు ఈ చట్టాన్ని ఉద్దేశించారు. పర్యవసానంగా వీరు ఎనఆర్‌సీలో నమోదవుతారు. ఈ ప్రక్రియలో శ్రీలంకలో వివక్షకు గురై శరణార్థులుగా వచ్చిన తమిళులు, నేపాల్, మయన్మార్ నుంచి వచ్చిన భారత సంతతి ప్రజలకు న్యాయం చేయలేదు. సీఏఏ అమలుకు నిబంధనలను నోటిపై చేశారు.

సంఖ్యలు సైతం మన జీవితాల్లో ప్రధాన పాత్ర వహిస్తున్నాయన్న సత్యం మనకు ఇప్పుడిప్పుడే అవగతమవుతోంది. ఒకప్పుడు, ప్రతి వ్యక్తికి తెలిసిన సంఖ్య బోర్డ్ పరీక్షలలో తన నెంబర్ మాత్రమే. ఆ తరువాత క్రమంగా మన జీవితాల్లోకి అనేక సంఖ్యలు ప్రవేశించాయి. రేషన్ కార్డ్ నెంబర్, ఓటర్ ఐడి నెంబర్, టూ వీలర్ లేదా కారు రిజి[illegible]స్ నెంబర్, ల్యాండ్ లైన్ టెలిఫోన్ నెంబర్, పాస్‌పోర్ట్ నెంబర్. సరే, మొబైల్ నెంబర్, అలాగే సర్వాంతర్యామి, సర్వశక్తిమంతమైన ఆధార్ నెంబర్, ఇప్పుడు వీటన్నిటినీ తలదన్నే నెంబర్ ఒకటి ఉన్నది. అదే ఎలెక్టోరల్ బాండ్ (ఈబీ) అల్ఫాన్యూమెరిక్ నెంబర్. సర్వశక్తిమంతమైన సుప్రీంకోర్టు సైతం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పట్టు నుంచి అల్ఫాన్యూమెరిక్ నెంబర్లను బయట పడవేయలేక పోయింది. కొద్ది రోజుల పాటు ఈబీ– ఎస్‌బీఐనే ఈడీ–సీబీఐ కంటే మహా శక్తిమంతంగా కనిపించింది!



రేషన్ కార్డ్ నెంబర్, ఓటర్ ఐడి నెంబర్, టెలీఫోన్ నెంబర్, పాస్‌పోర్ట్ నెంబర్, మొబైల్ నెంబర్... అలాగే, సర్వాంతర్యామి, సర్వశక్తిమంతమైన ఆధార్ నెంబర్. ఇప్పుడు వీటన్నిటినీ తలదన్నే నెంబర్ ఒకటి ఉన్నది. అదే ఎలెక్టోరల్ బాండ్ (ఈబీ) అల్ఫాన్యూమెరిక్ నెంబర్.

ఇప్పుడొక కొత్త ఆట ప్రారంభయింది అదే. జాయిన్ –ది –యాల్ఫబెట్స్. ఈ ఆటలో మొదటి విజేత సీబీఐ–ఈడీ. ఈడీ ఖంగుతిన్నది. ఆటలో తానే ప్రధాన భాగస్వామినని, కనుక విజేతను ఈడీ–సీబీఐగా ప్రకటించాలని గట్టిగా అడిగింది. దీనిపై అంతిమ నిర్ణయం ఇంకా వెలువడలేదు. లోక్‌సభ ఎన్నికలలో ఓట్ల లెక్కింపు పూర్తయినప్పుడు తీర్పు వెలువడవచ్చు. ఈడీ–సీబీఐ కనుక విజేత అయితే లోక్‌సభకు ఇవే చివరి ఎన్నికలు అవుతాయని ఢిల్లీలో చాలా మంది గుసగుసలు పోతున్నారు. అదే సంభవిస్తే ఎన్నికల నిర్వహణకు అయ్యే సమస్త వ్యయం ఆదా అవుతుంది మరి. కోవింద్ కమిటీ 'ఒన్ నేషన్– ఒన్ ఎలెక్షన్'ను సిఫారసు చేసినప్పుడు భారీగా ఆదా అయ్యే ఈ సొమ్మును పరిగణనలోకి తీసుకుని ఉండదు. పరిగణనలోకి తీసుకుని ఉంటే 'ఒన్ నేషన్, నో ఎలెక్షన్'ను సిఫారసు చేసి ఉండేది.

ఈ పోటీలో సీబీఐ–ఈడీ లేదా ఈడీ –సీబీఐకి వెనుకనే ఉన్నది సీబీఐ–ఐటీ. సీబీఐ కనుక నగదును స్వాధీనం చేసుకుంటే అది ఐటీకి చెందుతుంది. మరి ఐటీనే స్వాధీనం చేసుకుంటేనో? అది ఐటీకే చెందుతుందనేది లోక వివేకం. అయితే ఇప్పుడు ఒక కొత్త వివేకం ప్రాచుర్యంలోకి వచ్చింది. ఐటీ కనుక నగదును స్వాధీనం చేసుకుంటే దానిపై రెండు సంస్థలకు హక్కు ఉంటుంది. అవి: సీబీఐ, ఈడీ. 'చట్టబద్ధమైన ఆదాయ వనరుల కంటే ఆస్తులు అధికంగా ఉన్నప్పుడు' ఆ నగదు తనకే చెందాలని సీబీఐ వాదిస్తోంది. 'నేరానికి పాల్పడడం వల్ల సమకూరిన సొమ్ము'ను అయితే దానిపై హక్కు తనదేని ఈడీ వాదిస్తోంది. దీనిపై కూడా తుది నిర్ణయం ఇంకా వెలువడలేదు.

ఇదే ఆటను మరో విధంగా కూడా ఆడుతున్నారు. దాన్ని జాయిన్ –ది– నంబర్స్' అంటున్నారు, 22, 217 ఈబీల అల్ఫా–న్యూమెరిక్ నంబర్‌ను వెల్లడించేలా ఎస్‌బీఐపై సుప్రీంకోర్టు తీవ్ర ఒత్తిడి తెచ్చింది. నేను ఇది రాస్తున్న సమయంలో ఈ అల్ఫా–న్యూమెరిక్ నంబర్లను వెల్లడించడం జరిగింది. చాలామంది దాతలకు ఇదొక చేదు అనుభవమయింది. ఆ విరాళాలను అందుకున్న కొన్ని పార్టీలు ఆ ఈబీల ప్రక్రియలో తాము భాగస్వాములం కామని మొత్తుకున్నాయి. మరికొన్ని ఇతర పార్టీలు వాటిని తమపై రుద్దారని వాదించాయి. పర్యవసానంగా ఈబీలను రద్దు చేసే అవకాశమున్నది.

అల్ఫాబెట్స్, న్యూమెరిక్స్, అల్ఫా–న్యూమెరిక్స్ సృష్టించిన సంక్షోభం ఎంత తీవ్ర స్థాయిలో ఉందంటే అది జాతీయ ప్రయోజనాలకే కాకుండా జాతీయ భద్రతకు సైతం ముప్పుగా వాటిల్లే ప్రమాదమున్నది. ఈ కారణంగా వికసిత్ భారత్ లక్ష్యాల విస్తరణపై సలహా ఇచ్చేందుకు చాట్– జీపీటీ సహాయాన్ని అర్థించారు. ఇవిగో ఆ కొత్త లక్ష్యాలు: భారత్ జీడీపీని ప్రపంచంలోనే అతి పెద్దదిగా చేయడం; రైతుల ఆదాయాన్ని మూడు రెట్లు పెంచడం, ఏటా ఐదు కోట్ల ఉద్యోగాలు సృష్టించడం, ప్రతి భారతీయ పౌరుని బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు జమ చేయడం.


చాట్– జీపీటీ సహాయాన్ని తీసుకోవడంతో పాటు సమస్యాత్మక అల్ఫాబెట్స్, న్యూమెరిక్స్ అల్ఫా న్యూమెరిక్స్ స్థానంలో, కనిపించని, విన్పించని, పీల్చలేని, తినలేని విప్లవాత్మక ఐడెంటిఫికేషన్ టూల్‌తో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఇన్ని పద్ధతులు, ప్రక్రియలను ఉపయోగించుకోవడం జాతి ఆరోగ్యానికి శుభప్రదం కాదుకనుక ఏఐకు సహకరించేందుకు దేశంలోని సమస్త సమాచారానికి భాండారం అయిన నీతి–ఆయోగ్‌ను నియుక్తం చేయాలి.

'అంతా బాగుంది, సంతృప్తికరంగా ముగుస్తుంది' అన్నది పాత లోకోక్తి. 'ముగింపు, మొదలుకు భిన్నంగా లేదు' అనేది నవీన సూక్తి. కనుక 2004లో ప్రారంభమయిన చోటకే మళ్లీ వెళదాం. అచ్చే దిన్ ఆనే వాలా హై.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

తరులు, గిరులు... ఓ పుణ్యాత్ముడు

నేను సమున్నతంగా అభిమానించే ఒక గొప్ప భారతీయుడు చండీ ప్రసాద్ భట్. సామాజిక 'సేవకుడుగా, చిప్కో ఉద్యమ పథ నిర్దేశకుడుగా సుప్రసిద్ధుడు. నేను నా ఇరవైల తొలి నాళ్లలో ఆయన్ని ప్రప్రథమంగా కలిశాను. ఆ సమావేశం నా మనసుపై ఒక చెరగని ముద్ర వేసింది. నా మేధో కృషిని మౌలికంగా ప్రభావితం చేసింది. దరిమిలా నేను ఎన్నోసార్లు ఆయన్ని కలుసుకున్నాను. ప్రపంచమూ, భారతదేశమూ ఎదుర్కొంటున్న నైతిక, రాజకీయ, పర్యావరణపరమైన సవాళ్లు; వాటిని నియంత్రించడానికి చేయవలసింది ఏమిటనే విషయమై ప్రతి సమావేశమూ నాకు నిశిత దృష్టిని సమకూర్చింది. కొత్త ఆలోచనలను పురిగొల్పింది.





akbar

'హిమాలయ పర్వత ప్రాంతాల ప్రజల్లో తమ అడవుల పట్ల నిగూఢంగా ఉన్న సహానుభూతిని జాగ్రతం చేసిన శక్తే చిప్కో ఆందోళన. అంతరంగిక భావావేశాన్ని ఒక సామాజిక బాధ్యతగా పరిణమింపచేసిన చైతన్యశీలతే చిప్కో ఉద్యమం' అని ఆ చరిత్రాత్మక పర్యావరణ ఉద్యమ పథ నిర్దేశకుడు చండీ ప్రసాద్ భట్ వివరించారు. సాహిత్య విలువలు ఉన్న ఆయన ఆత్మకథ 'జెంటిల్ రెసిస్టెన్స్' సామాజిక, పర్యావరణ చరిత్ర పైనే గాక గాంధీ అనంతరం గాంధేయవాదం చరిత్ర పైన కూడా నిశిత అవగహనను కల్పించే ఉత్కృష్ట గ్రంథం.

కొన్ని సంవత్సరాల క్రితం భట్ తన ఆత్మకథను హిందీలో వెలువరించారు. సమీర్ బెనర్జీ ఇప్పుడు దాన్ని 'జెంటిల్ రెసిస్టెన్స్' పేరిట ఆంగ్లంలోకి అనువదించారు. భట్ 1934లో జన్మించారు. మన దేశం ఇంకా బ్రిటిష్ పాలనలో మగ్గుతున్న కాలమది. తన బాల్య జ్ఞాపకాలతో పాటు తనకు ఎంతో ప్రేమాస్పదురాలు అయిన తోబుట్టువు, తన ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, శ్రామిక కులాల వ్యక్తుల గురించి ఆయన ఎంతో ఆత్మీయతతోనూ, స్ఫూర్తిదాయకంగానూ రాశారు. భట్ ఆత్మకథ, మధ్య హిమాలయాల భూ దృశ్యాలు, కొండలు, అడవులు, సస్య క్షేత్రాలు, నదులను మన కళ్లకు గట్టిస్తుంది. 'అలకనందలో ప్రవహించే నీటిని నేను ఇష్టపడతాను. ఆ నది లయబద్ధమైన ప్రవాహం నాకు భావోద్వేగ పూరితమైన స్ఫూర్తినిస్తుంది' అని భట్ పేర్కొన్నారు.

భట్ కులీన బ్రాహ్మణుడే కానీ భాగ్యంతుడు కాదు. ఏడాది వయస్సులో ఉండగా తండ్రి గతించారు. పేద కుటుంబమే అయినప్పటికీ అనాథ కాదు. 'బాల్యమంతా నేను నిరంతర కొరతలతో గడిపాను. ఏదీ సమృద్ధిగా అందుబాటులో ఉండేది కాదు. సరిపడ డబ్బు లేదు. అవసరమైనవి ఎల్లప్పుడు లభించేవి కాదు' అని ఆయన రాశారు. కుటుంబాన్ని పోషించేందుకు చిన్న వయసులోనే సేద్యం చేశారు. ఆవులను కాశారు. తాను శ్రద్ధాళువు అయి విద్యార్థిని కానని, పరీక్షలలో సరిగా ఉత్తీర్ణుడిని అయ్యేవాడిని కానని ఆయన నిష్కపటంగా వివరించారు. కళాశాల విద్యాభ్యాసం ఆయనకు అందుబాటులో లేనిదని మరి చెప్పనవసరం లేదు. అదృష్టవశాత్తు ఒక స్థానిక బస్సు కంపెనీలో క్లర్క్ ఉద్యోగం లభించింది. ఆ కంపెనీ బస్సులు హిమాలయాలలోని వివిధ పుణ్యక్షేత్రాలకు యాత్రికులను తీసుకెళుతుండేవి. అలా ఆయన విశాల భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భారతీయులతో ఆయనకు పరిచయమయింది. తద్వారా ఆయన సాంస్కృతిక, భౌగోళిక విశ్వం విస్తరించింది.

ఇదిలా ఉండగా కొండ ప్రాంతాలలో వాణిజ్య సంబంధమైన అటవీ కార్యకలాపాలలో చోటుచేసుకొంటున్న దోపిడీని భట్ నిశితంగా అధ్యయనం చేశారు. చెట్లను కూల్చివేసే కూలీలకు కలప వ్యాపారులు ఇచ్చే భత్యం వారి కనీసవసరాలకు కూడా సరిపోని విధంగా ఉండడం, అయితే కాంట్రాక్టర్లు కలపను మైదాన ప్రాంతాలలోని ఫ్యాక్టరీలకు విక్రయించడం ద్వారా అపార లభాలను ఆర్జించడాన్ని ఆయన గమనించారు. అడవుల విధ్వంసానికి కలవరపడిన భట్ 'ఈ దోపిడీ ఉన్మాదాన్ని ఆపివేయలేమా?' అని ప్రశ్నించుకున్నారు. ఆ దోపిడీని అరికట్టగలమని ఆయన భావించారు. అయితే అందుకు కొండ ప్రాంతాల ప్రజలు తమ జీవనాధారాలు, మనుగడకు ఆధారభూతమైన మూలమైన అడవులను ముందుగా తమ నియంత్రణలోకి తీసుకోవలసి ఉందని ఆయన విశ్వసించారు.

1973లో, అడవుల నరికివేతకు వ్యతిరేకంగా గఢ్వాల్ ప్రాంత గ్రామీణుల తొలి నిరసనలకు భట్ నేతృత్వం వహించారు. ఆ ఆందోళనలే తదనంతరం చిప్కో ఉద్యమంగా సుప్రసిద్ధమయ్యాయి. నేను నా పరిశోధక వ్యాసాన్ని కూడా ఆ ఉద్యమ మూలాలు, చరిత్ర గురించే రాశాను. సమీర్ బెనర్జీ తన 'అనువాదకుని మాట'లో ఇలా రాశారు: 'విద్వత్ సంబంధమైన కథనాలు అట్టడుగు స్థాయి క్రియాశీలతలో అంతర్గతంగా ఉన్న మానవ వేదనలు, ఆశలు, అనుభూతులను అంతర్‌ప్రేరణతో వెల్లడించేందుకు అరుదుగా దోహదం చేస్తాయి. నిష్కపటమైన, అరమరిక లేని, సరళ రీతి జీవన వాస్తవాలకు విరుద్ధమైన వివరణాత్మక, విశ్లేషణాత్మక, వ్యాఖ్యానాత్మక చట్రాలకు చెందిన పదాల, వాక్యాల, భాషల, 'భావజాల విశ్వంలో క్రియాశీల కార్యకర్త జీవితపు సంవేదనలు పరిపూర్ణంగా వ్యక్తం కాలేవు.'. లక్నోలోని ఒక సీనియర్ బ్యూరాక్రాట్‌తో తన అనుభవాల గురించిన భట్ కథనం బెనర్జీ వ్యాఖ్యలకు ఉదాహరణగా నిలుస్తుందని చెప్పవచ్చు. అడవులపై నియంత్రణ ప్రభుత్వానికి కాకుండా గ్రామీణ జనసముదాయాలకే ఉండాలని నచ్చచెప్పేందుకు భట్ ఆ అధికారి కార్యాయానికి వెళ్లారు. అతడి సమక్షంలో తన అనుభవాలను ఆ సామాజిక సేవకుడు ఇలా పేర్కొన్నారు: 'నేను తొలుత ఆయనకు అభివాదం తెలిపాను. ఆయన స్పందించలేదు. పదేపదే నమస్కారాలు చేసినా పట్టించుకోలేదు. చివరకు తటపటాయిస్తూనే ఆయన ఎదుట ఒక కుర్చీలో కూర్చున్నాను. కొంత సేపయిన తరువాత ఆ అధికారి బంకమట్టి రంగులో ఉన్న ఒక సిగరెట్ వెలిగించాడు. అది బుర్రా సాహిబ్‌లు బాగా ఇష్టపడే పొగాకు చుట్ట అని ఆ తరువాత ఒకరు నాకు చెప్పారు. పొగను వదులుతూ నా వైపునకు తిరిగి 'ఏమిటి మీరు చేస్తున్నదంతా?' అని ప్రశ్నించాడు. అడవులపై నియంత్రణ విషయమై మా దృక్పథాన్ని వివరించడానికి ప్రయత్నించాను. వినడానికి ఆయనేమీ ఆసక్తి చూపలేదు. ఆయన ప్రపంచ దృక్పథం ప్రభుత్వాధికారులకు సామాన్యంగా ఉండే దృక్పథం లాంటిదే. కొండ ప్రాంతాల రైతులు అంటే వారికి చులకన. సంఘటిత సమాజమనే అందమైన దేహంపై కురుపుల లాంటి వారనేది ఆయన అభిప్రాయం. ఆ పౌర వ్యవస్థను భద్రంగా కాపాడడమే తమ కర్తవ్యమని ఆ బ్యూరాక్రాట్లు విశ్వసిస్తారు.

బుర్రా సాహిబ్ గురించిన ఈ పద చిత్రాన్ని, భట్ సృజించిన మరో పద చిత్రంతో పోల్చి చూడండి. గౌరాదేవి అనే అసాధారణ మహిళ చైతన్యశీలతను ఇది విశదం చేస్తుంది, ఆమె మానవతను వక్కాణిస్తుంది. నేను ఈ వ్యాసం రాస్తున్న సమయానికి సరిగ్గా యాభై సంవత్సరాల క్రితం (మార్చి 1974లో) రేణి గ్రామంలో ఆరంభమైన చిప్కో ఉద్యమ నాయకురాలు గౌరాదేవి. నిరక్షరాస్యురాలు, చిన్నతనంలోనే భర్తను కోల్పోయి, తనకున్న కొద్దిపాటి భూమిని సాగు చేసుకుంటూ అనిశ్చిత జీవితాన్ని గడిపిన ధీర. 1965లో ఆమె తన గ్రామంలో మహిళా మంగళ్‌దళ్ ప్రారంభించారు. తొమ్మిది సంవత్సరాల అనంతరం, హిమాలయ పర్వత ప్రాంతాల చరిత్రలో సుప్రసిద్ధమైన చిప్కో నిరసనలకు ఆమె నేతృత్వం వహించారు. గౌరాదేవి 1991లో మరణించారు. 'అసమానతలు, అణచివేతల వ్యతిరేక పోరాటంలో మనకు మార్గనిర్దేశం చేయగల తన మృదువైన ప్రతిఘటన ప్రకాశవంతమైన, ప్రభావశీలమైన శక్తిని మనకు వదిలివెళ్లారు'. భట్ ఇంకా ఇలా రాశారు: అణచివేతలపై గౌరాదేవి పోరాటానికి ప్రేరణ, జీవితంలో ఆమె పడిన మహా కష్టాలు, ఎదుర్కొన్న కఠిన పరీక్షల నుంచి వచ్చింది. పేదరికం, వ్యక్తిగత విషాదాల నెదుర్కోవడంలో తన సహచర మహిళల ధైర్య సాహసాలు ఆమెకు స్ఫూర్తినిచ్చాయి. దృఢ సంకల్పం, ఉక్కు ధైర్యానికి తోడు గాఢమైన దాక్షిణ్యం గౌరాదేవి వ్యక్తిత్వాన్ని విశిష్టంగా శోభితం చేశాయి. ఆమె క్షమా మూర్తి. ఆ సౌహార్ద గుణం వల్లే, చెట్ల రక్షణకు ఉద్యమిస్తున్న తమ పట్ల ఎంతో మొరటుగా వ్యవహరించిన అటవీ శాఖ ఉద్యోగులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనని, వారి జీవనాధారాన్ని దెబ్బగొట్టే చెడు తలంపు లేనేలేదని ఉద్ఘాటించిన గౌరాదేవిని తాను ఎప్పటికీ మరచిపోలేనని' భట్ రాశారు.



▪ రామచంద్ర గుహ

గతానుగతం

చిప్కో ఉద్యమాన్ని భట్ ఇలా వివరించారు. హిమాలయ పర్వత ప్రాంతాల ప్రజల్లో తమ అడవుల పట్ల నిగూఢంగా ఉన్న సహానుభూతిని జాగ్రతం చేసిన శక్తే చిప్కో ఆందోళన. ఆంతరంగిక భావావేశాన్ని ఒక సామాజిక బాధ్యతగా పరివర్తింప చేసిన చైతన్యశీలతే చిప్కో ఉద్యమం'. అడవుల విధ్వంసాన్ని నిరసించడంలోనే కాకుండా అడవుల పునరుద్ధరణకు చేపట్టిన కార్యాచరణలో కూడా ఆ సామాజిక నిబద్ధత వ్యక్తమయింది. భట్ నాయకత్వంలో చిప్కో ఉద్యమ కార్యకర్తలు గఢ్వాల్ పర్వత ప్రాంతాలలోని బంజరు భూములను పచ్చని అడవులుగా, పంట భూములుగా మార్చివేశారు. ఈ కృషి స్థానిక పర్యావరణ వ్యవస్థలపై లాభప్రదమైన ప్రభావాలను నెరపింది.

భట్ ప్రధానంగా ఉద్యమ నిర్మాణ దక్షుడు. అయితే ఆయన నిశిత ఆలోచనాశీలి కూడా, గఢ్వాల్ ప్రాంతంలో ఎడాపెడా రోడ్ల నిర్మాణం జోషి మఠ్ పట్టణంలో నివాస గృహాల పతనానికి దారి తీస్తుందని ఆయన 1976లోనే హెచ్చరించారు. భారీ ఆనకట్టల నిర్మాణం హిమాలయ ప్రాంతాలకు క్షేమకరం కాదని స్పష్టం చేస్తూ 1980 దశకంలో ఆయన పలు వ్యాసాలు రాశారు. 'ఇప్పటికే బలహీనమైన పర్వతాలు అంతకంతకూ మరింత వేగంగా బలహీనపడుతున్నాయని' భట్ వాపోయారు. 'భూమి, ఇతర సహజ వనరుల నుంచి మానవాళి వేరు పడిపోవడం వల్లే ఈ ఉపద్రవం వాటిల్లుతోంది. ప్రతి దాన్నీ వాణిజ్య ప్రయోజనాలే ప్రభావితం చేస్తున్నాయి. మానసిక, ఉద్వేగాత్మక మార్పులతో పాటు అనుసరణ ప్రక్రియలు ప్రజలను వాణిజ్య లబ్ధికి అనుకూలంగా మార్చి వేస్తున్నాయి' అని భట్ పేర్కొన్నారు.

చండీ ప్రసాద్ భట్ ఆత్మకథ ఒక శక్తిమంతమైన పుస్తకం. సొంత అనుభవాల గురించిన ఆయన కథనం సామాజిక, పర్యావరణ చరిత్రతో పాటు గాంధీ అనంతరం గాంధేయవాదం చరిత్ర పైన కూడా నిశిత దృష్టిని సమకూర్చుతుంది. సాహిత్య విలువలు ఉన్న భట్ ఆత్మకథ, ఆంగ్ల అనువాదం ద్వారా విస్తృత స్థాయిలో పాఠకులను, వారి మన్ననలు పొందగలదని నేను విశ్వసిస్తున్నాను.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

కుల సమస్యపై భగత్‌సింగ్ విప్లవ భావనలు

ఇటు అంబేడ్కర్, అటు గాంధీల సమకాలికుడైన భగత్‌సింగ్ కులసమస్యపై వెలిబుచ్చిన అభిప్రాయాలు ఎందుకు అంతగా చర్చకు రాలేదు? 'ఐక్యం కండి, మీ కాళ్లపై మీరు నిలవండి. ఎవరైనా మిమ్మల్నిపావులుగా చేసుకొని, మోసగించటాన్ని అనుమతించకండి. ఇతరుల నుంచి ఏమీ ఆశించకండి. ఈ దోపిడీ సమాజాన్ని సవాలు చేయండి' అని విప్లవ మార్గాన్ని సూచించటం వల్లనా?

'మతం – స్వతంత్ర పోరాటం' ('కీర్తి' పత్రిక, మే 1928); 'అస్పృశ్యతా సమస్య' ('కీర్తి', జూన్ 1928); 'నేను నాస్తికుడిని ఎందుకయ్యాను' (అక్టోబరు 1930) వంటి వ్యాసాల్లో భగత్‌సింగ్ కుల సమస్యపై చర్చించారు. 'జంతువుల కన్నా హీనంగా అస్పృశ్యుల్ని చూస్తున్నప్పుడు, ఉమ్మడి వనరులైన స్కూళ్లు నీళ్లు గుళ్లు వారికి నిషిద్ధమైనప్పుడు వారు మతం మార్చుకుంటే తప్పేముంది' అని 1928లోనే భగత్‌సింగ్ ప్రశ్నించారు. మతం మార్చుకుంటానని అంబేడ్కర్ అప్పటికి ఇంకా ప్రకటించలేదని గమనించాలి. అరవింద్ ఘోష్, తిలక్, సావర్కార్ వంటి హిందూ జాతీయ వాదుల వలె గాక, తనకు కులం మతం లేవన్న భగత్‌సింగ్ వారందరినీ మించి కోట్లాది మందికి ఆరాధ్యుడైనారు.



'జంతువుల కన్నా హీనంగా అస్పృశ్యుల్ని చూస్తున్నప్పుడు, ఉమ్మడి వనరులైన స్కూళ్లు నీళ్లు గుళ్లు వారికి నిషిద్ధమైనప్పుడు వారు మతం మార్చుకుంటే తప్పేముంది' అని 1928లోనే భగత్‌సింగ్ ప్రశ్నించారు. మతం మార్చుకుంటానని అంబేడ్కర్ అప్పటికి ఇంకా ప్రకటించలేదని గమనించాలి.

అభిప్రాయాల ప్రకటనే కాక ఆచరణాత్మక కార్యక్రమాల్నీ భగత్‌సింగ్ బలపరిచారు. ఉరిశిక్షకు ముందు చివరి కోరికగా అస్పృశ్యురాలైన భోగమ్మ అన్న ఖైదీ చేసిన రొట్టె తింటానన్నారు. భగత్‌సింగ్ తదితరులు 1926లో స్థాపించిన 'నౌ జవాన్ భారత్ సభ' కులమతాలకు అతీతంగా సహపంక్తి భోజనాలను నిర్వహించింది. 'అస్పృశ్యత తప్పు అని అంగీకరించి ప్రకటించండి, క్షమించమని కోరండి. సిక్కు ఇస్లాం హిందూ కన్వర్షన్ కార్యక్రమాలు, శుద్ధీకరణ వంటి ఏ తంతూ అక్కరలేదు. నేడే ప్రాయశ్చిత్తం చేసుకోండి. అస్పృశ్యుల చేతుల నుంచి ఆహారం, మంచి నీళ్లు స్వీకరించండి చాలు' అని రాశారు (1928 జూన్). పాత సంస్థ సోషలిజాన్ని తమ భావజాలంలో చేర్చుకొని, 'హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్'గా 1928 ఢిల్లీ సమావేశంలో పేరు మార్చుకున్నది. దానితోపాటు, విప్లవకారులంతా కుల మత చిహ్నాలు అన్నిటినీ వదిలేయాలని చారిత్రక నిర్ణయం తీసుకున్నారు. ఇదీ హఠాత్ నిర్ణయం కాదు. అంతకుముందే ఆ చర్చ, ఆచరణ కూడా మొదలైనాయి. కాకోరీ కుట్ర కేసు విప్లవకారులు చాలా మంది తమ జంధ్యాన్ని తీసిపారేశారు. వారిలో ఒకరైన మన్మధనాథ గుప్తా తన ఆత్మకథలో 'మాలో కొందరు యువకులం నాటి సామాజిక నియమాల్ని ధిక్కరించి గొడ్డు మాంసం కూడా తిన్నాం' అని రాశారు.

రాజకీయ సంస్కరణలు శతాబ్దం క్రిందటే ఓటుబ్యాంకు రాజకీయాల చుట్టూ ఎలా తిరిగేవో భగత్‌సింగ్ మాటల్లో కన్పడుతుంది: 'మింటో మార్లే సంస్కరణలు 1909లో భాగంగా ప్రత్యేక ఎలెక్టొరేట్స్‌ని ప్రతిపాదించిన నాటి నుంచీ, కమ్యూనల్ అవార్డుతో తమ కోటా తగ్గిపోతుందన్న భయం అగ్రవర్ణాల్లో మొదలైంది. దాంతో మతపర, రాజకీయ సంస్కరణలు మొదలైనాయి' అంటూ వాటిని అనుమానంతోనే చూశారు భగత్‌సింగ్. 'దయానంద సరస్వతి అస్పృశ్యతని నిర్మూలించాలన్నారు, చాలా మంచిది. కానీ ఆయన చాతుర్వర్ణ వ్యవస్థని అధిగమించలేకపోయారు. ఆ వివక్ష కొనసాగింది' అన్నారు (1928 మే). 'ప్రసిద్ధ సంస్కరణవాది మదన్‌మోహన్ మాలవ్యా పారిశుద్ధ్య కార్మికులు పూమాల వేస్తే స్వీకరించారు కానీ, ఆ వెంటనే స్నానం చేసి బట్టలు మార్చుకోకపోతే మైలపడినట్టేనని భావించారు. ఎంత విడ్డూరం!' అని రాశారు. భగత్‌సింగ్ మాటలు నేటి ప్రదర్శనాత్మక రాజకీయాల్ని గుర్తుచేస్తాయి. 'కులనిర్మూలన' వ్యాసం (1936) కన్నా ముందు 1930 నవంబరు 'రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్'లోనే దళితులకు ముస్లింలకు ప్రత్యేక ప్రాతినిధ్యం ఉండాలని అంబేడ్కర్ వాదించారని తెలిసిందే. 'దేశ విముక్తికై మన ప్రస్థానంలో ఈ ప్రాతినిధ్యం (కమ్యునల్ రెప్రెజెంటేషన్) కొద్దిగా ఉపయోగపడుతుంది; అస్పృశ్యులను ఆకర్షించటం ద్వారా హిందూ ముస్లిం సిక్కు రాజకీయశక్తులు శాసనసభల్లో తమ కోటాని పెంచుకోటానికి ఒకరిని మించి మరొకరు పోటీపడుతున్నారు. ఇది విస్తృతస్థాయిలో కల్లోలాలకు దారి తీస్తున్నది. ఈ కల్లోలం అస్పృశ్యత పట్టుని ఖచ్చితంగా బలహీనపరిచే రీతిలో తోడ్పడుతున్నది. అయితే అంతిమంగా అస్పృశ్య వర్గాలన్నీ ఐక్యమై సంఘటితపడితే తప్ప అస్పృశ్యతా సమస్య సంతృప్తికరంగా పరిష్కరించబడదు' అని నొక్కి చెప్పారు భగత్‌సింగ్. 'బాల్య వివాహాల రద్దు వంటి చిన్న సంస్కరణలకే తమ మతానికి ప్రమాదం వాటిల్లిందని గగ్గోలు పెట్టే శాసనసభల ద్వారా కులం, అస్పృశ్యత సమస్యలు పరిష్కారం కావు' అని నొక్కి చెప్పారు.

'అధికారవర్గం (బ్యూరోక్రసీ), శాసనసభలూ అనుసరించే సంస్కరణవాదం క్రమక్రమంగా మార్పుకు (గ్రాడ్యువలిజం) ఉపయోగపడజాలవు' అని చెప్పి, 'సాంఘిక ఉద్యమాల ద్వారా విప్లవాన్ని తీసుకురండి; ఆ తర్వాత రాజకీయ ఆర్థిక విప్లవాలకు సంసిద్ధంకండి' అన్న పిలుపుతో భగత్‌సింగ్ తన అస్పృశ్యత వ్యాసాన్ని ముగించారు. 'స్వతంత్రం అంటే కేవలం బ్రిటిష్ వారి నుంచి విముక్తి కాదు, సంపూర్ణ స్వతంత్రం కావాలి. మానసిక బానిసత్వం నుంచి విముక్తి అయి, ప్రజలంతా సమరస భావనతో జీవించాలి. సంకుచితత్వాన్ని విడిచిపెట్టాలి. అలాంటి ఆహారపు అలవాట్లని మార్చుకోవాలి. అస్పృశ్యత అన్న పదాన్ని సమూలంగా పెరికివేయాలి. అప్పుడే బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ఐక్యత, సహకారమూ సాధ్యమవుతాయి' అని రాశారు (1928 మే).

భగత్‌సింగ్ జైల్లో ఉండగానే మార్క్సిజాన్ని అధ్యయనం చేసి, సోషలిస్టు లక్ష్యాన్ని స్వీకరించారు. అస్పృశ్యత వ్యాసం ముగింపులో 'తిరుగుబాటు బావుటా ఎగరేయాలి. ప్రస్తుత సామాజిక వ్యవస్థనే సవాలు చేయాలి' అన్నారు. 'కమ్యూనిస్టు మేనిఫెస్టో'లోని 'శ్రామికులారా ఏకంకండి, పోరాడితే మీకు పోయేదేమీలేదు సంకెళ్లుతప్ప' అన్న మహత్తర సందేశంతో ముగించారు. 'దళితులారా మీరు నిజమైన శ్రామిక వర్గం' అన్నారు వర్గదృష్టితో. 'దళితులతో పాటు యావత్ శ్రామిక వర్గం విప్లవిస్తేనే పెట్టుబడిదారీ దోపిడీ నుంచి, కులపీడన నుంచి కూడా భారతదేశ విముక్తి సాధ్యం' అని రెంటినీ జోడించి చాటి చెప్పారు. కులతత్వ రాజకీయాలు నానాటికీ ముదురుతున్న నేటి తరుణంలో, మౌలిక మార్పుకై ప్రజల్ని ఐక్యం చేసి, ఏకోన్ముఖం చేయాల్సిన అవసరం రీత్యా భగత్‌సింగ్ మాటలు చిరస్మరణీయాలు.

• ఎమ్. జయలక్ష్మి
రిటైర్డ్ ఏజీఎం, ఆప్కాబ్

(నేడు భగత్‌సింగ్ వర్ధంతి)

దళిత డప్పుకు దక్కిన గౌరవం

సంగీతం సార్వజనీనమైనది. అయితే అది స్థలకాలాలకు అతీతమైనది కాదు. నిర్వికల్ప సంగీతం (అబ్సొల్యూట్ మ్యూజిక్) అంటూ ఏదీ ఉండదు. స్థలకాలాదులతోపాటు సంస్కృతి ఆ సంగీత రూపసారాలను నిర్మిస్తుంది. అవును, సంగీతం కూడా ఒక నిర్మాణమే. సంగీతం ఒక సృజనాత్మక ప్రవాహం అన్నది ఎంత నిజమో; అనేక నైరూప్య సారూప్య అంశాల సమ్మిళిత నిర్మాణం అన్నది కూడా అంతే నిజం. అందువల్ల సంగీతాన్ని కల్చరల్ ఆంత్రోపాలజీ దృక్పథం నుంచి వ్యాఖ్యానించే ఒక అకడమిక్ స్టడీ ఇప్పటికే వికసించింది. కళాకారుడి సామాజిక, ఆర్థిక నేపథ్యం సంగీతం వివిధ రకాలుగా వేరుపడడానికి హేతువు అవుతున్నది. అందుకే ప్రపంచంలో ఎన్నో రకాలైన సంగీతం వుంది. ఎన్నో రకాలైన వాయిద్య పరికరాలున్నాయి. ఇండియాలో ప్రతి కులానికీ సంగీతం అందించే సాంస్కృతిక కులం వుంది. పాట, మాట, ఆట, వాయిద్యంతో ఈ సాంస్కృతిక కులాల అస్తిత్వం, మనుగడ ముడిపడి ఉంది.



అందుకే సంగీతం అంటే రాగం, తాళం మాత్రమే కాదు. గాత్ర విన్యాసంతో పాటు, వాయిద్య విన్యాసం కూడా సంగీతంలో అంతర్భాగం. మనిషి మొదటిపాట ఎప్పుడు పాడాడో కాలనిర్ణయం చేయలేము. అలాగే ఒక వాయిద్యం ఎప్పుడు ఎందుకు అవతరించిందో ఇతమిత్థంగా చెప్పడం కూడా కష్టమే. ప్రధాన స్రవంతి సంగీతానికి ఒక శాస్త్ర ప్రమాణం ఏర్పడి, అది శాస్త్రీయ సంగీతంగా ఉనికిలోకి వచ్చిన కాలాన్ని ఆయా సమాజాల చరిత్రను అధ్యయనం చేసే క్రమంలో గుర్తించారు. అయితే, శాస్త్రీయ సంగీతం అనే వర్గీకరణ ఒక ఆధిపత్య వ్యక్తీకరణ. సంగీతం ఏదైనా దానికంటూ ఒక నియమం ఉంటుంది. వాయిద్యం ఏదైనా సరే దానికంటూ ఒక నియమం, ప్రవర్తన ఉంటుంది. అంతేకాదు, దానికంటూ ఒక సామాజిక పాత్ర వుంటుంది. అయితే, రాజ్యం గుర్తింపు, ఆదరణ ఉన్నవి మాత్రమే శాస్త్రీయమైనవిగా లేదా క్లాసికల్ మ్యూజిక్ లేదా క్లాసికల్ మ్యూజికల్ ఇను[illegible]ంట్స్‌గా ప్రాచుర్యంలోకి వచ్చాయి. రాజ్య నిరాదరణకు గురైన సంగీతం, వాయిద్య ప్రదర్శనలు జానపదాలుగా, ప్రజాకళలుగా, అలగాజన ఆనందహేళగా ముద్రలు పొందాయి. ఇది అన్యాయమని, వివిధ ఎథ్నిక్ గ్రూపులు తమ సంగీతానికి గల శాస్త్రీయతను నిరూపించే ప్రయత్నం బలంగా చేశాయి. ఆ క్రమంలోనే డప్పు అనే వాయిద్యాన్ని శాస్త్రీయ సంగీత ప్రేంవర్కులో రాజ్యానికి అవగతమయ్యేలా వాగ్గేయకారుడు సూర్యభగవంతం విశేష కృషి చేశారు. సూర్యభగవంతం వేలాది మందికి డప్పు సంగీతంలో శిక్షణ ఇచ్చాడు. ఆయనకు రాజ్యం నుంచి ఎలాంటి గుర్తింపు దక్కలేదు గానీ, కోట్లాదిమంది ఆయనను గౌరవించారు. అయితే, ఆయన శిష్యుడు అందె భాస్కరుకు గొప్ప గౌరవం దక్కింది. కేంద్ర నాటక సంగీత అకాడమీ అతనికి ఉస్తాద్ బిస్మిల్లాఖాన్ యువ పురస్కారం 2024 ప్రకటించింది. స్వతంత్ర భారత చరిత్రలో మొదటిసారిగా ఒక డప్పు కళాకారుడికి దక్కిన అత్యున్నత సత్కారం ఇది.

సంస్కృతి ఏకరూపమైనది కాదు. బహుళ ఎథ్నిక్ కమ్యూనిటీలు ఉనికిలో ఉన్న మన దేశంలో బహుళ సంస్కృతులు ఉన్నాయి. ముందే చెప్పినట్టు వివిధ కులాలు, తెగలకు ప్రత్యేక కళా సంస్కృతులు ఉన్నాయి. వాటికే సొంతమైన వాయిద్య పరికరాలున్నాయి. అయితే, డప్పు ఒక ఆదిమ వాయిద్యం. మాదిగ సమూహం 'కుల సమాజం'లో, కోయ గోండులు 'తెగల సమాజం'లో డప్పును వాయిస్తారు. అయితే, మాదిగలు డప్పు వాయించే తీరుకు, ఇతరులు వాయించే తీరుకు పూర్తిగా తేడా ఉంటుంది. అందె భాస్కర్ డప్పు కళాప్రదర్శన వైశిష్ట్యం కూడా అంతే.

అందె భాస్కర్ దళిత సామాజిక నేపథ్యం నుంచి ఎదిగిన కళాకారుడు. అతడు జన్మతః డప్పు కళాకారుడు. డప్పు అతడి ఇంటి పరికరం. డొమెస్టిక్ ఇన్[illegible]ంటు. డప్పుకీ తనకూ పేగుబంధం ఉంది. అది తన అస్తిత్వ పరివేదన వ్యక్తీకరణ సాధనం. తన ఆకలిని చల్లార్చే వానదరువు. తన ఆవేశాన్ని రగిలించే అగ్నికీల. తన జీవనగతి జతీ అది. అదే తనకో జాతీయ స్థాయి గుర్తింపును తెస్తుందని అతడు బహుశా ఊహించి ఉండడు. మూడు పాతికల వయస్సు గల దేశంలో, తెలంగాణ సమాజంలో అందె భాస్కర్ కేంద్ర యువ పురస్కారం పొందిన కళాకారుడు. ఇది తెలంగాణకే కాదు, యావత్ దేశానికే గర్వకారణం. దళితుల సంగీత పరికరమైన డప్పుకు రాజ్యాంగబద్ధ గుర్తింపు దక్కింది. అందుకు అందె భాస్కర్‌ను అభినందించాలి.

– శ్రీనివాస్ దక్షిణాది

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
హనుమకొండ
HANUMAKONDA
శనివారం 23 మార్చి 2024

శుక్రవారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 34.0° C | కనిష్ఠం : 22.0° C


రంజాన్ వేళలు
ఇఫ్తార్ : శనివారం సా : 6.34 గం..
సహర్ : ఆదివారం ఉ : 4.55 గం..



ఎంతో ఘన చరిత్ర కలిగిన కాకతీయ యూనివర్సిటీ అక్రమాలు, వివాదాలకు కేరాఫ్‌గా మారిందా? యూనివర్సిటీలో నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు, నిధుల కేటాయింపులు జరుగుతున్నాయా? అడ్మిషన్లు మొదలు విద్యార్థుల ఆన్సర్ షీట్ల స్కానింగ్ టెండర్ల రద్దు వరకు అన్నీ అక్రమార్కుల కనుసన్నల్లోనే జరుగుతున్నాయా? వీసీ, రిజిస్ట్రార్ నియామకంతో పాటు 16మంది అనుబంధ అధ్యాపకుల కొలువుల దాకా అన్నిటిలోనూ ఆరోపణలకు కేంద్రంగా విశ్వవిద్యాలయం మారిందా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానమే వినిపిస్తోంది. యూనివర్సిటీలో కొంతకాలంగా జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వం దృష్టిసారించకపోవటంతో విద్యా ప్రమాణాలతో పాటు వర్సిటీ కీర్తిప్రతిష్ఠలు కూడా దెబ్బతింటున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

అక్రమాలకు కేరాఫ్ కేయూ!



7

ఆరోపణలు, వివాదాలకు కేంద్రంగా కాకతీయ యూనివర్సిటీ

- గాడి తప్పిన పాలనతో అంతా అస్తవ్యస్తం
- అనుబంధ అధ్యాపకుల నియామకం, ఆన్సర్‌షీట్ల స్కానింగ్ టెండర్లలో గోల్‌మాల్
- ఫార్మసీ కళాశాలలకు అనుమతుల్లోనూ నిబంధనలకు చెల్లుచీటీ
- పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలపై విద్యార్థుల ఆందోళన
- సీడ్‌మనీ పేరుతో ఫేక్ ప్రాజెక్టులతో నిధులు స్వాహా
- రిజిస్ట్రార్‌తో సహా అనేక నియామకాలపై వివాదం

బాలికపై అత్యాచార యత్నం

- భూపాలపల్లి సైబర్ క్రైం సీఐ సంపత్ అరెస్టు
- పోక్సో కేసులో రిమాండ్‌కు తరలింపు



సంపత్

వరంగల్ క్రైం, మార్చి22: బాలికపై అత్యాచార యత్నం చేసిన కేసులో భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైం విభాగంలో సీఐగా పనిచేస్తున్న బండారు సంపత్ అరెస్టయ్యారు. ఈయనపై పోక్సో కేసు నమోదు చేసిన కేయూ పోలీసులు.. గురువారం అర్ధరాత్రి అరెస్టు చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..

2012 బ్యాచ్‌కు చెందిన బండారు సంపత్.. వరంగల్ కమిషనరేట్ పరిధిలో వర్ధన్నపేట, జఫర్‌గడ్, కేయూ తదితర పోలీసుస్టేషన్‌లలో ఎస్‌ఐగా విధులు నిర్వహించారు. కేయూ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐగా (ఆగస్టు 2021 నుంచి డిసెంబర్ 2022) పనిచేసిన సమయంలో సంపత్‌కు ఓ మహిళతో పరిచయం ఏర్పడింది. సదరు మహిళ కేయూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఒక కాలనీలో నివాసం ఉంటోంది. సంపత్ పరిచయంతో మహిళ కాపురంలో గొడవలు జరిగి భర్తకు దూరమైంది. ఆ తర్వాత ఇద్దరు సహజీవనం చేశారు. మొదటి భార్య వరంగల్ దేశాయిపేటలో ఉండగా.. ఈ మహిళ వద్దకు సంపత్ వస్తూ ఉండేవాడు.

దీంతో సదరు మహిళ భర్త నాటి సీపీ రంగనాథ్‌కు సంపత్‌పై ఫిర్యాదు చేయగా విచారణ చేసి వీఆర్‌కు అటాచ్ చేశారు. ఆపై సీఐగా పదోన్నతి పొందిన సంపత్.. ఖమ్మం, అటు నుంచి భూపాలపల్లి జిల్లా సైబర్ క్రైంకు మారారు. కాగా, మహిళ వద్దకు వస్తున్న సీఐ సంపత్.. ఆమె కూతురు (మైనర్)పై కన్నేశాడు. ఇటీవల ఆ బాలికపై అత్యాచార యత్నం చేశాడు. గమనించిన సదరు మహిళ.. సీఐ సంపత్‌పై ఇటీవల కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

విచారణ చేసిన కేయూ పోలీసులు.. అత్యాచార యత్నం, పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. సీఐ సంపత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన విషయాన్ని కేయూ సీఐ సంజీవ్ ధ్రువీకరించారు. అరెస్టయిన సీఐ సంపత్‌పై సస్పెన్షన్ వేటు పడనుంది.

కడియం మాదిగ ద్రోహి

- రాజయ్యకు, పసునూరికి టికెట్ రాకపోవడానికి ఆయనే కారణం
- అరూరి రమేష్ ఓటమిలోనూ పాత్ర
- శ్రీహరికి గుణపాఠం చెప్పడానికే బీఆర్ఎస్‌కు ఓటెయ్యొద్దు..
- లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణ మద్దతు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణమాదిగ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంద క్రిష్ణమాదిగ

హనుమకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాదిగద్రోహి అని, రాజకీయాల్లో మాదిగలు ఎదగకుండా ఆయన అడుగడుగునా అడ్డుపడుతున్నాడని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణమాదిగ విమర్శించారు. శుక్రవారం వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కడియం శ్రీహరిపై ధ్వజమెత్తారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమ నేపథ్యంగా రాజకీయాల్లోకి వచ్చిన వారు ఎదగకుండా కుట్రలు చేస్తున్న శ్రీహరి.. పక్కా స్వార్థపరుడిగా అభివర్ణించారు. ఇందుకు మాజీ ఉపముఖ్యమంత్రి డాక్టర్ రాజయ్య ఉదంతమే ఉదాహరణన్నారు. తన ఎదుగుదల కోసం రాజయ్యను బలిపశువును చేశాడన్నారు. పార్టీ అధిష్ఠానానికి లేనిపోనివి చెప్పడం ద్వారా రాజయ్యను ఆ పదవి నుంచి తొలగించేట్టు చేసి ఉపముఖ్యమంత్రి పీఠంపై తాను కూర్చున్నాడని ఆరోపించారు. ఎమ్మార్పీఎస్ నుంచి ఎదిగిన మరో నేత అరూరి రమేష్ విషయం లోనూ ఇదే కుట్రను అనుసరించాడని, వర్ధన్నపేటలో అరూరి గెలిస్తే తనకు మంత్రి పదవి రాదని కుట్ర పన్నాడన్నారు. సిట్టింగ్ ఎంపీ పసునూరి దయాకర్ విషయంలోనూ కడియం ఇదే కుట్ర ధోరణిని అనుసరించడాని, తన కూతురు కోసం పసునూరికి లోక్‌సభ టికెట్ రాకుండా మోకాలడ్డాడని ఆరోపించారు. గత లోక్‌సభఎన్నికల్లో మాదిగేతరుడైన గుడిమల్ల రవికుమార్‌కు టికెట్ ఇప్పించేందుకు కడియం ప్రయత్నించాడని, ఆయన మాదిగ వ్యక్తి కాదన్న వాస్తవాన్ని తాము పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకురావడంతో చివరి నిమిషంలో దయాకర్‌కు టికెట్ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ ఎన్నికల్లో దయాకర్ భారీ మెజారిటీతో గెలిచాడని గుర్తు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేయకుండా శ్రీహరికి గుణపాఠం చెప్పాలని, ఈ ఎన్నికల్లో బీజేపీకి సంపూర్ణ మద్దతు ఉంటుందని మంద క్రిష్ణ మాదిగ ప్రకటించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధ్య మవుతుందన్న నమ్మకం ఉందని, ఇటీవల విశ్వరూపసభలో చేసిన ప్రకటన మేరకు ఎస్సీ వర్గీకరణకు బాటలు వేస్తున్నాడన్నారు. మోదీ మూడోసారి ప్రధానమంత్రి అవుతారని, ఎస్సీ వర్గీకరణ తథ్యమని అన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోటీకి బీజేపీ తన పేరును పరిశీలించిందని, ఎస్సీ వర్గీకరణ జరిగే వరకు తాను ఏ ఎన్నికల్లో పోటీ చేయకూడదని నిర్ణయించు కున్నానని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో మహాజన సోష లిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జాతీయ నాయకుడు మం దకుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్య క్షుడు జన్ను దినేష్ మాదిగ, జిల్లా నాయకులు మంద రాజు మాదిగ, బొక్కల నారాయణ మాదిగ, బిర్రు మహేందర్ మాదిగ, కట్ట రాజేశేఖర్ మాదిగ, వేల్పుల సూరన్న కాపు, ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారి సురేందర్ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం తీసిన సరదా

- క్వారీ నీటికుంటలో పడి టెన్త్ విద్యార్థి మృతి
- మృతుడిది భూపాలపల్లి జిల్లా చెల్పూరు మండలం



శ్రీకాంత్ (ఫైల్)

కాజీపేట, మార్చి 22: తోటి విద్యార్థులు ఈతకు వెళ్తుండడంతో వారితోపాటు వెళ్లిన ఓ విద్యార్థి క్వారీ కుంటలో పడి మృతి చెందాడు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. భూపాలపల్లి జిల్లా చిల్పూర్ మండలం గొర్లమేడు గ్రామానికి చెందిన పోతనవేణి రాజాబాబు - మమత దంపతులకు కూతురు శిరీష, కుమారుడు పి.శ్రీకాంత్ (15) ఇద్దరు పిల్లలు, రాజబాబు మమత దంపతులు కూలి పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. కూతురు శిరీష ఇంటర్‌పూర్తి కాగా, కుమారుడు పి.శ్రీకాంత్ కాజీపేట విద్యానగర్ బీసీ హాస్టల్‌లో ఉంటూ ప్రస్తుతం పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. శుక్రవారం పరీక్ష లేకపోవడంతో తోటి విద్యార్థులు ఏడుగురితో కలిసి సమీపంలోని లోతైన క్వారీ గుంతల్లో ఈతకు వెళ్లారు. శ్రీకాంత్‌తోపాటు మరో ముగ్గురికి ఈతరాకపోవడంతో ఒక గుండుమీద కూర్చుని బట్టలు విప్పి చేతితో నీళ్లు పోసుకుంటున్నారు. మిగతా ముగ్గురు గుంతలో ఈతకొడుతున్నారు. శ్రీకాంత్ నీళ్లు పోసుకుంటున్న క్రమంలో బండ జారడంతో నీటిలోకి మునిగాడు. దీంతో శ్రీకాంత్ నీటిలో మునిగి మృతిచెందాడు. తీవ్ర భయభ్రాంతులకు గురైన తోటి విద్యార్థులు హాస్టల్‌కు వెళ్లి సిబ్బందికి సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్‌రెడ్డి తహసీల్దార్ బావుసింగ్, హాస్టల్ సిబ్బంది ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. ఫైర్ సిబ్బందిని పిలిపించి మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎం తరలించారు. అప్పటివరకు తమతోనే కలిసి ఉన్న శ్రీకాంత్ మృతిచెందడంతో తోటి విద్యార్థులు షాక్‌కు గురయ్యారు. దీంతో హాస్టల్‌లో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, హాస్టల్ వార్డెన్‌కు తెలియకుండా విద్యార్థులు బయటికి ఎలా వెళ్లారనే దానిపై పోలీసులు విచారణ చేస్తున్నారు.



అక్రమ లే అవుట్‌లను తొలగిస్తున్న బల్దియా సిబ్బంది

అనుమతుల్లేకుండా వెంచర్లు వేస్తే కఠిన చర్యలు

- బల్దియా సిటీ ప్లానర్ వెంకన్న నాయక్
- న్యూ శాయంపేటలో అక్రమ లే అవుట్ల తొలగింపు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 22: మున్సిపల్ శాఖ అనుమతులు లేకుండా అక్రమ లే అవుట్ వెంచర్లు చేస్తే కఠిన చర్యలు తప్పవని బల్దియా సిటీ ప్లానర్ వెంకన్న నాయక్ హెచ్చరించారు. గ్రేటర్ వరంగల్ 31వ డివిజన్ న్యూశాయంపేటలో ప్రభుత్వ అనుమతులు లేకుండా సర్వే నెంబర్ 350, 351లో అక్రమంగా వెంచర్‌లో నిర్మిస్తున్న కట్టడాలను శుక్రవారం అడ్డుకుని నిలిపివేశారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఖలీల్ ఆధ్వర్యంలో డీఎర్ఎఫ్ టీం సిబ్బంది అక్రమ నిర్మాణాలను తొలగించారు. జేసీబీ, డోజర్ సహాయంతో హద్దురాళ్లను, మట్టి రోడ్డును ధ్వంసం చేశారు. వెంచర్ యజమానులకు నోటీలు జారీ చేశారు.

ఈ సందర్భంగా వెంకన్న నాయక్ మాట్లాడుతూ.. వరంగల్ కార్పొరేషన్ పరిధిలో వెంచర్లు చేయాలనుకుంటే ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం టీఎస్ బీపాస్ ద్వారా దరకాస్తు చేసుకుని అనుమతులు పొందిన తర్వాతనే కట్టడాలు జరపాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టాలని అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్లాట్లు కొనుగోలు చేసే వారు నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు ఉన్న వెంచర్లలో మాత్రమే కొనుగోలు చేయాలని, లేదంటే తర్వాత ఇబ్బందులు వస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్, డీఆర్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

బాబోయ్.. ఎండలు!

వడగాలులతో జాగ్రత్త

- వేసవిలో ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం
- ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరంటున్న వైద్యులు

7

మానుకోటలో ఏసీబీ కలకలం

- లంచం తీసుకుంటూ పట్టుబడిన సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా
- స్థలం రిజిస్ట్రేషన్‌కు చదరపుగజానికి రూ.200 అదనంగా డిమాండ్
- గత్యంతరం లేక ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- సబ్‌రిజిస్ట్రార్‌కు సహకరించిన డేటా ఎంట్రీ ఆపరేటర్ కూడా అదుపులోకి



మహబూబాబాద్‌లో తస్లీమా మహ్మద్‌ను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

మహబూబాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : మానుకోటలో ఏసీబీ దాడులు కలకలం రేపాయి. బాధితుడిచ్చిన సమాచారం మేరకు ఏసీబీ అధికారులు పథకం ప్రకారం కాపుకాసి.. జిల్లా సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ శుక్రవారం లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఆమెతో పాటు ఆమెకు సహకరించిన ఔట్‌సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఆలేటి వెంకట్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం. దంతాలపల్లి మండలం దాట్ల గ్రామానికి చెందిన రైతు గుండగాని హరీష్ దంతాలపల్లి మండల కేంద్రంలో 128 గజాల ఇంటి స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ భూమి రిజిస్ట్రేషన్ కోసం ఈనెల మొదటి వారంలో సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్‌ను సంప్రదించారు. అయితే రిజిస్ట్రేషన్ కోసం ప్రభుత్వ లెక్కల ప్రకారం ఫీజుకింద చదరపు గజానికి ప్రకారం రూ.100 చొప్పున చెల్లించాల్సి ఉండగా.. దాంతో పాటు అదనంగా గజానికి రూ.200ఇవ్వాలని సబ్‌రిజిస్ట్రార్ ఆయన్ను డిమాండ్ చేశారు. ఈ క్రమంలో గజానికి రూ.150 అదనంగా ఇచ్చేందుకు హరీష్ అంగీకరించాడు. కానీ అందుకు సబ్‌రిజిస్ట్రార్ అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు గజానికి రూ.200చొప్పున ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో గత్యంతర లేని పరిస్థితుల్లో బాధితుడు వరంగల్‌లోని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఆ తర్వాత పథకం ప్రకారం మరోసారి సబ్‌రిజిస్ట్రార్‌తో మాట్లాడిన హరీష్.. తాను గజానికి రూ.150 చొప్పున 128 గజాలకు రూ.19200 అదనంగా చెల్లిస్తానని అంగీకారం కుదుర్చుకున్నాడు. ఆ తర్వాత శుక్రవారం సాయంత్రం రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి రిజిస్ట్రేషన్ చేయాలని, డబ్బు తెచ్చానని చెప్పగా.. ఆ నగదును డేటా ఎంట్రీ ఆపరేటర్ వెంకట్‌కు అందించాలని తస్లీమా సూచించారు. ఆమె చెప్పినట్టుగా నగదును ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి, డేటాఎంట్రీ ఆపరేటర్ వెంకట్ అలియాస్ ఆలేటి వెంకటేశ్వర్లుకు ఇస్తుండగా అక్కడే మాటువేసి ఉన్న ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడి నుంచి హరీష్ ఇచ్చిన రూ.19,200తో పాటు అంతకుముందు శుక్రవారం రోజంతా ఇతరుల నుంచి లంచాల రూపంలో వసూలు చేసిన (అన్‌అకౌంట్ మనీ) రూ.1.72 లక్షలను కూడా స్వాధీనం చేసుకున్నారు. సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్‌తో పాటు ఆమెకు సహకరించిన వెంకటేశ్వర్లును అరెస్టు చేశారు. వారిని శనివారం వరంగల్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు. ఈదాడుల్లో సీఐలు శ్యాంసుందర్, సునీల్‌కుమార్, రాజు పాల్గొన్నారు. మొత్తంగా ఏసీబీ దాడుల్లో తస్లీమా పట్టుబటడం జిల్లా వ్యాప్తంగా, అధికార వర్గాల్లో తీవ్ర కలవరం రేపింది. అయితే తాను కష్టపడి సంపాదించుకున్న సొమ్ముతో దంతాలపల్లి మండల కేంద్రంలో ఇటీవలే 128 గజాల ఇంటి స్థలాన్ని కొని రిజిస్ట్రేషన్ కోసం వెళ్తే ప్రభుత్వానికి చెల్లించే ఫీజుతో పాటు అదనంగా డబ్బులు అడగడంతో ఏసీబీని ఆశ్రయించానని హరీష్ తెలిపారు. మరెవరికి ఇలా జరుగవద్దనే ధైర్యం చేశానన్నారు.

సామాజిక సేవా కార్యకర్తగా..

కొన్నేళ్లుగా సామాజిక సేవాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ సబ్‌రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ములుగు జిల్లా సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కాలం నుంచి అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విపత్కర సమయాల్లో గిరిజనులకు సాయమందించడంలో ముందుండేవారన్న పేరుంది. కొవిడ్ విపత్కర సమయంలో ములుగు ఎమ్మెల్యే, ప్రస్తుత మంత్రి సీతక్కతో కలిసి కొండలు, గుట్టలు దాటి గిరిజనగూడేల్లోకి వెళ్లి నిత్యావసరాల పంపిణీతో పాటు పలు సేవాకార్యక్రమాలు నిర్వహించడం, ఆ దృశ్యాలు సోషల్‌మీడియా ద్వారా ప్రజల్లోకి వెళ్లడంతో తస్లీమా అందరి ప్రశంసలు అందుకున్నారు. ఇలా సామాజిక సేవా గుణం ఉన్న ఆమె లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశంగా మారింది.

హవ్వా.. ఎక్సైజ్ స్టేషన్!



- శిథిల భవనంలో హనుమకొండ అబ్కారీ శాఖ
- పగుళ్లు, పాములు, అపరిశుభ్రత మధ్యే సిబ్బంది విధులు
- నూతన భవన నిర్మాణంపై దృష్టి సారించని ఉన్నతాధికారులు



పెచ్చులు ఊడిన లోపలి భాగం

వరంగల్ క్రైం, మార్చి 22: ఇరుకు గదులు.. ఎప్పుడు కూలుతాయో తెలియని గోడలు.. కూర్చునేందుకు లేని కుర్చీలు.. ఊడిపడేందుకు సిద్ధంగా ఉన్న సీలింగ్ ఫ్యాన్లు.. చుట్టూ దుర్గంధం.. ఆవరణలో పాముల సంచారం. ఇదీ.. హనుమకొండలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ దుస్థితి. ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూర్చిపెట్టే హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ శిథిలావస్థలో ఉన్న భవనంలో కొనసాగుతోంది. దాదాపు రెండు దశాబ్దాలకు పైగా ఇలాంటి భవనంలోనే ఎక్సైజ్ సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు.

అసౌకర్యాల నడుమ..

హనుమకొండ నక్కలగుట్ట ప్రాంతంలోని ఆర్అండ్‌బీ క్వార్టర్స్‌లో హనుమకొండ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ నడుస్తోంది. ఈ స్టేషన్‌లో ఒక సీఐతో పాటు ముగ్గురు ఎస్ఐలు, ఏడుగురు కానిస్టేబుళ్లు, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లతోపాటు మరో ఇద్దరు కింది స్థాయి ఉద్యోగులు కలుపుకుని మొత్తం 15 మంది విధులు నిర్వహిస్తున్నారు. భవనం చూస్తే పూర్తిగా శిథిలమైపోయి ఉంది. భవనం చుట్టూ చెట్లు, చెత్తతోపాటు దుర్గంధం వ్యాపించి ఉంది. నిత్యం పాములు సంచరిస్తుంటాయని ఉద్యోగులు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనం పగుళ్లు వచ్చి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉంది. విధులు నిర్వహించే సిబ్బందికి కనీస సౌకర్యాలు లేవు. పురాతన కాలంనాటి ఫర్నిచర్‌నే వాడుతున్నారు. ఫైళ్లు, ముఖ్యమైన దస్త్రాలు పెట్టుకునేందుకు కనీసం బీరువాలు కూడా లేవు. ఎప్పుడు ఊడి మీద పడుతాయో అనేలా ఫ్యాన్లు ఉన్నాయి.

సొంత భవనం ఏదీ?

సమీకృత కలెక్టర్ కార్యాలయం నిర్మాణం చేసినప్పుడు కేవలం సూపరింటెండెంట్ కార్యాలయానికి మాత్రమే గది కేటాయించిన ఉన్నతాధికారులు.. హనుమకొండ, వరంగల్ ఎక్సైజ్ స్టేషన్‌లకు చోటు ఇవ్వలేదు. హనుమకొండ స్టేషన్ నక్కలగుట్టలోని ప్రభుత్వ క్వార్టర్స్‌లో, వరంగల్ స్టేషన్ అద్దె భవనంలో కొనసాగుతున్నాయి. ఎక్సైజ్ స్టేషన్‌లు ప్రత్యేకంగా ఉండాలనే లక్ష్యంతో ఈ రెండు కార్యాలయాలకు భవనాలను కేటాయించలేదని చెబుతున్న ఉన్నతాధికారులు.. నూతన భవన నిర్మాణాలపై శ్రద్ధపెట్టకపోవడం గమనార్హం. ప్రభుత్వ ఖజానాకు ఆదాయం సమకూర్చే ఈ స్టేషన్‌లకు శాశ్వత భవన నిర్మాణాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



శిథిలావస్థలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ భవనం

యువకుడి అదృశ్యం

హనుమకొండ టౌన్, మార్చి 22 : హనుమకొండ నయీంనగర్‌కు చెందిన సంద్ర దిలీప్ అనే యువకుడు (25) ఈ నెల 18న ఇంట్లో నుంచి బయటికి వెళ్లి కనిపించకుండా అదృశ్యమైపోయాడని హనుమకొండ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కారుడ్రైవర్‌గా పనిచేసే దిలీప్.. ఈ నెల 18న ఉదయం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు ఇళ్లలో వెతికినా సమాచారం లేకపోవడంతో దిలీప్ తల్లి శోభ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ఐనవోలు, మార్చి 22: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన పున్నేలు శివారు జాతీయరహదారిపై శుక్రవారం రాత్రి జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పంథిని గ్రామానికి చెందిన నస్కూరి వినోద్ ఐనవోలుకు వెళ్లి బైక్‌పై పంథినికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఏకశిల పాఠశాల సమీపంలో టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వినోద్‌కు తీవ్ర గాయాలు కాగా హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.



కటాక్షపూర్‌లో చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

చెక్‌పోస్టు తనిఖీ చేసిన సీపీ

వరంగల్ క్రైం, మార్చి22: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని ఆత్మకూరు మండలం కటాక్షపూర్‌లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద సిబ్బంది నిర్వహిస్తున్న తనిఖీ తీరును సీపీ పరిశీలించారు. తనిఖీ సమయంలో ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని ఆయన సూచించారు. అప్రమత్తంగా విధులు నిర్వహించాలని అంబర్ కిషోర్ ఝా తెలిపారు. సీపీతో ఆత్మకూరు సీఐ క్రాంతికుమార్ ఉన్నారు.

ఏనుమాముల మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

వరంగల్ వ్యవసాయం, మార్చి 22: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.సంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం యార్డు బంద్ సెలవు, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం హోలీ పండుగను పురస్కరించుకుని సెలవు ప్రకటించారు. తిరిగి మంగళవారం మార్కెట్లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని మార్కెట్ కార్యదర్శి ఆ ప్రకటనలో తెలిపారు.

వరంగల్ మార్కెట్లో తగ్గిన పంటల ధరలు

వరంగల్(ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్లో వివిధ పంట సరకులకు గురువారంతో పోలిస్తే శుక్రవారం మరింత తగ్గాయి. పత్తి క్వింటాకు రూ.7,315 శుక్రవారం రూ. 7,250 పలికింది. సింగిల్‌పట్టి మిర్చి క్వింటాకు రూ.45,600 లకు రూ.42వేలు పలికింది. తేజా రూ.19,800లకు రూ. 19,300, వండర్‌హాట్ రూ.15,500లకు రూ.15వేలు, యుఎస్ 341 రకం రూ.16,500లకు రూ.15వేలు ధర పలికింది. అలా గే, దీపిక రూ.14వేలు పలికింది. దేశీ రకం రూ.34వేలకు రూ.30వేలు, తాలు రూ.8వేలకు రూ.8,500 ధర పలికింది.

అక్రమాలకు కేరాఫ్ కేయూ!

ఆరోపణలు, వివాదాలకు కేంద్రంగా కాకతీయ యూనివర్సిటీ



(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

తన చదువులమ్మ చెట్టు నీడలో ఎందరినో మహానుభావులుగా తీర్చిదిద్దిన కాకతీయ యూనివర్సిటీ ప్రతిష్ఠ దిగజారుతోంది. యూనివర్సిటీ నిర్వహణ వ్యవహారాల గురించి గత ప్రభుత్వం పెద్దగా పట్టించుకోకపోవటంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని, ఫలితంగా అనేక అక్రమాలు జరిగాయని తెలుస్తోంది. తాజా వెలుగులోకి వచ్చిన పలు అక్రమాలతో ఇదంతా వాస్తవమేనన్న చర్చ జరుగుతోంది. ప్రస్తుతం ఆన్సర్ షీట్ స్కానింగ్ టెండర్ల రద్దు, రీటెండర్ వ్యవహారం దుమారం రేపుతోంది. కాకతీయ యూనివర్సిటీలో 32పేజీలు ఉండే యూజీ, పీజీ పరీక్షలకు సంబంధించిన సమాధాన పత్రాలను స్కానింగ్ చేయటం కోసం ఫిబ్రవరి 2వ తేదీన ఈ టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. టెండర్ బిడ్ సమర్పించడానికి మార్చి6 వరకు గడువు విధించారు. ఇలా వచ్చిన దరఖాస్తుల టెక్నికల్ బిడ్‌ను మార్చి 7న, కమర్షియల్ బిడ్‌ను 13వ తేదీన ఓపెన్ చేయాల్సి ఉంది. ఈ స్కానింగ్ టెండర్‌కు మూడు కంపెనీలు బిడ్ దాఖలు చేయగా.. అందులో కోజిన్ లిమిటెడ్ కంపెనీ మిగతా రెండింటి కంటే తక్కువగా ఒక ఆన్సర్ షీట్ డిజిటలైజేషన్‌కు రూ.14.51కు కోట్‌చేసింది. నిబంధనల ప్రకారం టెండర్‌ను కోజిన్ కంపెనీకి ఇవ్వాల్సి ఉంది. కానీ, అనుహ్యంగా కేయూ వీసీ ఆ టెండర్‌ను రద్దు చేసి మళ్లీ ఈ నెల 16న రీటెండర్‌కు నోటిఫికేషన్ జారీ చేయటం వివాదాస్పదమైంది. పాత టెండర్‌ను ఎందుకు రద్దు చేశారో చెప్పకుండా రీ టెండర్ నోటిఫికేషన్ వేయటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమకు అనుకూలమైన కంపెనీకి టెండర్ దక్కకపోవటంతోనే రద్దు నిర్ణయం తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి నిబంధనల ప్రకారం రూ.5లక్షల దాటే ఏ పనికైనా తప్పనిసరిగా టెండర్లు ఆహ్వానించాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వంలో మూడేళ్లుగా ఎలాంటి టెండర్లు లేకుండా ఆన్సర్ షీట్ స్కానింగ్ చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత టెండర్లపై దృష్టిపెట్టడంతో రూ.2కోట్లతో చేపట్టే ఆన్సర్ షీట్ల స్కానింగ్ పనులకు ఈసారి టెండర్లు పిలిచి, వాటిని ఆకారణంగా రద్దు చేసిన కేయూ అధికారుల నిర్వాకం వెలుగులోకి వచ్చింది. ఈ టెండర్ రద్దుపై పలువురు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి కేయూ వీసీ, రిజిస్ట్రార్‌లపై ఫిర్యాదు చేయటం కలకలం రేపుతోంది.

ఆధ్యాపకుల నియమాకంలో అక్రమాలే..

కేయూలో ఇటీవల నియమించిన అనుబంధ అధ్యాపకుల(అడ్జంట్ ఫ్యాకల్టీ)ను నిబంధనలకు విరుద్ధంగా నియమించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూజీసీ నిబంధనల ప్రకారం అడ్జంట్ ఫ్యాకల్టీ నియమకానికి ముందస్తుగా నోటిఫికేషన్ ఇవ్వాలని, వచ్చిన దరఖాస్తులను ఆయా విభాగాల అధిపతులు పరిశీలించి రిజిస్ట్రార్‌కు పంపించాల్సి ఉంటుందని యూనివర్సిటీ అధ్యాపకులు పేర్కొంటున్నారు. అలాగే దరఖాస్తు చేసుకున్న వారి నుంచి అధ్యాపకులను ఎంపిక చేసేందుకు ఐదుగురితో కూడిన సెలక్షన్ కమిటీని కూడా ఏర్పాటు చేయలేదనే విమర్శలున్నాయి. సెలక్షన్ కమిటీ లేకుండా కేయూలో గతేడాది జనవరి 30న 12 మందిని, మార్చిలో నలుగురిని కలిపి మొత్తం 16 మందిని పాలక మండలి అనుబంధ అధ్యాపకులుగా నియమించటంపై విమర్శలు వినిపిస్తున్నాయి. 2014 సెప్టెంబరులో ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో ఏ యూనివర్సిటీలో ఎలాంటి టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయకూడదని ఆదేశాలున్నా యూనివర్సిటీ అధికారులు పట్టించుకోకుండా నియామకాలు చేశారని, వీరి కి ఒక్కొక్కరికి నెలకు రూ.50వేల చొప్పున 16మంది కి ప్రతినెల రూ.8లక్షల వేతనాలు చెల్లిస్తున్నారని, అయితే ఇప్పటి వరకు వీరు ఎలాంటి పరిశోధనలు చేయడం లేదని, క్లాసులు తీసుకోవటం లేదని, దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఫామ్-డి అనుమతిలో నిబంధలు బేఖాతరు

ఫార్మసీ కాలేజీలకు అనుమతుల్లోనూ కేయూ అధికారులు నిబంధనలను తుంగలో తొక్కారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేయూ పరిధిలో మొత్తం 24 ఫార్మసీ కాలేజీలుండగా వీటిలో బీఫార్మసీ, ఎంఫార్మసీ కోర్సులున్నాయి. అయితే 12కాలేజీలు డీఫార్మసీ కోర్సును ప్రవేశపెట్టేందుకు అనుమతులు కోరుతూ యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకున్నాయి. అయితే ఫామ్-డి కోర్సు నిర్వహించే కాలేజీలకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతి పొందిన 300 పడకల ఆస్పత్రులు అనుబంధంగా ఉండాలి. కానీ దరఖాస్తు చేసుకున్న 12కాలేజీల్లో.. కేర్ ఫార్మసీ, సహస్ర ఫార్మసీ, వాగ్దేవి హనుమకొండ, సెయింట్ పీటర్, తాళ్ల పద్మావతి కాలేజీ, ఖమ్మం ఫార్మసీకాలేజీలు మాత్రమే 300 పడకల ఆస్పత్రులను అనుబంధంగా కలిగి ఉన్నాయి. మిగతా ఆరు కాలేజీలకు ఎలాంటి అనుబంధ వైద్యశాలలు లేకపోయినా యూనివర్సిటీ అధికారులు అనుమతులు ఇచ్చారు. కేయూ అధికారుల తమకు అనుకూలమైన వారిని తనఖీలకు పంపించి, తప్పుడు నివేదికల ఆధారంగా ఆ కళాశాలలకు అనుమతులిచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు

పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలతో కేయూ పరువు బజారుకెక్కింది. 2017లో పీహెచ్‌డీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసిన అధికారులు ఆరేళ్ల పాటు పట్టించుకోలే దు. విద్యార్థుల ఆందోళనలతో దిగివచ్చిన కేయూ అధికారు లు 2023లో అడ్మిషన్లకు షెడ్యూల్ ప్రకటించింది. పీహెచ్‌డీ అడ్మిషన్లలో 75శాతం రెగ్యులర్ ప్రాతిపదికన, 25శాతం పార్ట్ టైం ప్రాతిపదికన కేటాయించారు. మే 27, 2022లో కేటగిరి-1 ఇంటర్వ్యూలు నిర్వహించి.. అదే ఏడాది మార్చి 21న కేటగిరి-2లో సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ ఇచ్చి ఆగస్టు 29న ఫలితాలు వెల్లడించారు. అయితే ఇంటర్వ్యూలో అధికారులు నిబంధనలు పాటించలేదని, అవకతవకలకు పాల్పడ్డారని విద్యార్థులు ఆరోపిస్తూ గత సెప్టెంబరులో ఆందోళనకు దిగా రు. కేటగిరి-2 అడ్మిషన్లలో కొందరు ప్రొఫెసర్లు సీట్లు అమ్ముకున్నారని ఆరోపిస్తూ విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనకు దిగగా పదిమంది విద్యార్థులపై పోలీసులు కేసులు నమోదు చేసి ఇద్దరిని జైలుకు పంపించారు. దీనిపై విద్యార్థులు అప్పటి గవర్నర్ తమిళిసైను కూడా కలిసి పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై ఫిర్యాదు చేశారు. దీనిపై కొత్త ప్రభుత్వం ఫిబ్రవరి 16న త్రిసభ్య కమిటీని వేసింది. కేయూలో పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అక్రమాలను వెలికి తీసేందుకు ఆ త్రిసభ్య కమిటీ సభ్యులు కేయూలో పర్యటించి వీసీ, రిజిస్ట్రార్‌లతో పాటు అధ్యాపకులు, విభాగాల అధిపతులు, విద్యార్థుల నుంచి సమాచారం సేకరించారు. అయితే గత బుధవారం త్రిసభ్య కమిటీ నివేదిక ఇచ్చినా అందులో ఏముందో యూనివర్సిటీ అధికారులు బయట పెట్టకపోడంతో విద్యార్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

కాగా, వీటితో పాటు కేయూలో ఆరుగురు ప్రొఫెసర్లతో కలిసి సీడ్‌మనీ పేరుతో నకిలీ పరిశోధన ప్రాజెక్టులు మంజూరు చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎలాంటి పరిశోధనలు చేయకుండా రూ.20లక్షల నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ల, సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయనే చర్చ జరుగుతోంది. రిజిస్ట్రార్, వీసీ నియామకాలతో పాటు పార్ట్‌టైమ్ అధ్యాపకుల నియామకాలపై వివాదం కొనసాగుతుండగా.. ఇప్పటికే ప్రభుత్వం యూనివర్సిటీపై దృష్టిసారించి ప్రత్యేక విచారణ కమిటీలు, విజిలెన్స్ విచారణకు కూడా ఆదేశించింది. కేయూలో జరుగుతున్న అవతవకలపై ఆకుట్ ఆధ్వర్యంలో అనేకమార్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు చేసింది. మొత్తం మీద రాష్ట్రంలో రెండో అతిపెద్ద యూనివర్సిటీగా ఉన్న కేయూలో కొంతకాలంగా వస్తున్న అక్రమాల ఆరోపణలు, విద్యార్థులు, అధ్యాపకుల ఆందోళనలతో ప్రతిష్ఠ మసకబారుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

వరంగల్‌లో గడువు తీరిన ఔషధాల విక్రయం

వరంగల్ మెడికల్, మార్చి 22: రోగికి గడువు తీరిన ఔషధాలు విక్రయించిన ఘటనపై వరంగల్ ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు ఫిర్యాదు అందింది. వరంగల్ పోచమ్మమైదాన్‌లోని శ్రీ సృష్టి హాస్పిటల్ వైద్యురాలు దొడ్డ సంధ్య దగ్గరకు లలిత అనే గర్భిణీ పరీక్ష నిమిత్తం ఈ నెల 18న వెళ్లింది. వైద్యురాలు గర్భిణీకి పరీక్ష నిర్వహించి పోల్‌విస్ట్-డీహెచ్‌ఏ మా త్రలు రాసింది. ఇదే హాస్పిటల్ ఆవరణలోని తిరుమల ఫార్మసీలో మందులు కొనుగోలు చేశారు. ఎక్స్‌పైరీ తేదీ దగ్గర కట్ చేసి నాలుగు షీట్స్ విక్రయించారని రోగి భర్త ఎం.మహేశ్ ఫిర్యాదు చేశారు. వరంగల్ ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఈ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మందుల విక్రయాలపై డీఎంఈ ఆరా

వరంగల్ మెడికల్, మార్చి 22: ప్రాంతీయ ప్రభుత్వ నేత్ర వైద్యశాల ఫార్మసిస్టు మందులను ప్రయివేట్ వ్యక్తులకు విక్రయించిన ఘటనపై వైద్య విద్య డైరెక్టర్ తీవ్రంగా స్పందించారు. ఆర్‌ఈహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ గిరిధర్‌రెడ్డి సెలవులో ఉండటంతో ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ వెంటనే విచారణ జరపాలని ఆదేశించారు. ఈ ఆదేశాలతో శుక్రవారం ఉదయం డాక్టర్ చంద్రశేఖర్ ఆర్‌ఈహెచ్‌ను సందర్శించారు. మందులు బయటికి తరలివెళ్లిన విషయాలపై ఆరా తీశారు. సమగ్ర నివేదికను డీఎంఈకి పంపనున్నారు. కాగా, ఎఫ్ఐఆర్ కాపీ అందించిన వెంటనే ఫార్మసిస్టు తలకోటి నాగేందర్‌ను సస్పెండ్ చేయనున్నట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి.

ఏప్రిల్ 1 నుంచి దివ్యాంగుల ప్యాసింజర్ వాహనాల రాయితీ రద్దు

వరంగల్ చౌరస్తా, మార్చి 22: డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఆదేశానుసారం జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా అమలు చేయబడుతున్న టీ-ప్రైడ్ పథకంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులకు ప్యాసింజర్ వాహనాలకు కల్పించే రాయితీ ఏప్రిల్ 1 నుంచి రద్దు చేయబడిందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శుక్రవారం నర్సింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన రాయితీలు యథావిధిగా అమల్లో ఉంటాయన్నారు. రద్దు చేయబడిన లబ్ధిదారులు ఆ రాయితీని ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా పొందవచ్చని ఈ మార్పును లబ్ధిదారులు గమనించాలని నర్సింహమూర్తి తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ దాడులు

వరంగల్ క్రైం, మార్చి22: గీసుగొండ మండలంలోని రెడ్డిపాలెం, హసన్‌పర్తి మండలంలోని ఎల్లాపూర్‌లో బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన దాడుల్లో రెడ్డిపాలెంలో రూ.61,210, ఎల్లాపూర్‌లో రూ.5100 అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ ఎ.మధుసూధన్ ధృవీకరించారు.

అర్చక ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సీఎం రేవంత్ రెడ్డికి అర్చక ఉద్యోగుల జేఏసీ విజ్ఞప్తి



సీఎంను కలిసి సమస్యలను నివేదిస్తున్న అర్చక ఉద్యోగుల జేఏసీ నాయకులు

హనుమకొండ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అర్చక ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలన్నిటినీ పరిష్కరించాలని అర్చక ఉద్యోగుల జేఏసీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభ్యర్థించింది. శుక్రవారం అర్చక ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ నేతృత్వంలో అర్చకులు సీఎంను హైదరాబాద్‌లోని ఆయన నివాసగృహంలో కలిశారు. అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రధానంగా జీవో నెంబరు 577 ప్రకారం అర్చక ఉద్యోగులందరికీ గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా వేతనాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 5,627 మందికి వేతనాలు చెల్లించాల్సి ఉండగా, దేవాదాయ అధికారుల నిర్లక్ష్యంవల్ల ప్రస్తుతం మూడు వేల మందికి మాత్రమే వస్తున్నాయని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. మిగతా వారికి కూడా వచ్చేట్టు తగిన చర్యలు తీసుకోవలసిందిగా వారు కోరారు. 121 జీవో తొలగించడంవల్ల పూర్తిస్థాయిలో అందరికీ గ్రాంట్ ఎయిడ్ ద్వారా వేతనాలు వస్తాయని తెలిపారు. రెండేళ్లుగా దేవాదాయ శాఖలో కారుణ్య నియామకాలు లేవని తెలిపారు. 200మంది అర్చక ఉద్యోగుల పిల్లలను కారుణ్య నియామకాల ద్వారా నియమించాలని కోరారు. అర్చక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసినా అర్చక ఉద్యోగులకు న్యాయం జరగడం లేదన్నారు. ప్రతీ అర్చక ఉద్యోగికి ఆరోగ్య బీమా వర్తింప చేయాలని సీఎంను అభ్యర్థించారు. రిటైరైన ఉద్యోగులకు రూ.10లక్షల చొప్పున గ్రాట్యుటీ ఇవ్వాలని, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ప్రతీనెల 5వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని, గ్రామీణప్రాంత ధూప, దీప, నైవేద్య అర్చకులకు ఉద్యోగభద్రత కల్పించాలని, వారి గౌరవ వేతనాన్ని రూ.25వేలకు పెంచాలని, ధార్మిక భావన కలిగిన వారిని దేవాలయ ధర్మకర్తల మండలిలో నియమించాలని కోరారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. వెంటనే ఓఎస్‌డీని పిలిచి అర్చక ఉద్యోగుల సమస్యలపై రెండు రోజుల్లో నివేదిక అందచేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో అర్చక ఉద్యోగ జేఏసీ నాయకులు క్రిష్ణమాచారి, పరాశరం రవీంద్రాచారి, అర్చక జేఏసీ కన్వీనర్ అగ్నిహోత్రం చంద్రశేఖర్ శర్మ, కర్మాఘాట్ దేవాలయం అర్చకులు అంబా ప్రసాద్ శర్మ, సంతోష్ కుమారాచార్యులు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బండారి జగపతి, ధూప దీప నైవేద్య అర్చకుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పెన్నా మోహన శర్మ తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీ కొట్టిన కారు.. ఒకరికి గాయాలు

హనుమకొండ టౌన్, మార్చి 22 : హనుమకొండ కేయూ రోడ్డులోని గోపాల్‌రావు బిల్డింగ్ ఏరియాలో ప్రధాన రహదారిపై ద్విచక్రవాహనదారుడు యూ టర్న్ తీసుకుంటుండగా కారు ఢీకొని గాయపడ్డ ఘటన ఈ నెల 11న చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. వికాస్‌నగర్‌కు చెందిన ఎల్లస్వామి డబ్బాల నుంచి రెడ్డికాలనీ వైపు వస్తుండగా గోపాల్‌రావు బిల్డింగ్ వద్ద కారు డ్రైవర్ మద్యం మత్తులో అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టాడు. ఈ ఘటనలో ద్విచక్రవాహనదారుడి ఎడమ కాలు విరిగింది. బాధితుడి అల్లుడు దండు యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మట్టి టిప్పర్ల పట్టివేత

ధర్మసాగర్, మార్చి 22: అక్రమంగా మట్టిని రవాణాచేస్తున్న టిప్పర్లను ఎస్సై నర్సింగరావు శుక్రవారం పట్టుకున్నారు. నష్కల్‌కు చెందిన కొతుల రాజు, యాకయ్యలు ఎక్స్‌కావేటర్, టిప్పర్లతో వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామ శివారు గట్టుమల్లికార్జున దేవస్థానం నుంచి టిప్పర్లతో మట్టిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి వద్దకు రాగానే పోలీసులు వాహనాలను పట్టుకున్నారు. అనంతరం టిప్పర్లను పీఎస్‌కు తరలించి యజమానులపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.


రైల్వే కో ఆప్షన్ మెంబర్‌గా రాఘవేందర్



నియామక పత్రాన్ని అందుకుంటున్న రాఘవేందర్

కాజీపేట, మార్చి 22: సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ అనుబంధంగా నడుస్తున్న సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కో- ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డైరెక్టర్ల సర్వసభ్య సమావేశం శుక్రవారం సికింద్రాబాద్‌లో జరిగింది. కాజీపేట రైల్వే విభాగంలో పనిచేస్తున్న దేవులపల్లి రాఘవేందర్‌ను కో ఆప్షన్ డైరెక్టర్‌గా నియమించారు. రాష్ట్ర సంఘం నాయకుల చేతుల మీదుగా రాఘవేందర్ నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు శంకర్‌రావు, పిల్లలమర్రి రవీందర్, షేక్ ఖాజాబాబ, చినుకు స్వామిలకు రాఘవేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

బాబోయ్.. ఎండలు!



● వడగాలులతో జాగ్రత్త ● వేసవిలో ఆరోగ్యంపై అప్రమత్తత అవసరం ● ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరంటున్న వైద్యులు

వరంగల్ మెడికల్, మార్చి 22: ఎండలు బాబోయ్ ఎండలు.. అంటూ జనం బేజారవుతున్నారు. మార్చి మొదటివారం నుంచే మండే ఎండలు ముంచుకొచ్చాయి. ఇక ఏప్రిల్, ఇక మే నెలను తలుచుకుంటే జనం బెంబేలెత్తుతున్నారు. వాతావరణ శాఖ కూడా ఈ ఏడాది ఎండలు దంచనున్నాయని ముందే హెచ్చరించింది. కూలీలు, వ్యాపారులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజలు భానుడి ప్రతాపానికి విలవిలలాడుతున్నారు. వడదెబ్బతో ఇప్పటికే మంచాన పడుతున్నారు. ఎండ వేడిమి నుంచి తమను తాము రక్షించుకోవడానికి ముందస్తు జాగ్రత్తలు పాటించాలని వర్గాలు చెబుతున్నాయి.

వడదెబ్బ ఎలా సోకుతుంది?

ఎండ తీవ్ర ఉన్నప్పుడు మనిషి మెదడులో ఉన్న ఉష్ణోగ్రతను నియంత్రించే కేంద్రం దెబ్బతినడం వల్ల, ఎక్కువసేపు ఎండలో ప్రయాణం చేసిన పని చేసిన వడదెబ్బ తగులుతుంది. దీంతో శరీర ఉష్ణోగ్రత 108 ఫారన్‌హీట్ నుంచి 110 ఫారన్‌హీట్‌ల వరకు పెరుగుతుంది. వడదెబ్బ తగిలిన వారిలో 40శాతం మరణాలు సంభవించే అవకాశం ఉంటుందని వైద్య వర్గాలు హెచ్చరిస్తున్నాయి.

వడదెబ్బ లక్షణాలు

శరీరం నీరసించి పోవడం, విపరీతమైన దాహం, మూత్ర విసర్జనలో మంట తీవ్ర, చర్మం ఎర్రగా మారి వేడిగా ఉండడం, నీళ్ల విరేచనాలు, తల తిరగడం, మగతగా ఉండి అపస్మారక స్థితికి చేరడం. వాంతులు చేసుకోవడం.


వెంటనే అందించాల్సినవి

వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ లేదా గాలి ఉన్న ప్రదేశానికి చేర్చాలి. ఆ తరువాత శరీరంపై ఉన్న దుస్తులు తొలగించి ఐస్ ముక్కలతో చల్లని నీటితో కానీ శరీరం అంతా తుడవాలి. కొబ్బరినీరు, నిమ్మరసం, మజ్జిగ ద్రావణాన్ని తాగించాలి. అయినా రోగి కోలుకోకపోతే వెంటనే ఆస్పత్రికి తరలించాలని వైద్యులు సూచిస్తున్నారు.



ముందస్తు చర్యలు చేపట్టాం..

డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు



ఎండలు ముదురుతున్న దృష్ట్యా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల, ఆరోగ్య ఉప కేంద్రాల, తన ఆరోగ్య కేంద్రాల సిబ్బందిని అలర్ట్ చేశాం. క్షేత్రస్థాయిలో వడదెబ్బ సోకిన వారి వివరాలు సేకరించేందుకు యంత్రాంగం పూర్తి కార్యాచరణతో ఉంది. పిల్లలు, వృద్ధులు తొందరగా వడదెబ్బ సోకే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి. ఆరోగ్య శాఖ కూడా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నాం. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతాం. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సెలైన్ బాటిల్స్ సరిపడా నిల్వలు ఉన్నాయి. త్వరలో ప్రత్యేక వైద్య శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తాం. 108, 104 సేవలు కూడా ముమ్మరం చేస్తాం, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి.

జంగాకు శుభాకాంక్షలు

ఐనవోలు, మార్చి 22: రాష్ట్ర కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్ ఫెడరేషన్ చైర్మన్‌గా నియామకమైన జంగా రాఘవరెడ్డికి నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. గర్మిళ్ళపల్లికి చెందిన ఎంపీటీసీ బీరం మౌనికదేవేందర్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హనుమకొండలో చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు.



రాఘవరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పాఠశాలల్లో అమ్మ ఆదర్శ మహిళా కమిటీల ఎన్నిక

ఐనవోలు, మార్చి 22: ఐనవోలు, ఉడుతగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో శుక్రవారం అమ్మ ఆదర్శ మహిళా కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలకు గ్రామంలోని వీవో సంఘాల అధ్యక్షుల కమిటీలకు చైర్మన్‌గా పాఠశాల హెచ్‌ఎం కన్వీనర్‌గా, 15 మంది సభ్యులలో ఐదుగురు ఎస్సీ, ఎస్టీల నుంచి ఎన్నుకున్నారు. ఐనవోలు పాఠశాల చైర్మన్‌గా అనిత, కన్వీనర్‌గా హెచ్‌ఎం శ్రీనివాస్ రెడ్డి, ఉడుతగూడెం పాఠశాల చైర్మన్‌గా బరిగెల సుమలత, కన్వీనర్‌గా హెచ్‌ఎం చుంచుకాల లింగారావులతో పాటు చిదురాల మమత, మిద్దెపాక రజిత, ఇల్లందుల రేణుక, యాకర ప్రియాంక, ఆకులపల్లి రజిత, తాటికాయల రజితలను సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కమిటీలు పాఠశాలలలో పారిశుధ్య, మరమ్మతులు, మధ్యాహ్న భోజనం నిర్వహణ తదితర కార్యక్రమాలు పర్యవేక్షించనున్నారు. ఈ ఎన్నిక కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు మధుకర్, భీమళ్ళ సారయ్య, మహేందర్‌రెడ్డి, మహేందర్, లక్ష్మయ్య, ప్రతికంఠం ఉమాదేవి, అంగన్‌వాడీ టీచర్ కొండ్రెడ్డి ప్రణీత, సీఆర్పీలు రేవతి, రాజ్‌కుమార్, భవన్, అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

ఆహార కొరతను అధిగమించాలి

• కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్

కేయూ క్యాంపస్, మార్చి 22: మానవాళికి ఉపయోగపడే పరిశోధనలను ఆవిష్కరించి ఆహారకొరతను అధిగమించాలని కేయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఉద్బోధించారు. శుక్రవారం హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలలో రిసెంట్ ట్రెండ్స్ ఇన్ ప్లాంట్ సైన్స్ రిసెర్చ్ అనే అంశంపై జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నూతన పరిశోధనలతో ఉత్పాదన ఔషధరంగానికి తోడ్పాటును అందించాలని అన్నారు. సదస్సులో ప్రధానవక్తగా పాల్గొన్న బెంగళూరు సీఎస్‌ఐఆర్ సీనియర్ అసిస్టెంట్ ఆర్‌ఆర్ రావు మాట్లాడుతూ.. పశ్చిమ కనుమల్లో ఉన్న వృక్షవైవిధ్యం, మాంగ్రూవ్ అడవుల్లోని జీవన విధానం వంటి వాటితో మానవాళికి గల ఉపయోగాలను వివరించారు. ప్రత్యేక అతిథిగా హాజరైన హైదారబాద్ ఓయూ ప్రొఫెసర్ మనోహరచారి, కేయూ రిటైర్డు ప్రొఫెసర్ ఎస్‌ఎంరెడ్డిలు మాట్లాడుతూ.. రెండు లక్షల మొక్కల జాతుల్లో 800 మొక్కల జాతులు మానవులకు చాలా ముఖ్యమన్నారు. 12రకాల వృక్షజాతులు మనకు కావాల్సిన ఆహారాన్ని అందిస్తున్నాయని చెప్పారు. కేడీసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజిరెడ్డి అధ్యక్షుడిగా వ్యవహరించిన సదస్సులో దేశంలోని వివిధ ప్రాంతాలనుంచి అధ్యాపకులు, పరిశోధకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు హాజరయ్యారు. సెమినార్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ కె.ఓంకార్, కన్వీనర్ డాక్టర్ బి.జయపాల్‌రెడ్డి, కన్వీనర్స్ డాక్టర్ ఎం.రాంబాబు, డాక్టర్ రమణారావు, డాక్టర్ గాంధీ, కళాశాల ఏక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ బి.రమేశ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మల్లయ్య కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, అధ్యాపకులు

డ్రంకెన్ డ్రైవ్‌లో 12మందికి జరిమానా

హనుమకొండ టౌన్, మార్చి22 : డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 12 మందిని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రమేశ్ రూ.17,500 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ షూకూర్ తెలిపారు. అదే విధంగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన 8 మందికి 6,600 జరిమానా విధించారన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపొద్దని తెలిపారు.

మెప్మా ఆధ్వర్యంలో ఓటరు అవగాహన

వరంగల్ కార్పొరేషన్, మార్చి 22: మెప్మా ఆధ్వర్యంలో స్వీప్ 2024 ఓటరు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని మెప్మా భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీఆర్‌ఓ రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. డబ్ల్యూఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు ఓటింగ్ శాతం పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఎస్‌హెచ్‌జీ బృందాలకు, ఆర్పీలను భాగస్వామ్యం చేసినట్లు తెలిపారు. అనంతరం ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో టీఎంసీ రమేశ్, సీవో శ్రీలత, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, మార్చి22 : విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మచిలీబజార్ సబ్‌స్టేషన్ పరిధిలోని రెడ్డికాలనీ, గుడిబండల్, రాయపురవాడ, రోజరీ పాఠశాల ఏరియాలో సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

సెక్టోరల్ అధికారులకు శిక్షణ శిబిరం



ఎన్నికల సూచనలు చేస్తున్న సెక్టోరియల్ అధికారులు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 22: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వర్తించే సెక్టోరల్ అధికారులకు శుక్రవారం కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో శిక్షణా శిబిరం నిర్వహించారు. పలువురు అధికారులకు అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్ సందీప్‌కుమార్ మాట్లాడారు. 106 - వరంగల్ తూర్పు నియోజక వర్గం పరిధిలో పనిచేసే సెక్టోరల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మే మాసంలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఓటర్లు అందించేందుకు ఏఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో నీడ కోసం షామియానాలు వేయించాలని సూచించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలను ముందస్తుగా గుర్తించాలని అన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల నిర్వాహణ, పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు చేయాల్సిన బాధ్యతలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగేశ్వర్‌రావు, ట్రైనర్లు కనుకయ్య, వాసు, నాగరాజు, శ్రవణ్, ఆర్‌ఐలు కీర్తన్, జలపతిరెడ్డి పాల్గొన్నారు.

మహిళా ప్రాంగణాన్ని సందర్శించిన ఆర్‌జేడీ

మడికొండ, మార్చి 22: మడికొండలోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రాన్ని శుక్రవారం స్త్రీ, శిశుసంక్షేమ శాఖ అధికారులు ఏసీడీపీవోలు, జిల్లా కోఆర్డినేటర్లు సంసిద్ధ యాప్‌పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఆర్‌జేడీ ఝాన్సీ లక్ష్మీబాయి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పోషణలోపం ఉన్న పిల్లలను గుర్తించడంలో ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం జిల్లా అధికారిణి పి. జయశ్రీ, విజయలక్ష్మి, ప్రదీప్‌కుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

అజీజ్‌ఖాన్‌కు రాష్ట్ర కార్పొరేషన్ పదవి ఇవ్వాలి

వరంగల్ స్పోర్ట్స్, మార్చి22: కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎం.డి. అజీజ్‌ఖాన్‌కు రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ కార్పొరేషన్ పదవి ఇవ్వాలని ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరబోయిన కైలాస్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తోట శ్యాంప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం హనుమకొండ జేఎన్‌ఎస్‌లోని కబడ్డీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కైలాస్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. సుదీర్ఘ కాలంగా క్రీడలతో పాటు రాజకీయాల్లో విశేష సేవలు అందించిన అజీజ్‌ఖాన్‌కు స్పోర్ట్స్ కోటాలో రాష్ట్ర కార్పొరేషన్ పదవి ఇవ్వాలని అన్నారు. మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిలు అజీజ్‌ఖాన్‌కు చైర్మన్ పదవి వచ్చేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకపోవాలని కోరారు. ఈ సమావేశంలో ఒలంపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పవన్‌కుమార్ బాధ్యులు అకుల సారంగపాణి, సాంబశివరావు, లక్ష్మణ్, సృజన్, నలుబోల సతీష్, లిల్లీ ఫోరెన్స్ రాజేందర్, రాజన్న, కబడ్డీ కోచ్ ఓనపాకల శంకర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కైలాస్‌యాదవ్

కమిషనర్‌ను కలిసిన బల్దియా ఔట్ సోర్సింగ్ డ్రైవర్లు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 22: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను ఓఎస్ జేఏసీ ఆధ్వర్యంలో ఔట్ సోర్సింగ్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు కలిశారు. కమిషనర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందించారు. ఇటీవల ఔట్‌సోర్సింగ్ నూతన డ్రైవర్ల సంఘం ఏర్పడినట్టు కమిషనర్‌కు పరిచయం చేసుకున్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో జేఏసి అధ్యక్షుడు పుల్ల రమేష్, సంఘం అధ్యక్షుడు మేకల దేవేందర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి నాగుల శ్రీకాంత్, కోశాధికారి దొడ్డిపాటి రాజేందర్, ఉపాధ్యక్షుడు కుమార్, పైడయ్య, కార్యదర్శి ఉసిల్ల ఆనందరావు, ప్రచార కార్యదర్శి పైనాల క్రాంతికుమార్, గుంజ రవిలు ఉన్నారు.

చెత్త తరలింపు ప్రక్రియలో వేగం పెంచండి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 22:నగరంలోని పలు కాలనీలలో సేకరించిన చెత్త తరలింపు ప్రక్రియలో వేగం పెంచాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. వరంగల్ నగరంలో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా నగరంలోని శుక్రవారం కరీమాబాద్, రంగశాయిపేట, జన్మభూమి జంక్షన్ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్యం, నీటి సరఫరా తీరును స్వయంగా పరిశీలించారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. నీటి వృథాను అరికట్టడానికి ఆన్‌ఆఫ్ వాల్వ్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గార్బేజ్ నిర్వాహణ ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలని అన్నారు. చెత్త నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని చెప్పారు. స్వచ్ఛ ఆటోల ద్వారా చెత్త తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, శానిటరి సూపర్‌వైజర్ సాంబయ్య, ఏఈ మెజామిల్, శానిటరి ఇన్‌స్పెక్టర్ వెంకన్న పాల్గొన్నారు.



కరీమాబాద్‌లో నీటి సరఫరాను పరిశీలిస్తున్న కమిషనర్

వైద్యులపై మెడికల్ కమిషన్‌కు ఫిర్యాదు

వరంగల్ మెడికల్, మార్చి 22: ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకుంటూ ప్రభుత్వ డాక్టర్లుగా పనిచేస్తూ ప్రయివేట్‌గా క్లినిక్‌లు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి డి.తిరుపతి, జిల్లా కార్యదర్శి డి.సాంబమూర్తి తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఎన్నికైన సభ్యులు పబ్లిక్ రిలేషన్ చైర్మన్ డాక్టర్ నరేశ్ కుమార్‌కు శుక్రవారం పోస్టు ద్వారా లేఖ పంపించారు. కాకతీయ మెడికల్ కాలేజీ ఆస్పత్రి, ఎంజీఎంలో పనిచేస్తున్న వైద్యులు సరైన సేవలు అందించడం లేదని ఆరోపించారు. కనీసం ఓపీ కూడా చూడటం లేదని, పనిచేసే సమయంలో ప్రయివేట్ క్లినిక్‌లు నిర్వహిస్తూ వైద్యం పేద ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ప్రయివేట్ క్లినిక్‌లు నిర్వహిస్తున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.



డాక్టర్ నరేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఘనంగా స్వామివారి చక్రస్నానం

ముగిసిన చైతన్యపురి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కాజీపేట టౌన్, మార్చి 22: కాజీపేట 61వ డివిజన్‌లోని చైతన్యపురి వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చక్రస్నానం వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా రుత్వికులు నిర్వహించిన ఈ వేడుకలను భక్తులు తన్మయత్వంతో తిలకించారు. ఉదయం 7 గంటలకు బాల బోగంతో ప్రారంభమైన ప్రత్యేక పూజ పూర్ణాహుతి, బలిహరణం, కళశస్నపనం అనంతరం ఆలయ ప్రాంగణంలో గల కొలనులో రుత్వికులు స్వాముల ప్రతిమలతో చక్రస్నానం కొనసాగించారు. సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం, ద్వాదశారాధనములు, దేవతో ద్వాసనం, ధ్వజారోహణం, ఆరగింపుతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులైన పంజాల అశోక్‌కుమార్, మేజర్ వడ్డెపల్లి నరేందర్, ఇతర కమి టీ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన కైంకర్యాలలో వైదిక ఆశీర్వచనం, రుత్వికులసన్మానోత్సవ కార్యక్రమాలో భక్తులు పాల్గొన్నారు.



స్వామివారి చక్రస్నాన దృశ్యం

ఎయిడ్స్ నివారణలో భాగస్వాములవ్వాలి

వరంగల్ మెడికల్, మార్చి 22: ఎయిడ్స్ నియంత్రణలో ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం తప్పనిసరి అని డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ శాఖ కార్యాలయంలో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు మా ట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్య సాధనలో భాగంగా 31వ ర్యాంక్ నుంచి 20వ ర్యాంక్‌కు చేరుకున్నామని, 10వ ర్యాంక్‌లోపు వచ్చేందుకు అందరూ కృషి చే యాల్సిన అవసరం ఉందన్నారు. అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్, ఎం జీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ మ దన్ మోహన్‌రావు, హిమబిందు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా మోసినవారికే పదవులు ఇవ్వాలి

కాజీపేట, మార్చి 22: కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన వారికే నామినేటెడ్, మేయర్, డిప్యూటీ మేయర్ పదవులు ఇవ్వాలని 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీసయ్యద్ రజాలీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021లో జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో మొత్తం డివిజన్‌లో కేవలం నలుగురు మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచారన్నారు. జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, సీఎం చొరవ తీసుకుని కాంగ్రెస్ గెలుపుకోసం ఏళ్లుగా కృషి చేసిన వారికి పదవులు ఇవ్వాలని కోరారు.

సోదరభావానికి ప్రతీక ఇఫ్తార్

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

హనుమకొండ చౌరస్తా, మార్చి 22: హిందూ, ముస్లింల సోదర భావానికి ప్రతీక ఇఫ్తార్ విందు అని వరంగల్ పశ్చిమ ఎమ్మె ల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రంజాన్ పవిత్ర మాసాన్ని పురస్కరించుకొని హనుమకొండ 8వ డివిజన్ మర్కజీ మసీదులో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌విందులో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30రోజుల పాటు ముస్లిం సోదరులు కఠినమైన ఉపవాస దీక్ష చేపట్టడం రంజాన్ మాసంలో ఆనవాయితీగా వస్తోందని అన్నారు. ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వర్సిటీలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలి



పనిచేయని ఫ్రిజ్‌ను చూపుతున్న మంద శ్రీకాంత్ తదితరులు

కేయూ క్యాంపస్, మార్చి 22: కాకతీయ యూనివర్సిటీ ప్రధాన లైబ్రరీలో 15 రోజులుగా ఫ్రిడ్జ్ పనిచే యకపో వడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా రని ఎస్ఎఫ్ఐ జిల్లా సెక్రటరీ మంద శ్రీకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం కేయూ లైబ్రరీలో తాగునీటి ఇబ్బందులను ఎస్ఎఫ్ఐ బృందం నేతృత్వంలో విద్యార్థులు తెలుసుకున్నారు. లైబ్రరీలోని ఫ్రిడ్జ్‌లను సందర్శించారు. 15 రోజులుగా ఫ్రిడ్జ్‌లు మరమ్మతులో ఉన్నాయని అన్నారు. పోటీ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు లైబ్రరీలో చదువుకుంటున్న క్రమంలో తాగునీరు లేక అల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వర్సిటీ అధికారులు స్పందించి లైబ్రరీలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్, శ్రీకాంత్, సందీప్, సాయికుమార్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

క్షయ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

వరంగల్ మెడికల్, మార్చి 22:క్షయ (టీబీ) రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సంబంధిత అధికారులు సమష్టిగా కృషి చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు సూచించారు. శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. టీబీ లక్షణాలున్న వారిని త్వరితగతిన గుర్తించి కల్లె పరీక్షలు చేయించి, పూర్తిస్థాయి చికిత్స అందించాల్సిన అవసరం ఉందన్నారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆశా డే నందు పట్టణ ఆరోగ్య పోషక ఆహార దినోత్సవం, గ్రామీణ దినోత్సవం రోజులలో టీబీ పర్యవేక్షకులు ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలను సందర్శించి క్షయ వ్యాధిపైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. క్షయ వ్యాధి నివారణ కార్యక్రమంలో ప్రశంసాపూర్వక సేవలు అందించిన వారికి సర్టిఫికెట్స్ ప్రదానం చేశారు. అనంతరం డీటీసీవో డాక్టర్ హిమబిందు వార్షిక నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ టి.మధుసూదన్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎండి.యాకూబ్‌పాష, ఎన్‌సీడీ అధికారి డాక్టర్ ఉమాశ్రీ, ప్రోగ్రాం అధికారి చైల్డ్, హెల్త్ ఇమ్యూనైజేషన్ డాక్టర్ ఇఫ్తాదర్ అహ్మద్, ఇన్‌చార్జి జిల్లా మాస్ మీడియా అధికారి ఎల్.చంద్రశేఖర్, డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, సీనియర్ టీబీ మెడికల్ ఆఫీసర్, స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు

మహిళలపై దాడిచేసిన వ్యక్తి అరెస్టు

తుపాకీ, నగదు స్వాధీనం ● హైదరాబాద్ పోలీసులకు అప్పగింత



నిందితుడిని అదుపులోకి తీసుకున్న ఆర్పీఎఫ్ పోలీసులు

కాజీపేట, మార్చి 22 : హైదరాబాద్ బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఓ ఇంట్లో ఇద్దరు దుండగులు చొరబడి మహిళలను బెదిరించి చోరీకి ప్రయత్నించగా తల్లి, కూతురు తిరగబడ్డారు. ఈ ఘటనలో ఓ దొంగ హైదరాబాద్‌లో పట్టుబడగా మరో దొంగ పారిపోయాడు. పారిపోయిన దొంగను శుక్రవారం ఉదయం కాజీపేట ఆర్పీఎఫ్ సిబ్బంది పట్టుకున్నారు. కాజీపేట ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం. సంజీవరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లో జరిగిన ఘటనను పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీని, చోరీకి యత్నించి పారిపోయిన వ్యక్తి ఫొటోలను కాజీపేట ఆర్పీఎఫ్ సిబ్బందికి పంపించారు. దీంతో అప్రమత్తమైన ఎస్సై ఐ.శ్రావణి, కానిస్టేబుల్ డి.సతీష్‌లు గురువారం రాత్రి కాజీపేట ప్లాట్‌ఫారంలో తనిఖీలు చేస్తుండగా నిందితుడు పట్టుబడ్డారు. అతడిని ఆర్పీఎఫ్ స్టేషన్‌కు తరలించి ఆరా తీయగా తప్పును ఒప్పుకున్నాడు. నిందితుడు యూపీలోని కాన్పూర్ వాస్తవ్యుడు. ఇతడు జీవనోపాధి కోసం కొన్నేళ్ల కిందట యూపీ నుంచి హైదరాబాద్‌కు వచ్చి నేరాలకు పాల్పడుతున్నాడు. ఇతడికి వివాహం కాలేదు. రూ. రెండు లక్షల వరకు అప్పులుండటంతో చోరీలకు పాల్పడుతున్నాడు. ఇతడు గతంలో కూడా హైదరాబాద్‌లో దాడికి పాల్పడ్డ అమిత్ మహోత్ ఇంట్లో క్లీనింగ్ ఇతరత్రా పనులు చేసేవాడు. ఇంట్లో అమిత్ మహోత్ భర్త లేని సమయంలో మరో వ్యక్తితో కలిసి చోరీ యత్నంలో మహిళలపై దాడికి యత్నించినట్లు ఒప్పుకున్నాడు. అతడి వద్ద నగదు రూ.3600, ఆధార్‌కార్డు స్వాధీనం చేసుకున్నామని, అతడు ఉపయోగించిన తుపాకీని హైదరాబాద్ పోలీసులు కాజీపేటకు తీసుకువచ్చి నిందితుడికి చూపించడంతో ఆ తుపాకీ తనదేనని ఒప్పుకున్నాడు. అతడి వద్ద స్వాధీనం చేసుకున్న తుపాకీ, ఆధార్‌కార్డును హైదరాబాద్ పోలీసులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



నిందితుడి వద్ద లభించిన తుపాకీ

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 23 మార్చి 2024



మేకప్

రంగుల పండగ హోలీ రోజు రంగు నీళ్లలో తడుస్తాం, రంగుల్లో మునకలేస్తాం. అయినా మేకప్ చెక్కుచెదరకుండా ఉండాలంటే అందుకు కొన్ని చిట్కాలు పాటించాలి.

హోలీ కేళీ

వాటర్‌ప్రూఫ్ కలర్స్

ఈ రోజు వాడే మేకప్ ఉత్పత్తులన్నీ వాటర్‌ప్రూఫ్ అయి ఉండేలా చూసుకోవాలి. ఫౌండేషన్, మస్కారా, ఐలైనర్, లిప్‌స్టిక్ నీరు కారిపోకుండా ఉండడం కోసం, వాటర్‌ప్రూఫ్ ప్రొడక్ట్స్ మాత్రమే ఎంచుకోవాలి.

ప్రైమర్ ఇలా...

మేకప్‌కు అనువుగా చర్మాన్ని సిద్ధం చేయడంతో పాటు చర్మ రంధ్రాలు కనిపించకుండా చేయడం కోసం మొదట ఫేస్ ప్రైమర్ అప్లై చేయాలి. అలాగే నీళ్లు చిందినా చెక్కుచెదరకుండా ఉండడం కోసం నాణ్యమైన ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. వీటిలో ఫుల్ కవరేజ్ ఫౌండేషన్లు 24 గంటల పాటు నిలిచి ఉంటాయి. అలాగే మచ్చలు, డాగులను దాచడం కోసం కాన్‌సెంట్రేటెడ్ స్పాట్ కరెక్టింగ్ కన్‌సీలర్ వాడుకోవాలి. చివర్లో సెట్టింగ్ పౌడర్‌తో మేకప్ ముగించాలి.

రంగులద్దుకోవాలి

ముఖానికి హోలీ కళ తెచ్చిపెట్టడం కోసం గులాబీ రంగు బ్లష్‌ను చెక్కిళ్ల మీద అప్లై చేసుకోవాలి. అలాగే కనురెప్పలకు అదే రంగు మ్యాట్ లేదా షిమ్మర్ ఐషాడో అప్లై చేసుకోవాలి. కనురెప్పల చివర్లలో డీప్ బ్రౌన్ లేదా నలుపు రంగు షాడో అప్లై చేయాలి. మరింత గ్లామరస్ లుక్ కావాలనుకునేవాళ్లు గోల్డ్ ఐషాడో కూడా వాడుకోవచ్చు.

పెదవుల కోసం...

హోలీ కళ తెచ్చిపెట్టేలా గులాబీ లేదా ఎరుపు షేడ్ లిప్‌స్టిక్ ఎంచుకోవాలి. అది వాటర్‌ప్రూఫ్ అయి ఉండాలి. లిప్‌స్టిక్ అప్లై చేసిన తర్వాత, అదనపు రంగును బ్లాటింగ్ పేపర్‌తో తొలగించి అవసరమనుకుంటే లిప్ గ్లాస్ అప్లై చేసుకోవచ్చు.

వంటిల్లు

వారెవ్వా స్నాక్స్

స్నాక్స్ అంటే ఎవరికైనా ఇష్టమే. సాయంకాలం పూట విభిన్నంగా చేసుకునే రుచికరమైన స్నాక్స్ కొన్ని ఉన్నాయి. అవే పోహ నగ్గెట్స్, భర్వన్ ఆలూ తిన్లాజ్, బ్రెడ్ పిజ్జా పాకెట్స్, పనీర్ గోల్డెన్ ఫ్రై. వీటిని సులువుగా చేసుకోవచ్చు ఇలా...

పోహ నగ్గెట్స్

కావాల్సిన పదార్థాలు:
పోహ- 1 కప్పు, బంగాళ దుంపలు- 2, పచ్చి మిరపకాయ- 1 (సన్నగా తరగాలి), అల్లం- 2 చిన్న ముక్కలు (సన్నగా తరగాలి), ఎండు మిరప గింజలు- అర టీస్పూన్, వామాకు పొడి- అర టీస్పూన్, పెప్పర్ పౌడర్- పావు టీస్పూన్, కొత్తిమీర- 2 టేబుల్ స్పూన్లు (సన్నగా తరగాలి), ఉప్పు- రుచికి తగినంత, మైదా- పావు కప్పు, నూనె- డీప్ ఫ్రైకి తగినంత

తయారీ విధానం:
ముందుగా బంగాళదుంపలను ఉడకబెట్టి.. వాటి తొక్క తీసి మెత్తగా చేసుకోవాలి. ఆ తర్వాత పోహను జార్‌లో వేసి మెత్తటి పిండిలా మిక్సీ పట్టాలి. ఈ పిండిలో బంగాళదుంపల మిశ్రమాన్ని వేయాలి. సన్నగా తరిగిన పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముక్కలు, వామాకు పొడి, పెప్పర్ పౌడర్, కొత్తిమీర, ఉప్పు వేసి మిశ్రమాన్ని మెత్తగా కలపాలి. చపాతీ ముద్దలా చేసుకోవాలి. ఆ తర్వాత మైదా పిండి వేయాలి. ముద్దలో మైదాపిండి బాగా కలిసేట్లు కలపాలి. ఆ తర్వాత కొంచెం కొంచెం తీసుకుని.. చిన్న లడ్డులా చేసుకోవాలి. దీన్ని చిన్నపాటి ఫింగర్స్‌లా చేసుకోవాలి. నూనెను వేడిచేసి ఈ పోహ ఫింగర్స్‌ను నూనెలో డీప్ ఫ్రై చేసుకోవాలి. సాయంత్రం పూట చేసుకుని ఈ స్నాక్స్ తినాలి. పిల్లలు బాగా ఇష్టపడతారు.



పనీర్ గోల్డెన్ ఫ్రై

కావాల్సిన పదార్థాలు:
పనీర్- 200 గ్రాములు, గరం మసాలా పౌడర్- 1 టీస్పూన్, బ్రెడ్ క్రంబ్స్- పావు కప్పు, నిమ్మరసం- 4 టీస్పూన్లు, బ్లాక్ పెప్పర్- పావు టీస్పూన్, కారం పొడి- పావు టీస్పూన్, కార్న్ ఫ్లోర్- పావు కప్పు, ధనియాలపొడి- 1 టీస్పూన్, ఉప్పు- రుచికి తగినంత, నూనె- డీప్ ఫ్రైకి సరిపడ

తయారీ విధానం:
బౌల్‌లో కార్న్ ఫ్లోర్, ఉప్పు, బ్లాక్ పెప్పర్, కారంపొడి, గరం మసాలా, ధనియాల పొడి వేసి కొద్దిగా నీళ్లు పోసి చూర్ణం చేయాలి. ఈ మిశ్రమాన్ని పక్కన ఉంచుకోవాలి. ఆ తర్వాత మరో బౌల్‌లో పనీర్ ముక్కలను కట్ చేసి వేయాలి. పనీర్ ముక్కల మీద నిమ్మరసం వేసి.. నిమ్మరసం పనీర్ ముక్కలకు అంతా తగిలేట్లు కలపాలి. పనీర్ ముక్కలను తీసుకుని కార్న్‌ఫ్లోర్‌లో ముంచి వీటిని బ్రెడ్ క్రంబ్స్‌లో వేయలి. బ్రెడ్ క్రంబ్స్ అతుక్కుపోతాయి. ప్యాన్‌లో నూనె వేసి ఈ పనీర్ క్యూబ్స్‌ను గోల్డెన్ రంగు వచ్చే వరకు వేయించాలి. వీటిని పుదీనా చట్నీతో తింటే రుచిగా ఉంటాయి.



భర్వన్ ఆలూ తిన్లాజ్



కావాల్సిన పదార్థాలు
మీడియం సైజ్ బంగాళదుంపలు- 4, పచ్చి బఠాణీలు- 60 గ్రాములు, పనీర్- 30 గ్రాములు (సన్నగా తరగాలి), తెల్ల నువ్వులు- 30 గ్రాములు, గరం మసాలా పౌడర్- 5 గ్రాములు, నెయ్యి- 30 గ్రాములు, కోవా- 100 గ్రాములు, జీడిపప్పు- 60 గ్రాములు, జీలకర్ర పొడి- 5 గ్రాములు, కారంపొడి- 5 గ్రాములు, నూనె- డీప్ ఫ్రైకి తగినంత, ఉప్పు- రుచికి తగినంత

తయారీ విధానం
ముందుగా నువ్వులను వేయించాలి. ఆ తర్వాత బంగాళదుంపల తొక్కలను పీలర్‌తో తీయాలి. బంగాళదుంపల రెండు చివర్ల కూడా కట్ చేయాలి. బంగాళదుంపలను రోల్‌లా చేసుకోవాలి. బంగాళదుంప మధ్యలో మిశ్రమాన్ని చిన్న కత్తి లేదా పీలర్‌తో బయటకు తీయాలి. లోపల్ స్టఫ్ కూరటానికి ఇలా చేసుకోవాలి. నూనె తీసుకుని మీడియమ్ ఫ్లేమ్‌లో ఈ స్కూప్డ్ బంగాళదుంపలను రంగు మారేంత వరకూ వేయించుకోవాలి. ఆ తర్వాత వీటిని పక్కన ఉంచుకోవాలి.

స్టఫ్ కోసం మొదట ప్యాన్ తీసుకుని అందులో కొద్దిగా నూనె లేదా నెయ్యిని వేయాలి. నూనె హీట్ అయ్యాక కోవా, పచ్చి బఠాణీలు, క్రష్ చేసిన జీడిపప్పు ముక్కలు, తగినంత ఉప్పు, కారం పొడి, గరం మసాలా, జీలకర్ర పొడి వేయాలి. మిశ్రమాన్ని కలుపుతూ నాలుగు నిముషాల పాటు వేయించాలి. ఈ స్టఫ్‌ను ఒక ప్లేట్‌లో ఉంచుకోవాలి. నాలుగు బంగాళదుంపల్లో స్టఫ్‌ను కూరాలి. ఆ తర్వాత వీటిని తందూరి పొయ్యిమీద పది నిముషాల పాటు వేడి చేశాక.. వీటికి కొద్దిగా నెయ్యి పట్టించి.. చివరగా వేయించిన నువ్వులలో ఈ స్టఫ్డ్ బంగాళదుంపల్ని రోల్ చేయాలి. నువ్వులన్నీ బంగాళదుంపలకు అతుక్కుంటాయి. భర్వాన్ ఆలూ తిన్లాజ్ రెడీ. బంగాదుంపల్ని రెండు ముక్కలుగా కట్ చేసి టమోటా కెచప్ లేదా పుదీనా చట్నీతో తింటే రుచిగా ఉంటుంది.

బ్రెడ్ పిజ్జా పాకెట్స్



కావాల్సిన పదార్థాలు
వెన్న- 1 టీస్పూన్, వెల్లుల్లి-1 (సన్నగా తరగాలి), పెద్ద ఉల్లిపాయ- సగం (సన్నగా తరగాలి), క్యారెట్- 1 (సన్నగా తరగాలి), స్వీట్ కార్న్- 3 టేబుల్ స్పూన్లు, క్యాప్సికం- సగం (సన్నగా తరగాలి), ఉప్పు- రుచికి తగినంత, పిజ్జా సాస్- 3 టేబుల్ స్పూన్లు, ఆలివ్ ముక్కలు- 2 (గుండ్రంగా కట్ చేసుకోవాలి), చీజ్- పావుకప్పు, బ్రెడ్ ముక్కలు- 5

తయారీ విధానం
ప్యాన్‌లో వెన్న వేసి కరిగిన తర్వాత వెల్లుల్లి ముక్కలు వేసి గరిటెతో బాగా కలపాలి. ఉల్లిపాయ ముక్కలు వేసి రంగు మారేంత వరకూ కదుపుతూ వేయించాలి. ఆ తర్వాత సన్నగా తరిగిన క్యారెట్ ముక్కలు, స్వీట్ కార్న్, క్యాప్సికం ముక్కలు వేశాక రుచికి సరిపడ ఉప్పు వేసి గరిటెతో బాగా కలపాలి. హైఫ్లేమ్‌లో కుక్ అయ్యేంత వరకూ గరిటెతో కదుపుతూ వేయించుకోవాలి. పిజ్జా సాస్ వేసి మిశ్రమంలో కలిసేట్లు కలపాలి. రెండు మూడు నిముషాలు వేగించాక స్టఫ్డ్ మిశ్రమాన్ని ఒక బౌల్‌లో వేసుకోవాలి. దీన్ని చల్లబర్చాలి. ఆ తర్వాత ఆలివ్ ముక్కలు వేశాక చీజ్ వేసి బాగా మిశ్రమాన్ని కలపాలి.

చివరగా ఐదు చతురస్రాకారం బ్రెడ్ ముక్కలను తీసుకుని వాటికి నాలుగు పక్కల ఉండే గోధుమరంగు చివరి లేయర్‌ను కట్ చేసుకోవాలి. ఇపుడు ఒక్కో బ్రెడ్ ముక్క తీసుకుని రోటీ మేకర్ కట్టెతో గట్టిగా చపాతీ చేసినట్లు అనాలి. ఇప్పుడు మధ్యలో స్టఫ్ ఉంచి దీన్ని చివర్ల కొద్దిగా నీళ్లు తగిలిస్తే చాలు రెండు వైపులా క్లోజ్ అవుతుంది. అలా అన్నీ చేసుకోవాలి. వీటన్నింటినీ డీప్ ఫ్రై చేసుకుని.. టమోటా కెచప్‌తో తినేయవచ్చు.

అన్నయ్య ఆట చూడడానికి మైదానానికి వెళితే... బౌండరీ దాటిన బంతి ఆమె చేతికి దొరికింది. దాన్ని తిరిగి మైదానంలోకి విసిరితే... స్టంప్ ఎగిరిపడింది. అదే ఆమె జీవితాన్ని అనుకోని మలుపు తిప్పింది. ఇప్పుడు ఆ అమ్మాయే ఐసీసీ మహిళల టీ20, వన్డే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-5లో నిలిచింది. ఐసీసీ టీ20 అంతర్జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న ఏకైక భారత మహిళా క్రికెటర్‌గానూ చరిత్ర సృష్టించింది. తాజాగా 'ఫోర్బ్స్' మ్యాగజైన్ 'సెల్ఫ్‌మేడ్ విమెన్-2024' జాబితాకు ఎక్కిన మేటి ఆల్‌రౌండర్... దీప్తిశర్మ జర్నీ ఇది...

సవాళ్లకు సిద్ధం

ఇటీవల ఓ మ్యాగజైన్ ఇంటర్వ్యూలో 'నీకు క్రికెట్‌లో ఇష్టమైంది ఏంటి..? బౌలింగా? బ్యాటింగా?' అని అడిగితే వెంటనే చెప్పలేకపోయింది దీప్తి భగవాన్ శర్మ. 'ఈ ప్రశ్నకు సమాధానం ఇవ్వడం చాలా కష్టం' అన్న దీప్తి.. 'బ్యాటింగ్, బౌలింగే కాదు... క్రికెట్‌లో ఫీల్డింగ్ కూడా నేను ఆస్వాదిస్తా' అంటూ చెప్పుకొచ్చింది. క్రికెట్‌ను దీప్తి ఎంతగా ప్రేమిస్తుందో... ఆమెను క్రికెట్ కూడా అంతే ఇష్టపడుతుంది. ఇది ఆటను అభిమానించేవారి మాట. ఉత్తరప్రదేశ్ ఆగ్రాలో పుట్టిన దీప్తికి తొమ్మిదేళ్లప్పుడే క్రికెట్‌పై ఆసక్తి కలిగింది. ఆమె తండ్రి భగవాన్ శర్మ భారతీయ రైల్వేలో బుకింగ్ సూపర్‌వైజర్‌గా రిటైర్ అయ్యారు. తల్లి సుశీల గృహిణి. సంతానంలో అందరికంటే దీప్తినే చిన్న. ఆమె అన్నయ్య సువిత్ శర్మ ఉత్తర ప్రదేశ్ జట్టు మాజీ పేస్ బౌలర్. అన్నను చూసే దీప్తికి ఆటపై మరింత మక్కువ పెరిగింది. తనను కూడా మైదానానికి తీసుకువెళ్లేలా అన్నను ఒప్పించమని రోజూ నాన్నను అడిగేది. అన్నయ్య మ్యాచ్‌లు, నెట్ ప్రాక్టీస్ చూడాలనేది దీప్తి కోరిక.



రాత మార్చిన త్రో...

అలా ఒక రోజు ఆగ్రాలోని 'ఏకలవ్య స్పోర్ట్స్ స్టేడియం'కు వెళ్లిన దీప్తి... దూరం నుంచి అన్నయ్య, అతని సహచర ఆటగాళ్ల నెట్ ప్రాక్టీస్ చూస్తోంది. ఇంతలో ఓ బంతి దూరాన ఉన్న ఆమె దగ్గరకు వచ్చి పడింది. ఆ బంతిని నెట్స్ వైపు వేయమని అన్నయ్యావాళ్లు అడగడంతో.. దీప్తి బలంగా విసిరింది. యాభై మీటర్లకు పైగా దూరం నుంచి ఆమె విసిరిన ఆ బంతి... నేరుగా దూసుకువచ్చి స్టంప్స్‌ను గిరాటేసింది. అంత చిన్న వయసులో దీప్తి వేసిన ఆ త్రోకు అక్కడున్నవారంతా ఆశ్చర్యపోయారు. ఆ దృశ్యం అక్కడే ఉన్న నాటి భారత మహిళా క్రికెట్ జట్టు సెలెక్టర్ హేమలత కంట్లో పడింది. ఇక దీప్తి జీవితం అనుకూని మలుపు తిరిగింది. అప్పటి నుంచి ఆమె క్రికెట్‌కు అంకితమైంది.

ఎంపిక చేయకపోయినా...

ఆరంభంలో దీప్తికి ఆమె అన్నయ్య సుమిత్‌శర్మ కోచింగ్ ఇచ్చేవాడు. తొలి రోజుల్లో దీప్తి రైట్ ఆర్మ్ మీడియమ్ పేసర్. లెఫ్ట్‌హ్యాండ్ బ్యాటర్. పదిహేనేళ్లు వచ్చేసరికి వివిధ దశల్లో ఆడి ఎంతో అనుభవం గడించింది. అయితే రాష్ట్ర స్థాయి జట్టు సెలక్షన్స్‌లో సెలక్టర్లు ఆమెను పట్టించుకునేవారు కాదు. అది నిరాశ పరిచినా... మరింత పట్టుదలతో శ్రమించింది. ఆ క్రమంలోనే ఆల్‌రౌండర్‌గా దీప్తి ప్రతిభను భారత మాజీ క్రికెటర్ రీతా డే గమనించారు. ఆమెలోని అద్భుతమైన నైపుణ్యానికి మెరుగులు అద్దాలని నిర్ణయించుకున్నారు. దీప్తికి మార్గదర్శకురాలిగా మారారు. మీడియమ్ పేసర్ అయిన దీప్తి నిదానంగా ఆఫ్ స్పిన్ బౌలర్‌గా మారింది. కానీ ఆ పరివర్తన అంత సులువుగా జరగలేదు. ఏదో కష్టంగా బంతి రిలీజ్ చేస్తున్నట్టు, అసహజంగా, లయ తప్పినట్టు ఉండేది ఆమె బౌలింగ్ యాక్షన్. దీనిపై దృష్టి పెట్టి... స్థానిక కోచ్‌లు, సెలెక్టర్ల శిక్షణ, పర్యవేక్షణలో కొద్ది కాలంలోనే స్పిన్ బౌలింగ్‌లో మాస్టర్ అయింది దీప్తి.

అదిరిపోయే ఆటతో...

పట్టు వదలని ప్రయత్నంతో రాష్ట్ర జట్టుకు ఎంపికైన దీప్తి... ఇక వెనుదిరిగి చూడలేదు. ఉత్తరప్రదేశ్ జట్టు తరుఫున అద్భుతమైన ప్రదర్శనలతో ఆల్‌రౌండర్‌గా అందరినీ ఆకట్టుకుంది. చివరకు ఆమె ఆశయం ఫలించింది. కల నెరవేరింది. భారత జట్టు నుంచి పిలుపు వచ్చింది. 2014 నవంబర్... బెంగళూరు చిన్నస్వామి స్టేడియం... దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌తో దీప్తి అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టింది. మూడేళ్లకు బెంగాల్ జట్టుకు మారింది. తరువాత భారత టెస్ట్, టీ20 మహిళా జట్లలో స్థానం సంపాదించింది. ఇప్పుడు ఆల్‌రౌండర్‌గా జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. 2017... మహిళల వన్డే ప్రపంచ కప్ సెమీఫైనల్. ప్రత్యర్థి ఆస్ట్రేలియా బౌలర్లను చెండాడిన హర్మన్‌ప్రీత్ కౌర్... 171 పరుగులతో అజేయంగా నిలిచింది. 'ఒకవేళ దీప్తిశర్మ కనుక సరైన భాగస్వామ్యం ఇవ్వకపోయి ఉన్నా... స్ట్రయిక్ రొటేట్ చేయకపోయినా హర్మన్‌ప్రీత్ ఈ ఘనత సాధించగలిగేది కాదు' అంటూ ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్, కామెంటేటర్ లిసా స్థాలేకర్ కొనియాడారు. ప్రస్తుతం ఆమె దీప్తి ప్రాతినిధ్యం వహిస్తున్న డబ్ల్యూపీఎల్ (విమెన్ ప్రీమియర్ లీగ్) 'యూపీ వారియర్జ్' జట్టుకు మెంటార్‌గా వ్యవహరిస్తున్నారు.

ఒకే ఒక్క క్రీడాకారిణి...

ఎన్నో మైలురాళ్లను అధిగమించిన 26 ఏళ్ల దీప్తి శర్మ... ప్రస్తుతం ఐసీసీ టీ20, వన్డే ర్యాంకింగ్స్‌లో టాప్-5లో కొనసాగుతోంది. టాప్5లో నిలిచిన ఏకైక భారత ఆల్‌రౌండర్‌గా రికార్డులకు ఎక్కింది. అలాగే ఈ ఏడాది ఐసీసీ టీ20 అంతర్జాతీయ జట్టులో స్థానం దక్కించుకున్న ఏకైక భారత మహిళా క్రికెటర్‌గా చరిత్ర సృష్టించింది. తాజాగా ప్రముఖ మ్యాగజైన్ 'ఫోర్బ్స్ ఇండియా' ప్రకటించిన 'సెల్ఫ్‌మేడ్ విమెన్' జాబితాలోనూ చోటు సంపాదించిన దీప్తి... రేపటి తరం క్రికెటర్లకు స్ఫూర్తి మంత్రమయింది. అంతేకాదు... ఇటీవల ముగిసిన డబ్ల్యూపీఎల్‌లో హ్యాట్రిక్ సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా మరో అరుదైన రికార్డు సాధించింది. 'సవాళ్లంటే ఎంతో ఇష్టం. అంచనాలను ఒత్తిడిగా భావించను' అంటున్న దీప్తి... తన సీనియర్ క్రికెటర్లు ఝులన్ గోస్వామి, మిథాలీరాజ్‌లా యువ క్రీడాకారులకు మార్గదర్శిగా నిలవాలని కోరుకొంటోంది.



విన్నర్

సెంచరీనా... ఐదు వికెట్లా..!

జనవరిలో ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ సందర్భంగా దీప్తిశర్మ పొట్టి ఫార్మాట్‌లో 1000 పరుగులు, 100 వికెట్లు పూర్తి చేసుకుంది. ఈ ఘనత సాధించిన ఏకైక భారత మహిళా ఆల్‌రౌండర్‌గా నిలిచింది. భారత మహిళా క్రికెట్ జట్టుకు వెన్నెముకగా మారిన దీప్తిని 'సెంచరీ కొట్టడమా..? ఐదు వికెట్లు తీయడమా? దేనికి నీ ఓటు' అని అడిగితే... ఆమె సెంచరీనే ఎంచుకుంది. 'ఎందుకంటే... బాగా పరుగులు చేస్తే బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపిస్తారనే ఆలోచన. దానివల్ల క్రీజ్‌లో కుదురుకోవడానికి ఎక్కువ సమయం దొరుకుతుంది. జట్టు కోసం మరిన్ని పరుగులు చేసే అవకాశం లభిస్తుంది. అందుకే ప్రస్తుతం నాకు సెంచరీనే ముఖ్యం. అలాగని ఒక మ్యాచ్‌లో ఐదు వికెట్లు తీయడం తక్కువని కాదు' అంటూ చెప్పుకొచ్చింది దీప్తి. 'నెట్స్‌లో బ్యాటింగ్ చేసేటప్పుడు ఒక బంతికి మూడు రకాల షాట్లకు సన్నద్ధమై ఉంటాను. పవర్‌ప్లే, మిడిల్ ఓవర్స్, డెత్ ఓవర్స్... జట్టు అవసరానికి తగినట్టు ఏ సమయంలోనైనా బౌలింగ్ వేయగలిగేలా సిద్ధం అవుతా' అంటున్న దీప్తికి క్రికెట్ అంటే ఆట మాత్రమే కాదు... జీవితం కూడా.

నవ్య 'స్పోర్ట్స్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/6yu6qnv లో చదవండి.

ఉసిరికాయతో కొత్త రకం ఊరగాయ

స్నిగ్ధం ధాత్రీఫలం యజ్జ్వలదనల శిఖాసన్నిభం
స్నిగ్ధపాత్రే క్షిప్తం ప్రభృష్ట హింగుకణ రజనిరజస్తైల సింధుత్యై!
సంలిప్తం జాతపాకం కతిపయదివ సౌరాల్ల నతైలభాడ్యం
తస్య స్వాదానువాదం కథితుమపి వరో నేశ్వరః కస్తదన్యః!

ఉసిరి కాయ అగ్నిశిఖతో సమానమైనది. జీర్ణశక్తిని కాపాడే బలకరమైన ఔషధం. దీన్ని 'ధాత్రీ, ఆమలకి'.. ఇలా పిలుస్తారు. 'ధాత్రి' అంటే భూమి, ఆదిశక్తి, అని కూడా! 'ఎంబ్లిక్ మైరోబలన్' అంటారు ఈ మొక్కని. ఇంగ్లీషువాళ్లు 'ఇండియన్ గూస్‌బెర్రీ' అంటారు. తల్లితో సమానమైనది కాబట్టి దీన్ని 'ధాత్రి' అన్నారు. దాదాపు అన్ని వ్యాధుల్లోనూ ఉసిరికాయ ప్రయోగం ఉంది.

ఉసిరికాయతో తొక్కు పచ్చడి (నల్లపచ్చడి), ఆవకాయ మాదిరిగా ఊరగాయ పచ్చడి... ఇలా రెండు రకాలుగా మనం నిల్వ పచ్చళ్లు పెడుతుంటాం. మామూలుగా అయితే గోంగూర తొక్కు, చింతకాయ తొక్కులాగా ఉసిరికాయని కూడా దంచి, లోపలి గింజలు ఏరేసి నిల్వ పచ్చడి లేదా తొక్కుపచ్చడి పెడుతుంటారు. ఇలా తొక్కినందువలన ఉసిరికాయ పులుస్తుంది. అతిగా పులుపు వలన ఈ ఉసిరికాయ తొక్కుపచ్చడి కొంతవరకూ ఎసిడిటీ పెరగటానికి కారణం అవుతుంది.

> **హంతిపిత్తంతు మాధుర్యాత్,**
> **కఫం తిక్తకషాయాత్!**
> **వాయుమమ్ల ప్రభావత్వద్ధాత్రీ దోషత్రయాపః!**
> **ఇందులో తీపి, పులుపు, వగరు మూడు రుచులూ ఉన్నాయి. తీపి రుచివల్ల పైత్యాన్ని హరిస్తుంది. వగరు, చేదులవల్ల కఫాన్ని పూర్తిగా హరిస్తుంది. ఉసిరి కాయలోని పులుపునకు వాతాన్ని హరించే గుణం ఉంది. ఈ విధంగా వాతం, వేడి, కఫంతో కూడిన అన్ని వ్యాధులనూ హరించే దివ్యౌషధం ఇది.**

ఉసిరి కాయల్ని నూనె వేసి మగ్గబెట్టి, అవి చల్లారాక ఉప్పు, కారం, ఆవపిండి కలిపి, తగినంత నూనె పోసి ఉసిరి ఆవకాయ పెడుతుంటారు. ఈ పద్ధతిలో ఉసిరి కాయను ఉడికించటంవల్ల ప్రధానమైన సి-విటమిన్ అందులోంచి ఎగిరిపోతుంది. కాబట్టి, ఉసిరి ఆవకాయ మనం ఆశించిన ప్రయోజనాన్ని పెద్దగా ఇవ్వదు.

ఉసిరి కాయ విషయంలో మనం అనుసరించే ఈ రెండు విధానాలూ అంతగా ఆరోగ్యదాయకమైనవి కాదు. క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో ఉసిరికాయ నిల్వ పచ్చడిని ఆరోగ్యదాయకంగా ఎలా పెట్టుకోవాలో వివరంగా పేర్కొన్నాడు.

- బాగా కండ ఉన్న నాణ్యమైన ఉసిరికాయల్ని కడిగి, పొడి బట్టతో తుడిచి, కొద్దిసేపు గాలికి ఆరనివ్వండి.
- పింగాణీ జాడీ తీసుకొని దాని లోపల నూనె పట్టించి, ఆరిన ఉసిరి కాయల్ని అందులో వేయండి.
- ఈ ఉసిరికాయల మీద తగినంత పసుపు, ఇంగువ పొడి, ముక్కలన్నీ మునిగేలాగా నువ్వుల నూనె, చాలినంత సైంధవ లవణం, శొంఠి పిప్పళ్లు, మిరియాల పొడి... వీటన్నిటినీ కలపండి. కాయలన్నిటినీ కిందవి పైకి, పైవి కిందకీ వచ్చే లాగా కలియబెట్టి, మూతబెట్టి ఒక శుభ్రమైన తెల్లని వస్త్రాన్ని మూతికి వాసెన కట్టి ఓ మూల భద్రపరచండి.
- రెండు నెలలపాటు ఈ సంగతే మరిచిపోయేలా ఆ జాడీని అలా వదిలేయండి. కొన్నాళ్లు కదల్చకుండా ఉంటే, ఉసిరి కాయలు మెత్తబడి ఊరతాయి. తోడుగా శొంఠి, పిప్పళ్లు, మిరియాల పొడి, పసుపు కూడా కలిసి, చక్కని గ్రేవీ మధ్య ఈ కాయలు తేలుతూ ఉంటాయి. దీని రుచిని శివుడు కూడా వర్ణించలేడంటాడు క్షేమశర్మ.



ఉసిరికాయలకు సమానమైన తూకంలో పసుపు కలపటంవల్ల ఈ ఊరుగాయ షుగరు మీద అద్భుతంగా పని చేసే ఔషధంగా మారుతుంది.

పసుపును 'నిశ' అని, ఉసిరికాయను 'ఆమలకి' అనీ పిలుస్తారు. 'నిశా, ఆమలకీ'ల కలయిక షుగరు వ్యాధిలో వచ్చే ఉపద్రవాల్ని నివారిస్తుంది. 'నిశామలకీ' చూర్ణం పేరుతో ఒక ఔషధం కూడా ఆయుర్వేద మందులషాపుల్లో దొరుకుతుంది.

ఈ పద్ధతిలో తయారైన ఉసిరి ఊరగాయని రోజుకొక కాయ చొప్పున ఇంటిల్లిపాదీ తినేందుకు వీలుగా కాయల్ని లెక్కబెట్టి ఈ ఊరుగాయని పెట్టుకోండి. ఇందులో సి-విటమిన్ సహా అన్ని పోషకాలూ బాగా వృద్ధిపొంది ఉంటాయి. దీన్ని ముందుగానే దంచటం లాంటివి చేయటంలేదు కాబట్టి అతిగా పులవదు. ఆరోగ్యదాయకం, గుణాత్మకం, పోషకం. ఊరగాయల్ని ఎవరైనా పెట్టుకునేది దేనికంటే... అన్ సీజన్లో కూడా తినటానికి అనువుగా ఉంటాయని. ఉసిరి కాయని ఏడాదంతా తినాలంటే ఈ చెప్పిన పద్ధతిలో ఊరగాయని పెట్టుకోండి. ఇది చాలా కాలం నిల్వ ఉంటుంది. ఇందులో మిరపకారమూ, ఆవపిండి, మెంతి పిండీ లాంటివి ఉండవు. కారానికి శొంఠి, పిప్పళ్లు, మిరియాలే ఆరోగ్యదాయకం.

• గంగరాజు అరుణాదేవి



ట్రాక్ రికార్డు కాదు టాలెంట్ ముఖ్యం అంటున్నారు మన హీరోలు. అందుకే ఒకట్రెండు సినిమాల అనుభవం ఉన్న దర్శకులకు సైతం అవకాశాల తివాచీ పరుస్తున్నారు. అరంగేట్రంతోనే అదరగొట్టిన దర్శకులకే కాదు, కమర్షియల్ సక్సెస్‌ను రుచి చూడని దర్శకులను సైతం మన హీరోలు ప్రోత్సహిస్తున్నారు. కొందరు సీనియర్లను కూడా పక్కనపెట్టి యువ దర్శకులతోనే సినిమాలు చేస్తుంటే, మరికొందరు పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లను సైతం కుర్ర దర్శకుల చేతుల్లో పెడుతున్నారు.

యువ దర్శకులకే హీరోల ఓటు


సోషియో ఫాంటసీ డ్రామాగా తెరకెక్కుతోన్న 'విశ్వంభర' చిత్రంపై భారీ అంచనాలకు కారణం చిరంజీవి నటిస్తుండడమే అని చెప్పాల్సిన పనిలేదు. చిరంజీవిని డైరెక్ట్ చేయాలనేది ఎంతో మంది స్టార్ డైరెక్టర్ల కల. ఆయనకు కథ వినిపించి ఓకే చేయించుకునేందుకు పలువురు అగ్ర దర్శకులు ఎదురుచూస్తుంటారు. అలాంటిది రెండో చిత్రానికే చిరంజీవిని డైరెక్ట్ చేసే అవకాశం వశిష్ఠకు రావటానికి కారణం అతని ప్రతిభే! తక్కువ బడ్జెట్‌లో తెరకెక్కిన 'బింబిసార' చిత్రం ఘన విజయం అందుకోవడంతో దర్శకుడిగా వశిష్ఠ పేరు ఇండస్ట్రీలో మార్మోగింది. హిట్ కోసం ఎదురుచూస్తున్న కల్యాణ్‌రామ్ కెరీర్‌ను ఈ చిత్రం మేలి మలుపు తిప్పింది. ఆ సినిమా సక్సెస్ వశిష్ఠకు ఈ అరుదైన అవకాశాన్ని అందించింది. 18 ఏళ్ల తర్వాత చిరంజీవి, త్రిష జత కడుతున్నారు. వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్నారు. 2025 సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

నాన్న బాటలో

రామ్‌చరణ్ సైతం తండ్రి బాటలోనే నడుస్తున్నారు. దర్శకుడిగా కేవలం ఒక్క సినిమా అనుభవమున్న బుచ్చిబాబు సానాకు 'ఆర్‌సీ 16' (వర్కింగ్ టైటిల్)తో అవకాశమిచ్చారు. వైష్ణవ్‌తేజ్ నటించిన 'ఉప్పెన' చిత్రంతో దర్శకుడిగా ఆయన ఇండస్ట్రీ హిట్ ఇచ్చారు. ఇటీవలే చరణ్, బుచ్చిబాబు చిత్రం సెట్స్‌పైకి వెళ్లింది. జాన్వీ కపూర్ కథానాయిక.

ఒకరిద్దరు కాదు...

ఒకరిద్దరు కాదు ఏకంగా ముగ్గురు యువ దర్శకులకు అవకాశమిచ్చారు శర్వానంద్. రామ అబ్బరాజు, శ్రీరామ్ ఆదిత్య, అభిలాష్ కంకరతో సినిమాలు పట్టాలెక్కించారు. తన మలి చిత్రంతోనే శర్వానంద్‌ను డైరెక్ట్ చేసే అవకాశం దక్కించుకున్నారు రామ్ అబ్బరాజు. కొన్నాళ్లుగా ఫ్లాప్‌లతో సతమతమవుతున్న శ్రీవిష్ణుకు 'సామజవరగమన' రూపంలో ఘన విజయం అందించి ఆయన పరిశ్రమ దృష్టిని ఆకర్షించారు. శర్వా, కృతీశెట్టి జంటగా నటిస్తున్న 'మనమే' చిత్రానికి శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు. లండన్ నేపథ్యంలో సాగ ఈ తరం యువతీ యువకుల ప్రేమకథ నేపథ్యంలో రూపొందుతోంది. గతంలో శ్రీరామ్ చేసిన సినిమాల్లో భారీ హిట్లు లేవు. కానీ అతని టాలెంట్‌ను గుర్తించి శర్వానంద్ అవకాశం ఇచ్చారు. టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. 'లూజర్' వెబ్‌సిరీస్‌తో గుర్తింపు తెచ్చుకున్న అభిలాష్ కంకరతో శర్వా మరో చిత్రం చేస్తున్నారు. బైక్ రేసింగ్ కాన్సెప్ట్ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. శర్వాకు 'రన్‌రాజారన్, మహానుభావుడు' లాంటి హిట్లు ఇచ్చిన యూవీ క్రియేషన్స్‌లో ఈ చిత్రం రూపొందుతోంది. వంశీ-ప్రమోద్ నిర్మిస్తున్నారు. మాళవికా నాయర్ కథానాయిక.









ఏరీ కోరి యువజోడీ

డీజే టిల్లు చిత్రంతో హీరోగా స్టార్ స్టేటస్‌ను సొంతం చేసుకున్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఇప్పుడు ఆయనతో సినిమాలు చేసేందుకు పలువురు సీనియర్ దర్శకులు తహతహలాడుతున్నారు. ఆయన మాత్రం తన క్రేజీ ప్రాజెక్ట్ 'టిల్లూ స్క్వేర్'ను అంతగా ఫేమస్ కానీ యువ దర్శకుడి చేతుల్లో పెట్టి వెన్ను తట్టారు. గతంలో 'నరుడా డోనరుడా', 'అద్భుతం' అనే చిత్రాలను తెరకెక్కించిన మల్లిక్‌రామ్ దీనికి దర్శకుడు. ఆ చిత్రాలు అంతగా ప్రేక్షకాదరణకు నోచుకోలేదు. అయినా మల్లిక్‌రామ్ గురించి తెలిసిన సిద్ధు అతనితో ఓ సినిమా చేయాలనుకున్నారు కానీ కుదరలేదు. ఇప్పుడు ఈ చిత్రం చేసే అవకాశం ఆయనకు దక్కింది. ఈ నెల 29న 'టిల్లూ స్క్వేర్' చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. తన మరో చిత్రానికి సైతం సిద్ధు జొన్నలగడ్డ కొత్త డైరెక్టర్‌తో పని చేస్తున్నారు. ఆయన నటిస్తున్న 'తెలుసు కదా' అనే చిత్రంతో కాస్ట్యూమ్ డిజైనర్ నీరజ్ కోన దర్శకురాలిగా పరిచయం అవుతున్నారు.

పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లోకి

'కార్తికేయ 2' చిత్రంతో పాన్ ఇండియా స్టార్‌గా నిలదొక్కుకున్నారు నిఖిల్ సిద్ధార్థ. ఆయనతో సినిమాలు చేసేందుకు అగ్ర దర్శకులు ఉత్సాహం చూపిస్తున్నారు. నిఖిల్ మాత్రం ఏరీ కోరీ కొత్త దర్శకులకు అవకాశం ఇస్తున్నారు. ఆయన తన గత చిత్రం 'స్పై'తో ఎడిటర్ గ్యారీ బీహెచ్‌ను దర్శకుడిగా పరిచయం చేశారు. ఈసారీ కొత్త దర్శకుడినే తన సినిమా కోసం రంగంలోకి దించారాయన. నిఖిల్ నటిస్తున్న 'స్వయంభూ' చిత్రానికి భరత్ కృష్ణమాచారిని దర్శకుడిగా తీసుకున్నారు. తమిళ దర్శకుడు మిస్కిన్ వద్ద సహాయకుడిగా పనిచేసిన భరత్ తొలి చిత్రంతోనే నిఖిల్ లాంటి స్టార్‌ను డైరెక్ట్ చేసే అవకాశం అందుకున్నారు. ప్రచార చిత్రాలతోనే తన సినిమాపై పాన్ ఇండియా స్థాయిలో అంచనాలు పెంచిన తీరుతో నిఖిల్ ఖాతాలో మరో భారీ హిట్ ఖాయం అంటున్నారు పరిశ్రమ జనాలు.

సాహో జంట

మలి చిత్రం 'సాహో' తోనే పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌ను డైరెక్ట్ చేశారు సుజిత్. ఆ సినిమా అభిమానుల అంచనాలు అందుకోలేకపోయింది. అయినా సుజిత్ టేకింగ్ మన అగ్రహీరోలను మెప్పించింది. పవన్ కల్యాణ్‌తో 'ఓజీ' అవకాశం అందిపుచ్చుకున్నారు. ఈ సినిమా ప్రచార చిత్రాలతోనే తనమార్క్ చూపించారు సుజిత్. ఆ చిత్రం సెట్స్‌పైన ఉండగానే నానితో మరో సినిమా (నాని 32)ను ఆయన ఓకే చేయించుకున్నారు. నాని నటిస్తున్న 'సరిపోదా శనివారం' చిత్రాన్ని నిర్మిస్తున్న డీవీవీ ఎంటర్టైన్మెంట్స్‌లోనే 'నాని 32' సైతం రూపుదిద్దుకోనుంది.



యువతకే మేజర్

మేజర్ చిత్రంతో ఉత్తరాదినా విజయ పతాక ఎగురవేశారు అడివి శేష్. ప్రస్తుతం తను నటిస్తున్న రెండు చిత్రాలను యువ దర్శకుల చేతిలో పెట్టారు. 'గూఢచారి 2' చిత్రీకరణలో ఉంది. పాన్ ఇండియా లెవల్లో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ చిత్రానికి వినయ్ కుమార్ సిరిగినీడును శేష్ దర్శకుడిగా ఎంచుకున్నారు. డైరెక్టర్‌గా ఆయనకు ఇదే తొలి చిత్రం. శేష్ నటించిన 'మేజర్' చిత్రానికి ఆయన ఎడిటర్‌గా పనిచేశారు. ఆ సమయంలో వినయ్‌లోని టాలెంట్‌ను పసిగట్టిన శేష్ 'గూఢచారి 2' లాంటి భారీ ప్రాజెక్ట్‌ను ఆయన చేతుల్లో పెట్టారు. అడివి శేష్ హీరోగా నటిస్తున్న మరో భారీ ప్రాజెక్ట్ 'డెకాయిట్'తో కెమెరామ్యాన్ షానీ డియోల్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆయనే కథను అందిస్తున్నారు. శ్రుతీహాసన్ కథానాయిక. మాజీ ప్రేమికుల జంట మధ్య శత్రుత్వం నేపథ్యంలో కథ సాగుతుందని యూనిట్ తెలిపింది.

'సెహరి' అనే చిన్న చిత్రంతో ఇండస్ట్రీకి దర్శకుడిగా పరిచయమయ్యారు జ్ఞానసాగర్ ద్వారక. ఆ సినిమాకు మంచి టాక్ వచ్చినా కమర్షియల్ సక్సెస్ రాలేదు. అయితే సుధీర్‌బాబు అతని ప్రయత్నాన్ని మెచ్చి అవకాశం ఇచ్చారు. వారి కలయికలో 'హరోం హర' చిత్రం వస్తోంది. 1980ల నాటి కుప్పం నేపథ్యంలో సాగే ఆసక్తికర కథాంశంతో ఈ చిత్రం తెరకెక్కుతోంది.

• తొలి చిత్రం 'దసరా'తోనే దర్శకుడిగా భారీ కమర్షియల్ విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు శ్రీకాంత్ ఓదెల. ఆ తర్వాత ఆయన ప్రభాస్, ఎన్టీఆర్‌తో సినిమా చేయబోతున్నట్లు వార్తలు వచ్చాయి. శ్రీకాంత్ వాటిపై స్పష్టత ఇస్తూ తన రెండో చిత్రం కూడా నానితోనే చేయబోతున్నట్లు చెప్పారు.

మరిన్ని యువ కెరటాలు

పలువురు మీడియం రేంజ్ హీరోలు సైతం కొత్త దర్శకులతో సినిమాలు చేస్తున్నారు. నితిన్‌తో 'ఛల్ మోహన్ రంగ', నారా రోహిత్‌తో 'రౌడీ ఫెలో' చిత్రాలను తెరకెక్కించారు కృష్ణచైతన్య. ఆ రెండు చిత్రాలు నిరాశపరిచినా రెట్టించిన ఉత్సాహంతో విష్వక్సేన్ హీరోగా నటిస్తున్న 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రానికి దర్శకత్వం చేసే అవకాశం అందిపుచ్చుకున్నాడు. అల్లరి నరేశ్, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న 'ఆ ఒక్కటీ అడక్కు' చిత్రానికి మల్లి అంకం దర్శకత్వ వహిస్తున్నారు. సుకుమార్ శిష్యుడు అర్జున్ సుహాస్‌తో సినిమా ఓకే చేయించుకున్నాడు. వారి కలయికలో 'ప్రసన్నవదనం' చిత్రం రూపొందుతోంది.

మళ్లీ గోవా వెళ్లిన
దేవర

జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ యాక్షన్ డ్రామా 'దేవర పార్ట్ 1. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన భారీ షెడ్యూల్ ఇటీవల గోవాలో జరిగింది. తాజా షెడ్యూల్ కూడా గోవాలో మొదలైంది. నృత్య దర్శకుడు రాజు సుందరం సారథ్యంలో ఓ మాంటేజ్ సాంగ్‌ను అక్కడ చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా వర్కింగ్ స్టిల్స్ మీడియాకు విడుదల



చేశారు. ఇందులో ఎన్టీఆర్ సరికొత్త లుక్‌తో కనిపించారు. ఓ కొత్త తరహా పాత్రలో ఆయన్ని చూడడానికి అభిమానులు, ప్రేక్షకులు ఆశగా ఎదురు చూస్తున్నారు. బాలీవుడ్ స్టార్ సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రం రెండు భాగాలుగా రూపొందుతోంది. తొలి భాగాన్ని విజయదశమి సందర్భంగా అక్టోబర్ 10న విడుదల చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన 'దేవర' గ్లింప్స్ సెన్సేషన్ క్రియేట్ చేసిందనీ, ఇండియన్ సినిమాలోనే ఎక్కువ మంది చూసిన గ్లింప్స్‌గా సరికొత్త రికార్డ్ సృష్టించిందని నిర్మాతలు మిక్కిలినేని సుధాకర్, కె.హరికృష్ణ చెప్పారు. నందమూరి కల్యాణ్‌రామ్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.



రస్టిక్ లవ్‌స్టోరీ.. షూట్ డైరీస్

నాగచైతన్య సాయిపల్లవి జంటగా రూపొందుతున్న 'తండేల్ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంతో జరుగుతోంది. దేశభక్తి అంశాలు కలిగిన ఈ రస్టిక్ లవ్‌స్టోరీని చందు మొండేటి రూపొందిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. 'తండేల్' సెట్స్‌లో నాగచైతన్య, అల్లు అరవింద్, సాయిపల్లవి, చందు మొండేటి, నిర్మాత బన్నీ వాసు ఉన్న వర్కింగ్ స్టిల్స్‌ను షూట్ డైరీస్ పేరుతో విడుదల చేశారు. నాగచైతన్య, సాయిపల్లవి ఇద్దరూ పాత్రలకు తగినట్లుగా డీ గ్లామరెస్‌గా కనిపిస్తున్నారు. ఒక ప్రామాణికంగా ఈ కథను చెప్పాలని దర్శకుడు చందు నటీనటుల గెటప్స్, కాస్ట్యూమ్స్, యాస విషయాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తండేల్ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ సంగీత దర్శకుడు.

ఈ సినిమా కోసం బరువు పెరిగి, 31 కిలోలు తగ్గా



మలయాళ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన 'ది గోట్ లైఫ్' చిత్రం ఈ నెల 28న విడుదలవుతోంది. మలయాళ, తమిళ, హిందీ భాషల్లో రిలీజ్ అవుతున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ తెలుగులో ప్రేక్షకులకు అందిస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో హీరో పృథ్వీరాజ్ మాట్లాడుతూ ' తొంభైవ దశకంలో జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి నజీబ్ అనే వ్యక్తి తన ప్రయాణంలో ఎదుర్కొన్న కష్టాలను వివరిస్తూ ఓ పుస్తకం రాశారు. 2008లో వచ్చిన ఆ పుస్తకం ఎంతో పాపులర్ అయింది. మలయాళ చిత్ర పరిశ్రమలో చాలా మంది ఆ నవల హక్కులు కొనాలని ప్రయత్నించారు కానీ మా దర్శకుడు బ్లెస్సీ సాధించారు. ఇందులో నజీబ్‌గా నేను నటించా. 2009లో ఈ సినిమా అనుకున్నాం. కానీ భారీ బడ్జెట్ అవసరం కావడంతో వెనుకంజ వేశాం. ప్రాంతీయ సినిమాల మార్కెట్ పరిధి పెరగడంతో పదేళ్ల తర్వాత 2018లో షూటింగ్ ప్రారంభించాం. ఈ చిత్రం కోసం నేను మొదట బరువు పెరిగి ఆ తర్వాత 31 కిలోలు తగ్గా. ఏడాదిన్నర పాటు అల్జీరియాలోని టిము హౌస్ అనే ప్రాంతంలో షూటింగ్ చేశాం. సహార ఎడారి మధ్యలో ఉంటుందా లొకేషన్. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా సినిమా తీశాం. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా ఏడాదిన్నర పాటు జరిగాయి' అని వివరించారు. 'ఈ సినిమాను మొదట రాజస్థాన్ ఎడారిలో తీయాలనుకున్నాం. అయితే డీప్ డిజర్ట్ దొరకలేదు. అందుకే విదేశాలకు వెళ్లి షూటింగ్ చేశాం. ఏడారిలోనే 150 రోజులు షూట్ చేశాం. బడ్జెట్ పెరిగినా మేం అనుకున్న ఫీల్ తీసుకురాగలిగాం' అన్నారు దర్శకుడు బ్లెస్సీ. సమావేశంలో పాల్గొన్న హాలీవుడ్ నటుడు జిమ్మీ జీన్ లూయిస్ తను నటించిన తొలి భారతీయ చిత్రమిదని చెప్పారు. నజీబ్‌కు సాయం చేసే కీలక పాత్ర తనదని తెలిపారు. ఇలాంటి అద్భుత చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నందుకు గర్వంగా ఉందని నిర్మాత వై రవిశంకర్ చెప్పారు.

కష్టపడే వాళ్లే ఫ్యామిలీ స్టార్లు



దిల్ రాజు

తమ కుటుంబాలను పైకి తీసుకొచ్చేందుకు కష్టపడేవాళ్లందరూ ఫ్యామిలీ స్టార్లే అని నిర్మాత దిల్ రాజు అన్నారు. శుక్రవారం తెలుగు సినీ జర్నలిస్టుల సంఘం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'మా సినిమాకు 'ఫ్యామిలీస్టార్' అని డిఫరెంట్ టైటిల్ పెట్టినప్పుడు చాలా మంది ఏమనుకున్నారంటే, 'విజయ్ దేవరకొండను స్టార్‌గా చూపించడానికే ఇలాంటి టైటిల్ పెట్టారు' అని అనుకున్నారు. ఈ టైటిల్ పెట్టడానికి ఓ కారణం ఉంది. మీరంతా మీ కుటుంబాలను వృద్ధిలోకి తెచ్చేందుకు కష్టపడుతున్నారు. అలాంటి వాళ్లందరూ ఫ్యామిలీ స్టార్లే అని చెప్పడమే మా ఆలోచన. నాలాంటి వాళ్లం సినీ రంగంలోకి వచ్చి ప్రయోజకులమై మా కుటుంబానికి సంఘంలో ఒక గౌరవం కల్పించాం. అందుకే మాలాంటి వాళ్లు, మీలాంటి వాళ్లందరూ ఫ్యామిలీ స్టార్లే. అదే మా ఫ్యామిలీ స్టార్ టైటిల్ కథ. అంతేగానీ విజయ్ దేవరకొండను స్టార్‌గా చూపించడానికి ఈ సినిమా చేయలేదు. దిల్ రాజు బ్రాండ్‌తో వచ్చే ఒక కుటుంబ కథా చిత్రం అంటే చాలా గొప్పగా ఉంటుంది. ఆ పేరు నిలబెడుతుంది. మీ అందరిలోనూ ఫ్యామిలీ స్టార్లు ఉన్నారు అని చెప్పడానికే ఈ సినిమా తీశాం' అని తెలిపారు. విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి పరశురామ్ పెట్ల దర్శకుడు. ఏప్రిల్ 5న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.






పార్టీ కాదు పెద్ద బాధ్యత

'ఇప్పటిదాకా నా జీవితంలో శని, ఆది వారాలు రిలాక్స్ అవ్వడం అనేది లేదు. ఏదో ఒక సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండేదాన్ని. ఆ రోజున ఫ్రెండ్స్ కలుద్దామని అడిగినా వీలు కాదని చెప్పేదాన్ని. ఇక నుంచి వారాంతంలో రిలాక్స్ అవ్వడం గురించి ఆలోచిస్తున్నాను' అని అన్నారు తమన్నా. నటుడు విజయ్ వర్మతో ఆమె ప్రేమలో ఉన్న విషయం తెలిసిందే. త్వరలోనే వారిద్దరూ పెళ్లి పీటలెక్కబోతున్నారు. ఈనేపథ్యంలో తన జీవితంలో సరికొత్త మార్పుకు శ్రీకారం చుడుతున్నట్లు తమన్నా తెలిపారు. 'పెళ్లంటే పార్టీ కాదు. అది చాలా పెద్ద బాధ్యత. జీవితం పూర్తి భిన్నంగా ఉంటుంది. షూటింగ్ పూర్తి చేసుకొని సాయంత్రానికల్లా ఇంటికి చేరి పిల్లలతో గడపాలి. ఎందుకంటే అదే భూమ్మీద మనం సంతోషంగా ఉండే ప్లేస్. ఇదంతా తలుచుకున్నప్పుడల్లా ఎంతో ఉద్విగ్నంగా అనిపిస్తుంది' అని తమన్నా అన్నారు.

డబుల్ ధమాకా



సిద్ధు జొన్నలగడ్డ నటించిన 'డీజే టిల్లు' చిత్రం యూత్‌ను బాగా అలరించింది, ఇప్పుడు దానికి సీక్వెల్‌గా వస్తున్న 'టిల్లు స్క్వేర్' చిత్రం అన్ని కార్యక్రమాలూ పూర్తి చేసుకుంది. సెన్సార్ ఫార్మలిటీస్ కూడా అవడంతో ఈ నెల 29న విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు ప్రకటించారు. 'డీజే టిల్లు' చిత్రం కంటే రెట్టింపు వినోదం ఈ సినిమా అందిస్తుందనీ, ముఖ్యంగా టిల్లు పాత్ర, అతను పలికే సంభాషణలు అలరిస్తాయని దర్శకనిర్మాతలు చెప్పారు. టిల్లు డబుల్ ధమాకా ను చిత్రంలో చూడవచ్చని అన్నారు. ఈ సినిమాలో లిల్లీ పేరు కలిగిన బోల్డ్ క్యారెక్టర్‌ను అనుపమ తన కెరీర్‌లోనే తొలిసారిగా పోషించిందని చెప్పారు. లిల్లీతో టిల్లు ప్రయాణం కూడా విభిన్నంగా ఉంటుందని అన్నారు. సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకుడు.

సూపర్ బోణీ

బెంగళూరుపై చెన్నై విజయం

ముస్తాఫిజుర్‌కు నాలుగు వికెట్లు ● రాణించిన రచిన్


రచిన్ రవీంద్ర (15 బంతుల్లో 37)

1 టీ20ల్లో 12 వేలకు పైగా పరుగులు చేసిన తొలి భారత ఆటగాడిగా విరాట్. అలాగే తక్కువ ఇన్నింగ్స్ (360)లో ఈ ఫీట్ సాధించిన రెండో బ్యాటర్. గేల్ (345) ముందున్నాడు.

స్కోరుబోర్డు

బెంగళూరు: కోహ్లీ (సి) రచిన్ (బి) ముస్తాఫిజుర్ 21, డుప్లెసి (సి) రచిన్ (బి) ముస్తాఫిజుర్ 35, పటీదార్ (సి) ధోనీ (బి) ముస్తాఫిజుర్ 0, మ్యాక్స్‌వెల్ (సి) ధోనీ (బి) చాహర్ 0, గ్రీన్ (బి) ముస్తాఫిజుర్ 18, రావత్ (రనౌట్) 48, దినేశ్ (నాటౌట్) 38, ఎక్స్‌ట్రాలు: 13; **మొత్తం: 20 ఓవర్లలో 173/6; వికెట్ల పతనం:** 1-41, 2-41, 3-42, 4-77, 5-78, 6-173; **బౌలింగ్:** దీపక్ చాహర్ 4-0-37-1, దేశ్‌పాండే 4-0-47-0, తీక్షణ 4-0-36-0, ముస్తాఫిజుర్ 4-0-29-4, జడేజా 4-0-21-0.

చెన్నై: రుతురాజ్ (సి) గ్రీన్ (బి) యశ్ 15, రచిన్ (సి) పటీదార్ (బి) కర్ణ్ 37, రహానె (సి) మ్యాక్స్‌వెల్ (బి) గ్రీన్ 27, డారిల్ మిచెల్ (సి) పటీదార్ (బి) గ్రీన్ 22, శివమ్ దూబే (నాటౌట్) 34, జడేజా (నాటౌట్) 25, ఎక్స్‌ట్రాలు: 16, **మొత్తం: 18.4 ఓవర్లలో 176/4; వికెట్ల పతనం:** 1-38, 2-71, 3-99, 4-110; **బౌలింగ్:** సిరాజ్ 4-0-38-0, యశ్ దయాల్ 3-0-28-1, జోసెఫ్ 3.4-0-38-0, కర్ణ్ శర్మ 2-0-24-1, దాగర్ 2-0-6-0, గ్రీన్ 3-0-27-2, మ్యాక్స్‌వెల్ 1-0-7-0.


ముస్తాఫిజుర్ (4-0-29-4)

చెన్నై: డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ఆరంభ మ్యాచ్‌లోనే అదరగొట్టింది. కొత్త కెప్టెన్ రుతురాజ్ నేతృత్వంలో బరిలోకి దిగిన ఈ జట్టు బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో రాణిస్తూ.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరును 6 వికెట్ల తేడాతో ఓడించింది. అటు చెపాక్ మైదానంలో ఆర్సీబీకిది వరుసగా ఎనిమిదో ఓటమి కావడం గమనార్హం. సీఎస్‌కే తరఫున తొలి మ్యాచ్ ఆడిన పేసర్ ముస్తాఫిజుర్ నాలుగు వికెట్లతో ఆర్సీబీ వెన్నువిరిచాడు. శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 20 ఓవర్లలో 6 వికెట్లకు 173 పరుగులు చేసింది. అనూజ్ రావత్ (25 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 48), దినేశ్ కార్తీక్ (26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 38 నాటౌట్) డుప్లెసి (23 బంతుల్లో 8 ఫోర్లతో 35) రాణించారు. ఆ తర్వాత ఛేదనలో చెన్నై 18.4 ఓవర్లలో 4 వికెట్లకు 176 పరుగులు చేసి గెలిచింది. రచిన్ రవీంద్ర (15 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 37), శివమ్ దూబే (28 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 34 నాటౌట్) కీలకంగా నిలిచారు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ముస్తాఫిజుర్ నిలిచాడు.

కలిసికట్టుగా..: సీఎస్‌కే ఛేదన జోరుగా ఆరంభం కాగా.. క్రీజులోకి వచ్చిన ప్రతీ బ్యాటర్ ఉన్న కాసేపు బ్యాట్లు ఝుళిపించారు. ఇన్నింగ్స్ తొలి బంతినే ఫోర్‌గా మలిచిన కెప్టెన్ రుతురాజ్ (15) మొదటి వికెట్‌కు 38 పరుగులు జోడించి నాలుగో ఓవర్‌లో వెనుదిరిగాడు. అయితే కెరీర్‌లో తొలి ఐపీఎల్ ఆడిన రచిన్ ఆకట్టుకున్నాడు. మూడో ఓవర్‌లో 4,6 బాదిన అతను ఐదో ఓవర్‌లోనూ సిక్సర్ సాధించాడు. అటు రహానె (27) కూడా ఉన్న కాసేపు వేగం కనబరిచాడు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 62/1 స్కోరుతో పటిష్ఠంగా కనిపించింది. కర్ణ్ శర్మ ఓవర్‌లో సిక్సర్ బాదాక మరో భారీ షాట్‌కు యత్నించిన రచిన్ క్యాచ్ అవుటయ్యాడు. దీంతో రెండో వికెట్‌కు 33 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఇక తొమ్మిదో ఓవర్‌లో డారిల్ మిచెల్ (22) రెండు వరుస సిక్సర్లతో ఆకట్టుకున్నాడు. మరోవైపు రహానె ఓ భారీ సిక్సర్ బాదిన వెంటనే మ్యాక్స్‌వెల్‌కు క్యాచ్ ఇవ్వగా, కాసేపటికే మిచెల్ వెనుదిరగడంతో 110కి 4 వికెట్లు కోల్పోయిన చెన్నై ఒత్తిడిలో పడింది. దూబే, జడేజా ఓపిగ్గా ఆడుతూ అడపాదడపా ఫోర్లతో ఆదుకునే ప్రయత్నం చేశారు. 17వ ఓవర్‌లో 16 రన్స్ రావడంతో కోలుకుంది. ఇక దూబేను షార్ట్ బాల్స్‌తో విసిగించే ప్రయత్నం చేసినా.. 18వ ఓవర్‌లో 2 ఫోర్లు, 19వ ఓవర్‌లో 6,4తో మరో 9 బంతులుండగానే జట్టును గెలిపించాడు.

చివర్లో ధనాధన్: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ పవర్‌ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయినా.. డెత్ ఓవర్లలో అదరగొట్టింది. 140 కూడా కష్టమే అనుకున్న వేళ అనూజ్ రావత్, దినేశ్ కార్తీక్ జోడీ ఆరో వికెట్‌కు 50 బాల్స్‌లో 95 పరుగులు జత చేయడంతో జట్టు సవాల్ విసిరే స్కోరు సాధించగలిగింది. అయితే మధ్య ఓవర్లలో పేసర్ ముస్తాఫిజుర్ ధాటికి టపటపా వికెట్లు కోల్పోవడం దెబ్బతీసింది. తొలి మూడు ఓవర్లలోనే ఓపెనర్ డుప్లెసి 30 పరుగులు సాధించగా, అటు మరో ఓపెనర్ విరాట్ కోహ్లీ (21) ఈ సమయంలో ఒక్క బంతినే ఆడడం గమనార్హం. అయితే చక్కటి రన్‌రేట్‌తో సాగుతున్న ఆర్సీబీకి పేసర్ ముస్తాఫిజుర్ బ్రేకులు వేశాడు. ఐదో ఓవర్‌లో తను డుప్లెసి, రజత్ (0)ల వికెట్లు తీసి షాక్ ఇచ్చాడు. వెంటనే మ్యాక్స్‌వెల్‌ను చాహర్ డకౌట్ చేయడంతో ఆర్సీబీ పవర్‌ప్లేలో 42/3తో నిలిచింది. ఈ దశలో విరాట్, గ్రీన్ (18) నాలుగో వికెట్‌కు 35 రన్స్ జోడించారు. 12వ ఓవర్‌లో ఈ ఇద్దరినీ ముస్తాఫిజుర్ పెవిలియన్‌కు చేర్చాడు. అప్పటికి స్కోరు 78/5. ఈ స్థితిలో దినేశ్ కార్తీక్, రావత్ నిదానంగా ఆడడంతో 28 బంతులపాటు ఒక్క ఫోర్ కూడా రాలేదు. కానీ 15వ ఓవర్‌లో రావత్ రెండు ఫోర్లు, తర్వాత ఓవర్‌లో డీకే 4,6తో స్కోరులో కాస్త కదలిక వచ్చింది. తుషార్ వేసిన ఇన్నింగ్స్ 18వ ఓవర్‌లోనైతే రావత్ 6,6,4 డీకే 6తో 25 రన్స్ వచ్చాయి. అయితే ఆఖరి ఓవర్‌లో అతడు 9 రన్స్‌తో కాస్త కట్టడి చేయగలిగాడు.

సెమీఫైనల్లో శ్రీకాంత్

బాసెల్ (స్విట్జర్లాండ్): స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో కిడాంబి శ్రీకాంత్ సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్స్‌లో శ్రీకాంత్ 21-10, 21-14తో లి చియా (తైపీ)ని చిత్తుచేశాడు. కాగా, డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో గాయత్రి గోపీచంద్/ట్రీసా జాలీ జోడీ 14-21, 15-21తో ఆస్ట్రేలియా జంట సెట్యానా/ఏంజెలా చేతిలో పరాజయం పాలైంది. ఇక..గురువారం అర్ధరాత్రి జరిగిన రౌండ్-16 మ్యాచ్‌లో లక్ష్యసేన్ 17-21, 15-21తో లి చియా చేతిలో, మిక్స్‌డ్‌లో సుమిత్/సిక్కిరెడ్డి ద్వయం 11-21, 14-21తో రాబిన్/సెలెనా జోడీ చేతిలో ఓడారు.

క్లిష్టమైన గ్రూపుల్లో భారత్

థామస్, ఉబర్ కప్ డ్రాలు

చెంగ్డూ (చైనా): ప్రతిష్ఠాత్మక థామస్, ఉబర్ కప్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ డ్రాలను శుక్రవారం విడుదలజేశారు. డిఫెండింగ్ చాంపియన్ భారత పురుషుల జట్టు 14 సార్లు చాంప్ ఇండోనేసియాతోపాటు ఇంగ్లండ్, థాయ్‌లాండ్‌లతో కలిసి గ్రూప్-సిలో ఉంది. అలాగే భారత మహిళల జట్టు గ్రూప్ 'ఎ'నుంచి 15 సార్లు విజేత చైనాతోపాటు కెనడా, సింగపూర్‌లతో తలపడనుంది. గత విజేతగా భారత్ థామస్ కప్‌కు, ఆసియా టీమ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం నెగ్గడం ద్వారా మహిళల జట్టు ఉబర్ కప్‌కు అర్హత సాధించాయి. ఈ పోటీలు వచ్చేనెల 27 నుంచి ఇక్కడ జరగనున్నాయి.

డబ్ల్యూటీటీ ఫీడర్ విజేత సాథియన్



బీరూట్ (లెబనాన్): డబ్ల్యూటీటీ ఫీడర్ సిరీస్‌లో టైటిల్ నెగ్గిన తొలి భారత టేబుల్ టెన్నిస్ క్రీడాకారుడిగా సాథియన్ చరిత్ర సృష్టించాడు. ఫైనల్‌లో సాథియన్ 3-1తో సహచర ప్యాడ్లర్ మానవ్ టక్కర్‌పై గెలిచాడు.

భారత్-అఫ్ఘాన్ మ్యాచ్ డ్రా

అభా (సౌదీ అరేబియా): భారత్-అఫ్ఘానిస్థాన్ జట్ల మధ్య జరిగిన వరల్డ్ కప్ సాకర్ క్వాలిఫయింగ్ మ్యాచ్ డ్రా (0-0)గా ముగిసింది. ఈ మ్యాచ్ అనంతరం.. మొత్తం నాలుగు పాయింట్లతో గ్రూప్ 'ఎ'లో భారత్ రెండో స్థానానికి చేరింది. ఖతార్ (9) అగ్రస్థానంలో ఉండగా, కువైట్ (3), అఫ్ఘానిస్థాన్ (1) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

ఐపీఎల్‌లో తనుష్ కోటియన్


న్యూఢిల్లీ: వ్యక్తిగత కారణాలతో తప్పుకొన్ని రాజస్థాన్ రాయల్స్ స్పిన్నర్ ఆడమ్ జంపా స్థానంలో ముంబై ఆఫ్ స్పిన్నర్ తనుష్ కోటియన్ జట్టులో చేరాడు. అలాగే రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుజరాత్ వికెట్ కీపర్ రాబిన్ మింజ్ స్థానంలో బీఆర్ శరత్‌ను తీసుకున్నారు.

అదిరెను.. ఆటాపాట



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్ ఆట పాటలతో పాటు కళ్లు మిరుమిట్లు గొలిపే లేజర్ షో, బాణాసంచా వెలుగులతో ఘనంగా ఆరంభమైంది. 20 నిమిషాలపాటు సాగిన ఈ వేడుకల్లో బాలీవుడ్ స్టార్ల డ్యాన్స్‌తో పాటు ప్రఖ్యాత సింగర్ సోనూ నిగమ్, సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ బృందం సంగీత విభావరి అలరించింది. అలాగే స్టేడియం మధ్యలో త్రీడీ గ్రాఫిక్స్ ద్వారా ఇండియా గేట్, యోగ ముద్రలో వ్యక్తి, చందమామలను సృష్టించడం విశేషంగా ఆకట్టుకుంది. మొదట అక్షయ్ కుమార్ చేతిలో జాతీయ జెండా పట్టుకుని స్టేడియంలోకి ఎంట్రీ ఇచ్చాడు. ఆ తర్వాత టైగర్ ష్రాఫ్‌తో కలిసి స్టేజిపై నృత్యం చేశాడు. ఇద్దరూ త్రివర్ణ పతాకం చేతపట్టి స్టేడియం కలియతిరిగి ప్రేక్షకులను హుషారెత్తించారు. ఇక వందేమాతర గీతాన్ని సోనూ నిగమ్, రెహమాన్ కలిసి ఆలపించడంతో స్టేడియం దద్దరిల్లింది. అనంతరం సింగర్స్ మోహిత్ చౌహాన్, శ్వేతా మోహన్ తదితరులతో కలిపి కాసేపు రెహమాన్ తన హిట్ సాంగ్స్‌తో ప్రేక్షకులను మైమరిపింపజేశాడు. చివర్లో జయహో సాంగ్‌తో ముగించగా.. అటు బాణసంచా వెలుగులతో చిదంబరం స్టేడియం కళకళలాడింది. ప్రదర్శన అనంతరం ఐపీఎల్ ట్రోఫీతో బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ, కార్యదర్శి జైషా, ఐపీఎల్ ఛైర్మన్ ధూమల్‌తో పాటు చెన్నై, బెంగళూరు కెప్టెన్లు రుతురాజ్, డుప్లెసి, నటులు అక్షర్, టైగర్ ష్రాఫ్, రెహమాన్, సోనూ నిగమ్ వేదికపై ఫొటో దిగారు.

జోష్‌లో సన్‌రైజర్స్


కమిన్స్

నేటి మ్యాచ్‌లు	
పంజాబ్ x ఢిల్లీ	మ. 3.30 నుంచి
కోల్‌కతా x హైదరాబాద్	రాత్రి 7.30 గం. నుంచి

కోల్‌కతా: నిరుడు ఐపీఎల్‌లో అట్టడుగున నిలిచిన సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఈసారి కొత్త కెప్టెన్ పాట్ కమిన్స్ సారథ్యంలో నవోత్తేజంతో బరిలోకి దిగుతోంది. శనివారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరగనున్న తమ తొలి మ్యాచ్‌లో లోకల్ టీమ్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో తలపడనుంది. ఇరు జట్లు ఇప్పటివరకు 25 సార్లు తలపడగా కేకేఆర్ 16, ఎస్ఆర్‌హెచ్ 9 మ్యాచ్‌ల్లో నెగ్గాయి. గత ఏడాది ఆస్ట్రేలియా జట్టుకు తన సారథ్యంలో వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్, వన్డే వరల్డ్‌కప్ టైటిళ్లను అందించిన కమిన్స్‌పై ఎస్ఆర్‌హెచ్ టీమ్ మేనేజ్‌మెంట్ భారీ ఆశలు పెట్టుకుంది. ఇక, నిరుడు ఐపీఎల్‌కు దూరమైన శ్రేయాస్ అయ్యర్ ఈసారి కెప్టెన్‌గా కేకేఆర్‌ను ఎలా నడిపిస్తాడనే దానిపైన, మెంటార్‌గా గౌతం గంభీర్ వ్యూహాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



కొత్త స్టేడియంలో పంజాబ్ పోరు ఆరంభం

చండీగఢ్: పంజాబ్ కింగ్స్ తన పోరును కొత్త స్టేడియంలో ప్రారంభించనుంది. చండీగఢ్ శివారులోని ముల్లాపూర్ గ్రామంలో మహరాజా యదవీంద్ర సింగ్ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం పేరిట పంజాబ్ క్రికెట్ సంఘం ఈ నూతన స్టేడియాన్ని నిర్మించింది. దాదాపు 33 వేల సీటింగ్ కెపాసిటీ కలిగిన, అధునాతన సౌకర్యాలతో కూడిన ఈ స్టేడియంలో శనివారం రిషబ్ పంత్ నాయకత్వంలోని ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుతో ధవన్ సారథ్యంలోని పంజాబ్ జట్టు తలపడనుంది. మొదటిసారి అంతర్జాతీయ మ్యాచ్‌కు ఆతిథ్యమిస్తున్న ఈ స్టేడియం ఇకనుంచి పంజాబ్ ఫ్రాంఛైజీకి సొంత మైదానం.

హైదరాబాద్‌లో అంతర్జాతీయ కరాటే టోర్నీ

నార్సింగ్ (ఆంధ్రజ్యోతి): జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా (జేకేఏఐ) హైదరాబాద్‌లో వచ్చే ఏడాది ఇన్విటేషన్ ఇంటర్నేషనల్ కరాటే టోర్నమెంట్ నిర్వహించనుంది. ఈ టోర్నీ 2025 జనవరి 18 నుంచి 22 వరకు జరుగనుందని జేకేఏఐ సభ్యులు ఆనంద్ రత్న వెల్లడించారు. సుమారు 3 వేల మంది ఈ పోటీల్లో పాల్గొంటారన్నారు. కటా, కుమిటే విభాగాలలో తలపడే క్రీడాకారులకు త్వరలో ట్రయల్స్ నిర్వహిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు 9177307007 నెంబర్‌లో సంప్రదించాలి.

మూడో రోజూ లాభాలొచ్చాయ్..

190 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్



ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా మూడో రోజూ లాభపడ్డాయి. ఎల్ అండ్ టీ, ఐటీసీ, మారుతి సుజుకీ వంటి ప్రధాన కంపెనీల షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లలో అమ్మకాలు సూచీల లాభాలను పరిమితం చేశాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ ఒక దశలో 474 పాయింట్ల మేర పుంజుకుని మళ్లీ 73,000 స్థాయిని దాటినప్పటికీ, చివరికి 190.75 పాయింట్ల లాభంతో 72,831.94 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 84.80 పాయింట్ల వృద్ధితో 22,096.75 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 21 లాభపడగా.. మారుతి సుజుకీ షేరు మూడు శాతానికి పైగా పెరిగి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. సన్‌ఫార్మా, టైటాన్ 2 శాతానికి పైగా వృద్ధి చెందాయి. కాగా, బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 1.06 శాతం ఎగబాకగా.. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.38 శాతం పెరిగింది. రంగాలవారీ సూచీల్లో టెలికాం 2.28 శాతం లాభపడగా.. కన్స్యూమర్ డిస్‌క్రెషనరీ, కమోడిటీస్, హెల్త్‌కేర్, ఇండస్ట్రియల్స్ సూచీలు ఒక శాతానికి పైగా పెరిగాయి.

ఐటీ షేర్లు ఢమాల్ : అమెరికన్ ఐటీ దిగ్గజం యాక్సెంచర్ ఈ ఆర్థిక సంవత్సరానికి ఐటీ రంగ ఆదాయ వృద్ధి అంచనాను 2-5 శాతం నుంచి 1-3 శాతానికి తగ్గించిన నేపథ్యంలో దేశీయ ఐటీ కంపెనీల షేర్లు భారీగా నష్టపోయాయి. బీఎస్ఈలో ఎల్‌టీఐమైండ్‌ట్రీ షేరు అత్యధికంగా 3.01 శాతం క్షీణించగా.. ఇన్ఫోసిస్ 2.98 శాతం నష్టంతో సెన్సెక్స్ టాప్ లూజర్‌గా మిగిలింది. విప్రో 2.73 శాతం, హెచ్‌సీఎల్ టెక్ 2.46 శాతం పతనమవగా.. టీసీఎస్, ఎల్‌టీఎస్, టెక్ మహీంద్రా షేర్లు ఒక శాతానికి పైగా నష్టపోయాయి. దాంతో బీఎస్ఈలోని ఐటీ రంగ సూచీ 2 శాతం క్షీణించగా.. టెక్నాలజీ ఇండెక్స్ 1.47 శాతం నష్టపోయింది.

28 నుంచి క్రియేటివ్ గ్రాఫిక్స్ ఐపీఓ: ఇంటిగ్రేటెడ్ ప్యాకేజింగ్ సిస్టమ్ కంపెనీ క్రియేటివ్ గ్రాఫిక్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 28న ప్రారంభమై ఏప్రిల్ 4న ముగియనుంది. పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.54.4 కోట్ల వరకు సమీకరించనుంది. ఆ తర్వాత కంపెనీ షేర్లను ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫామ్‌లో నమోదు చేయనుంది.

రికార్డు కనిష్ఠానికి రూపాయి

- ఒక్కరోజులో 48 పైసల క్షీణత
- 83.61కి డాలర్‌తో మారకం రేటు



భారత కరెన్సీ విలువ మరింత పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ ఒక్కరోజులోనే 35 పైసలు క్షీణించి సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయి 83.48 వద్ద ముగిసింది. శుక్రవారం ఫారెక్స్ మార్కెట్లో డాలర్-రూపీ ఎక్స్ఛేంజీ రేటు 83.28 వద్ద ప్రారంభమై.. ఒక దశలో 83.65 వద్దకు చేరుకుంది. చివరికి 83.61 వద్ద స్థిరపడింది. క్రితం సెషన్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 48 పైసలు తగ్గింది. అంతర్జాతీయంగా మిగతా కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలపడటంతో పాటు మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోవడం రూపాయిని బాగా కుంగదీశాయని ఫారెక్స్ మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. డాలర్-రూపాయి ఎక్స్ఛేంజీ రేటులో గత కనిష్ఠ స్థాయి 2023 డిసెంబరు 13న 83.40 వద్ద నమోదైంది.

కాస్త దిగివచ్చిన పసిడి

సరికొత్త ఆల్‌టైం రికార్డు గరిష్ఠాలకు ఎగబాకిన పసిడి ధర శుక్రవారం కాస్త దిగివచ్చింది. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర రూ.875 తగ్గి రూ.66,575కు పరిమితమైంది. గురువారం 10 గ్రాముల బంగారం రేటు రూ.67,450కి చేరుకుంది. వెండి విషయానికి వస్తే, క్రితం రోజు రూ.77,750 పలికిన కిలో ధర.. శుక్రవారం రూ.760 తగ్గి రూ.76,990కి జారుకుంది. అంతర్జాతీయంగా వీటి ధరలు కాస్త తగ్గుముఖం పట్టడం ఇందుకు దోహదపడింది. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ రేటు క్రితం సెషన్‌తో పోలిస్తే 35 డాలర్లు 2,167 డాలర్ల వద్దకు దిగిరాగా.. సిల్వర్ 24.45 డాలర్ల వద్ద ట్రేడైంది.

ఆల్‌టైం గరిష్ఠానికి మారుతి షేరు

దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా షేరు సరికొత్త శిఖరాలకు చేరుకుంది. తొలిసారిగా రూ.12,000 మైలురాయిని దాటిన కంపెనీ షేరు ధర ఒక దశలో 4.28 శాతం లాభంతో రూ.12,423.45 వద్ద సరికొత్త ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 3.55 శాతం వృద్ధితో రూ.12,336.20 వద్ద ముగిసింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు దాదాపు 20 శాతం పుంజుకున్న మారుతి సుజుకీ షేరు.. గడిచిన ఏడాది కాలంలో 50 శాతం పెరిగింది. శుక్రవారం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.3.88 లక్షల కోట్లకు (4,690 కోట్ల డాలర్లు) చేరుకుంది. మారుతి సుజుకీ మాతృ సంస్థ సుజుకీ మోటార్ కార్ప్ మార్కెట్ క్యాప్ 2,210 కోట్ల డాలర్లతో పోలిస్తే రెండు రెట్ల కన్నా అధికమిది. పదేళ్ల క్రితం సుజుకీ మోటార్ కార్ప్ మార్కెట్ క్యాప్‌లో సగం ఉన్న మారుతి సుజుకీ మార్కెట్ విలువ.. 2015 జనవరిలో తొలిసారిగా మాతృసంస్థను మించిపోయింది.


పీఎస్‌బీలను ప్రైవేటీకరించాల్సిందే

16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగడియా

గిఫ్ట్ సిటీ (గుజరాత్): కొన్ని ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ)ను ప్రైవేటీకరించాల్సిందేనని 16వ ఆర్థిక సంఘం చైర్మన్, నీతి ఆయోగ్ మాజీ వైస్ చైర్మన్ అరవింద్ పనగడియా అన్నారు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో జరిగిన ఒక సదస్సులో ఆయన ఈ అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ మూడోసారి అధికారం చేపడితే ఇదే ప్రభుత్వ ప్రధాన ఎజెండా కావాలని స్పష్టం చేశారు. మొండి బకాయిల భారం తగ్గడంతో పీఎస్‌బీల విలువ పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో కొన్ని పీఎస్‌బీల ప్రైవేటీకరణకు ఇదే సరైన సమయం అని అరవింద్ పనగడియా అన్నారు. పీఎస్‌బీల ఆర్థిక పరిస్థితి మెరుగుపడడంలో ప్రభుత్వం సమకూర్చిన నిధులూ దోహదం చేశాయన్నారు.

రెడీమిక్స్ కాంక్రీట్‌లోకి శ్రీ సిమెంట్

హైదరాబాద్‌లో తొలి ప్లాంట్ ఏర్పాటు



హైదరాబాద్: బంగూర్ ఫ్యామిలీ ప్రమోట్ చేసిన శ్రీ సిమెంట్ రెడీమిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ) రంగంలోకి ప్రవేశించింది. ఇందుకోసం బంగూర్ కాంక్రీట్ పేరుతో హైదరాబాద్‌లో గంటకు 90 క్యూబిక్ మీటర్ల ఉత్పత్తి సామర్థ్యంతో తన తొలి ఆర్ఎంసీ ప్లాంట్ ఏర్పాటు చేసింది. కంపెనీ త్వరలో ముంబై ఆర్ఎంసీ మార్కెట్లోకీ ప్రవేశించబోతుంది. ఇందుకోసం స్టార్‌క్రెట్ ఎల్ఎల్‌పీకి చెందిన ఐదు ఆర్ఎంసీ ప్లాంట్లను ఈ నెలారంభంలో రూ.33.5 కోట్లకు కొనుగోలు చేసింది. దీంతో తమ ఆర్ఎంసీ ప్లాంట్ల మొత్తం ఉత్పత్తి సామర్థ్యం గంటకు 512 క్యూబిక్ మీటర్లకు చేరుకుందని తెలిపింది. రెడీమిక్స్ కాంక్రీట్ రంగంలో ఉన్న వృద్ధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఈ రంగంలోకి ప్రవేశిస్తున్నట్టు శ్రీ సిమెంట్ ఎండీ నీరజ్ అఖోరి తెలిపారు. శ్రీ సిమెంట్.. బంగూర్ బ్రాండ్ కింద దేశవ్యాప్తంగా సిమెంట్‌ను విక్రయిస్తోంది.

బిజినెస్



వారానికో కొత్త విమానం

6,000 మంది కొత్త ఉద్యోగులు: ఇండిగో

న్యూఢిల్లీ: దేశీయ ఇండిగో విమానయాన సంస్థ తన కార్యకలాపాలను పెద్దఎత్తున విస్తరిస్తోంది. ఇందులో భాగంగా వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో వారానికి ఒకటి కంటే ఎక్కువ కొత్త విమానాలు తమకు అందుతాయని అనలిస్టుల భేటీలో తెలిపింది. పెరుగుతున్న విమానాలను దృష్టిలో ఉంచుకుని 2024-25 ఆర్థిక సంవత్సరంలో 6,000 మంది ఉద్యోగులను కొత్తగా నియమించుకోవాలని నిర్ణయించింది. లాభసాటి వృద్ధితో వాటాదారుల షేర్ల విలువ పెంచడమే తమ లక్ష్యమని తెలిపింది. వచ్చే ఆర్థిక సంవత్సరం తమ సామర్థ్యంతో పాటు విమాన ప్రయాణికుల వృద్ధి రేటు రెండంకెల్లో ఉంటుందని తెలిపింది. కొత్త విమానాల రాకతో కొత్తగా మరో పది మార్గాల్లో విమాన సర్వీసులు ప్రారంభించాలని ఇండిగో భావిస్తోంది.

2030 నాటికి 600కు పైగా విమానాలు

ఈ ఏడాది ఫిబ్రవరి నాటికి ఇండిగో చేతిలో 366 విమానాలు ఉన్నాయి. 2030 నాటికి ఈ సంఖ్య 600కు పైగా ఉంటుందని తెలిపింది. గతంలో ఏ విమానయాన సంస్థ పెట్టనంత భారీ సంఖ్యలో 500 విమానాల కొనుగోలుకు కంపెనీ ఎయిర్‌బస్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం దేశ, విదేశాల్లోని మరిన్ని మార్గాలకు విమాన సర్వీసులు ప్రారంభించాలని యోచిస్తున్నట్టు ఇండిగో తెలిపింది.

త్వరలో మరిన్ని రాష్ట్రాలకు

విజయ డయాగ్నొస్టిక్స్ విస్తరణ

అందుబాటులోకి ఓపెన్ ఎంఆర్ఐ మెషిన్

హైదరాబాద్: విజయ డయాగ్నొస్టిక్స్ సరికొత్త ఎంఆర్ఐ మెషిన్‌ను సమకూర్చుకుంది. జపాన్‌కు చెందిన ఫుజి ఫిల్మ్ తయారు చేసిన అధునాతన ఓపెన్ ఎంఆర్ఐ మెషీన్‌ను కొనుగోలు చేసింది. ఈ అధునాతన ఎంఆర్ఐను కంపెనీ తన అమీర్‌పేట కేంద్రంలో ఏర్పాటు చేసింది. దేశంలో ఓపెన్ ఎంఆర్ఐ మెషీన్‌ను ఏర్పాటు చేసిన తొలి డయాగ్నొస్టిక్ సంస్థ తమదేనని విజయ డయాగ్నొస్టిక్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ) శేషాద్రి వాసన్ విలేకరులతో చెప్పారు. ఈ ఎంఆర్ఐ కోసం రూ.6 కోట్లకుపైగా ఖర్చు చేసినట్టు తెలిపారు. కాగా విజయ డయాగ్నొస్టిక్ విస్తరణ కొనసాగుతుందని వాసన్ చెప్పారు. తమ కంపెనీకి ఇప్పటికే దేశంలోని ఐదు రాష్ట్రాల్లో 140 డయాగ్నోస్టిక్ కేంద్రాలు ఉన్నట్టు తెలిపారు. అందులో 125 కేంద్రాలు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉండగా మిగతా 15 కేంద్రాలు ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్టు తెలిపారు. కొత్తగా మహారాష్ట్రలోని పుణే, పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో తమ డయాగ్నొస్టిక్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఏటా ఏడు లేదా ఎనిమిది కొత్త డయాగ్నొస్టిక్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు వాసన్ తెలిపారు.

డాక్టర్ రెడ్డీస్ నుంచి

సెంథాక్విన్ ఔషధం

హైదరాబాద్ కేంద్రంగా పని చేసే డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ మరో ప్రాణ రక్షక ఔషధాన్ని దేశీయ మార్కెట్లోకి విడుదల చేస్తోంది. అమెరికాకు చెందిన ఫార్మాజ్ కంపెనీ అభివృద్ధి చేసిన 'సెంథాక్విన్' అనే ఔషధాన్ని 'లిఫాక్విన్' పేరుతో తయారు చేసి భారత్, నేపాల్ దేశాల్లో మార్కెట్ చేయనుంది. ఇందుకోసం ఫార్మాజ్ కంపెనీతో లైసెన్సింగ్ ఒప్పందం కుదుర్చుకుంది. విపరీతమైన స్రావం కారణంగా రక్తం లేదా ద్రవ పదార్థాలు తగినంతగా శరీరంలో లేనప్పుడు.. గుండె, ఇతర అవయవాలు పనిచేయడం ఆగిపోయి ఆ వ్యక్తులు చనిపోయే ప్రమాదం ఉంది. సెంథాక్విన్ ద్వారా ఈ ప్రమాదం నుంచి గట్టెక్కవచ్చు. పేటెంట్ ఉన్న ఈ ఔషధాన్ని భారత్‌లో తయారు చేయడం ఇదే మొదటిసారి. ఈ ఔషధ తయారీకి అనుమతించినందుకు డాక్టర్ రెడ్డీస్.. ఫార్మాజ్‌కు కొంత అప్‌ఫ్రంట్ ఫీజు, రాయల్టీ చెల్లిస్తుంది.

జూన్‌లో మార్కెట్లోకి బజాజ్ సీఎన్‌జీ బైక్


సంస్థ ఎండీ రాజీవ్ బజాజ్ వెల్లడి



పుణె: బజాజ్ ఆటో.. దేశంలోనే సీఎన్‌జీతో నడిచే తొలి మోటార్ సైకిల్‌ను అభివృద్ధి చేస్తోంది. ఈ బైక్ జూన్ నెలలో మార్కెట్లోకి వస్తుందని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ బజాజ్ తెలిపారు. అధిక మైలేజీ కోరుకునే కస్టమర్లను ఉద్దేశించి తయారుచేస్తున్న ఈ బైక్ పూర్తిగా కొత్త బ్రాండ్‌గా విడుదల అవుతుందని ఆయన చెప్పారు. పెట్రోల్ బైక్‌లతో పోల్చితే సీఎన్‌జీ బైక్‌ల తయారీ వ్యయాలు అధికంగా ఉంటాయి గనుక ధర కూడా కొంత ఎక్కువగానే ఉంటుంది. ఈ బైక్‌లకు పెట్రోల్, సీఎన్‌జీ కోసం రెండు ఇంధన ట్యాంకులు అమర్చాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా 20 ఏళ్ల క్రితం మార్కెట్లోకి తెచ్చిన పల్సర్ త్వరలో 20 లక్షల అమ్మకాల మైలురాయిని చేరనున్నట్టు కంపెనీ తెలిపింది.

సీఎస్ఆర్ కోసం రూ.5,000 కోట్లు

కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యకలాపాల కోసం బజాజ్ గ్రూప్... వచ్చే ఐదేళ్ల కాలంలో రూ.5,000 కోట్లు ఖర్చు చేయనుంది. సీఎస్ఆర్, దాతృత్వ కార్యకలాపాల నిర్వహణ కోసం కొత్తగా ఆవిష్కరించిన గ్రూప్ గుర్తింపు "బజాజ్ బియాండ్" కింద ఈ నిధితో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపింది. ఈ కార్యక్రమం రెండు కోట్ల మంది నవ యువతరానికి ప్రయోజనకారి అవుతుందని, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అందిస్తున్న ఉపాధి, ఎంటర్‌ప్రెన్యూర్ అవకాశాలను చేపట్టేందుకు వారికి ఉపయోగపడుతుందని పేర్కొంది. గత 10 సంవత్సరాల కాలంలో సీఎస్ఆర్ కార్యకలాపాలకు రూ.4,000 కోట్లు ఖర్చు చేశామని, ఆ సొమ్ము నైపుణ్యాలు, విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, జల సంరక్షణ వంటి విభాగాల్లో ఖర్చు చేశామని బజాజ్ ఆటో ఛైర్మన్ నీరజ్ బజాజ్ తెలిపారు.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,930 ▼	61,350 ▼	79,500 ▼
ముంబై	66,268 ▼	60,702 ▼	74,052 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (సెక్ 100 గుడ్లు)



22వ తేదీ	
హైదరాబాద్	415
23వ తేదీ	
చిత్తూరు	478
గోదావరి	425
విజయవాడ	425
విశాఖపట్నం	415
వరంగల్	417

డజను గుడ్లు రూ.72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	113
వరంగల్	113
కరీంనగర్	113
మహబూబ్‌నగర్	113
కర్నూలు	113
విశాఖపట్నం	105
గోదావరి	111
విజయవాడ	111
గుంటూరు	112
ఒంగోలు	112
చిత్తూరు	108

బీఆర్‌ఎస్‌ను వదిలి వెళ్లేవారిని ప్రజలే చెప్పులతో కొడతారు

» అప్పు తెచ్చిన రూ.16,500 కోట్ల నిధులేవి?

» బీఆర్‌ఎస్ పాలనలో వేసవిలోనూ సాగునీరిచ్చాం: పల్లా

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నుంచి గెలిచి ఇతర పార్టీల్లోకి వెళుతున్న నేతలను ప్రజలే చీకొట్టి.. చెప్పులతో కొడతారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒక పార్టీ నుంచి గెలిచిన అభ్యర్థి మరో పార్టీలోకి వెళ్లడం శోచనీయమన్నారు. అక్రమాలు చేయడానికే కొంత మంది అధికార పార్టీలో చేరుతున్నారని ఆరోపించారు. అలాంటి వారి అక్రమాలను బీఆర్ఎస్ పార్టీ బయటపెడుతుందని హెచ్చరించారు. రాష్ట్రంలో 2 లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగిందని, ఉత్తర తెలంగాణలో నష్టం తీవ్రత అధికంగా ఉందని పేర్కొన్నారు. సీఎం రేవంత్, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కనీసం రైతులను పరామర్శించలేదని విమర్శించారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న తుమ్మల పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. పైగా గత ప్రభుత్వం పంట నష్టంపై అంచనా వేయలేదని తమపైనే బురద జల్లడం సరికాదన్నారు. బీఆర్ఎస్ పాలనలో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల సాయం అందించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అప్పు తీసుకొచ్చిన రూ.16,500 కోట్ల నిధులు ఏమయ్యాయని.. ఇంతవరకు రైతు బంధు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పాలనలో వేసవిలోనూ సాగునీరు అందించామని ఆయన చెప్పారు.

పార్టీ మారారు.. అనర్హత వేటు వేయండి

» పట్నం, కూసుకుంట్లపై శాసనమండలి చైర్మన్‌కు బీఆర్‌ఎస్ వినతి

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నుంచి ఎన్నికై ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్సీలు పట్నం మహేందర్ రెడ్డి, కూసుకుంట్ల దామోదర్ రెడ్డిలపై అనర్హత వేటు వేయాలని ఆ పార్టీ ఎమ్మెల్సీలు శాసనమండలి చైర్మన్‌ను కోరారు. ఈ మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఎంఎస్ ప్రభాకర్ రావు, యాదవ రెడ్డి, శేరి శుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయ కార్యదర్శి ఎం.రమేశ్ రెడ్డి శుక్రవారం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు.

8 నుంచి కృష్ణా ట్రైబ్యునల్ విచారణ

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలకు కృష్ణా జలాల కేటాయింపులకు సంబంధించి ఏప్రిల్ 8 నుంచి జస్టిస్ బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్(కృష్ణా-2) విచారణ జరపనుంది. కృష్ణా జలాలను రాష్ట్రాల వారీగా పంచాలని కోరుతూ అంతర్రాష్ట్ర నదీ జలాల వివాద చట్టం-1956లోని సెక్షన్-3 ప్రకారం కేంద్రానికి తెలంగాణ విజ్ఞప్తి చేయగా.. గత ఏడాది అక్టోబరు 6న కేంద్ర జలశక్తి శాఖ విచారణ విధివిధానాలు జారీ చేసిన విషయం విదితమే. అయితే కృష్ణా జలాలను ఏ విధంగా పంచాలనే దానిపై నీటిపారుదల శాఖ ఇప్పటికే స్టేట్ ఆఫ్ కేసు(ఎస్ఓసీ) ముసాయిదాను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించింది. దీనిపై ముఖ్యమంత్రితో పాటు నీటిపారుదల శాఖ మంత్రి నిర్ణయం తీసుకుంటే.. ఎస్ఓసీకి తుదిరూపు ఇచ్చి, ట్రైబ్యునల్‌లో దాఖలు చేయనున్నారు.

పోస్టల్ అధికారి, అనుచరుల నుంచి రూ.6.57 లక్షలు అటాచ్

» అధికార దుర్వినియోగం కేసులో ఈడీ చర్య

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పెద్ద నోట్ల (రూ.500, రూ.1000) రద్దు సమయంలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డ కేసులో అప్పటి పోస్టల్ అధికారి, అతని అనుచరుల నుంచి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రూ.6.57 లక్షలు అటాచ్ చేసింది. కేంద్రం పెద్ద నోట్లు రద్దు చేసిన సమయంలో కె.సుధీర్‌బాబు పోస్టల్ శాఖ హైదరాబాద్ డివిజన్‌లో సీనియర్ సూపరింటెండెంట్‌గా విధుల్లో ఉన్నారు. సామాన్య ప్రజలు పోస్టాఫీసుల్లో పాత నోట్లు మార్పిడి చేసుకునే సదుపాయం కల్పించడంతో సుధీర్‌బాబు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. తన అనుచరులతో కలిసి నిబంధనలకు విరుద్ధంగా రూ.3.75 కోట్లు పోస్టాఫీసుల నుంచి నోట్ల మార్పిడికి పాల్పడ్డారు. అందుకు సుధీర్‌బాబుకు రూ. 87.19 లక్షలు కమీషన్ వచ్చింది. నోట్ల రద్దు సమయంలో జరిగిన అక్రమాలపై అందిన ఫిర్యాదుతో సీబీఐ అధికారులు సుధీర్‌బాబు, అతని అనుచరులు నర్సింహారెడ్డి, నితిన్, సుదర్శన్‌పై నాలుగు వేర్వేరు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆయా కేసుల్లో సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారణ చేపట్టింది. కేసు దర్యాప్తులో భాగంగా సుధీర్‌బాబు, అతని అనుచరులకు సంబంధించి తాజాగా రూ.6.57 లక్షలు అటాచ్ చేసినట్లు ఈడీ అధికారులు వెల్లడించారు.

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు ఉద్యోగుల సమ్మె విరమణ

హైదరాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వేతనాలు చెల్లించడంతో జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కాంట్రాక్టు ఉద్యోగులు సమ్మె విరమించారు. ఎన్‌హెచ్‌ఎంలో సుమారు 17 వేల మంది ఉద్యోగులు కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. వారికి 3 నెలల నుంచి జీతాలు అందలేదు. పెండింగ్ వేతనాలను ఈ నెల 22లోగా చెల్లించకుంటే సమ్మెకు దిగుతామని ఉద్యోగులు హెచ్చరించారు. ఎన్‌హెచ్‌ఎం ఎండీ కర్ణన్‌కు నోటీసులు ఇచ్చారు. అయితే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిపివేయడంతో రాష్ట్ర ప్రభుత్వమే రూ.100 కోట్లను ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల జీతాల కోసం విడుదల చేసింది. ఆ నిధులతో ఒకేసారి రెండు నెలల వేతనాలను చెల్లించారు. దీంతో తాము తలపెట్టిన సమ్మెను విరమించుకున్నట్లు తెలంగాణ ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రకటించింది. శుక్రవారం కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను కలిసి సమ్మె విరమణ విషయాన్ని తెలియజేస్తూ వేతనాలను అందించినందుకు కృతజ్ఞతలు తెలిపింది.

గ్రూప్స్ పోటీ పరీక్షల కోసం టీ-శాట్ క్రాష్ కోర్స్

హైదరాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1,2,3 పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం టీ- శాట్ నెట్‌వర్క్ ఆన్‌లైన్‌లో క్రాష్ కోర్సులను అందిస్తోందని ఆ సంస్థ సీఈవో బీ. వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిపుణ చానల్‌లో అనుభవం కలిగిన బోధనా సిబ్బందితో మొదటి అవగాహన కార్యక్రమం బయాలజీ సబ్జెక్ట్‌పై ప్రసారమవుతుందని ఆయన తెలిపారు. అదే కార్యక్రమం టీ- శాట్ విద్య చానల్‌లో మరుసటి రోజు ఉదయం 8 గంటల నుంచి 9 గంటల వరకు పున: ప్రసారమవుతుందని వెల్లడించారు. ఈ లైవ్ క్రాష్ కోర్స్ ఏప్రిల్ మొదటి వారం వరకు కొనసాగుతుందని తెలిపారు. క్రాష్ కోర్స్ ప్రసారాలు టీ- శాట్ నెట్‌వర్క్ చానళ్లు విద్య, నిపుణతో పాటు యాప్, యూట్యూబ్‌లోనూ ప్రసారమవుతాయని వేణుగోపాల్ సూచించారు.

ఏపీలో టీడీపీ మూడో జాబితా విడుదల

» 13 లోక్‌సభ, 11 అసెంబ్లీ అభ్యర్థుల పేర్లు వెల్లడి

» ఇంకా 4 లోక్‌సభ, 5 అసెంబ్లీ స్థానాలు పెండింగ్

అమరావతి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పాతవారు, కొత్త నేతల సమాహారంతో టీడీపీ మూడో జాబితా విడుదల చేసింది. ఇందులో 13 మంది లోక్‌సభ అభ్యర్థులు, 11 మంది అసెంబ్లీ అభ్యర్థుల పేర్లు ఉన్నాయి. జనసేన, బీజేపీతో పొత్తులో భాగంగా టీడీపీ రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ, 144 సీట్లలో పోటీ చేస్తుండగా.. శుక్రవారం 13 ఎంపీ సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. 11 మంది అసెంబ్లీ అభ్యర్థులతో కలిపితే ఇప్పటివరకు 139 సీట్లకు పేర్లను ఖరారుచేసినట్లయింది. ఇంకా ఐదు అసెంబ్లీ, 4 లోక్‌సభ స్థానాల అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది.

లోక్‌సభ అభ్యర్థులు: కింజరాపు రామ్మోహన్‌నాయుడు(శ్రీకాకుళం), మతుకుమిల్లి భరత్(విశాఖపట్నం), గంటి హరీశ్ మాధుర్(అమలాపురం (ఎస్సీ)), పుట్టా మహేశ్ యాదవ్ (ఏలూరు), కేశినేని శివనాథ్ (చిన్ని)(విజయవాడ), పెమ్మసాని చంద్రశేఖర్(గుంటూరు), లావు శ్రీకృష్ణదేవరాయలు (నరసరావుపేట), టి. కృష్ణప్రసాద్ (బాపట్ల (ఎస్సీ)) వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి(నెల్లూరు), దగ్గుమళ్ల ప్రసాదరావు (చిత్తూరు (ఎస్సీ), బస్తిపాటి నాగరాజు(కర్నూలు), బైరెడ్డి శబరి (నంద్యాల), బీకే పార్థసారథి (హిందూపురం)

ఎమ్మెల్యే అభ్యర్థులు : గౌతు శిరీష (పలాస), మామిడి గోవిందరావు (పాతపట్నం), గొండు శంకర్ (శ్రీకాకుళం), కోళ్ల లలిత కుమారి (శృంగవరపు కోట), వనమాడి వెంకటేశ్వరరావు (కాకినాడ), అయితాబత్తుల ఆనందరావు (అమలాపురం (ఎస్సీ)), బోడె ప్రసాద్ (పెనమలూరు), వసంత కృష్ణప్రసాద్ (మైలవరం), డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు(నరసరావుపేట), మద్దులూరి మాలకొండయ్య యాదవ్(చీరాల), సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి (సర్వేపల్లి)

ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి రోజు

విపక్షాలే లేకుండా బీజేపీ కుట్ర..కేజ్రీవాల్ అరెస్టు అందులో భాగమే

హేమంత్, కవిత అరెస్టులూ దీన్ని రుజువు చేస్తున్నాయి: కేసీఆర్

బీజేపీకి బీ టీం లీడర్‌లా రేవంత్ మాటలు: హరీశ్ రావు



హైదరాబాద్/న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్ ప్రజాస్వామ్య చరిత్రలో మరో చీకటి రోజు అని మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. ప్రతిపక్షాల్ని నామరూపాల్లేకుండా చేయాలనే ఏకైక సంకల్పంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ ఘటనలు అదే విషయాన్ని రుజువు చేస్తున్నాయన్నారు. ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థల్ని కేంద్ర ప్రభుత్వం పావులుగా వాడుకుంటోందని ఆరోపించారు. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా పరిణమిస్తున్న కేంద్ర ప్రభుత్వ చర్యల్ని బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. కేజ్రీవాల్‌ది రాజకీయ ప్రేరేపిత అరెస్ట్ అని, అక్రమ కేసులను వెంటనే వెనక్కి తీసుకొని, అరెస్ట్ చేసిన వారిని విడుదల చేయాలని కేసీఆర్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తీరు చూస్తుంటే బీజేపీకి బీ టీం లీడర్‌గా వ్యవహరిస్తున్నట్లుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. మద్యం పాలసీ కేసులో ఈడీ, సీబీఐ వ్యవహరిస్తున్న తీరుపై కాంగ్రెస్ జాతీయ నాయకులు స్పందిస్తున్న విధానానికి పూర్తి వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని విమర్శించారు. లిక్కర్ స్కాం అనేది పూర్తిగా కల్పితమని, కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థల్ని ఉపయోగించి రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు పెడుతోందని కాంగ్రెస్ పెద్దలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఆరోపించారని పేర్కొన్నారు. కానీ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం లిక్కర్ స్కాం జరిగిందని, అందులో నిందితుల్ని అరెస్ట్ చేయడం ఆలస్యం అయిందంటూ వ్యాఖ్యానించారన్నారు.

ప్రాంతీయ పార్టీలను లొంగదీసుకునేందుకు మోదీ చేసిన కుట్ర

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టులు అప్రజాస్వామికమని బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత నామ నాగేశ్వరరావు అన్నారు. దేశంలోని ప్రాంతీయ పార్టీలను లొంగదీసుకునేందుకు మోదీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలో భాగంగానే ఈ అరెస్టులు జరిగాయని ఆరోపించారు. ఈ మేరకు ఢిల్లీలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించిన బీఆర్ఎస్ ఎంపీలు.. కవిత, కేజ్రీవాల్ అరెస్టులను ఖండించారు. ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఢిల్లీ మద్యం పాలసీ ఆ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయమని చెప్పారు. ప్రైవేటీకరణకు అనుబంధంగా పాలసీల్లో మార్పులు చేసి ఆకట్టుకునే విధానాలను రూపొందించినప్పుడే వ్యాపారవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు వస్తారని, దానిని రాజకీయం చేయడం సరికాదని అన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో కొత్త పాలసీలు తీసుకురావడం కొత్తేమీ కాదని తెలిపారు. దేశంలో ప్రాంతీయ పార్టీలు లేకుండా చేయాలని బీజేపీ కుట్ర చేస్తుందని తెలిపారు. ఎన్డీయేలో మొదటి నుంచి మిత్రపక్షంగా ఉన్న శివసేన, అకాళీదళ్‌ను కూడా బీజేపీ వదిలి పెట్టలేదని నామ ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇక, రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్ రెడ్డి మాట్లాడుతూ తమకు లొంగని రాజకీయ పార్టీలు, నేతలపై బీజేపీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఢిల్లీలో కేజ్రీవాల్‌ను ఎదుర్కొనే పరిస్థితి లేకే ఆయన్ను అరెస్టు చేశారని విమర్శించారు. కాగా, లోక్‌సభ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌ను దెబ్బతీసేందుకే కవితను అరెస్టు చేశారని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఆరోపించారు. ఈ వ్యవహారంలో కవిత బాధితురాలని నిందితురాలు కాదని పేర్కొన్నారు. కేజ్రీవాల్, కవిత అరెస్టులతోనే బీజేపీ ఓటమి ప్రారంభమైందని ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను జేబు సంస్థలుగా మార్చేసిందని విమర్శించారు.

కవితకు సుప్రీంలో చుక్కెదురు

» ఢిల్లీ మద్యం కేసులో బెయిల్ ఇవ్వలేమన్న న్యాయస్థానం

» ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సూచన

» కవితకు వ్యతిరేకంగా చిన్న సాక్ష్యం లేదు

» ఈడీ వ్యవహరిస్తున్న తీరు ఆందోళనకరం

» కపిల్ సిబల్ వాదనలు.. భావోద్వేగం

» కేసు మెరిట్స్‌లోకి వెళ్లడం లేదన్న ధర్మాసనం





న్యూఢిల్లీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టులో నిరాశే మిగిలింది. ఈడీ అరెస్టు, కస్టడీని సవాలు చేస్తూ కవిత దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ బేలా ఎం.త్రివేదిల ప్రత్యేక ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ కేసులో తాము బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసింది. ట్రయల్‌కోర్టుకు వెళ్లాలని సూచించింది. సోదాల పేరుతో ఈడీ అధికారులు తనను అక్రమంగా అరెస్టు చేశారని, అనంతరం సీబీఐ స్పెషల్ కోర్టు తనను కస్టడీకి అప్పగించడం రాజ్యాంగ విరుద్ధమని ఆరోపిస్తూ కవిత 537 పేజీల పిటిషన్ దాఖలు చేశారు. తనను వెంటనే విడుదల చేసేలా ఈడీని ఆదేశించాలని సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరారు. కవిత తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపించారు. కవితను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు అరెస్టు చేసిన తీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. విచారణలో భాగంగా కవిత పట్ల ఈడీ వ్యవహరిస్తున్న తీరు తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురిచేశాయని తెలిపారు. ముందుగానే.. 'దయచేసి హైకోర్టును ఆశ్రయించమని మాత్రం సూచించొద్దు' అని ధర్మాసనానికి కపిల్ సిబల్ విజ్ఞప్తి చేశారు. "ప్రస్తుతం దేశంలో ఏం జరుగుతుందో చూడాలి. ఇవన్నీ చూసి న్యాయవాదిగా నేనెంతో బాధ పడుతున్నాను" అని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా.. భావోద్వేగానికి గురికావద్దని సిబల్‌కు సూచించారు. కవితకు వ్యతిరేకంగా కేసులో చిన్న సాక్ష్యం కూడా లేదని సిబల్ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈడీ చూపుతున్న సాక్ష్యాలన్నీ అప్రూవర్‌ల నుంచి సేకరించినవేనని తెలిపారు. గత సెప్టెంబరులో కవితను నిందితురాలిగా చూపని ఈడీ.. ఇప్పుడు అరెస్టు రిపోర్టులో మాత్రం నిందితురాలిగా పేర్కొన్నదని చెప్పారు. మాగుంట శ్రీనివాసులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగానే కవితను నిందితురాలిగా చూపుతున్నారని.. ఒక్క బలమైన సాక్ష్యం కూడా లేకుండా కవితను ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. అయితే.. ప్రస్తుతానికి తాము కేసు మెరిట్స్‌లోకి వెళ్లడం లేదని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. తాము కవితకు బెయిల్ ఇవ్వలేమని తెలిపింది. తొలుత కింది కోర్టును ఆశ్రయించాల్సిందేనని తేల్చిచెప్పింది. ఆ స్వేచ్ఛ పిటిషనర్‌కు ఉందని పేర్కొంది. త్వరితగతిన కేసు విచారణ చేపట్టాలని ట్రయల్ కోర్టుకు సూచించింది. ఈ సందర్భంగా ఇటీవల ఈడీ అరెస్టు చేసిన ఝార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ కేసును సిబల్ ప్రస్తావించారు. ట్రయల్ కోర్టులో ఏం జరగడం లేదన్నారు. ఈ వ్యాఖ్యలపై మరోసారి స్పందించిన ధర్మాసనం.. కవిత రాజకీయ నాయకురాలైనందున ఆమె పిటిషన్‌ను నేరుగా స్వీకరించలేమని స్పష్టం చేసింది. అలాగే ఈ పిటిషన్‌లో రాజ్యాంగ ఉల్లంఘనకు సంబంధించిన అంశాలను పొందుపరిచినందున, దీన్ని ఇప్పటికే దాఖలైన విజయ్ మదన్‌లాల్ కేసుకు జత చేస్తున్నట్లు ధర్మాసనం వెల్లడించింది. రాజ్యాంగ పరమైన అంశాలపై ఈడీకి నోటీసులు జారీ చేసింది. ఆరు వారాల్లోగా సమాధానం చెప్పాలని, ఆ తర్వాత 2 వారాల్లో రిజాయిండర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

సుప్రీంకోర్టు సాక్షిగా ఈడీ మాట తప్పింది..

సుప్రీంకోర్టులో హామీ ఇచ్చి కూడా ఈడీ మాట తప్పిందని కవిత తరఫున మరో సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి తెలిపారు. గతంలో సుప్రీంకోర్టులో కవిత దాఖలు చేసిన పిటిషన్‌ను ఆయన ప్రస్తావించారు. సుప్రీంకోర్టు సాక్షిగా కవితను అరెస్టు చేయబోమని ఈడీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ క్రమంలో జస్టిస్ బేలా ఎం.త్రివేది స్పందిస్తూ.. కవిత వేసిన ఆ పిటిషన్‌పై ఎలాంటి తాత్కాలిక ఉపశమనం లేదని స్పష్టం చేశారు. ఈ నెల 19న ఆ పిటిషన్‌పై విచారణ సందర్భంగా అభ్యంతరం ఎందుకు వ్యక్తం చేయలేదని ప్రశ్నించారు. పిటిషన్‌ను ఉపసంహరించుకొని, ఇప్పుడు మళ్లీ ఆ ప్రస్తావన తేవడం సరికాదని తెలిపారు.

నేడు రౌజ్ అవెన్యూ కోర్టుకు కవిత

» కస్టడీ పొడిగించాలని కోరనున్న ఈడీ

» ఆమెతో భేటీ అయిన కుమారుడు ఆర్య, సోదరి అఖిల, స్నేహితురాలు వినుత

న్యూఢిల్లీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అధికారులు శనివారం ఢిల్లీలోని రౌజ్‌అవెన్యూ కోర్టులో హాజరు పరచనున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఈ నెల 15న హైదరాబాద్‌లో ఆమెను అరెస్టు చేయగా, 16న ఢిల్లీ కోర్టులో హాజరు పరిచారు. మద్యం పాలసీ కేసులో ఆమెది కీలకపాత్రని, ఆమె నుంచి మరిన్ని నిజాలు రాబట్టాల్సిన అవసరం ఉన్నందున 10 రోజులు కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోరింది. రౌజ్ అవెన్యూ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నాగ్ పాల్ మాత్రం వారం రోజుల కస్టడీకి అనుమతించారు. 23వ తేదీన మధ్యాహ్నం 12లోపు మళ్లీ కోర్టులో హాజరు పరచాలని ఆదేశించారు. దాంతో శనివారం ఆమెను ఈడీ అధికారులు కోర్టులో హాజరు పరచనున్నారు. గత ఆరురోజులుగా ఈడీ అధికారులు కవితను విచారిస్తున్నా రు. శుక్రవారం కూడా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారించినట్టు తెలిసింది. మధ్యాహ్నం భోజన విరామం ఇచ్చారు. ప్రతిరోజు కవితను సాయంత్రం 7నుంచి 8 గంటల వరకు కుటుంబ సభ్యులతో భేటీ అయ్యేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. ఇప్పటి వరకు కేటీఆర్, హరీశ్ రావు, న్యాయవాది మోహిత్ రావులు ఆమెతో మాట్లాడగా, గురువారమే తల్లి శోభ కలిశారు. శుక్రవారం కుమారుడు ఆర్య, సోదరి అఖిల,స్నేహితురాలు వినుత భేటీ అయ్యారు. కుటుంబ విషయాల గురించి వారితో మాట్లాడినట్టు తెలిసింది. ధైర్యంగా ఉండాలని, త్వరలోనే ఇంటికి వచ్చేస్తానని కుమారుడికి ఆమె ధైర్యం చెప్పినట్టు సమాచారం. ఆమె నుంచి మరింత సమాచారం రాబట్టాల్సిన అవసరం ఉన్నదని ఈడీ భావిస్తున్నట్టు తెలిసింది. అందువల్ల కస్టడీని పొడిగించాలని న్యాయస్థానాన్ని కోరనున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

మెదక్ నుంచి వెంకట్రామిరెడ్డి

(మొదటి పేజీ తరువాయి)



ఎంపీ అభ్యర్థులను బీఆర్ఎస్ ప్రకటించినట్లయింది. మరో నాలుగు.. నల్లగొండ, భువనగిరి, హైదరాబాద్, సికింద్రాబాద్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. నల్లగొండ, భువనగిరి స్థానాల్లో ఒకచోట నుంచి కంచర్ల కృష్ణారెడ్డిని బరిలోకి దించాలని బీఆర్ఎస్ అధిష్ఠానం యోచిస్తోంది. ఆయనకు నల్లగొండ టికెట్‌ను ఖరారుచేసే అవకాశం ఎక్కువగా ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. భువనగిరి టికెట్‌ను పలువురు ఆశిస్తున్నారు. ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌లో చేరిన జిట్టా బాలకృష్ణారెడ్డితో పాటు చెరుకు సుధాకర్, దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ భువనగిరి టికెట్ కోసం ప్రయత్నిస్తున్నట్లు కారుపార్టీ నేతలు చెబుతున్నాయి. భువనగిరి సీటును బీసీలకు ఇవ్వాలన్నయోచనలో గులాబీ బాస్ ఉన్నారు. బాలరాజ్ యాదవ్, క్యామ మల్లేశం పేర్లు పరిశీలనలో ఉన్నాయి. భువనగిరి స్థానంలో మొత్తం 9 లక్షల ఓట్లు బీసీ సామాజికవర్గానివి ఉన్నాయి. ఇందులో ఒక్క గొల్లకురుమలవే 3 లక్షలున్నాయి. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థుల్లో ఒక్కరూ కూడా గొల్ల కురుమలు లేరు. దీంతో ఆ సామాజికవర్గ అభ్యర్థిని బీఆర్ఎస్ బరిలోకి దించనున్నట్లు సమాచారం. సికింద్రాబాద్ నుంచి ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌ను బరిలోకి దించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఆయన సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆ నియోజకవర్గ పరిధిలో పద్మారావుకు కొంతమేరకు మంచి పట్టు కూడా ఉందని పార్టీ అధిష్ఠానం యోచిస్తోంది. ఇక గత లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ నుంచి పుస్తె శ్రీకాంత్ పోటీ చేశారు. ఈమారు కూడా మళ్లీ ఆయన్నే ఎన్నికల బరిలో దించాలని పార్టీ నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ప్రకటించిన జాబితాలో కరీంనగర్ నుంచి బోయినపల్లి వినోద్ కుమార్, పెద్దపల్లి కొప్పుల ఈశ్వర్, ఖమ్మం నుంచి నామా నాగేశ్వర రావు, మహబూబాబాద్ మాలోత్ కవిత, మహబూబ్‌నగర్ మన్నె శ్రీనివాసరెడ్డి, నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్, ఆదిలాబాద్ ఆత్రం సక్కు, వరంగల్ కడియం కావ్య, జహీరాబాద్ గాలి అనిల్ కుమార్, మల్కాజ్‌గిరి రాగిడి లక్ష్మారెడ్డి, చేవెళ్ల స్థానానికి కాసాని జ్ఞానేశ్వర్ అభ్యర్థిత్వాలను బీఆర్ఎస్ అధిష్ఠానం ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఎర్రవల్లి క్షేత్రంలో ప్రత్యేక ఏర్పాట్లు

లోక్‌సభ ఎన్నికలపై సమీక్షలను కేసీఆర్ ఇక నుంచి ఎర్రవల్లి క్షేత్రంలోనే నిర్వహించనున్నట్లు తెలిసింది. ఇందుకు ఏర్పాట్లన్నీ సిద్ధం చేశారు. పార్టీ సమావేశాల కోసం అక్కడ సమావేశ మందిరం నిర్మించారు. ఇక్కడ 300 మంది వరకు కూర్చునే విధంగా హాల్‌ను ఏర్పాటు చేశారు. అందరికీ వినిపించేలా సౌండ్ సిస్టం ఏర్పాటు చేశారు. భోజనాల కోసం మరోహాల్‌ను, వీఐపీలతో ప్రత్యేక సమావేశం కోసం మరో హాల్‌ను సిద్ధం చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సమావేశాలు ఇదే వేదికలో నిర్వహించనున్నారు.

తాకట్టు వెనుక కనికట్టు ఏమిటి?

(మొదటి పేజీ తరువాయి)

చేసిన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నుంచి కూడా వివరాలను సేకరించే పనిలో పడింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించాలని నిర్ణయించారు. హనుమకొండలోని పాత సెంట్రల్ జైలు స్థలాన్ని దీనికోసం ఎంపిక చేశారు. 2 వేల పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి 2021 జూన్ 22న అప్పటి సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. మూడు బ్లాకులుగా, 34 విభాగాలతో 24 అంతస్తుల్లో 16.50 లక్షల చదరపు అడుగుల్లో నిర్మాణం తలపెట్టారు. అయితే, ఇంత పెద్ద ఆస్పత్రి నిర్మాణానికి ఏ బ్యాంకూ రుణం ఇచ్చేందుకు ముందుకురాలేదు. నిధుల కోసం బీఆర్ఎస్ సర్కారు అప్పు బాట పట్టింది. టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్‌ను ఏర్పాటు చేసింది. దీని ద్వారా వరంగల్ ఆస్పత్రి నిర్మాణానికి జైలు స్థలాన్ని తాకట్టు పెట్టి బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నుంచి రుణం తీసుకుంది. మొత్తం రూ.1,173 కోట్లు రుణం పొందింది. దీనికిముందే టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్‌కు సర్వే నంబరు 31, 32లోని 2,75,759 గజాల స్థలాన్ని బదిలీ చేసింది.

ఈ వివరాలు వెంటనే ఇవ్వండి

విజిలెన్స్ విభాగం.. డీఎంఈ కార్యాలయంతో పాటు, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నుంచి వివరాల సేకరణలో నిమగ్నమైంది. జైలు స్థలాన్ని టీఎస్ఎస్‌హెచ్‌సీఎల్‌కు బదలాయిస్తూ జారీ చేసిన జీవో నంబరు 81ను, స్థలాన్ని మార్టిగేజ్ చేసిన ఒప్పందం కాపీని కూడా పంపాలని కోరింది. వీటితోపాటు హైదరాబాద్ కోఠిలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రతో చేసుకున్న అవగాహన ఒప్పందం ప్రతిని కూడా పంపాల్సిందిగా ఆదేశించింది. అంతేకాకుండా తాకట్టు పెట్టిన స్థలం నుంచి ఎంతమేరకు రుణం తీసుకున్నారు? ఇప్పటివరకు ఎన్ని వాయిదాలు కట్టారు? ఇంకెన్ని కట్టాలి? వెంటనే తమకు తెలియజేయాలని కోరింది. కాగా, వరంగల్ జైలు స్థలాన్ని తాకట్టు పెట్టి రుణం తీసుకోవడంపై గతంలోనే కాంగ్రెస్ నేత బక్క జడ్సన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. కేసీఆర్ కమీషన్ల కోసమే రుణం తీసుకున్నారని, దాన్ని దుర్వినియోగం చేస్తున్నారని రిజర్వ్ బ్యాంకుకు ఫిర్యాదు చేశారు. విచారణ జరపాలని కోరారు.

భారీ ఆస్పత్రి..

500 మంది వైద్యులు, వెయ్యిమంది నర్సులు, పారామెడికల్, ఇతర సిబ్బంది పనిచేసేలా 2 వేల పడకలతో హనుమకొండ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని డిజైన్ చేశారు. నిర్మాణ బాధ్యతలను రోడ్లు భవనాల శాఖకు అప్పగించారు. రూ.1,100 కోట్ల పరిపాలనా అనుమతులిస్తూ అప్పటి వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ జీవో విడుదల చేశారు.

దారికాచి.. కంట్లో కారం కొట్టి!

» మాచర్లలో రెచ్చిపోయిన వైసీపీ రౌడీలు..

» జనసేన నేతలపై పిన్నెల్లి అనుచరుల దాడి

» గన్నవరంలో టీడీపీ మహిళా నేతలపై ఎమ్మెల్యే వంశీ అనుచరుల వీరంగం..



గన్నవరంలో టీడీపీ కార్యకర్తలపై సీరియస్ అవుతున్న సీఐ ప్రసాద్

గుంటూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి), దుర్గి/గన్నవరం: పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ రౌడీ మూకలు మరోసారి రెచ్చిపోయాయి. మూడ్రోజుల కిందట మాచర్లలో టీడీపీ నేత సురేశ్ కారును తగలబెట్టిన రౌడీ మూకే తాజాగా జనసైనికులే లక్ష్యంగా దాడికి తెగబడ్డారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరఫున పల్నాడు జిల్లా మాచర్ల అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి తరఫున ప్రచారం చేస్తున్న జనసేన పార్టీ నాయకులే లక్ష్యంగా వైసీపీ రౌడీలు రెచ్చిపోయారు. దుర్గి మండలం జంగమహేశ్వరపాడులో జనసైనికులపై వైసీపీ నేత, రౌడీ షీటర్ మన్నెయ్య సహా మరో 20 మంది గొడ్డళ్లతో విరుచుకుపడ్డారు. కారును ధ్వంసం చేసి, నేతలపై పిడిగుద్దులు కురిపించారు. మళ్లీ ఇక్కడ ప్రచారం చేస్తే చంపేస్తామని బెదిరించారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. దుర్గి మండలంలో ఉన్న వింజంచాలపాడుకు చెందిన జనసేన నేతలు గురువారం రాత్రి దుర్గిలో జరిగిన పార్టీ సమావేశానికి ఓ వాహనంలో వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న వైసీపీ నేతలు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు, రౌడీ షీటర్ మన్నెయ్య సుమారు 20 మంది వైసీపీ రౌడీలు, మరికొంత మంది మహిళలు దారి కాచారు. జనసేన నేతలు పసుపులేటి ప్రసాద్, సింగంశెట్టి మధు, హనుమంతురావు, చెన్నయ్యలను కాలర్లు పట్టుకుని కారు నుంచి బయటకు లాగి కళ్లల్లో కారం కొట్టారు. కర్రలు, గొడ్డళ్లతో దాడికి దిగారు. నలుగురిని చితకబాది కారును పూర్తిగా ధ్వంసం చేశారు. దాడి జరుగుతున్న సమయంలో అదే ప్రాంతంలో పోలీసులు ఉన్నప్పటికీ అడ్డుకునే ప్రయత్నం చేయలేదని సమాచారం. ఇటు, గురజాల డీఎస్పీ పల్లపు రాజు జంగమహేశ్వరపాడుకు చేరుకుని, జనసేన నేతలను దుర్గి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్టేట్‌మెంట్ తీసుకున్న అనంతరం ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు.

వైసీపీ పోస్టర్లు ఫొటో తీశారని..

గన్నవరం వైసీపీ అభ్యర్థి వల్లభనేని వంశీ అనుచరులు టీడీపీ మహిళా నాయకులపై దాడికి తెగబడ్డారు. శుక్రవారం సాయంత్రం గన్నవరం వైసీపీ కార్యాలయం గోడకు రంగులు, సిద్ధం బ్యానర్, జగన్ బొమ్మతో జెండా దిమ్మకు రంగులు ఉండటాన్ని గమనించిన మహిళలు.. 'సీ-విజిల్' యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఫొటో లు తీస్తున్నారు. దీన్ని గమనించిన వంశీ అనుచరులు, కార్యకర్తలు కారును చుట్టుముట్టారు. మహిళలపై దాడికి దిగారు. దీంతో వారు తీవ్ర భయాందోళనలకు గురై.. అక్కడ నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నించారు. డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. అయితే, వీరి కారు ముందుకు కదలకుండా వాహనాలు అడ్డుపెట్టి దౌర్జన్యానికి దిగారు. ఘటనా స్థలానికి చేరుకున్నా సీఐ ప్రసాద్.. అధికారపార్టీ వారికే వంతపాడారు. 'గన్నవరంలో ఎన్నికల కోడ్ అమలులో ఉందా? లేదా?' అని కడప టీడీపీ అభ్యర్థి మాధవి ప్రశ్నించారు. తన కారును అడ్డుకుని నిర్బంధిస్తే పట్టించుకోకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించానని తనపైనే కేసు పెడతామని పోలీసులు చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు.

కొకైన్ గుట్టు విప్పేద్దాం

» వేగవంతంగా సీబీఐ దర్యాప్తు

» న్యాయాధికారి సమక్షంలో 960 బ్యాగుల నుంచి శాంపిల్స్ సేకరణ

» సంధ్యా ఆక్వా కార్యాలయాల్లో తనిఖీలు

విశాఖపట్నం(ఆంధ్రజ్యోతి)/కొత్తపల్లి/శంఖవరం, మార్చి 22: కొకైన్ కేసులో దర్యాప్తును సీబీఐ వేగవంతం చేసింది. కంటెయినర్‌లోని మొత్తం డ్రై ఈస్ట్ బ్యాగుల నుంచి శాంపిల్స్ సేకరించడంతో పాటు సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించింది. విశాఖపట్నం కంటెయినర్ టెర్మినల్ ప్రైవేటు లిమిటెడ్ (వీసీటీపీఎల్)కు డ్రై ఈస్ట్ పేరుతో వచ్చిన డ్రగ్స్‌ను సీబీఐ అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. దర్యాప్తులో భాగంగా సీబీఐ కోర్టు న్యాయాధికారి సమక్షంలో సంబంధిత కంటెయినర్‌ను శుక్రవారం మరోసారి తెరిపించిన అధికారులు అందులోని అన్ని సంచుల నుంచి 960 శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపించారు. ఇక, బ్రెజిల్ నుంచి డ్రై ఈస్ట్‌ను దిగుమతి చేసుకున్న సంధ్యా ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన కార్యాలయాల్లో సీబీఐ సోదాలు నిర్వహించింది. ఇందులో భాగంగా కాకినాడ జిల్లా కొత్తపల్లి, శంఖవరం మండలాల్లోని సంధ్యా ఆక్వా కార్యాలయాల్లో సీబీఐ బృందాలు తనిఖీలు చేశాయి. పరిశ్రమ ల్యాబ్‌ల నుంచి రొయ్యల మేత నమూనాలను కూడా సేకరించారు.

మేము సీబీఐకి అడ్డుపడలేదు : విశాఖ సీపీ

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కొకైన్ దిగుమతి కేసులో సీబీఐ విచారణకు ఏపీ పోలీసులు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై విశాఖపట్నం సీపీ రవిశంకర్ స్పందించారు. సీబీఐ దర్యాప్తునకు తాము ఎటువంటి అడ్డంకులు కల్పించలేదని విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వీసీటీపీఎల్ తమ పరిధిలో లేదని, అక్కడ నార్కోటిక్ డ్రగ్స్‌ను తనిఖీ చేయడానికి డాగ్ స్క్వాడ్ కావాలని కస్టమ్స్ ఎస్పీ ఫోన్ చేసి అడిగితే పంపించామన్నారు. ఏపీ ప్రభుత్వ అధికారులు తమ విధులకు అడ్డంకులు కల్పించారని సీబీఐ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న అంశం గురించి మాట్లాడుతూ.. అది టెక్నికల్ రీజన్ అని కొట్టిపారేశారు. విలేకరులు ప్రశ్నలు అడిగేందుకు యత్నించగా ఆయన వెంటనే సమావేశం నుంచి వెళ్లిపోయారు.

బీజేపీ వరంగల్ అభ్యర్థి అరూరి రమేశ్!

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా అరూరి రమేశ్ పేరు దాదాపు ఖరారైంది. పార్టీ జాతీయ నాయకత్వం ఆయన పేరును నేడో, రేపో ప్రకటించనుంది. ఖమ్మం అభ్యర్థిత్వంపై సస్పెన్స్ కొనసాగుతోంది. కాగా, ప్రధాని మోదీ భూటాన్ పర్యటన కారణంగా శుక్రవారం జరగాల్సిన పార్టీ జాతీయ ఎన్నికల కమిటీ సమావేశం శనివారానికి వాయిదా పడిందని పార్టీవర్గాలు తెలిపాయి. దీంతో వరంగల్‌తో పాటు ఖమ్మం అభ్యర్థిని కూడా శనివారం ప్రకటించే అవకాశం ఉందని చెప్పాయి.

రాష్ట్ర ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీతో కిషన్‌రెడ్డి సమీక్ష

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన రాష్ట్ర ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశానికి ఎంపీ లక్ష్మణ్‌తో పాటు పలువురు నేతలు హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా 32 విభాగాలు ఏర్పాటు చేశారు. ఈ విభాగాలకు ఇన్‌చార్జీలను కూడా నియమించారు. వీరితో కిషన్‌రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. అయితే, ఎక్కువ మంది బాధ్యులు హాజరుకాలేదు. వారు ఎందుకు రాలేకపోయారో కిషన్‌రెడ్డి ఆరా తీశారని పార్టీవర్గాలు తెలిపాయి.

విద్యుత్తు కొనుగోళ్ల అవకతవకలపై మీనమేషాలు

» ఎన్టీపీసీతో పీపీఏ ఎందుకు కుదుర్చుకోరు?: ఎంపీ లక్ష్మణ్

హైదరాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విద్యుత్తు కొనుగోళ్లలో బీఆర్‌ఎస్ సర్కారు అవినీతిపై విచారణ జరపకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ మండిపడ్డారు. ఎన్టీపీసీ నుంచి చౌకగా వచ్చే విద్యుత్తు కోసం ఎందుకు కొనుగోలు ఒప్పందం కుదుర్చుకోవడం లేదని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనను పక్కనబెట్టి పార్టీలో చేరికలపై దృష్టిపెట్టారని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో డాక్టర్ లక్ష్మణ్ గురువారం మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం విద్యుత్ కొనుగోలులో అక్రమాలకు పాల్పడిందని రూఢీ అవుతోందన్నారు. వేరే రాష్ట్రాలతో ఒప్పందం చేసుకుంటామని ఎన్టీపీసీ చెప్పినప్పటికీ ముఖ్యమంత్రి స్పందించడం లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ అడుగుజాడల్లోనే కమీషన్ల కోసం నడవాలనుకుంటున్నారా?అని నిలదీశారు. ఎన్టీపీసీతో పీపీఏ కుదుర్చుకొని కరెంటు కోతలు అధిగమించవచ్చన్నారు. యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్ల నిర్మాణం, మేడిగడ్డ, ధరణి, భూమాఫియాపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదో సీఎం సమాధానం చెప్పాలన్నారు.

అర్హులైన అర్చక, ఉద్యోగులందరికీ వేతనాలివ్వాలి

» సీఎం రేవంత్ రెడ్డికి జేఏసీ వినతి

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ పరిధిలోని అన్ని ఆలయాల్లో విధులు నిర్వహిస్తూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ వేతనాలు పొందేందుకు అర్హులైన అర్చక, ఉద్యోగులందరికీ వేతనాలు చెల్లించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జేఏసీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ నేతృత్వంలో శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. వేతనాల చెల్లింపునకు అడ్డుగా మారిన జీవో నెం. 121ను రద్దు చేయాలని సీఎంను కోరారు. జీవో నెం. 577 ప్రకారం 5627 మంది అర్చక, ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ వేతనాలు రావాల్సి ఉందని ముఖ్యమంత్రికి వివరించారు. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కేవలం 3 వేల మందికి మాత్రమే వేతనాలు అందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖలో రెండు సంవత్సరాలుగా కారుణ్య నియామకాలు నిలిపివేశారని, సుమారు 200 కారుణ్య నియామకాలు పూర్తి చేయాల్సి ఉందని సీఎంకు వివరించారు. అర్చక వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసినా... పెద్దగా ఉపయోగం లేదని అర్చక, ఉద్యోగుల కుటుంబాల కోసం హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకురావాలని రేవంత్ రెడ్డికి జేఏసీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. పదవీ విరమణ చేసిన అర్చక, ఉద్యోగులకు రూ. 10 లక్షలు ఆర్థిక సహాయం, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. అదేవిధంగా ధూప దీప నైవేద్యం పథకంలో అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు గౌరవ వేతనం రూ. 25 వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జేఏసీ రూపొందించిన క్రోధినామ సంవత్సర ఉగాది పంచాంగ డైరీని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. జేఏసీ నేతలు కందూరి కృష్ణమాచారి, పరశురాం, రవీంద్రచారి తదితరులు రేవంత్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు.

ఖాతాలపై ఆంక్షలు రాజకీయ దురుద్దేశమే

» ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్

హైదరాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బాండ్లు, ఫండ్ల పేరిట కంపెనీల నుంచి రూ. వేల కోట్లు దండుకుంటున్న బీజేపీ ప్రభుత్వం.. లోక్‌సభ ఎన్నికల ముందు రాజకీయ దురుద్దేశంతోనే కాంగ్రెస్ బ్యాంకు అకౌంట్లపై ఆంక్షలు విధించిందని ఆ పార్టీ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలక్టోరల్ బాండ్ల విషయంలో బీజేపీ పెద్ద స్కామ్ చేసిందన్నారు.మతంపేరిట మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్న బీజేపీకి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కాగా, తెలంగాణ లేబర్ పార్టీని ఆ పార్టీ అధ్యక్షుడు రమేశ్ శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో విలీనం చేశారు. ఈసందర్భంగా మహేశ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ లేబర్‌పార్టీని కాంగ్రెస్‌లోకి మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామన్నారు.

వారికి టికెట్లిచ్చి క్యాడర్‌ను అవమానించారు

» మల్లికార్జున ఖర్గేకు నిరంజన్ లేఖ

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్, రంజిత్‌రెడ్డి, సునీతామహేందర్‌రెడ్డికి ఎంపీ టికెట్లిచ్చి పార్టీ క్యాడర్‌ను అవమానించారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ అన్నారు. ఈ నిర్ణయం క్యాడర్ ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీశాలా ఉందని, దానిపై పునరాలోచన చేయాలని ఆయన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు లేఖ రాశారు. రాష్ట్రంలో అధికార మార్పిడిని కోరుకున్న ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని, కానీ ఆ పార్టీ నుంచి వచ్చిన వ్యక్తులకు ఇప్పుడు టికెట్లివడం ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా ఉందని అన్నారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన, నిబద్ధత, విధేయత కలిగిన నేతలకు 17 లోక్‌సభ నియోజకవర్గాల నుంచి పోటీకి దింపాలని ఖర్గేను నిరంజన్ కోరారు.

ఉద్యోగ అర్హతకు అడ్డంగా చిన్న కేసులు

» ఈ విషయంపై సమీక్షించాలని సీఎంను కోరుతా: పొన్నం

హుస్నాబాద్, మార్చి 22 : పోలీసు ఉద్యోగాలు సాధించినప్పటికీ చిన్న, చిన్న కేసులు ఉండటం వల్ల కొంతమంది అభ్యర్థులు అర్హత పొందలేకపోతున్నారని, అటువంటి వారిని పరిగణనలోకి తీసుకునేలా, వారికి అవకాశం కల్పించేలా తగిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హామీ ఇచ్చారు. ఈ విషయంపై సమీక్షించాలని ముఖ్యమంత్రిని కోరతానని తెలిపారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో తనను కలిసిన బాధితులతో మంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. పోలీసు ఉద్యోగాలే కాకుండా ఇతర ఉద్యోగాలు సాధించిన చాలా మంది అభ్యర్థులు ఈ సమస్యతో అర్హత పొందడం లేదన్నారు. కేసుల సాంద్రతను గుర్తించి నిర్ణయం తీసుకోవాలన్నారు.

ఇవాళ కేజ్రీవాల్.. రేపు సీఎం రేవంత్ కావొచ్చు

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

హైదరాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): లక్ష కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిన ఏపీ సీఎం జగన్‌ను వదిలేసి, వందల కోట్ల రూపాయల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం మోదీ తీరని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విమర్శించారు. కేజ్రీవాల్ అరెస్టుతో ప్రత్యర్థుల పట్ల మోదీ వ్యవహారశైలి మరోసారి స్పష్టమైందని పేర్కొన్నారు. మగ్దుంభవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇవాళ కేజ్రీవాల్.. రేపు తెలంగాణ సీఎం రేవంత్‌కు కూడా ఏదో ఒక కుంభకోణం పేరుతో ప్రమాదం తప్పకపోవచ్చని వ్యాఖ్యానించారు.

రూ.72.71 లక్షల నగదు సీజ్

చాదర్‌ఘాట్, నల్లగొండ, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వాహన తనిఖీలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో రూ.72.71లక్షలను సీజ్ చేశారు. ఇందులో రూ.62.60 లక్షలను హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. చాదర్‌ఘాట్ కాజ్‌వే వంతెనపై ఓ కారులో రూ.49లక్షలను గుర్తించారు. ఇక, ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో రూ.10,51,600 నగదును గుర్తించి సీజ్ చేశారు.

అధిష్ఠానం ఆదేశిస్తే భువనగిరి ఎంపీ బరిలో లక్ష్మి

నా భార్యకు టికెట్ ఇవ్వాలని అడగలేదు.. బీసీలకు టికెట్ ఇవ్వాలని పార్టీని కోరా

» కాంగ్రెస్‌కు 12 -14 స్థానాలు ఖాయం

» ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



మునుగోడు, మార్చి 22: అధిష్ఠానం ఆదేశిస్తే భువనగిరి ఎంపీ స్థానం నుంచి కాంగ్రెస్ తరఫున సుశీల ఫౌండేషన్ చైర్మన్, తన భార్య కోమటిరెడ్డి లక్ష్మి పోటీ చేస్తారని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా మునుగోడులోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. కోమటిరెడ్డి కుటుంబీకులు పదవులకు పాకులాడుతున్నారని, కోమటిరెడ్డి లక్ష్మి భువనగిరి ఎంపీ టికెట్ ఆశిస్తున్నట్లు కొన్ని రోజులుగా వివిధ మీడియాల్లో వస్తున్న కథనాలను ఆయన కొట్టిపారేశారు. ఇప్పటివరకు తమ కుటుంబంలో ఏ ఒక్కరికి టికెట్ కావాలని పార్టీ పెద్దలను అడగలేదన్నారు. ఏ స్థానం నుంచి అయినా పోటీ చేయాలంటే పార్టీకి అభ్యర్థన పెట్టుకునే విధానం ఉందని తెలిపారు. తమ కుటుంబీకులు ఎవరూ అలా అభ్యర్థన పెట్టుకోలేదని చెప్పారు. గెలిచే సత్తా ఉన్న బలమైన అభ్యర్థులకు టికెట్లు ఇవ్వాలని గతంలో అన్న మాట వాస్తవమేనని, భువనగిరి ఎంపీ స్థానాన్ని బీసీలకు కేటాయించాలని పార్టీని కోరినట్లు తెలిపారు. భువనగిరి టికెట్ ఎవరికి ఇచ్చినా రాష్ట్రంలోనే భారీ మెజారిటీతో గెలిపిస్తానన్నారు. తన వల్లే భువనగిరి ఎంపీ టికెట్ పెండింగ్‌లో ఉందనడం బాధాకరమని పేర్కొన్నారు. గతంలో పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు ఓటమి పాలవుతామని తెలిసి కూడా అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా తన భార్య లక్ష్మిని పోటీలో నిలిపామని, చివరకు ఓడిపోయినా బాధపడలేదని చెప్పారు. అలాంటి తాము పదవులకు పాకులాడుతున్నామని కొందరు తమపై దుష్ప్రచారం చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో బీజేపీ గెలిచే పరిస్థితి లేదని, కాంగ్రెస్ 12-14 ఎంపీ స్థానాల్లో గెలువనున్నట్లు ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో తాను తిరిగి చేరేటప్పుడే అధిష్ఠానం తనకు కీలక హామీ ఇచ్చిందని, భవిష్యత్‌లో తనకు మంత్రివర్గంలో స్థానం కల్పిస్తుందన్న నమ్మకం ఉందని అన్నారు.

సంపత్.. నీ బాధ్యత నాది!

నాగర్‌కర్నూలులో పార్టీ విజయానికి కలిసి కృషి చేయండి.. సంపత్‌కుమార్‌కు సీఎం రేవంత్ భరోసా





హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): "సంపత్.. నీ బాధ్యత నాది! నాగర్ కర్నూలులో పార్టీ విజయానికి కలిసికట్టుగా కృషి చేయండి" అని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌కు సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. నాగర్ కర్నూలు అభ్యర్థిత్వం దక్కకపోవడంతో అసంతృప్తిగా ఉన్న సంపత్‌కుమార్ శుక్రవారం రేవంత్‌ను ఆయన నివాసంలో కలిసినప్పుడు ఈ మేరకు భరోసా ఇచ్చారు. అంతకు ముందు సంపత్ నివాసానికి నాగర్ కర్నూల్ పార్టీ అభ్యర్థి మల్లు రవి వెళ్లారు. ఎన్నికల్లో ఆయన సహకారాన్ని కోరారు. అనంతరం సీఎం రేవంత్ పిలుపు మేరకు ఇద్దరూ వెళ్లి ఆయనను కలిశారు. అలాగే, అందుబాటులో ఉన్న పార్టీ ముఖ్య నేతలతో సీఎం రేవంత్ సమావేశమయ్యారు. పార్టీ విజయానికి అమలు చేయాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లను గెలిచి తీరాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఆ దిశలో అందరూ కలిసికట్టుగా పని చేయాలని నిర్దేశించారు. ఎన్నికలయ్యేంత వరకు పార్టీ ముఖ్య నేతలంతా బాధ్యతలు పంచుకోవాలని, కార్యకర్తల వెన్నంటి ఉండాలని సూచించారు. గతంలో విజయం సాధించిపెట్టిన మల్కాజ్‌గిరి మోడల్‌ను రాష్ట్రమంతటా అమలు చేయాలన్నారు. రానున్న రెండు రోజుల్లో అన్ని నియోజక వర్గాల్లోనూ సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని, లోక్‌సభ, అసెంబ్లీ, బూత్ స్థాయిల్లో మూడంచెలుగా వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. లోక్‌సభ నియోజకవర్గ స్థాయి కమిటీలో ఏఐసీసీ పరిశీలకులతోపాటు అక్కడి పార్టీ ముఖ్యులు సభ్యులుగా ఉంటారని, అసెంబ్లీ కమిటీలో ఎమ్మెల్యే లేదా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ప్రతి మండలం నుంచి ముఖ్య నేతలను నియమించాలని సూచించారు. బూత్ స్థాయి కమిటీల్లో చురుకుగా పని చేస్తున్న ఐదుగురు పార్టీ సభ్యులకు అవకాశం కల్పించాలన్నారు. వారే ఈసారి ఎన్నికల్లో అత్యంత కీలక పాత్ర పోషిస్తారని, సైనికులుగా నిలబడతారని తెలిపారు. పార్టీ అభ్యర్థికి సదరు బూత్‌లో వచ్చిన ఓట్ల సంఖ్య వారి పనితీరుకు ప్రాతిపదికగా ఉంటుందని, వారికి భవిష్యత్తులో తగిన గుర్తింపును ఇస్తామని వివరించారు. పనితీరును బట్టి ఇందిరమ్మ కమిటీల్లో వారికి ప్రాధాన్యం ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సికింద్రాబాద్, నాగర్ కర్నూల్ పార్టీ అభ్యర్థులు దానం నాగేందర్, మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీనే నాకు గాడ్ ఫాదర్: సంపత్‌కుమార్

తనకు కాంగ్రెస్ పార్టీనే గాడ్ ఫాదర్ అని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్‌లో మాదిగ నేతలకు గాడ్ ఫాదర్ లేరంటూ మంద కృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. గాంధీ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన మాదిగల హక్కులను మంద కృష్ణ రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం సరికాదన్నారు. 341/ఎ సవరణ ద్వారా రాష్ట్రాలకు నిర్ణయాధికారాన్ని కట్టబెట్టే విషయంలో కాంగ్రెస్ పార్టీ ముందడుగు వేసిందని, ఈ విషయాన్ని మంద కృష్ణ మాదిగనే చెప్పారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం వేసిన కమిషన్లన్నీ కాంగ్రెస్ హయాంలో వేసినవేనన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాదిగలపై వివక్ష చూపితే.. ఆ రోజునే రేవంత్ రెడ్డి తనతో గొంతు కలిపి అసెంబ్లీలో వాణిని వినిపించారని తెలిపారు. గడిచిన పదేళ్లలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు మాదిగలకు ద్రోహం చేశాయని, వాటితో చేతులు కలిపిన మంద కృష్ణ.. మాదిగ సామాజిక వర్గానికి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. మాదిగ జాతి ప్రయోజనాలను మోదీ కాళ్ల దగ్గర మంద కృష్ణ తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. తనకు పార్లమెంటు టికెట్ దక్కకపోయినా బాధ లేదన్నారు.

మెజారిటీ సీట్లను గెలిపించుకుందాం: ప్రచార కమిటీ

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన పట్ల ప్రజల్లో మంచి విశ్వాసం ఏర్పడిందని టీపీసీసీ ప్రచార కమిటీ అభిప్రాయపడింది. సీఎం రేవంత్, మంత్రుల పనితీరు అద్భుతంగా ఉందని, ఇచ్చిన హామీలనూ ప్రభుత్వం నెరవేరుస్తూ వస్తోందని పేర్కొంది. ప్రభుత్వ పనితీరును ప్రజల్లోకి తీసుకెళదామని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ సీట్లను గెలిపించుకుందామని నిర్ణయించింది. ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ నేతృత్వంలో గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన భేటీలో ఈ మేరకు నిర్ణయం జరిగింది.

అలా లీజుకు ఔటర్.. ఇలా 25 కోట్లు కారులోకి

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణ సర్కారు అంతర్జాతీయ టెండర్లను ఆహ్వానించింది. మొత్తం 11 కంపెనీలు పోటీ పడగా.. ఎన్‌హెచ్ఏఐ నిబంధనల ప్రకారం సాంకేతిక అంశాలను పరిశీలించి నాలుగు కంపెనీలను ఎంపిక చేశారు. వాటిలో అత్యధికంగా రూ.7,380 కోట్లకు బిడ్ దాఖలు చేసిన ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాకు టెండర్ ఖరారు చేశారు. ఈమేరకు.. 2023 ఏప్రిల్ 27న లెటర్ ఆఫ్ ఆర్డర్ (ఎల్‌వోఏ) అందజేశారు. ఎన్‌హెచ్ఏఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ టెండర్ ప్రక్రియను పూర్తి చేశామని నాటి హెచ్ఎండీఏ కమిషనర్ అర్వింద్ కుమార్ ఘనంగా ప్రకటించారు. అయితే కొసమెరుపు ఏంటంటే.. 2023 జూలై 4న ఆ కంపెనీ రూ.25 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసింది. అవే బాండ్లను జూలై 13న బీఆర్‌ఎస్ పార్టీ నగదుగా మార్చుకుంది!! గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. కేరళకు చెందిన కైటెక్స్ కంపెనీ కారు పార్టీకి సమర్పించుకున్న రూ.25 కోట్ల విరాళాలు కూడా కొంత ప్రత్యేకమైనవే. వరంగల్ జిల్లాలో ఆ కంపెనీ ఏర్పాటు చేస్తున్న ఫ్యాక్టరీ నిర్మాణం ముగిసే సమయానికి.. రంగారెడ్డిలో మరో ఫ్యాక్టరీ నిర్మాణం మొదలయ్యే సమయానికి జరిగిన చదివింపులివి. 2021 జూన్‌లో ఆ సంస్థ.. కేరళ రాష్ట్ర ప్రభుత్వ అధికారుల వేధింపుల నేపథ్యంలో అక్కడ తాను తలపెట్టిన రూ.3500 కోట్ల పెట్టుబడుల ప్రణాళికను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించింది. ఆ తర్వాత నెలరోజులకు.. 2021 జూలైలో తెలంగాణలోని వరంగల్ జిల్లాలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో రూ.1000 కోట్ల ప్రాథమిక పెట్టుబడితో గార్మెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించింది. 2023 జూన్‌లో ఆ ఫ్యాక్టరీ ప్రారంభం కావాల్సి ఉంది. కానీ.. ఆ ఫ్యాక్టరీ మరికొద్ది నెలల్లో ప్రారంభం అవుతుందంటూ 2023 జూన్ 16న నాటి మంత్రి కేటీఆర్ ఒక ప్రకటన చేశారు. ఆ తర్వాత మూడు వారాలకు.. 2023 జూలై 5న కైటెక్స్ చిల్డ్రన్స్ వేర్ లిమిటెడ్, కైటెక్స్ గార్మెంట్స్ లిమిటెడ్ సంస్థలు రూ.కోటి విలువైన 15 బాండ్లు కొనుగోలు చేసి బీఆర్‌ఎస్‌కు సమర్పించుకున్నాయి. వాటిని బీఆర్‌ఎస్ జూలై 17న నగదుగా మార్చుకుంది. సెప్టెంబరు 28న కేటీఆర్.. రంగారెడ్డి జిల్లా సీతారాంపూర్ వద్ద కైటెక్స్‌కు చెందిన రెండో ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత రెండు వారాలకు.. 2023 అక్టోబరు 12న కైటెక్స్ చిల్డ్రన్స్‌వేర్ లిమిటెడ్, కైటెక్స్ గార్మెంట్స్ లిమిటెడ్ కలిసి రూ.10 కోట్ల బాండ్లు కొనుగోలు చేశాయి. అవే బాండ్లను బీఆర్‌ఎస్ పార్టీ అక్టోబరు 16న నగదుగా మార్చుకుంది.



తల్లీకూతుళ్లను సన్మానిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ రోహిణి ప్రియదర్శిని

మార్షల్ ఆర్ట్స్‌లో నైపుణ్యంతోనే.. ఇద్దరు అగంతకుల భరతం పట్టిన మహిళ

» తుపాకీ గురిపెట్టినా బెదరక సాహసం

» ఆమెతోపాటు బాలికకు సన్మానం

అడ్డగుట్ట, కాజీపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోకి కొరియర్ బాయ్స్ అటూ ఇంట్లోకి చొరబడిన ఇద్దరు దొంగలపై తిరగబడి.. ఒకరిని పట్టుకున్న అవితా మేహోత్ అనే మహిళ, ఆమె మైనర్ కుమార్తెను నార్త్‌జోన్ డీసీపీ రోహిణీ ప్రియదర్శిని అభినందించారు. శుక్రవారం ఇద్దరినీ ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడారు. ఆమె వెల్లడించిన వివరాల ప్రకారం.. యూపీ కాన్పూర్‌కు చెందిన సుశీల్‌కుమార్, ప్రేమ్‌చంద్ అనే ఇద్దరు దొంగలు భారీ చోరీ చేయడానికి నగరానికి వచ్చారు. ఒకరోజు రెక్కీ చేసి, బేగంపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పైగా కాలనీలో ఉంటున్న పారిశ్రామికవేత్త నవరతన్ జైన్ ఇంట్లో చోరీ చేసేందుకు నిర్ణయించారు. గురువారం మధ్యాహ్నం ఆ ఇద్దరు కొరియర్ బాయ్స్ రూపంలో ఇంటి ప్రాంగణంలోకొచ్చారు ఎన్.కె. జైన్ పేరుతో పార్శిల్ వచ్చిందని చెప్పడంతో అవితా కొరియర్ తీసుకోవడానికి వెళ్లింది. అగంతకుల్లో ఒకరు తలకు హెల్మెట్ ధరించి ఉండగా.. మరో వ్యక్తి ముఖానికి మాస్క్ ధరించి తలకు టోపీ పెట్టుకొని ఉన్నాడు. ప్రేమ్‌చంద్ నేరుగా వంటగదిలోకి వెళ్లి పనిమనిషి మెడపై కత్తిపెట్టి బెదిరించాడు. సుశీల్‌కుమార్.. వెంట తెచ్చుకున్న బ్యాగులోంచి నాటు తుపాకీ తీసి అమితాపై గురిపెట్టాడు. ఇంట్లోని విలువైన వస్తువులు తెచ్చి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అమితాకు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రవేశం ఉండటంతో తుపాకీ గురిపెట్టిన దొంగ సుశీల్‌ను కాలుతో తన్ని కిందపడేసింది. తర్వాత కూతురు పరుగు పరుగున అక్కడికొచ్చి తల్లితో కలిసి అతడిని పట్టుకునే ప్రయత్నం చేసింది. ఎంతో కష్టంగా వారితో తలబడిన సుశీల్ ఆ తర్వాత పారిపోయాడు. మరో దొంగ ప్రేమ్‌చంద్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించారు. అప్పటికే తల్లీకూతుళ్ల అరుపులకు చుట్టుపక్కల వారు వచ్చి పారిపోతున్న ప్రేమ్‌చంద్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇంట్లోకి చొరబడి తల్లికూతుళ్లను కంట్రీమేడ్ పిస్టోల్‌తో బెదిరించినా అదరక బెదరక ధైర్య సాహసాలు ప్రదర్శించి దొంగల్ని పట్టుకున్న తల్లి కూతురులను సాహసం చాలా గొప్పదని, ఈ తరహా స్పందన ఎప్పుడూ చూడలేదని డీసీపీ కొనియాడారు. పారిపోయిన సుశీల్‌ను కాజీపేట రైల్వే పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి అప్పగించినట్లు డీసీపీ తెలిపారు. సుశీల్ నుంచి తుపాకీ, ఆధార్ కార్డును స్వాధీనం చేసుకున్నట్లు కాజీపేట పోలీసులు వెల్లడించారు.

ప్రభాకర్‌రావు ఇంట్లో తనిఖీలు

ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసుల సోదాలు.. మాజీ ఐపీఎస్ అమెరికాకు వెళ్లినట్లుగా గుర్తింపు

» ట్యాపింగ్‌లో ఓ మీడియా ఓనర్ పాత్ర!

» ఆయన ఇంట్లో సోదాలు

» లండన్‌కు పరారైనట్లు గుర్తింపు



ఓ మీడియా యజమాని ఇంట్లో సోదాకు వచ్చిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అత్యంత సంచలనం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో సూత్రధారిగా భావిస్తోన్న రిటైర్డ్ ఐపీఎస్, స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఇంట్లో శుక్రవారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అయితే, మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు సస్పెన్షన్‌తో ప్రభాకరావు ఇప్పటికే అమెరికాకు వెళ్లిపోయినట్లుగా తేలింది. మరోవైపు ట్యాపింగ్‌లో ఓ మీడియా సంస్థ యజమాని పాత్ర కూడా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ప్రణీత్‌రావు ఎస్ఐబీలో ఉండగా సేకరించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఈయనకు అందజేసినట్లు విచారణలో తేలినట్లు సమాచారం. ఈయన మీడియా కార్యాలయంలోనే సర్వర్ ఉంచి, ప్రణీత్‌రావు ట్యాపింగ్‌కు పాల్పడినట్లుగా స్పష్టమైంది. దాంతో శుక్రవారం రాత్రి వెస్ట్‌జోన్ పోలీసులు హైదరాబాద్ జూబ్లీహిల్స్ రోడ్ నం.78లోని మీడియా యజమాని ఇంట్లో తనిఖీలు చేపట్టారు. ట్యాపింగ్‌కు సంబంధించిన పలు కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. మీడియా యజమాని ఇప్పటికే లండన్‌కు వెళ్లిపోయినట్లు సమాచారం. దొరికిన ఆధారాలను నిందితుల ముందు ఉంచుతున్న పోలీసులు ట్యాపింగ్ కుట్రలో భాగస్వాములందరినీ ఒక్కొక్కరిగా బయటకు లాగుతున్నారు. అనంతరం ఆధారాలను బట్టి నేరస్తులుగా పరిగణించి ఒకొక్కరిని అరెస్టు చేసి జైలుకు తరలించే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. వీరిలో పోలీస్ సిబ్బంది, రాజకీయ నాయకులు, టెక్నికల్ సిబ్బంది ఉండే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా, ప్రణీత్ రావును ఏడు రోజులు కస్టడీకి తీసుకున్న పోలీసులు అన్ని కోణాల్లో విచారించారు. వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి, ఏసీపీ శ్రీధర్‌లతో కూడిన బృందం ప్రణీత్‌రావును బంజారాహిల్స్ స్టేషన్‌లో విచారించింది. స్టేషన్ గేట్లకు తాళాలు వేసి, ఎవరినీ లోపలికి అనుమతించకుండా ముఖ్యంగా మీడియా కంటపడకుండా పకడ్బందీ ఏర్పాట్లతో ప్రణీత్‌ను విచారిం్చారు. ఇప్పటికే వివిధ కోణాల్లో కేసును దర్యాప్తు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలు సేకరించినట్లు తెలిసింది. శనివారం ప్రణీత్ రావుకు పోలీస్ కస్టడీ ముగియనుంది. ఈ నేపథ్యంలో ట్యాపింగ్ కుట్రలో భాగస్వాములైన వారిలో ఎంతమందిని రిమాండ్‌కు తరలిస్తారు..? వారిలో తిరిగి ఎంత మందిని కస్టడీకి తీసుకుంటారు..? అనేది చర్చనీయాంశంగా మారింది. కాగా, ప్రణీత్‌రావు హార్డ్ డిస్కుల ధ్వంసం అనంతరం వాటి ముక్కలను మూసీ నదిలో పడేసినట్లు విచారణలో తేలింది. అవి ఏ ప్రాంతంలో పడేశారనేది శనివారం నిర్ధారించే అవకాశం ఉంది. మధ్యాహ్నం వరకు విచారణ పూర్తి చేసి, వైద్య పరీక్షలు నిర్వహించి సాయంత్రానికి తిరిగి చంచల్‌గూడ జైలుకు తరలించనున్నారు.

కాంగ్రెస్‌లోకి జీహెచ్‌ఎంసీ మేయర్!

గద్వాల్ విజయలక్ష్మి, కేకేతో దీపాదాస్ మున్షీ భేటీ.. పార్టీలోకి రావాలని ఆహ్వానం



హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల వేళ మహానగరంలో బీఆర్‌ఎస్‌కు మరో షాక్. హైదరాబాద్‌పై పట్టు సాధించేందుకు వేగంగా పావులు కదుపుతోన్న కాంగ్రెస్.. జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఆమె తండ్రి అయిన బీఆర్‌ఎస్ సెక్రటరీ జనరల్, ఎంపీ కె. కేశవరావును పార్టీలో చేర్చుకునేందుకు స్కెచ్ వేసింది. శుక్రవారం వారితో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ భేటీ అయ్యారు. కేశవరావు నివాసంలో జరిగిన ఈ భేటీలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డిలూ పాల్గొన్నారు. సుమారు 40 నిమిషాల పాటు కేకే, విజయలక్ష్మిలతో చర్చలు జరిపిన దీపాదాస్ మున్షీ.. వారిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరితే ఇచ్చే పదవి, ఇతర అంశాలకు సంబంధించి కేకే పలు ప్రతిపాదనలు దీపాదాస్‌మున్షీ ముందు ఉంచినట్లు ప్రచారం జరుగుతోంది. కేకే పెట్టిన ప్రతిపాదనలపైన పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని దీపాదాస్ చెప్పినట్లు పేర్కొంటున్నారు. సుదీర్ఘ కాలం కాంగ్రెస్ నేతగానే ఉన్న కేశవరావు.. సీడబ్ల్యూసీ సభ్యునిగానూ పనిచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆయన బీఆర్‌ఎస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో చేరేందుకు కేశవరావు, విజయలక్ష్మిల నుంచి సానుకూల సంకేతాలు వచ్చిన నేపథ్యంలోనే వారితో దీపాదాస్ మున్షీ భేటీ అయ్యారని పార్టీ వర్గాలు తెలిపాయి. పార్టీలో చేరేందుకు కేకే, విజయలక్ష్మిలు దీపాదాస్ మున్షీ ముందు ఉంచిన ప్రతిపాదనలపైన సీఎం రేవంత్‌రెడ్డి త్వరలోనే నిర్ణయం తీసుకుంటారని, మరో రెండు.. మూడు రోజుల్లో వారు కాంగ్రెస్‌లో చేరతారని ఆ వర్గాలు చెబుతున్నాయి. మేయర్‌తోపాటు బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు కార్పొరేటర్లు కూడా హస్తం గూటికి వెళ్లే అవకాశముందని తెలుస్తోంది.

పార్టీ మారినా ఏడాదిపాటు పదవుల్లోనే..

మేయర్ విజయలక్ష్మి పార్టీ మారినా.. ఆ పదవిలో ఆమే కొనసాగనుంది. గత నెలలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి హస్తం గూటికి చేరారు. ప్రస్తుతం విజయలక్ష్మి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారు. బీఆర్‌ఎస్‌ను వీడినా రాజీనామా చేస్తే తప్ప ప్రస్తుతానికి వారి పదవులకు ఢోకా లేదు. మరో ఏడాదిపాటు వారు ఆ పదవుల్లో కొనసాగే అవకాశముంది. జీహెచ్‌ఎంసీ చట్టంలోని వెసులుబాటే ఇందుకు కారణం. బల్దియా యాక్ట్ 1955, సెక్షన్ 91 (ఏ) ప్రకారం నాలుగేళ్ల వరకు మేయర్, డిప్యూటీ మేయర్‌పై అవిశ్వాసం పెట్టడం కుదరదు. మరోవైపు.. జీహెచ్‌ఎంసీ కౌన్సిల్‌లో కాంగ్రెస్ బలం క్రమేణా పెరుగుతోంది. పార్టీ నుంచి ముగ్గురు కార్పొరేటర్లు విజయం సాధించగా.. ఏఎస్‌రావునగర్ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీ వీడారు. దీంతో ఆ పార్టీ సభ్యుల సంఖ్య రెండుకు తగ్గింది. గత ఎన్నికల ముందు, ఆ తరువాత బీఆర్‌ఎస్ నుంచి 11 మంది హస్తం గూటికి చేరారు. దీంతో కౌన్సిల్‌లో కాంగ్రెస్ బలం 13కు చేరింది. బీజేపీకి చెందిన కొందరు కార్పొరేటర్లూ కాంగ్రెస్‌లో చేరే అవకాశముందని తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లోపు బీఆర్‌ఎస్‌కు చెందిన కొందరు ఎమ్మెల్యేలు కూడా కాంగ్రెస్‌లో చేరుతారని ప్రచారం జరుగుతోంది.

ఎప్‌సెట్, ఐసెట్ పరీక్షల తేదీల్లో మార్పులు

» లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మారిన షెడ్యూళ్లు

కేయూ క్యాంపస్, హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఎప్‌సెట్, ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఐసెట్ పరీక్షలపై లోక్‌సభ ఎన్నికల ఎఫెక్ట్ పడింది. ఎన్నికల కారణంగా ఎప్‌సెట్ పరీక్షలు రెండు రోజులు ముందుగా, కౌంటింగ్ కారణంగా ఐసెట్ పరీక్షలు ఒకరోజు ఆలస్యంగా ప్రారంభించాలని ఉన్నత విద్యామండలి శుక్రవారం నిర్ణయించింది. ఈ మేరకు మే 7నుంచి ప్రారంభం కావాల్సిన ఎప్‌సెట్ మే 9 నుంచి ప్రారంభం కానుంది. అలాగే జూన్ 4, 5 తేదీల్లో జరగాల్సిన ఐసెట్ జూన్ 5, 6 తేదీల్లో నిర్వహించనున్నారు. సవరించిన షెడ్యూలు ప్రకారం ఎప్‌సెట్ హాల్‌టికెట్ల జారీ తేదీ మినహా గడువు(దరఖాస్తు, ఆలస్య రుసుంతో దరఖాస్తు గడువు) తేదీల్లో మార్పులేమీ లేవని జేఎన్‌టీయూ అధికారులు తెలిపారు. మే 1 నుంచి జారీ చేయాల్సిన ఎప్‌సెట్ హాల్‌టికెట్లను ఏప్రిల్ 29 నుంచే జారీ చేస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి గ్రూప్-1 అభ్యర్థులకు ఎడిట్ ఆప్షన్

గ్రూప్-1 పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ వివరాలను సవరించుకునే అవకాశాన్ని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కల్పించింది. నేటి ఉదయం 10 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 7 గంటల వరకు వెబ్‌సైట్ ద్వారా పేరు, పుట్టిన తేదీ, విద్యార్హతలు, ఫొటో, సంతకం లాంటివి ఎడిట్ చేసుకోవచ్చని కమిషన్ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. సవరణకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని సైతం అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.చీ

స్వల్పంగా పెరగనున్న ఔషధాల ధరలు

» కొత్త ధరలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కొన్ని ఔషధాల ధరలు స్వల్పంగా పెరగనున్నాయి. మొత్తం 800 రకాల ఔషధాల ధరలు 0.55 శాతం మేర పెరగనుండగా.. కొత్త ధరలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి రానున్నాయి. టోకు ధరల సూచిక (డబ్ల్యూపీఐ)లో వార్షిక మార్పుకు అనుగుణంగా ఔషధాల ధరల పెంపునకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. నేషనల్ లిస్ట్ ఆఫ్ ఎసన్‌షియల్ మెడిసిన్(ఎన్‌ఎల్‌ఈఎమ్) జాబితాలోని ఔషధాల ధరలను 0.55 శాతం పెంచేందుకు ఫార్మా సంస్థలకు అనుమతించింది. పారాసిటమాల్, యాంటీ బయాటిక్స్, అజిత్రోమైసిన్, యాంటీ ఎనిమియా మెడిసిన్, విటమిన్స్, మినరల్స్ ఔషధాలు, స్టెరాయిడ్స్ ధరలు పెరిగే ఔషధాల జాబితాలో ఉన్నాయి. 2022, 2023లో ఈ ఔషధాల ధరలను 10-12 శాతం మేర పెంచారు. దాంతో పోలిస్తే ఈ ఏడాది పెంచింది స్వల్పమేనని, ఇది రోగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు కొంత ఊరట కలిగించే అంశమేనని వైద్య నిపుణుల చెబుతున్నారు.

ఆర్టీసీ కార్మికులకు బాండ్ బకాయిలు చెల్లించాలి

» డిప్యూటీ సీఎంకు స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ వినతి

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులకు బకాయిపడిన 2013 పీఆర్‌సీ 50 శాతం బాండ్‌ల డబ్బులు చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని టీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(ఐఎన్‌టీయూసీ) ప్రధానకార్యదర్శి కె.రాజిరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి జి.అబ్రహం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను శుక్రవారం ప్రజాభవన్‌లో కలిసి బాండ్ల డబ్బులు చెల్లించడంతోపాటు తగ్గించిన హెచ్‌ఆర్‌ఏ 2020 ఏప్రిల్ నుంచి కాకుండా 2021 ఏప్రిల్ నుంచి అమలుచేయాలని కోరుతూ వినతి పత్రం సమర్పించినట్టు తెలిపారు. బాండ్ల నిధుల విడుదలలో జాప్యానికి కారణాలు తెలుసుకుని, తక్షణమే విడుదలకు చర్యలు తీసుకుంటామని డిప్యూటి సీఎం హామీ ఇచ్చినట్టు రాజిరెడ్డి, అబ్రహం తెలిపారు.

మేడిగడ్డ, అన్నారంలో ఇసుక మేట తొలగింపు

» మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు సర్కారు లేఖ

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల దగ్గర మేటవేసిన ఇసుకను తొలగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం నీటి పారుదల శాఖ.. తెలంగాణ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు లేఖ రాసింది. రెండు బ్యారేజీల్లోని ఇసుక మేటలను తొలగించాలని కోరింది. అన్నారం వద్ద దాదాపు 9 లక్షల టన్నులు, మేడిగడ్డ బ్యారేజీ వద్ద 36లక్షల టన్నులకు పైగా ఇసుక ఉన్నట్లు అంచనా. ఈ నేపథ్యంలోనే సర్కారు తాజా నిర్ణయం తీసుకుంది.

హోలీ సందర్భంగా ప్రత్యేక రైళ్లు: రైల్వే

హోలీ పండగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని మార్చి23 నుంచి 27 వరకు ఆయా ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. మార్చి23న హైదరాబాద్-దానాపూర్(07647), సికింద్రాబాద్-సంత్రాగచి(07645), 25న సంత్రాగచి-సికింద్రాబాద్ (07646), మార్చి26న దానాపూర్-హైదరాబాద్(07548) ప్రత్యేక రైళ్లు నడవనున్నట్లు పేర్కొన్నారు. మార్చి 24న సంత్రాగచి-చెన్నైసెంట్రల్(06096), మార్చి27న పాట్నా-కోయంబత్తూర్(06094) రైళ్లు నడుపుతున్నట్లు తెలియజేశారు.

1వ తేదీ నుంచి యాసంగి ధాన్యం కొనుగోళ్లు

75.20 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణే లక్ష్యం.. రాష్ట్రవ్యాప్తంగా 7,149 కొనుగోలు కేంద్రాలు

సెప్టెంబరు 30 వరకు మిల్లింగ్ చేసి బియ్యమివ్వాలి.. పౌర సరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లకు ముహూర్తం ఖరారైంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభిస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 7,149 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, 75.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. కనీస మద్దతు ధర(ఎమ్మెస్పీ)కు ధాన్యం కొనుగోలు చేస్తామని తెలిపారు. ఈ మేరకు యాసంగి ధాన్యం సేకరణపై వివిధ జిల్లాల అడిషనల్ కలెక్టర్లు, ఎఫ్‌సీఐ అధికారులు, పౌర సరఫరాలు, వ్యవసాయ, మార్కెటింగ్, పోలీసు శాఖల అధికారులతో శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఈ సీజన్‌లో రాష్ట్రంలో 66 లక్షల ఎకరాల్లో వరి సాగవ్వగా 121 మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా అని చౌహాన్ పేర్కొన్నారు. ఇందులో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు 75లక్షల టన్నుల పైచిలుకు ధాన్యం వస్తుందని అంచనా అన్నారు. గతేడాది కంటే ఈసారి కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచినట్లు వెల్లడించారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి సెప్టెంబరు 30 వరకు(ఆరు నెలల వ్యవధిలో) మిల్లింగ్ మొత్తం పూర్తి చేసి కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) డెలివరీ



ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సీఎంఆర్ బకాయిలు 30 లక్షల మెట్రిక్ టన్నులు ఉండడంపై అధికారులను ప్రశ్నించారు. అప్పులు, వడ్డీ భారం దృష్ట్యా సకాలంలో సీఎంఆర్ డెలివరీలు, బకాయిల రికవరి జరగాలని ఆదేశించారు. ఇక, రైస్‌మిల్లర్లు, రేషన్ డీలర్లు, ఇతరత్రా ప్రైవేటు వ్యక్తులెవరూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనిపించకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వ సిబ్బంది మినహా ఇతర వ్యక్తులు ఎవరైనా కొనుగోలు కేంద్రాల్లో కనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్‌సీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా ధాన్యం సేకరణ చేయాలని, ఇష్టారాజ్యంగా తరుగు తీసి రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులకు స్పష్టం చేశారు. గతేడాదికి సంబంధించి 35లక్షల టన్నుల ధాన్యాన్ని టెండర్ల ప్రక్రియలో విక్రయించామని, తక్షణమే ధాన్యం లిఫ్టింగ్ చేయించాలని అధికారులను ఆదేశించారు. కాగా, పాత ధాన్యం నిల్వలు ఎక్కడైనా ఉండి, నాణ్యత ఉంటే మిల్లింగ్ చేసిస్తే తీసుకుంటామని తెలిపారు. ధాన్యం, బియ్యంలో నాణ్యత లేకపోతే సీఎంఆర్ తీసుకునేది లేదని, ఇతర రాష్ట్రాల పీడీఎస్ అవసరాలకు పంపిస్తే తెలంగాణ బ్రాండ్ దెబ్బతింటుందన్నారు. నాణ్యత లేని బియ్యాన్ని తెలంగాణ ప్రజల ఆహార అవసరాలకు సరఫరా చేయలేమన్నారు.

బ్యారేజీల వైఫల్యం

తర్వాత చేసిందేంటి?

డ్యామ్‌సేఫ్టీ చట్టం అమలుపై ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ ఆరా

» విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతోనూ భేటీ

» ముగిసిన ఎన్‌డీఎస్‌ఏ టూర్



హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీల తర్వాత డ్యామ్‌సేఫ్టీ చట్టం ప్రకారం తీసుకున్న చర్యలేమిటి? ఏదైనా కమిటీలు వేసి, విచారణ జరిపారా? వైఫల్యానికి కారణాలు వెలికి తీశారా? అని జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ), నిపుణుల కమిటీ స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్‌డీఎస్‌వో)ను ప్రశ్నించింది. శుక్రవారం జలసౌధలో మూడోరోజు నిపుణుల కమిటీ పలు విభాగాల అధికారులతో సమావేశమైంది. వర్షాకాలానికి ముందు, తర్వాత బ్యారేజీల పరిస్థితులపై నివేదికలు తెప్పించుకున్నారా? ఆ నివేదికల్లో బ్యారేజీల పరిస్థితేమిటి? అని ఆరా తీశారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) విభాగం అధికారులను కూడా ప్రశ్నించింది. అయితే 2024 దాకా బ్యారేజీల మెయింటెనెన్స్ నిర్మాణ సంస్థల చేతుల్లోనే ఉండటంతో బ్యారేజీల వార్షిక మరమ్మతులపై ఎలాంటి నివేదికలు తమకు అందలేదని, బ్యారే జీల లోపాల్లో ఉన్నట్లు కూడా తమకు క్షేత్రస్థాయి అధికారులు నివేదించలేదని వీరు బదులిచ్చారు. నిర్మాణం జరుగుతున్నప్పుడు విధుల్లో ఉన్న అధికారులను కూడా ఎన్‌డీఎస్‌ఏ విచారించింది. నిర్మాణం ఏ విధంగా జరిగింది? డిజైన్/డ్రాయింగ్‌ల ఆధారంగానే నిర్మాణం జరిగిందా? మధ్యలో ఏమైనా మార్పులు చోటుచేసుకున్నాయా? అని ఆరా తీశారు. డిజైన్ ప్రకారం నిర్మాణం జరిగినట్లు వారు వెల్లడించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులను కూడా కమిటీ నిలదీసింది. పనులు నాణ్యత ప్రకారమే పూర్తయ్యాయని సర్టిఫై చేసేముందు బ్యారేజీల్లో లోపాలు కానరాలేదా? తొలి సీజన్‌లోనే వరదల అనంతరం మూడు బ్యారేజీల్లో సీసీ బ్లాకులతో పాటు అప్రాన్లు దెబ్బతిన్నా గుర్తించలేదా? అని ప్రశ్నించింది. ఐఎస్ కోడ్ ప్రకారమే నిర్మాణ పనులు జరిగినట్లు గుర్తించి, సర్టిఫికెట్లు ఇచ్చామని క్వాలిటీ కంట్రోల్ అధికారులు బదులిచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్(వీఅండ్ఈ) విచారణ జరిగింది కదా? ఆ నివేదిక ఉందా? అని కమిటీ ఆరా తీయగా.. విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ రతన్ నేరుగా కమిటీ ప్రతినిధులకు నివేదికను అందించి, విచారణ క్రమంలో గుర్తించిన లోటుపాట్లను వివరించారు. జలసౌధలో వరుస సమావేశాల అనంతరం కమిటీ రాజేంద్రనగర్‌లోని తెలంగాణ ఇంజనీరింగ్ రిసెర్చ్ ల్యాబోరేటరీ(టీఎస్ఈఆర్ఎల్)ను సందర్శించింది. బ్యారేజీల మోడల్స్‌ను పరిశీలించి.. నీటి ప్రవాహ వేగంతో పాటు బ్యారేజీల మోడల్ స్టడీస్‌పై అధ్యయనం చేసింది.

లోతుగా విచారణ చేయాల్సి ఉంది

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై లోతుగా అధ్యయనం చేయాల్సి ఉందని, అన్ని పత్రాలు పరిశీలించిన అనంతరమే బ్యారేజీల వైఫల్యాలపై ఒక అభిప్రాయానికి రాగలమని ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ చైర్మన్ జె.చంద్రశేఖర్‌అయ్యర్ చెప్పారు. మరింత సమాచారాన్ని అధికారుల నుంచి కోరామని, ఆ సమాచారం అందిన తర్వాతే స్పష్టత వస్తుందని పర్యటన ముగింపు సందర్భంగా విలేకర్లతో అన్నారు.

ఏం చర్యలు తీసుకోవాలో చెప్పండి

వానాకాలంలోపు బ్యారేజీల రక్షణ కోసం పునరుద్ధరణ/మరమ్మతులకు ఏ చర్యలు తీసుకోవాలో చెప్పాలని నిపుణుల కమిటీని నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ కోరారు. అయితే మంగళవారం లోగా తాము కోరిన సమాచారాన్ని అందిస్తే... ఆ తర్వాత తీసుకోవాల్సిన చర్యలను సూచిస్తామని నిపుణుల కమిటీ పేర్కొంది. ఈ సందర్భంగా తక్షణ చర్యలు చేపట్టి, బ్యారేజీల కాపాడుకోవడానికి తీసుకునే చర్యలకు సంబంధించి 10 పాయింట్లతో నివేదికను కమిటీకి ఈఎన్‌సీ (జనరల్) అనిల్ కుమార్ అందించినట్లు తెలిసింది.

ఆ నివేదికలోని కొన్ని అంశాలు

- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఐఎస్ కోడ్ ప్రకారం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులను నిర్మాణ సంస్థలు చేపట్టడానికి అవకాశం ఇవ్వండి.
- అన్ని బ్యారేజీల్లో రంధ్రాలను గుర్తించి... రాఫ్ట్ కింద ఉన్న ఆ రంధ్రాల్లో ప్రెజర్ గ్రౌంటింగ్(ఇసుక లేదా సిమెంట్‌ను ఒత్తిడితో పంపించి, రంధ్రాలను మూసివేయించడం).
- బ్లాకుల వారీగా గేట్ల నిర్వహణ స్కాడా ఆధారంగా నిర్వహించడం ద్వారా బ్యారేజీలపై ఒత్తిడి లేకుండా చూసుకొవొచ్చు. బ్యారేజీల గేట్ల నిర్వహణకు ఇప్పటిదాకా విధానం లేనందున ఆధునిక స్కాడా విధానం అమలు చేస్తే బాగుంటుంది.
- బ్యారేజీల ఎగువన, దిగువన వాటర్ ప్రూఫ్ కోసం సిమెంట్ గ్రౌటింగ్.
- 3డీ మోడల్ స్టడీస్ ఆధారంగా బ్యారేజీల ఎగువన, దిగువన ఉండే రాళ్లను తొలగించాలి.
- బ్యారేజీలపై వరద ఒత్తిడిని తగ్గించడానికి ఎగువ భాగంలో నదిపై రెగ్యులేటరీలు కట్టాలి.
- బ్యారేజీల వద్ద ఎగువ, దిగువ భాగాల్లో ఇసుక మేటలను నీటిపారుదల శాఖ పర్యవేక్షణ ఆధారంగా శాస్త్రీయంగా తొలగించాలి.
- మేడిగడ్డలో బ్లాకు-7లో జామ్ అయిన గేట్లను తొలగించాలి.
- మేడిగడ్డ బ్యారేజీలో కుంగిన బ్లాకు-7లో స్టీల్ షీట్ పైల్స్‌ను అదనంగా పెట్టాలి.

జూన్ 15లోగా 'సాగర్' మరమ్మతులు పూర్తిచేయాలి

» కేఆర్‌ఎంబీ సభ్యుడు ఆర్‌ఎన్ సంక్వా

నాగార్జునసాగర్, మార్చి 22 : నాగార్జున సాగర్ ప్రాజెక్టుపై చేపట్టిన నిర్వహణ, మరమ్మతు పనులను జూన్ 15లోగా పూర్తిచేయాలని కృష్ణానది యాజమాన్య బోర్డు(కేఆర్‌ఎంబీ) సభ్యుడు డాక్టర్ ఆర్ఎన్ సంక్వా అధికారులను ఆదేశించారు. సాగర్ ప్రాజెక్టు నిర్వహణపై ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదం నేపథ్యంలో డిసెంబరు నుంచి కేంద్ర బలగాల భద్రతలో ఉంది. దీంతో ప్రధాన డ్యాంపై చేపట్టాల్సిన మరమ్మతు పనులు నిలిచిపోయాయి. ఈ విషయమై తెలంగాణ జెన్‌కో, నీటిపారుదల శాఖ, ఏపీ జెన్‌కో అధికారులు గత నెలలో కేఆర్‌ఎంబీకి లేఖలు రాయగా స్పందించిన సభ్యులు గత నెలలో సాగర్ ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టుపై అసంపూర్తిగా నిలిచిన క్రేన్ ట్రాక్ నిర్మాణం, కుడి కాల్వ గేట్లపై రోడ్డు నిర్మాణం, సూట్ గేట్లపై రోడ్డు నిర్మాణ పనులు, కుడి, ప్రధాన జలవిద్యుత్ కేంద్రాలకు నీటిని సరఫరా చేసే పెన్‌స్టాక్ గేట్ల మరమ్మతు పనులను పరిశీలించారు. అనంతరం ఈ పనులు పూర్తి చేసుకోవడానికి కేఆర్‌ఎంబీ షరతులతో కూడిన అనుమతులను మంజూరు చేసింది. ఆమేరకు ఈ నెల మొదటివారం నుంచి పనులు చేస్తున్నారు. వాటిని పరిశీలించేందుకు నూతనంగా ఎన్నికైన కేఆర్‌ఎంబీ సభ్యులు సంక్వా శుక్రవారం సాగర్‌కు వచ్చారు. సాగర్ ప్రధాన డ్యాం, గ్యాలరీలు, కుడి, ప్రధాన జలవిద్యుత్ కేంద్రాలను పరిశీలించారు. మరమ్మతు పనులను జూన్ 15వ తేదీలోపు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా సాగర్ హిల్ కాలనీలోని బుద్ధవనాన్ని కూడా ఆయన సందర్శించారు. ఆయనకు బుద్ధవనం విశేషాలను పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ వివరించారు.

ఎన్నికల పిటిషన్లపై

ఆరుగురు ఎమ్మెల్యేలకు

నోటీసులు

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సమాధానాలు ఇవ్వాలని ఆరుగురు ఎమ్మెల్యేలకు శుక్రవారం హైకోర్టుకు చెందిన వేర్వేరు ధర్మాసనాలు నోటీసులు జారీచేశాయి. బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ ఎన్నిక చెల్లదని పేర్కొంటూ కాంగ్రెస్ అభ్యర్థి విజయారెడ్డి ఎలక్షన్ పిటిషన్ (ఈపీ) దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. కొత్తగూడెం నుంచి సీపీఐ తరఫున ఎమ్మెల్యేగా గెలుపొందిన కూనంనేని సాంబశివరావు ఎన్నిక చెల్లదని పేర్కొంటూ కొత్తగూడానికి చెందిన నందూలాల్ అగర్వాల్ ఎలక్షన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆసిఫాబాద్ నుంచి బీఆర్ఎస్ పార్టీ తరఫున గెల్చిన కోవా లక్ష్మి ఎన్నిక చెల్లదని కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యాం దావా వేశారు. జూబ్లీహిల్స్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలుపొందిన మాగంటి గోపీనాథ్ ఎన్నిక చెల్లదంటూ ఆయన ప్రత్యర్థి కాంగ్రెస్ అభ్యర్థి అజహరుద్దీన్, స్వతంత్ర అభ్యర్థి నవీన్ యాదవ్ వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నాలుగు పిటిషన్‌లపై జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. మహబూబ్‌నగర్ నుంచి కాంగ్రెస్ తరఫున గెలిచిన యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికల చెల్లదని బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిటిషన్ దాఖలు చేశారు. దేవరకద్ర ఎమ్మెల్యే జీ మధుసూదన్‌రెడ్డిపై ఆయన ప్రత్యర్థి, బీఆర్ఎస్ నేత ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వ్యాజ్యం దాఖలు చేశారు. నోటీసులు జారీ చేసిన ధర్మాసనాలు విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేశాయి.

భూసేకరణ చేయకుండా

ప్రభుత్వ భవనాల నిర్మాణంపై

హైకోర్టు ఆగ్రహం

» భువనగిరి కలెక్టర్, ఆర్డీవో, ఎంపీడీవో, తహసీల్దార్‌లకు నోటీసులు

హైదరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భూసేకరణ చేయకుండా, పరిహారం ఇవ్వకుండా ఓ 85 ఏళ్ల వృద్ధుడి స్థలంలో ప్రభుత్వ పాఠశాల, బస్టాండ్, వాటర్ ట్యాంక్ తదితర నిర్మాణలు చేపట్టినందుకు ప్రభుత్వ అధికారులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 2013 భూసేకరణ చట్టప్రకారం పరిహారం ఇవ్వాలని హైకోర్టు ఆదేశించినా ఆ ఉత్తర్వులు అమలు చేయకపోవడంతో తుర్కపల్లి మండలం గోపాలపురానికి చెందిన రహీముద్దీన్ (85) కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలుచేశారు. పరిహారం చెల్లించాలని హైకోర్టు తీర్పు ఇచ్చి ఏడాదిన్నర గడిచినా అమలు చేయలేదని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి ధర్మాసనం.. మూడువారాల్లో పరిహారం చెల్లించకపోతే భువనగిరి కలెక్టర్, ఆర్డీవో, ఎంపీడీవో, తహసీల్దార్లు ప్రత్యక్షంగా హాజరుకావాలని నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ ఏప్రిల్ 12కు వాయిదా పడింది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: **K. Srinivas.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.



వచ్చే నెలలో కొత్త ఐపాడ్స్

యాపిల్ కొత్తగా ఐపాడ్ ఎయిర్, ఐపాడ్ ప్రొ మోడల్స్‌ను ఈ నెలాఖరు లేదా ఏప్రిల్ మొదటి వారంలో విడుదల చేయవచ్చని చెబుతున్నారు. ఐపాడ్ ఓఎస్ 17.4 సాఫ్ట్‌వేర్‌కు తోడు పలు అప్‌గ్రేడ్స్ ఉంటాయని భావిస్తున్నారు. ఈ మోడల్స్‌లో కెమెరా విభాగంలో కొన్ని మార్పులు ఉండనున్నాయి. టాబ్లెట్స్‌పై ఫ్రంట్, రేర్ కెమెరాలు ఉంటాయి. ల్యాండ్‌స్కేప్ ఓరియెంటెడ్ ఫ్రంట్ కెమెరా ఉండనుంది. ఇది ఆరో జనరేషన్‌కు చెందినవని ధ్రువపరుస్తూ కూడా వార్తలు అందుతున్నాయి. ప్రస్తుతం ఉన్న ఎయిర్‌పాడ్స్‌లో ఫ్రంట్ ఫేస్ కెమెరా పోర్ట్రయిట్ మోడల్. అయితే ఇందులో ఇప్పుడు మార్పు చోటుచేసుకోనుంది. ఐపాడ్ ప్రొ, ఐపాడ్ ఎయిర్ మోడల్స్‌లో ల్యాండ్‌స్కేప్ ఫ్రంట్ కెమెరా ఉండనుంది.

50ఎంపీ కెమెరాతో వివో టీ3



వివో టీ సిరీస్‌ను విస్తరిస్తోంది. తాజాగా 'వివో టీ3 5జీ' ఫోన్‌ని ఇండియన్ మార్కెట్‌లోకి విడుదల చేసింది. అమోల్డ్ డిస్‌ప్లేకు తోడు మీడియాటెక్ డైమెన్సిటీ 7200 చిప్‌సెట్, 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, 44 వాట్స్ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్ ఉన్నాయి. 6.67 ఇంచీల ఫుల్ హెచ్‌డీ డిస్‌ప్లే, 1080 x 2400 పిక్సెల్ రిజల్యూషన్, 1800 నిట్స్ మేర పీక్ బ్రైట్‌నెస్ ఉన్నాయి. 128 జీబీ, 256 జీబీ వేరియంట్లను విడుదల చేస్తున్న వివో వీటికి ఒక టీబీ మైక్రోఎస్‌డీతో ఎక్స్‌పాండ్ చేసుకునే వీలు కల్పించింది. ఆండ్రాయిడ్ 14పై పనిచేస్తుంది. ఐపీ54 రేటింగ్ ఇచ్చారు. అంటే డస్ట్, వాటర్ రెసిస్టెంట్ అని చెప్పవచ్చు. కాస్మిక్ బ్లూ, క్రిస్టల్ ఫ్లేక్ రంగుల్లో ఇది లభ్యమవుతుంది. 8జీబీ, 128జీబీ వేరియంట్ ధర రూ.19,999 కాగా 8జీబీ, 256 జీబీ వేరియంట్ ధర రూ.21,999. వివో ఇండియా ఈ స్టోర్స్‌కు తోడు ఫ్లిప్‌కార్ట్ ద్వారా మార్చి 27 నుంచి పొందవచ్చు.

ఏఐ సాంకేతికతతో వరదలపై అంచనా



ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) మరికొన్ని కొత్త రంగాలకు విస్తరిస్తోంది. ముందస్తుగా రోగ నిర్ధారణలో ఏఐ ఇప్పుడు ముందుంది. తాజాగా ఇండియాలో వరదలను ముందుగా తెలుసుకునే వ్యవహారంలో నిమగ్నమైంది. 'నేచర్'లో ప్రచురించిన ఒక రీసెర్చ్ పేపర్‌లో ఈ విషయం వెల్లడైంది. ఇందులో భాగంగా మెషీన్ లెర్నింగ్ ఉపయోగించి హైడ్రలాజికల్ సిమ్యులేషన్ మోడల్స్‌ని రూపొందించారు. వాటిని బేసిన్స్‌కు పంపి సమాచారాన్ని రాబట్టాల్సి ఉంది. అయితే గ్లోబల్ ఫ్లడ్ అవేర్‌నెస్ సిస్టమ్ నాలుగో వెర్షన్‌తో యురోపియన్ సెంటర్ ప్రస్తుతం మీడియం రేంజ్ వెదర్ ఫోర్‌క్యాస్ట్ చేస్తోంది. ఆ మోడల్స్‌ను మరింత అభివృద్ధిపర్చిన ఈ రీసెర్చర్లు పక్కాగా తెలుసుకునే యత్నం చేశారు. ఎక్కువగా, మరింత ప్రభావపూరిత ఈవెంట్స్‌ను కవర్ చేసే ప్రయత్నం చేశారు. వాతావరణ మార్పులపై జరుగుతున్న పరిశోధనలో భాగంగా ఈ రీసెర్చ్‌ని చేపట్టారు. లాంగ్ షార్ట్ - టెర్మ్ మెమరీ నెట్‌వర్క్‌లను ఉపయోగించి రూపొందించిన ఏఐ మోడల్ రోజువారీ స్ట్రీమ్ ఫ్లోని అంచనా వేసింది. మొత్తమ్మీద ఈ ఫ్లడ్ హబ్ సిస్టమ్ వరదలను ఏడు రోజుల ముందు గుర్తించగలుగుతుంది. పైపెచ్చు 80 దేశాల్లోని నదులను కవర్ చేస్తుంది.

స్మార్ట్‌ఫోన్ స్థానే 'ఏఐ పిన్'!

చాలా కాలంగా ఎదురుచూస్తున్న హ్యూమేన్ - ఏఐ పిన్ ఈ నెలాఖరులో మార్కెట్లోకి రానుంది. స్మార్ట్ ఫోన్ చేసే చాలా పనులను ఇది కూడా చక్కబెడుతుంది. స్మార్ట్‌ఫోన్ స్థానాన్ని ఈ ఏఐ పిన్ ఆక్రమిస్తుందని భావిస్తున్నారు. వాస్తవానికి ఈ డివైజ్‌ని గత ఏడాది జూలైలోనే ప్రకటించారు. ఇప్పుడు అంటే ఏప్రిల్ 11న మార్కెట్లోకి వస్తోంది. ఇవాళ దీన్ని కొనుక్కుంటే మే మొదటి వారం డెలివరీ కానుంది. ఏఐ పిన్ నిజానికి చాలా చిన్న డివైజ్. దుస్తులకు లేదా యాక్సెసరీలకు దీన్ని క్లిప్‌గా పెట్టుకోవచ్చు. వాయిస్, సంజ్ఞ, టచ్ ఇన్‌పుట్స్ సమ్మిళితం ఈ డివైజ్. వెబ్‌సెర్చ్‌కు తోడు నేవిగేషన్, ట్రాన్స్‌లేషన్, ఫోన్ కాల్స్, టెక్స్ట్ మెసేజ్‌లను పంపడం - అందుకోవడం వంటి పనులన్నీ నిర్వర్తిస్తుంది. స్క్రీన్‌కు బదులు సమాచారం అరచేతిలో ఇమడటం దీని విశిష్టత. కీలకమైన ఫీచర్ల విషయానికి వస్తే...




- డైనమిక్ యూఐతో లేఔట్ బాగుంటుంది. స్టాక్ ధరలు, క్రీడల స్కోరులు వంటివి చూసుకోవడం చాలా సులువుగా, అర్థవంతంగా ఉంటుంది. సమాచారం అరచేతిలో ఇముడుతుంది.
- కాల్స్ చేసుకోవడానికి, టెక్స్ట్ పంపుకోవడానికి వీలుగా ఉంటుంది. వాయిస్ కమాండ్ నుంచి మెసేజ్ డిక్టేషన్ వరకు యూజర్లు సులువుగా ఉండాలని కోరుకుంటారు. అది ఈ డివైజ్‌లో సాధ్యమవుతుంది.
- ఫొటోలు తీసుకోవచ్చు. వీడియోల రికార్డింగ్ వీలుపడుతుంది. వాయిస్ కమాండ్స్‌తో నేపథ్య సంగీతాన్ని కంట్రోల్ చేసుకోవచ్చు. వేలితో టాప్ చేయడం ద్వారా పిక్చర్లను క్లిక్ చేయవచ్చు. వీడియో కూడా సాధ్యమవుతుంది.
- సమాచారం వెతుకులాట అంటే వెబ్ సెర్చ్ బాగుంటుంది. సమాచారాన్ని వెతకడం నుంచి, సమ్మరైజ్, అర్థమయ్యే విధంగా అందించడం వరకూ అన్నీ చేసుకోవచ్చు.
- రియల్ టైమ్ ట్రాన్స్‌లేషన్ విషయంలో 50 వరకు భాషలకు సపోర్ట్ ఇస్తోంది.
- ఇతర యాప్స్, సాఫ్ట్‌వేర్‌తో కూడా ఇది పనిచేస్తుంది. ఆఫ్టర్ ఎఫెక్ట్స్‌తో సమాచారం, పనిచేస్తున్నప్పుడు గైడెన్స్ ఇస్తుంది. ఇతర ల్యాప్‌ట్యాప్‌లతోనూ ఇది పనిచేస్తుంది.
- ఇమేజ్ రికగ్నిషన్ మరో అంశం. ఇమేజ్ సమాచారం, విశ్లేషణ అలాగే ఇమేజ్ ఆరిజన్, రకం తదితర వివరాలను కూడా ఇస్తుంది.
- వివిధ యాప్స్, సర్వీసులు నుంచి అందే నోటిఫికేషన్స్‌ను సమ్మరైజ్ చేస్తుంది. వేర్వేరు యాప్స్ అవసరం లేకుండానే ఇన్‌స్టాంట్‌గా వాటిని చెక్‌చేసుకునే వీలు కూడా ఉంది.

ఈ టూల్‌తో పీడీఎఫ్ వాడడం మరింత సులువు



పీడీఎఫ్ డాక్యుమెంట్ల విషయంలో తలెత్తే ఇబ్బందులకు చెక్ పెట్టేదే హైపీడీఎఫ్ టూల్. సుదీర్ఘంగా ఉండే డాక్యుమెంట్లను చదవలేక ఇబ్బంది పడాల్సిన పని ఇక ఉండదు. ఏఐ అసిస్టెంట్‌తో మాట్లాడి నిమిషాల్లోనే ఆ డాక్యుమెంట్‌లో ఉన్నది తెలుసుకోవచ్చు. ఏఐ సమ్మరీలు, రీరైట్ చేసిన పేరాగ్రాఫ్‌లు, ఏఐ జనరేటెడ్ కంటెంట్ సహా పలు పనులను ఈ టూల్‌తో చక్కబెట్టుకోవచ్చు. ఇదో ఆన్‌లైన్ పీడీఎఫ్ ఎడిటర్. పలు టాస్క్‌లను ఇది సరళతరం చేస్తుంది. వేర్వేరు ఫార్మాట్లలోకి ఆర్గనైజ్ చేసుకోవచ్చు. ముఖ్యమైన విషయాన్ని సంగ్రహించి చెప్పడంతో సమయం ఆదా అవడమే కాదు, ప్రొడక్టివిటీ పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. దీంతో ప్రధానంగా



- హైపీడీఎఫ్‌కు చెందిన ఏఐ అసిస్టెంట్ సహకారంతో డాక్యుమెంట్స్ నుంచి ఆర్టికల్స్, పీడీఎఫ్‌ల వరకు అన్నింటితో చాట్‌కు వీలు ఉంటుంది. యూజర్లు ప్రశ్నించి ఆన్సర్లను జనరేట్ చేసుకోవచ్చు.
- సింపుల్ ప్రాంప్ట్‌తో డాక్యుమెంట్లను వేర్వేరు విధాలు- వర్డ్, పీపీటీ, ఎక్సెల్, జేపీజీగా మారుస్తుంది.
- రాతపూర్వకంగా ఉన్న డాక్యుమెంట్‌లో ఏమి ఉన్నది తెలుసుకునేందుకు సహకరిస్తుంది. టెర్మ్స్, కాన్సెప్టులను తెలుసుకునే వీలు ఉంటుంది.
- పీడీఎఫ్ డాక్యుమెంట్లను ఎడిట్ చేస్తుంది. ఎడిటింగ్ ఆప్షన్స్‌తో ఇమేజెస్, షేప్స్, రీరైటింగ్, పేరాఫ్రేజ్‌లకు అవకాశం ఉంటుంది.
- క్రాప్, కంప్రెస్, మెర్జ్, రొటేట్ పేజెస్, కాంప్లెక్స్ ఎడిటింగ్ వరకు అన్నీ సాధ్యమవుతాయి. అలా ఆ డాక్యుమెంట్స్‌ను షేర్ చేసుకోవచ్చు. ఈమెయిల్, క్యూఆర్ కోడ్స్, లింక్స్ రూపంలో పంపుకోవచ్చు.



మరిన్ని భాషల్లో 'సిరి'

'సిరి' సామర్థ్యం మరిన్ని భాషల్లో అందనుంది. అందుకుగాను ఐఓఎస్ 17.4 అప్డేట్ రానుందని సమాచారం. ఇంతవరకు డివైజ్‌లో ఉన్న ప్రైమరీ భాషలోనే సిరి చదవగలిగేది. ఈ అప్డేట్‌తో ఒకటికి మించి భాషల్లో సిరి చదవగలుగుతుంది. వేర్వేరు భాషల్లో మెసేజ్‌ని తెలియజేయాలని భావించే వ్యక్తులకు ఈ ఫీచర్ బాగా అవసరం. అందుకోసం...

- ఐఫోన్‌లోని సెట్టింగ్స్ మెనూలో సిరి అండ్ సెర్చ్ కోసం నేవిగేట్ చేయాలి.
- ఆస్క్ సిరి విభాగంలో మెసేజింగ్ విత్ సిరిని సెలెక్ట్ చేసుకోవాలి.
- రీడ్ మెసేజెస్ విభాగంలో యాడ్ లాంగ్వేజ్‌ని టాప్ చేయాలి.
- అక్కడ అదనపు భాషలనూ ఎంచుకోవాలి.

ఇక్కడ వేర్వేరు భాషలను యాడ్ చేసుకోవాలి. అలాగే మరిన్ని భాషలను కలుపుకోవాలని అనుకున్నప్పుడు చివరి రెండు స్టెప్స్‌ను రిపీట్ చేస్తుండాలి. మొత్తమ్మీద ఈ సదుపాయంతో భిన్న భాషలు తెలిసిన వ్యక్తులతో కమ్యూనికేషన్ సులువు అవుతుంది.

వాట్సాప్ అప్డేట్స్!

స్టేటస్‌లో నిమిషం వీడియోలు

వాట్సాప్ ఎప్పటికప్పుడు కొత్త ఫీచర్లను యూజర్లకు చేరువ చేస్తూ ఉంటుంది. ఆ క్రమంలో కొన్ని టెస్టింగ్ దశలో ఉంటాయి. అందులో ప్రధానమైనది అరవై సెకెండ్లు అంటే ఒక్క నిమిషం స్టేటస్ అప్డేట్. ఇప్పటి వరకు ఇది ముప్పై సెకెండ్లుగా ఉంది. ఎక్కువ నిడివి గల వీడియోలను స్టాటస్‌గా అప్డేట్ చేసే అవకాశం దీంతో కలుగుతుంది. దీనితోపాటు యూపీఐ పేమెంట్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కానర్ షార్ట్ కట్ వంటివి ఈ వరుసలో ఉన్నాయి. ఆండ్రాయిడ్‌కు ఉద్దేశించిన వాట్సాప్ బేటాలో స్టాటస్ అప్డేట్‌ను కనుగొన్నారు. ఇదే జరిగితే వీడియో నిడివి ముప్పయ్ సెకెండ్ల నుంచి అరవై సెకండ్లకు పెరుగుతుంది. అయితే దీనికోసం లేటెస్ట్ వెర్షన్‌ను అటు యూజర్లు ఇటు వీక్షకులు యాక్సెస్ చేసుకోవాలి. త్వరలోనే ఇది బేటా టెస్టర్ల చేతికి రానుంది. మరొకటి యూపీఐ పేమెంట్స్. కొద్దిపాటి టాప్స్‌తోనే సాధ్యమయ్యేలా చేస్తోంది. త్రీడాట్ మెనూకు బదులు పేమెంట్స్‌ను సెలెక్ట్ చేసుకోవాలి. అక్కడ పేమెంట్ క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేసుకోవాలి. ఇది కెమెరాకు ఎడమవైపు ఉంటుంది. అలాగే స్క్రీన్ రైట్‌కార్నర్‌లో షార్ట్‌కట్స్ కనిపిస్తుంది. తద్వారా పేమెంట్స్‌ను సునాయసంగా కానిచ్చేయవచ్చు.



వాయిస్ నుంచి టెక్స్ట్ ట్రాన్స్‌క్రిప్షన్

ఆండ్రాయిడ్ యూజర్లకు మరో వెసులుబాటు. అదే వాయిస్ ట్రాన్స్‌క్రిప్షన్ ఫీచర్. మాట్లాడిన మాటలను పదాలుగా మారుస్తుంది. ఐఫోన్ వాట్సాప్ వినియోగదారులకు ఈ వెసులుబాటు ఏడాది క్రితమే లభించింది. తాజాగా ఆండ్రాయిడ్ యూజర్లకూ అందనుంది. అసలీ సదుపాయాన్ని వాట్సాప్ కల్పిస్తోందని 'దవెస్బీ ఆండ్రాయిడ్' మొదట కనుగొంది. ఈ ఫీచర్ ఇంకా డెవలప్‌మెంట్ దశలోనే ఉందని కూడా తెలిపింది.



ఐఫోన్ 17లో సాంకేతిక మార్పులు!

ఐఫోన్ 17లో సాంకేతికపరంగా మార్పులు ఉంటాయని టిప్‌స్టర్ సమాచారం. వచ్చే ఏడాది ఐఫోన్ 17 విడుదల కానుందన్న పుకార్లు వినవస్తున్నాయి. గత మోడల్స్‌తో పోల్చుకుంటే రెండు ఇంప్రూమెంట్స్ ఉంటాయని అంటున్నారు. చైనీస్ మైక్రోబ్లాగింగ్ సర్వీస్ 'వైబో' ప్రకారం రాబోయే ఈ స్మార్ట్ ఫోన్‌లో లెస్ రిఫ్లెక్టివ్ స్క్రీన్ ఉంటుంది. స్క్రాచ్ (గీత, పగులు) రెసిస్టెంట్‌గానూ ఉండనుంది. శాంసంగ్ ఇటీవలి విడుదల చేసిన గెలాక్సీ ఎస్24 అల్ట్రా మాదిరిగా అంటే కార్నింగ్ గొరిల్లా గ్లాస్ ఆర్మర్ స్క్రీన్‌లా ఇది పనిచేయనుంది. సూపర్-హార్డ్ ఏఆర్ లేయర్ - సూపర్ హార్డ్‌తో ఐఫోన్ 17 రూపొందుతుందని చెబుతున్నారు. ఏతావతా రిఫ్లెక్షన్‌కు తోడు స్క్రాచ్ విషయంలో మరింత మెరుగుపరిచే పనిలో ఐఫోన్ ఉంది.

లెనోవా గేమింగ్ ల్యాప్‌టాప్స్‌కు హంగులు

సరికొత్త హంగులతో లెనోవా ల్యాప్‌టాప్స్ ముందుకు వస్తున్నాయి. ఈ సిరీస్‌లో నాలుగు ల్యాప్‌టాప్స్ విడుదల అవుతున్నాయి. లెనోవాకు చెందిన రిఫ్రెష్డ్ లెజియన్ గేమింగ్ ల్యాప్‌టాప్‌లు పదహారు ఇంచీల ప్యూర్‌సైట్ డిస్‌ప్లేకు తోడు 240 హెచ్‌జెడ్ వేరియబుల్ రిఫ్రెష్ రేటు, 500 నిట్స్ మేర పీక్ బ్రైట్‌నెస్ కలిగి ఉన్నాయి. 11ప్రొ విండోస్‌పై రన్ అవుతాయి. 14 జనరేషన్ ఇంటెల్ కోర్ ఐ9-14900హెచ్‌ఎక్స్ సీపీయు, ఎల్ఏ1 ఏఐ చిప్, 32జీబీ ర్యామ్ ఉన్నాయి. రెండు టీబీ ఎస్ఎస్‌డీ స్టోరేజీ ఉంది. వైఫై-ఎఫ్ఐ 6ఈ, బ్లూటూత్ 5.1, నాలుగు యూఎస్‌బీ ఆడియో జాక్ తదితరాలు ఉన్నాయి. రెండు స్పీకర్లతో ఫుల్ హెచ్‌డి కెమెరా సపోర్ట్ ఉంది. రెండున్నర నుంచి 2.8 కేజీల బరువు కలిగి ఉన్నాయి. లెనోవా లెజియన్ 5ఐ ధర ఇండియాలో రూ.1,29,990. ప్రొ రూ.1,57,990తో ఆరంభమవుతోంది. 7ఐ రూ.1.77,990 కాగా ప్రొ 7ఐ రూ.3,24,990. కస్టమైజ్డ్ కాన్ఫిగరేషన్‌కూ అవకాశం ఉంది. అయితే ఎంపిక చేసిన పట్టణాల్లోనే అవి లభ్యమవుతాయి. వెబ్‌సైట్‌లో ఈ పట్టణాల వివరాలను తెలుసుకోవచ్చు.



ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శనివారం 23 మార్చి 2024

ఎన్.జీ రంగా వర్సిటీలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు



గుంటూరులోని ఆచార్య ఎన్.జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం(ఏఎన్‌జీఆర్‌ఏయూ) ఆధ్వర్యంలోని ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ సెంటర్ - ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి ఎనిమిది వారాలు(రెండు నెలలు). వీటిని తెలుగు మాధ్యమంలో నిర్వహిస్తారు. కోర్సులు ఏప్రిల్ నెలలో ప్రారంభమౌతాయి. కోర్సులో భాగంగా వారానికి ఒకటి చొప్పున ఏడు ఆన్‌లైన్ క్లాసెస్ ఉంటాయి. క్లాస్ వ్యవధి రెండు గంటలు. ప్రతి క్లాస్‌లో క్విజ్‌లు, అసైన్‌మెంట్‌లు ఉంటాయి. అటెండెన్స్ తప్పనిసరి. కోర్సుకు సంబంధించిన పాఠ్య పుస్తకాలు ఇస్తారు. చివరి వారంలో ఎగ్జామ్ ఉంటుంది. కనీసం 50 శాతం మార్కులు వస్తేనే సర్టిఫికెట్‌లు ఇస్తారు. ఈ ఎగ్జామ్‌లో ఫెయిల్ అయినవారికి/హాజరు కానివారికి నెలలోపు మరల పరీక్ష ఉంటుంది. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని నింపి దరఖాస్తు ఫీజు డీడీ/మని యార్డర్ జతచేసి కింది చిరునామాకు పంపాలి.

కోర్సులు

- సేంద్రీయ వ్యవసాయం
- పుట్టగొడుగుల పెంపకం

అర్హత: తెలుగులో చదవడం, రాయడం తెలిసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. అభ్యర్థులకు కంప్యూటర్/ఆండ్రాయిడ్ ఫోన్, ఆన్‌లైన్ సదుపాయం ఉండాలి.

- **కోర్సు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 25
- **చిరునామా:** ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్ సెంటర్, డీన్ కార్యాలయం, పరిపాలనా భవనం, ఆచార్య ఎన్.జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** www.angrau.ac.in

టీఎస్ ఎల్‌పీసెట్ నోటిఫికేషన్



హైదరాబాద్‌లోని స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్ (ఎస్‌బీటీఈటీ)- 'లేటరల్ ఎంట్రీ ఇన్‌టూ పాలిటెక్నిక్స్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఎల్‌పీసెట్) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులకు ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో రెండో ఏడాది ప్రవేశాలు కల్పించేందుకు ఈ పరీక్షను ఉద్దేశించారు. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాలిటెక్నిక్‌లు సహా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ ఇంజనీరింగ్ కాలేజీల ఆధ్వర్యంలోని సెకండ్ షిఫ్ట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఎల్‌పీసెట్ ద్వారా డిప్లొమా కోర్సులు పూర్తిచేసినవారు ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థల్లో సంబంధిత విభాగాల్లో ఉద్యోగావకాశాలు పొందవచ్చు. లేదంటే నిర్దేశిత ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ అడ్మిషన్ తీసుకోవచ్చు.

అర్హత: అభ్యర్థులు రెండేళ్ల ఐటీఐ కోర్సు ఉత్తీర్ణతతో పాటు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్(డీఈటీ) అందించే బ్రిడ్జ్ కోర్సు పూర్తి చేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి.

- ఐటీఐ(డ్రాఫ్ట్‌మన్-సివిల్) పూర్తిచేసినవారు డిప్లొమా(సివిల్ ఇంజనీరింగ్) కోర్సుకు; ఐటీఐ(డ్రాఫ్ట్‌మన్-మెకానిక్, ఫిట్టర్, మెషినిస్ట్/మెషినిస్ట్ కంపోజిట్, మెషినిస్ట్ గ్రైండర్, టర్నర్, మోటార్ వెహికిల్ మెకానిక్, మెకానిక్-ఆర్ అండ్ ఏసీ) అభ్యర్థులు డిప్లొమా(మెకానికల్/ఆటొమొబైల్/మెటలర్జికల్/ప్యాకింగ్ టెక్నాలజీ/టెక్స్‌టైల్ టెక్నాలజీ/మైనింగ్) కోర్సులకు; ఐటీఐ(ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఎలక్ట్రీషియన్) అభ్యర్థులు డిప్లొమా(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్)కోర్సులకు; ఐటీఐ(ఐసీటీ అండ్ సిస్టమ్ మెయింటెనెన్స్) అభ్యర్థులు డిప్లొమా(కంప్యూటర్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్) కోర్సులకు అర్హులు.

ఎల్‌పీ సెట్ 2024 వివరాలు: పరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ఇందులో మొత్తం 120 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మేథమెటిక్స్ నుంచి 60, ఫిజిక్స్ నుంచి 30, కెమిస్ట్రీ నుంచి 30 ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద హెచ్‌బీ పెన్సిల్‌తో గుర్తించాలి. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 120. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో అర్హత పొందాలంటే కనీసం 40 శాతం మార్కులు రావాలి. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

- **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని నింపి దరఖాస్తు ఫీజు డీడీని జతచేసి మాసబ్ ట్యాంక్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాలలో సబ్మిట్ చేయాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.300
- **దరఖాస్తు ఫారాలు అందుబాటులో ఉండే తేదీ:** ఏప్రిల్ 16 వరకు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 20
- **ఎల్‌పీసెట్ 2024 తేదీ:** మే 20
- **పరీక్ష కేంద్రం:** గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల, మాసబ్ ట్యాంక్, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** sbtet.telangana.gov.in

మారిటైమ్ ఇన్‌స్టిట్యూట్‌లో డిప్లొమా, డిగ్రీ



పుణెలోని తొలాని మారిటైమ్ ఇన్‌స్టిట్యూట్ (టీఎంఐ)- డిగ్రీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. బీటెక్ మెరైన్ ఇంజనీరింగ్, బీఎస్సీ నాటికల్ సైన్స్, డిప్లొమా ఇన్ నాటికల్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి ఐఎంయూ సెట్ 2024 అర్హత తప్పనిసరి. అలాగే సంస్థ నిర్వహించే సైన్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (టీఎంఐఎస్‌ఏటీ) 2024 కూడా రాయాల్సి ఉంటుంది. డిప్లొమాలో ప్రవేశానికి ఈ టెస్ట్ రాయనవసరం లేదు. డిగ్రీ ప్రోగ్రామ్‌లకు అవివాహితులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. మహిళలకు ట్యూషన్ ఫీజులో 50 శాతం రాయితీ వర్తిస్తుంది. అడ్మిషన్ నాటికి అభ్యర్థులకు పాస్‌పోర్ట్ ఉండాలి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టుగా ఇంటర్/ పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గ్రూప్ సబ్జెక్టుల్లో కనీసం 60 శాతం మార్కులు ఉండాలి. పదోతరగతి/ఇంటర్ స్థాయిలో ఇంగ్లీష్‌లో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి.

బీటెక్ మెరైన్ ఇంజనీరింగ్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులో ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. థియరిటికల్, ప్రాక్టికల్, వర్క్‌షాప్ ట్రెయినింగ్‌లు ఉంటాయి. ఇంజనీరింగ్ సైన్సెస్ సబ్జెక్టులు; షిప్ బోర్డ్ మెషినరీకి సంబంధించి మెరైన్, మెకానికల్ ఇంజనీరింగ్ సబ్జెక్టులు ఉంటాయి. చివరి సంవత్సరంలో ఇంటర్న్‌షిప్ ఉంటుంది.

బీఎస్సీ నాటికల్ సైన్స్: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఇంజనీరింగ్ మేథమెటిక్స్, ఫిజిక్స్, నాటికల్ టెక్నాలజీ, నేవిగేషన్, కార్గో ఆపరేషన్స్, షిప్ మెయింటెనెన్స్ అండ్ ఆపరేషన్స్ సంబంధిత సబ్జెక్టులు ఉంటాయి. ప్రోగ్రామ్ చివరలో షిప్ బోర్డ్ టూల్స్, ప్రాక్టికల్ సీమన్‌షిప్, సెయిలింగ్, బోట్ హ్యాండిలింగ్‌లపై వర్క్‌షాప్ ట్రెయినింగ్ ఉంటుంది.

డిప్లొమా ఇన్ నాటికల్ సైన్స్: ఇది ఏడాది వ్యవధి గల రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఇందులో 120 సీట్లు ఉన్నాయి. ఇది ప్రీ సీ డెక్ క్యాడెట్ కోర్సు. ఇది పూర్తయిన తరవాత ఏడాదిన్నర వ్యవధిగల ఆన్ బోర్డ్ షిప్ ట్రెయినింగ్ ఉంటుంది. దీనిని పూర్తిచేసినవారికి అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ నాటికల్ సైన్స్(ఏడీఎన్‌ఎస్)ను ప్రదానం చేస్తారు. తరవాత షిప్పింగ్ కంపెనీలు ఆఫర్ చేసే ఆన్ బోర్డ్ ట్రెయినింగ్ పూర్తయినవారికి ఐఎంయూ, బీఎస్సీ(అప్లయిడ్ నాటికల్ సైన్స్) డిగ్రీని ఇస్తుంది.

వయసు: డిగ్రీ ప్రోగ్రామ్‌లకు పురుషులు 2003 సెప్టెంబరు 1 తరవాత, మహిళలు 2001 సెప్టెంబరు 1 తరవాత జన్మించి ఉండాలి. డిప్లొమాకు 25 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: ఇంటర్ స్థాయిలో గ్రూప్ సబ్జెక్టుల్లో వచ్చిన మార్కులు, ఐఎంయూ సెట్ 2024 ర్యాంక్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు సైన్స్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎస్ఏటీ) నిర్వహిస్తారు. ఇందులో సాధించిన మెరిట్ ప్రకారం పర్సనల్ ఇంటర్వ్యూలు, మెడికల్ టెస్ట్‌లు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

టీఎంఐ ఎస్ఏటీ వివరాలు: ఇది ఆన్‌లైన్ ఎగ్జామ్. ఇందులో భాగంగా మొదట మెయిన్ టెస్ట్ ఉంటుంది. ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, జనరల్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్ అంశాల నుంచి 80 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఇంటర్ స్థాయిలోనే ఉంటాయి. పరీక్ష సమయం గంటన్నర. తరవాత బిహేవియరల్ అసెస్‌మెంట్ ఉంటుంది. దీనికి అర్థగంట సమయం కేటాయించారు.

- ఇంటర్వ్యూలో అభ్యర్థి ఆలోచన విధానం, పరిపక్వత స్థాయి, నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, రీజనింగ్ సామర్థ్యం తదితరాలు పరీక్షిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** డీఎన్ఎస్ ప్రోగ్రామ్‌నకు ఏప్రిల్ 30; మిగిలిన ప్రోగ్రామ్‌లకు మే 31
- **వెబ్‌సైట్:** tmi.tolani.edu

జాబ్ కార్నర్

ముంబయిలోని స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ- సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా(సెబీ)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

సెబీలో అసిస్టెంట్ మేనేజర్లు

ఖాళీలు 97

విభాగాలు: జనరల్, లీగల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ (ఎలక్ట్రికల్), రీసెర్చ్, అఫీషియల్ లాంగ్వేజ్
అర్హతలు: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి అభ్యర్థుల గరిష్ఠ వయస్సు 30 ఏళ్లు మించకూడదు.
ప్రారంభ వేతనం: నెలకు రూ.44,500- రూ.89,150
ఎంపిక విధానం: ఫేజ్-1, ఫేజ్-2 ఆన్‌లైన్ పరీక్షలు, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
దరఖాస్తు రుసుము: అన్‌రిజర్వ్‌డ్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి రూ.1000. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.100.
ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: ఏప్రిల్ 13. ప్రకటనకు సంబంధించిన పూర్తి సమాచారం ఏప్రిల్ 13న ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటుంది.
వెబ్‌సైట్: https://www.sebi.gov.in/



ఇండియన్ బ్యాంక్‌లో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఖాళీలు 146

ఇండియన్ బ్యాంక్... దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల్లో కింద పేర్కొన్న స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: చీఫ్ మేనేజర్, సీనియర్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, మేనేజర్
విభాగాలు: క్రెడిట్, ఎస్ఆర్ బిజినెస్ రిలేషన్‌షిప్, సెక్యూరిటీ, ఎంఎస్ఎంఈ రిలేషన్‌షిప్, డిజిటల్ మార్కెటింగ్, ఎస్ఈవో అండ్ వెబ్‌సైట్ స్పెషలిస్ట్, సోషల్ మీడియా స్పెషలిస్ట్, క్రియేటివ్స్ ఎక్స్‌పర్ట్, ఫారెక్స్/ట్రేడ్ ఫైనాన్స్, ట్రెజరీ డీలర్, ట్రేడింగ్/ఆర్బిట్రేజ్ ఇన్ కరెన్సీ ఫ్యూచర్స్, ట్రేడింగ్ ఇన్ ఇంటర్‌బ్యాంక్, ఈక్విటీ డీలర్ తదితరాలు.
అర్హత: సంబంధిత విభాగంలో సీఏ/సీడబ్ల్యూఏ/ఐసీడబ్ల్యూఏఐ, డిగ్రీ, పీజీ డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
దరఖాస్తు రుసుము: రూ.1000. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగ అభ్యర్థులకు రూ.175.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 1
వెబ్‌సైట్: www.indianbank.in/

కొచ్చిన్ షిప్‌యార్డ్‌లో ప్రాజెక్ట్ ఆఫీసర్స్

ఖాళీలు 7

కేరళలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్(మెకానికల్): 4
2. సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్(ఎలక్ట్రికల్): 2
3. సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్(ఇన్‌స్ట్రుమెంటేషన్): 1

అర్హత: కనీసం 60 శాతం మార్కులతో మెకానికల్/ఎలక్ట్రికల్/ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణత. షిప్ బిల్డింగ్/షిప్ రిపేర్/మెరైన్ రిపేర్/ఇంజనీరింగ్/ప్రభుత్వ కంపెనీల్లో కనీసం నాలుగేళ్ల పని అనుభవం ఉండాలి.
జీతం: నెలకు రూ.47,000 - రూ.50,000
వయోపరిమితి: 35 ఏళ్లు మించరాదు
ఎంపిక విధానం: రాత పరీక్ష, ఇంటర్వ్యూ, పని అనుభవం తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు: రూ.400. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులకు ఫీజు నుంచి మినహాయింపు ఉంటుంది.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 12
వెబ్‌సైట్: cochinshipyard.in/

ఐఐటీఆర్‌లో టెక్నీషియన్లు

ఖాళీలు 19

లఖ్‌నవూలోని సీఎస్ఐఆర్‌కు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టాక్సికాలజీ రీసెర్చ్(ఐఐటీఆర్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. టెక్నికల్ అసిస్టెంట్: 8 పోస్టులు
2. టెక్నీషియన్: 11 పోస్టులు

విభాగాలు: కెమికల్ సైన్సెస్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్/సివిల్ ఇంజనీరింగ్/యానిమల్ హౌజ్ అండ్ జీఎల్‌పీ ఫ్యాకల్టీ/బయలాజికల్ సైన్సెస్/ఎన్విరాన్‌మెంటల్ మానిటరింగ్/ఎపిడెమియాలజీ/ఇండస్ట్రియల్ రీసెర్చ్/సెన్సర్ అండ్ డివైజ్ డెవలప్‌మెంట్/ప్లంబర్/ఎలక్ట్రీషియన్/రిఫ్రిజిరేషన్- ఏసీటెక్నీషియన్, కంప్యూటర్ సైన్స్.
అర్హత: పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ, సంబంధిత విభాగంలో డిప్లొమా, బీఎస్సీ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు
జీతం: టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుకు రూ.63,312. టెక్నీషియన్ పోస్టుకు రూ.34,625.
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్ తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 31
వెబ్‌సైట్: https://www.csir.res.in/

టీహెచ్‌డీసీఐఎల్‌లో ఇంజనీర్ ట్రెయినీలు

ఖాళీలు 10

రిషికేశ్(ఉత్తరాఖండ్)లోని తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్(టీహెచ్‌డీసీఐఎల్).... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్
అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, బీఎస్సీ (ఇంజనీరింగ్) ఉత్తీర్ణతతో పాటు గేట్-2023 స్కోరు సాధించి ఉండాలి.
వయోపరిమితి: 2024 ఫిబ్రవరి 28 నాటికి 30 సంవత్సరాలు మించకూడదు **వేతనం:** నెలకు రూ.50,000 - రూ.1,80,000 వరకు
ఎంపిక ప్రక్రియ: గేట్ 2023 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
దరఖాస్తు రుసుము: జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ కేటగిరీకి రూ.600. ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు/ఎక్స్‌సర్వీస్‌మన్ అభ్యర్థులకు ఫీజు లేదు.
వెబ్‌సైట్: https://thdc.co.in/en

లిటిల్స్




దేశం- కజకిస్తాన్

- రిపబ్లిక్ ఆఫ్ కజిస్తాన్ అని పిలుస్తారు. ఇది మధ్య ఆసియాలో ఉండే దేశం. ఉత్తర, పడమర ప్రాంతాల సరిహద్దులు రష్యాతో, తూర్పు ప్రాంతం సరిహద్దు చైనాతో ఉంది. సౌతీస్ట్‌లో కిర్గిస్తాన్, దక్షిణాన యుజ్బెకిస్తాన్ హద్దులుగా ఉన్నాయి.




- భూమి ఎక్కువగా ఉండే దేశాల్లో ఇది తొమ్మిదోది. ఈ దేశ రాజధాని ఆస్టనా. ఆల్మైటీ.. ఇదో వాణిజ్య, కల్చరల్ సిటీ.
- రెండుకోట్ల మంది మాత్రమే ప్రజలు ఉన్నారిక్కడ. ఈ దేశ పౌరులను కజక్, కజకిస్తానీ అంటారు.
- ఇక్కడ ఉజ్బెకిస్తాన్స్, పోలీస్, రష్యన్స్, కొరియన్లు, జర్మన్లు.. ఇలా 130 రకాల దేశాల పౌరులు నివసిస్తున్నారు. కజకిస్తాన్ అనే అసలు అర్థం 'లాండ్ ఆఫ్ వాండరర్స్' అని. అంటే 'భూమిపుత్రులు' అనమాట!
- 2009లో యురేనియం ఉత్పత్తిలో మొదటి స్థానంలో నిలిచింది. ప్రపంచంలోనే అత్యధిక యురేనియం నిల్వలు ఇక్కడే ఉన్నాయి.
- రష్యాతో 7512 కిలోమీటర్ల సరిహద్దు ఉన్న ఈ దేశానికి సముద్ర తీరం లేదు.
- ప్రపంచంలోనే అతి పొడవైన చిమ్నీ (420 మీటర్లు) ఇక్కడే ఉంది.
- ఇది రష్యాలోని అంతర్భాగ ప్రాంతమే. 1991లో ఈ దేశం రష్యా నుంచి స్వాతంత్ర్యాన్ని పొందింది.
- హార్స్ రేసింగ్ ఇక్కడి కల్చర్‌లో ఓ భాగం. జాతీయ పానీయం గుర్రం పాలు. ఇక్కడ వైల్డ్ యాపిల్ ట్రీస్ ఉంటాయి.

ఎంత మంది పిల్లలు ఉన్నారు?




సరైన నీడ ఏది?



8 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 262

3	5		4	7	2			
		2				7		
4								2
		7	8					1
	2		7		6		8	
6					5	4		
7								4
		6				5		
			9	2	4		6	7

సుడోకు - 261 సమాధానం

3	9	6	4	2	5	8	1	7
4	5	8	7	1	9	2	6	3
1	2	7	3	6	8	5	4	9
2	8	4	6	5	7	9	3	1
5	6	1	2	9	3	4	7	8
9	7	3	8	4	1	6	2	5
7	4	5	9	3	2	1	8	6
8	1	2	5	7	6	3	9	4
6	3	9	1	8	4	7	5	2

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.